# చి త్ర లే ఖ



హిందీ మూలం: భగవతీ చరణ వర్మ

ఆంధ్రానువాదం: తిరుమల కృష్ణ దేశికాచార్యులు

(ప్రసన్నభారతిలో ధారావాహికంగా ప్రచురితమైన నవల)

# చిత్రలేఖ

"పాపమంటే?" - అని అడిగాడు శ్వేతాంకుడు.

ఆ ప్రశ్నకు మహాప్రభువు రత్నాంబరుడు హఠాత్తుగా గాఢనిద్రనుండి లేచినవానివలె ఉలికిపడ్డాడు. అతడు శ్వేతాంకునివైపు ఒకసారి తదేకంగా చూచాడు. "పాపం?" - ఇది చాలా కఠినమైన ప్రశ్న నాయనా! ఐతే ఇది అత్యంతస్వాభావికంగా ఉదయించే ప్రశ్న" -అంటూ కొంతసేపు కోలాహలపూరితమైన పాటలీపుత్రం వైపు, ఆ నగరంలో అరుణకాంతులలో మెరుస్తూవున్న అంబరాన్ని చుంబిస్తున్నవా అన్నట్లున్న ఉన్నతభవనాల వైపూ చూచాడు - "ఔను! పాపాన్ని నిర్వచించడానికి, నేనూ చాలాసార్లు యత్నించాను. కాని అన్ని సార్లూ విఫలుడనయ్యాను. పాపమంటే ఏమిటి, దానికి మూలస్థాన మేమిటి - ఇవి నాకింతవఱకు పరిష్కృతం గాని బహుకఠిన సమస్యలు. అచంచలమైన పరిశ్రమ చేసిన తర్వాతగూడ, అనుభవసాగరంలో ఈదిన తర్వాతగూడ సాధింపలేని ఈ సమస్యలను నీకెట్లా నేను వివరింపగలను?"

ఆ తర్వాత కాస్త ఆగి రత్నాంబరు డిట్లా అన్నాడు - "ఐతే శ్వేతాంకా! పాపాన్నిగూర్చి తెలుసుకొనాలంటే నీవు ప్రపంచానుభవంలో మునిగితేలాల్సివుంటుంది. ఇందుకు సిద్ధంగా ఉంటే పాపస్వరూపం తెలుసుకొనడానికి నీకు సంభవం కావచ్చు."

శ్వేతాంకుడు రత్నాంబరుని ముందు వినమ్రుడై "నేను సిద్ధమే" నన్నాడు.

"నీకూ పాపస్వరూపాన్ని వెదకాలని ఉందేమొ?" - అంటూ రత్నాంబరుడు విశాలదేవుని వైపు చూచాడు.

విశాలదేవుడుకూడ రత్నాంబరుని ముందు వినమ్రుడై అన్నాడు - "దేవరవారి అనుమానం సరియైనదే!"

రత్నాంబరుని ముఖం సుప్రసన్నతతో తేజరిల్లింది - "ముందుగా మిమ్ములను ప్రపంచంలో విచరించి అనుభవం గడించడానికి నేను వదలివేస్తాను. మీకు ప్రపంచపరిస్థితులను పరిచయంచేయడం ఆవశ్యకం. ఈనగరంలో నాకు యథేష్టంగా పరిచితులైన మహానుభావు లిద్దరున్నారు. ఈకార్యపరిపూర్తికి వీరిద్దరి సహాయ మవసరం. వారిలోనొకడు యోగి - అతని పేరు కుమారగిరి. వేఱొకడు మహాభోగి - అతడే బీజగుప్తుడు. మీ యిద్దరి జీవితాలు వారిద్దరి జీవనస్రవంతులతో కలిసి ప్రవహించాలి."

ఇద్దరు శిష్యులూ ఏకకంఠంతో "మాకు సమ్మతమే" నన్నారు.

"విశాలదేవా! నీవు బ్రాహ్మణుడవు. నీకు ధ్యానారాధనలయందు ఆసక్తి అధికం. అందుచేత నీవు కుమారగిరి శిష్యత్వం చేయడం మంచిది. శ్వేతాంకా! నీవు క్షత్రియుడవు. నీకు ప్రపంచమునం దనురక్తిమెండు. అందుచేత నీవు బీజగుప్తుని సేవకుడ వగుట ఉచితం."

ఇద్దరు శిష్యులూ ఏకకంఠంతో "మాకు సమ్మతమే" నన్నారు.

"మీ యిద్దరి మార్గాలూ నిర్ధారితమైనాయి. ఇంక నావిషయం మిగిలింది. దాన్నిగుఱించి మీరు చింతించకండి. జీవితంలో ఉపాసన కెంత అవసరముందో అనుభవానికీ అంతే ఉంది. మీరు అనుభవాన్ని గడించండి; నేను ఉపాసన (తపస్సును) చేస్తాను. ఒక సంవత్సరం తర్వాత మీరిద్దరు నన్నిక్కడనే కలుసుకొనండి. అప్పుడు తిరిగి మన నిర్ధారితకార్యక్రమాన్ని కొనసాగింతాం."

"కాని ఒకమాట గుర్తుంచుకొనండి. అధ్యయనంతో గ్రహింపలేని విషయాలను అనుభవంతో గ్రహించడానికి మిమ్ములను ప్రపంచం లోనికి పంపుతున్నాను. కాని ఈ అనుభవప్రవాహంలో మీరు పడి కొట్టుకపోకండి. సంసారతరంగాల వాస్తవికగతిలో మీరు పయనిం చండి కాని అందులో పడి మునిగిపోకండి."

శ్వేతాంకుడు, విశాలదేవుడు ఒకరినొకరు చూచుకున్నారు.

ఆ తర్వాత కొంచెం సేపాగి రత్నాంబరుడు మళ్లీ ఆరంభించాడు - "మీరు వెళ్ళే పరిస్థితులనుగుఱించి ముందుగానే మీకు పరిచయం చేస్తాను. కుమారగిరి యోగి. ప్రాపంచికవాసనలపైన విజయం సాధించినానని అతని నమ్మకం. అతనికి సంసారమంటే విరక్తి. తన మతానుసారం అతడు సుఖానుభూతినికూడ పొందాడు. అతనిలో తేజమూ ఉంది, ప్రతాపమూ ఉంది. శారీరకబలముంది, ఆత్మికబల ముంది. అతడు మమత్వాన్ని జయించినాడని ప్రజల విశ్వాసం. అతడు యువకుడు. ఐతే యౌవనమూ, వైరాగ్యమూ కలిసి అతనిలో ఒక అలౌకికశక్తిని ఉత్పన్నం చేసినాయి. సంసార మతని సాధన, స్వర్గ మతని లక్ష్యం. విశాలదేవా! ఆ కుమారగిరే నీకు గురువు.

"శ్వేతాంకా! బీజగుప్తుడు మహాభోగి. అతని హృదయంలో యౌవనలౌల్యం, కన్నులలో మత్తుజీరలున్నాయి. అతని విశాలశిరో గృహాలలో భోగవిలాసాలు లాస్యం చేస్తుంటాయి. రత్నఖచితమదిరాపాత్రలలోనే అతని జీవితసుఖమంతా ఉన్నది. వైభవోల్లాసతరంగా లలో అతడు తేలిపోతుంటాడు. అతని కైశ్వర్యంలో లోటు లేదు. అతడు సుందరుడు, అతని హృదయం సమస్తవిషయవాసనలకు సదనం. అతని భవనముందు మత్తమాతంగాలు తూలుతుంటాయి. భవనంలోపల సౌందర్యమత్తలైన నాట్యకత్తెలు నిత్యం తూలు తుంటారు. భగవంతునిపై అతనికి విశ్వాసం లేదు - బహుశః అతనికి భగవంతుని మాటే స్ఫురించలేదేమో! అతనికి స్వర్గనరకాల వివాదం లేదు. ఆమోదప్రమోదాలే అతనికి సాధకాలు - జీవనలక్ష్యాలు కూడ. ఆ బీజగుప్తునికే నీవు సేవకుడవు కావలెను. శ్వేతాంకా! నీకు స్వీకారమేనా!"

"తమరి యాజ్ఞ శిరోధార్యము" - శ్వేతాంకుడు ఊహాపరీతైశ్వర్యపు లోతులను గనదలచుచుండెను.

"విశాలదేవా! నీకూ సమ్మతమేనా?"

"తమరి యాజ్ఞ శిరోధార్యము" - విశాలదేవుడు యౌవనవైరాగ్యసముదితశక్తి మహత్త్వమును గనదలచుచుండెను.

"తథాస్తు!" అంటూ రత్నాంబరుడు లేచి నిలుచుండెను.

మఱునాడు కుటీరము నిర్జనమయ్యెను. గురువు సాధనాశుష్కక్షేత్రమునందును, శిష్యులు చేతనప్రపంచమునందును ప్రవేశించిరి.

౧

తొణికిసలాడే మదిరాపాత్రను చిత్రలేఖ అధరాని కందిస్తూ, 'చిత్రలేఖా! జీవనసుఖమంటే ఏమిటో తెలుసా?" అన్నాడు బీజగుప్తుడు.

చిత్రలేఖ అర్ధనిమీలితనేత్రాలలో మదాలసత్వం, చెక్కిళ్లలో ఉల్లాసం వెల్లివిరుస్తున్నాయి. యౌవలౌల్యంతో ఆమె సౌందర్యవిలాసం తాండవమాడుతున్నది. ఆలింగనపాశంలో ఆకాంక్షలు హసిస్తున్నాయి. చిత్రలేఖ కాస్త మద్యం సేవించింది - ఆపైని సుందరమందహాసం తొణికించింది. క్షణంసేపు ఆమె అధరం బీజగుప్తుని అధరంతో ఏవో మౌనభాషణ మాడింది. ఆపైని ఆమె మంద్రంగా పలికింది - "మైకం" - అంటూ.

అప్పుడు దాదాపుగా నడిరేయి దాటింది. బీజగుప్తుని భవనం వేయి దీపశిఖలతో వెలుగుతున్నది. ద్వారముఖంలో సన్నాయి విహాగ (బేహాగ్) రాగమాలపిస్తున్నది. బయట సర్వప్రపంచం గాఢాంధకారనిమగ్నమై ఉన్నది. లోపల కేళీభవనంలో సామంతబీజగుప్తుడు పాటలీపుత్రపు సుందరాతిసుందరనర్తకీమణుల సాన్నిధ్యంలో యౌవనోల్లాసకేళీవిలాసాలలో నిమగ్నుడై ఉన్నాడు.

బీజగుప్తుడు నవ్వుతూ అన్నాడు - "చిత్రలేఖా! యౌవనాంతంలో ఏమౌతుంది?"

చిత్రలేఖ కూడ నవ్వింది క్షణికంగా. హఠాత్తుగా ఆ మధురోల్లాసభరితమైన నవ్వు వేదనాత్మకగంభీరతను సంతరించుకొన్నది. ఆమె కూడ ఈ ప్రశ్నకు సమాధానం పొందనెంచింది. కాని ఈ ప్రశ్న భయావహమైన దగుటవల్ల దీన్నిగుఱించి ఎక్కువసేపు ఆలోచించలేక పోయేది. ఆమె మనస్సు వికలమయ్యేది. ఆ వైకల్యాన్ని తాత్కాలికంగా మదిరాపాత్రలో ముంచివేసేది. ఈనాడు హఠాత్తుగా అదే ప్రశ్న వినేసరికి ఆమె కళవళపడింది. "జీవనమృత్యువు" - ఆమె అన్నది.

"జీవనమృత్యువు" - కాదు, అది అసంభవం. యౌవనాంతం ఒక అజ్ఞాతాంధకారం. ఆ అంధకారం అంతరాలలో ఏమి నిబిడీ కృతమై ఉందో నాకు దెలియదు. తెలుసుకోవాలనే కోరికా లేదు. భూతభవిష్యత్తులు కల్పితాలు మాత్రమే. వానితో మనకేమీ ప్రయోజనం

లేదు. వర్తమానం మన సమక్షంలో ఉంది. అది ----" అంటూ బీజగుప్తుడు ఆగిపోయి మాటలకొఱకు వెదక నారంభించాడు.

"అదే ఉల్లాసమూను,విలాసమూను. ఇవే సంపూర్ణసుఖాలు. యౌవనసారాలు" - చిత్రలేఖ నవ్వుతూ ఆ వాక్యాన్ని పూరించింది.

బీజగుప్తుడు గాఢపరిష్వంగపాశంలో ఆమెను బంధిస్తూ అన్నాడు - "నీవే నామైకానివి".

"నీవే నా ఉన్మాదానివి" - ఆమె ప్రతివల్కింది.

చిత్రలేఖ వేశ్య కాదు. ఆమె కేవలం నర్తకి. పాటలిపుత్రంలోని అసాధారణసుందరి వేశ్యావృత్తిని అవలంబించకపోవడం ఒక అసాధారణవిషయం - ఐతే దీనికామె గతజీవితంతో గాఢంగా ముడివడిన ఒక కారణముంది.

చిత్రలేఖ బ్రాహ్మణవిధవ. ఆమె పదునెనమిదేండ్ల ప్రాయంలోనే భర్తను కోల్పోయింది. భర్త గతించిన తర్వాత ఆమెకు సంయమనమే నియమమైంది. కాని అదెంతో కాలం నిల్వలేక పోయింది. ఒకనాడామె జీవితంలో కృష్ణాదిత్యుడు ప్రవేశించాడు. కృష్ణాదిత్యుడు క్షత్రియ శూద్రులకు జనించిన సంకరజాతివాడు. వాడు సుందరనవయువకుడు. వాని సౌందర్యంలో అసాధారణమైన ఆకర్షణ ఉండేది. కృష్ణాదిత్యుడు విగతభర్తృకయైన చిత్రలేఖ వ్రతానికి భంగం కలిగించాడు.

ఆ సుందరాంగి అణచబడిన యౌవనం పునర్వికాసితమైంది. ఆమె వైరాగ్యతేజం నూత్నోల్లాసతరళకాంతి వెనుక మఱుగుపడిపోయింది. ఆమె జీవనస్రవంతి క్రొత్తపుంత త్రొక్కింది. కృష్ణాదిత్యుడు "యావజ్జీవం మనమిద్దరం కలిసే ఉంటాం, మన యిద్దరి నెవ్వరూ వేఱుచేయలేరు" -అని ఆమెకు వాగ్దానం చేశాడు. ఆమె దాన్ని పరిపూర్ణంగా నమ్మింది. ఆపైని జరుగవలసిందేదో జరిగింది.

చిత్రరేఖ గర్భం దాల్చింది. అంతవఱకు గుప్తంగా ఉన్న ప్రేమకలాపం ఇప్పుడు బట్టబయలైంది. వారిద్దరి తల్లిదండ్రులు వారిని వెడలనడిచారు. సంపన్నగృహస్థుడైన కృష్ణాదిత్యుడు చిత్రలేఖను తీసికొని బికారిలాగ తిరుగ నారంభించాడు. పితృపరిత్యక్తుడైన కృష్ణాదిత్యునికి నలుగురిలో కల్గిన అవమానతిరస్కారాలు అసహ్యములైనాయి. అతనికి జీవనంకంటె మరణమే శరణ్యమైంది. చిత్రలేఖ మాత్రం ఒంటరిగా మిగిలిపోయింది. ఆమె కొక నర్తకి ఆశ్రయ మిచ్చింది.

చిత్రలేఖ కొక పుత్రుడు జనించాడు కాని వాడు జనిస్తూనే మరణించాడు. చిత్రలేఖ కంఠం మధురం. ఆమె తనువు సుందరం. అందువల్ల ఆమె కాశ్రయ మిచ్చిన నర్తకి ఆమెకు సంగీతనృత్యకళలను నేర్పింది. ఆమె చక్కని నర్తకి అయ్యింది. భోగవిలాసాల సాన్నిధ్యంలో ఆమె మళ్లీ వైధవ్యసంయమనాన్ని పాటించడానికి ప్రయత్నించింది. కృష్ణాదిత్యుడు, అతని కొడుకు - ఆమె జీవితంలో ప్రవేశించి నిష్క్రమించినారు. కాని వారి స్మృతులు మాత్రం ఆమె హృదయఫలకంపై ముద్రించి వెళ్లారు.

పాటలిపుత్రంలోని ప్రజలు చిత్రలేఖ పాదాలపై వ్రాలేవారు. కాని ఆమె సంయమనతేజోమూర్తియై విరాజిల్లింది. అత్యంతశక్తివంతులైన సామంతులూ, లక్షాధికారులైన నవయువకులూ ఆమె ప్రణయపిపాసితులయ్యేవారు. కాని వారెవ్వరూ ఆమెను పొందలేకపోయారు. ఆ అతిలోకసుందరి క్షణప్రభవలె జనసముదాయం ముందర మెఱసేది - అంతలో మాయమయ్యేది. కాని ఆమె నొకసారి చూచిన యువకుడు ఆమెను మఱిమఱీ చూడాలని ఉవ్విళ్లూరేవాడు.

ఒకరోజు బీజగుప్తుడు చిత్రలేఖ నాట్యాన్ని చూడటానికి వెళ్లాడు. నాట్యవశయైన చిత్రలేఖ దృష్టి ఒక్కసారి బీజగుప్తునిపై పడింది. అంతే - ఆమె ముఖం తెల్లబారింది. ఆమె కొక్కసారిగా కృష్ణాదిత్యుడు స్వర్గాన్నినిర్గమించి తననృత్యాన్ని చూడవచ్చినట్లు తోచింది. ఆమె ఒక్కసారిగా మ్రాన్పడి తననూ, ఎదుటి లోకాన్ని మఱచి బీజగుప్తుని వైపు చూడసాగింది. బీజగుప్తుడు యువకుడు. అప్పు డతని ప్రాయం పాతిక సంవత్సరాలు. చిత్రలేఖయొక్క అతిలోకసౌందర్యానికి వశీభూతుడై అతడూ ఆమె వైపే చూస్తున్నాడు. ఉభయుల చూపులూ కలిశాయి. చిత్రలేఖ ఆలోకిస్తున్న ఆ యువకునిపైననే జనసముదాయం చూపులూ విరిశాయి. "ఓహో! అతడు బీజగుప్తుడు" - అని వారి నోటినుండి వెలువడింది.

చిత్రలేఖ చెవిలోనూ ఆమాట పడింది. తన పరవశత్వానికి ఆమెకు పరితాపం,పైగా అధికమైన కోపం కలిగాయి. ఆమె బీజగుప్తుని నుండి చూపులు త్రిప్పుకొని నాట్యం చేయడ మారంభించింది. నాట్యాంతంలో బీజగుప్తు డామె సముఖానికి వెళ్లి అన్నాడు - "మీ యింటిలో మీ దర్శనభాగ్యానికి నేనెప్పుడైనా నోచుకోగలనా?"

చిత్రలేఖ బీజగుప్తునివైపు చూచి నవ్వింది - "కాదు. నేనేకాంతంగా ఎవ్వరితోను కలువను. జనసమక్షంలోనే ప్రదర్శన లిస్తుంటాను. వ్యక్తులతో నేను సంబంధం కోరను."

బీజగుప్తుని ఆశపై హిమవర్షం కురిసింది. అతని ప్రఫుల్లవదనం ముకుళించింది. ఐనా అతడు సాహసంచేసి అన్నాడు - " వ్యక్తులతో ఏర్పడేదే సమాజం. వ్యక్తుల పిపాసయే సమాజం పిపాస. మఱి యీ భేదభావ మెందుకు?"

"భేదాన్ని తెలుసుకోవాలంటే విను. కొందఱి దృష్టిలో సమాజంయొక్క ఆనందంగా భాసించేది ఆ సమాజంలోని వ్యక్తుల రోదన యొక్క సారాంశం. నిర్బలవ్యక్తులయొక్క నిరాశాపూర్ణమైన నిట్టూర్పులు సంఘటితమై సమాజంయొక్క క్రాంతిరూపం సంతరించు కొంటాయి. ఇట్టి సమాజంవల్ల హాని కలుగని చోట , వ్యక్తుల మమకారాలే భయోత్పాదకకేంద్రాలుగా పరిణమిస్తాయి."

బీజగుప్తుడు అనురాగంతో ఆమెను సమీపించాడు గాని, ఆమెతో తర్కించడానికి గాదు. అతడన్నాడు - "ఐతే మీద్వారం నాకై ముకుళితమైందనే అనుకోమంటారా?"

చిత్రలేఖ గంభీరంగా యథాలాపంగా జవాబిచ్చింది - "వ్యక్తిపరంగానైతే అంతే. వ్యక్తి భాగస్థుడుగా గల సమాజపరంగానైతే కాదు."

బీజగుప్తుని వదనంపై నిరాశాపూరితమైన అల్పహాసం విరిసింది. "వ్యక్తిత్వం జీవితంలో ప్రధానమైనది. వ్యక్తులవల్లనే సమాజం ఏర్పడు తుంది. వివర్జితుడుగా భావింపబడిన వ్యక్తిని సమాజంలో భాగస్థునిగా పరిగణించడం ఆ సమాజానికే అవమానకరమైనటువంటిది" - అని బీజగుప్తు డక్కడనుండి బాణంవలె తటాలున దూసికొని వెళ్లిపోయాడు.

ఆతడైతే వెళ్లాడు గాని, చిత్రలేఖ హృదయంలో ఒక దుమారాన్ని రేపి మఱీ వెళ్లిపోయాడు.

దినాలు క్రమేణా జారుతున్నాయి కాని, చిత్రలేఖ బీజగుప్తుణ్ణిమాత్రం మళ్లీ చూడలేదు. తాత్కాలికమైన ఉపేక్ష నశించి ఆమె యెదలో అతనిపట్ల నూతనమైన అపేక్ష నెలకొనజొచ్చింది. రోజూ తనను చూడవచ్చే ప్రేక్షకులలో బీజగుప్తునికై గాలిస్తుంది. కనలేక తీవ్రమైన నిరాశను వహిస్తుంది.

అంకురితమైన అనురాగాన్ని ఎంతగా అణచివేయాలని యత్నిస్తే అది అంతగా అనుదినప్రవర్ధమానమౌతూ వచ్చింది. ఒకనాడామె దాసి నడిగింది - "ఈ నగరంలో బీజగుప్తుడనే ఒకవ్యక్తి ఉన్నాడా?"

దాసి ప్రత్యుత్తర మిచ్చింది - "బీజగుప్తుని ఎఱుగని వారెవ్వరు? అతడీ నగరంలో గల సుందరాంగులలో నతిసుందరాంగుడు. ఎంతో ప్రభావశాలియైన యువకసామంతుడు."

చిత్రలేఖ దాసి కొక ఉత్తరమిచ్చి దానిని బీజగుప్తున కీయమనింది.

దాసి అతనికా పత్రాన్ని చేరవేసింది. ఆ పత్రంలో - "చిత్రలేఖ ఎంతో విచారించిన పిదప, ఒకే ఒక వ్యక్తి తన జీవితంలో అడుగిడడానికి సమ్మతించింది. ఆవ్యక్తే బీజగుప్తుడు." - అని వ్రాసి ఉంది. ఆ ఉత్తరం చదువుతూనే బీజగుప్తుని యావచ్ఛరీరం హర్షపులకాంకుర సంకుల మయ్యింది. అతని శరీరం కంపించింది. ఆనాటినుండే వారి సాంగత్య మారంభమైంది - ఐనా చిత్రలేఖమాత్రం వేశ్య కాదు.

బీజగుప్తుడు నవ్వి అన్నాడు - "మైకం,ఉన్మాదం - ఈ రెండూ ఎప్పుడూ కలిసే ఉంటాయి. చిత్రలేఖా! మనమెంత సుఖజీవులం! "- ఆ మాటకు చిత్రలేఖసైతం నవ్వసాగింది.

అప్పుడే సన్నాయి నాదం ఆగిపోయింది. ప్రహరీలు ఉచ్చైస్స్వరంతో అన్నారు - "స్వామీ! అతిథులు వేంచేశారు.మీ ఆజ్ఞ ఏమిటి?"

బీజగుప్తుడు పరిరంభపాశాన్ని సడలించాడు. చిత్రలేఖ ఆ బంధంలోనుండి విడివడి ప్రక్కగా కూర్చున్నది. బీజగుప్తుడు పరిచారకు నితో "అతిథులనిక్కడికే పంపించు" - అంటూ మదిరాపాత్రను ఖాళీ చేశాడు.

అర్ధరాత్రివేళ ఏ అతిథు లొస్తారని బీజగుప్తు డాలోచిస్తున్నాడు. అట్లాలోచిస్తుండగనే శ్వేతాంకునితో సహా రత్నాంబరు డా కేళీ గృహంలోనికి ప్రవేశించాడు. రత్నాంబరుని చూచి బీజగుప్తుడు లేచి అభివాదం చేశాడు. చిత్రలేఖ తన తలను వాల్చుకొన్నది.

కేళీగృహాన్ని ఒకసారి కలియజూచిన తర్వాత రత్నాంబరుని దృష్టులు చిత్రలేఖపై పడ్డాయి. కొంచెసేపాగి రత్నాంబరు డన్నాడు - "నగరంలోని సుందరాతిసుందరి, పవిత్రనర్తకి ఈ అర్ధరాత్రివేళ బీజగుప్తుని కేళీగృహంలో ఉండడం ఆశ్చర్యకరం"- అంటూ ఆసనంపై

ఆసీనుడైనాడు. శ్వేతాంకుడు మాత్రం నిలబడే ఉన్నాడు.

బీజగుప్తుడు రత్నాంబరు నడిగాడు - "దేవరవా రేకారణంచేతనో దాసుని అనుగ్రహించడాని కీవేళ వేంచేసినారు?"

రత్నాంబరుడు నవ్వాడు - "బీజగుప్తా! నీతో ఉన్న విషయం విశదం చేస్తా. నేడు నా యీ శిష్యుడు శ్వేతాంకుడు పాపమంటే ఏమిటని నన్ను ప్రశ్నించాడు. దీనికి ప్రత్యుత్తర మీయడానికి నేను సమర్థుడను కాను. ఈ విషయంలోనీవు సాయం చేయగలవా? నీవు నా శిష్యుడవు. నీనుండి నేను గురుదక్షిణ నెప్పుడూ పొందలేదు. పాపస్వభావం తెలుసుకొనడానికి బ్రహ్మచారికుటీరం సరియైన నెలవు కాదు. ప్రపంచంలోని భోగవిలాసాల అనుభవంవల్లనే పాపరూపం బయల్పడుతుంది. నీ భవనమూ, నీ పరివారమూ - వీనిని శ్వేతాంకునికి పరిచయం చేయడ మావశ్యకం. ఇందుచేతనే శ్వేతాంకుని నీ సేవకునిగా ఉంచుటకు తీసికొనివచ్చినాను. వీనిని నీవు సేవకునిగా స్వీకరించవలెనని నా కోరిక. కాని ఒకమాట గుర్తుంచుకో. సేవకుడైనను, వీనిని నీ సతీర్థ్యునిగా గ్రహింపగలవు."

"దేవరవారి ఆజ్ఞ శిరోధార్యము" - అంటూ బీజగుప్తుడు మూర్ధాభివందనం చేశాడు.

"సరే నేను వెడతాను - నా కొకపని పూర్తయింది. శ్వేతాంకా! గుర్తుంచుకో. బీజగుప్తుడు నీ ప్రభువు. నీవాతని సేవకుడవు. ఈ వైభవంలోని భోగాన్ని, మఱీ పాపాన్ని గూడ పరిశీలించుటకు ప్రయత్నించు. మంచీ, చెడూ అన్నీ నీ కగపడుతాయి. కాని నీకే కాక ఇతరులకూ మంచిగా ఉండేదే మంచిది అనేది నీ నిర్ణయానికి గీటురాయిగా గుర్తుంచుకో. మఱీ బీజగుప్తా! నీ కొక్కమాట చెప్తాను - శ్వేతాంకుని దోషాల పట్ల సహనం వహించు. వీడజ్ఞాని. ప్రపంచరంగంలోని కిప్పుడే పాదార్పణం చేస్తున్న వీడు పసివాడు " - అంటూ రత్నాంబరుడు కేళీగృహంనుండి నిష్క్రమించాడు.

రత్నాంబరుడు వెళ్లిన తర్వాత బీజగుప్తుడు శ్వేతాంకుని వైపు తదేకనిష్ఠతో చూచాడు. "నీ పేరు శ్వేతాంకుడు - నీవు నేటినుండి నా సేవకుడవు" - అంటూ స్వల్పమందహాసం ముఖంపై దొరలించాడు. చిత్రలేఖను చూపిస్తూ, "తెలుసా శ్వేతాంకా! ఈమె యెవ్వరో?" - అన్నాడు.

శ్వేతాంకుని కన్నులు నిశిథదీపకాంతిలో మెఱుస్తూ సుసజ్జితమైన కేళీగృహమందలి చిత్రలేఖ మత్తుగొలిపే సౌందర్యాన్ని తిలకించి విభ్రమపాతం పొందాయి. అతడన్నాడు - "తెలియదు."

"ఐతే విను. ఈమె పేరు చిత్రలేఖ. ఈమె పాటలీపుత్రమందలి సుందరతమనర్తకి. నాకు పత్నితో సమానురాలు. అందుచేత ఈమె నీకు స్వామిని ఔతుంది" - అంటూ బీజగుప్తుడు నవ్వాడు. "నీ వాశ్చర్యపడుతున్నావేమో! నీ కాశ్చర్యం పనిలేదు. ఇక్కడ ఉండి నీవు పరిస్థితుల నవగాహన చేసికొనగలవు. ఇదో! ఈ మదిరాపాత్రను నీ స్వామిని కందివ్వు!" - అంటూ సుగంధమయమైన మదిరాపాత్రను బీజగుప్తుడు శ్వేతాంకుని కందించాడు.

శ్వేతాంకుడు మదిరాపాత్రను చిత్రలేఖ కడకు చేర్చాడు. అప్పు డతని హస్తం చిత్రలేఖాహస్తాన్ని స్పర్శించింది. ఆ స్పర్శతో శ్వేతాంకుని సమస్తశరీరం కంపించింది. చిత్రలేఖ శ్వేతాంకుని వైపు చూచింది. - "ఓ పడుచువాడా! ఈ అసాధారణప్రపంచంలో ప్రప్రథమంగా పాదంమోపుతున్న నీకు అభినందనలు!" - అంటూ ఆమె మదిరాపాత్రను ఖాళీ చేసింది.

అప్పుడే ప్రహరీదారులు "శయనసమయ మాసన్నమైంది" - అని ఉచ్చైస్స్వరంతో అరిచారు.

బీజగుప్తుడు చిత్రలేఖ నడిగాడు- "ఇక్కడే ఉంటావా లేక నీ యింటికి వెళుతావా?"

చిత్రలేఖ లేచి నిలబడింది. ద్వారం వైపు సాగుతూ - "ఇంటికి వెళ్లడమే ఉచితంగా తోస్తున్నది. కాని ఒంటరిగా వెళ్లలేనేమో!" - అంటూ తచ్చాడింది.

పరిచారకుడు కేళీగృహంలోనికి ప్రవేశించాడు. బీజగుప్తుడు లేచి నిలబడి, "ఔను ఇప్పుడు ఒంటరిగా వెళ్లడం నిజంగా అసంభవం" - అన్నాడు.

కొంచెం సేపు ఆలోచించి శ్వేతాంకునితో అన్నాడు - "ద్వారంముందు రథమాగింది. అందులో నాసీనురాలను జేసి నీవు నీ స్వామినిని ఆమె గృహమునకు జేర్చి రావలసినది. ఈలోపల నీ శయనగృహాని కేర్పాట్లు కాగలవు."

శ్వేతాంకుడు చిత్రలేఖతో వెళ్లిపోయాడు. బీజగుప్తుడు శ్వేతాంకుని శయనగృహాన్ని ఆయత్తం చేసేందుకు పరిచారకుణ్ణి నియోగించి నిద్రాదేవి ఒడిలో ఒదిగిపోయాడు.

౨

కుమారగిరి యోగీశ్వరుడు.

యోగీశ్వరుడా? ఎందుకు? ఎందుకంటే అతడు సంసారవిముక్తుడు. భౌతికసంసారాన్ని త్యజించి అతడు అలౌకిక కాల్పనిక ప్రపంచాన్ని సృష్టించుకొన్నాడు. ఆ ప్రపంచమే సుఖపూర్ణంగా ఉంటుందని అతని ఆశ. జనసమ్మర్దమందు అతనికి అరుచి; కాల్పనిక ప్రపంచంలో అతని సంచారం. సంసారం అతనికి అశాంతినిలయం. అందుచే అతడు నిర్జనత్వాన్ని ఆశ్రయించేవాడు. సంయమ,నియమాలపై అతనికి విశ్వాసం. కోరికలు అతనికి వశీభూతాలు.

కుమారగిరికి కొన్ని అలౌకికశక్తులుండేవి. ఆ శక్తుల సంచయనంలోనే అతనికి విశ్వాసం గాని, వాటి ప్రయోగంలో విశ్వాసం లేదు. ఏకాంతంలో అతని మనస్సు స్థిరంగా ఉండేది, ఏకాగ్రచిత్తతతో అతడు సాధనకూడ చేయగలిగేవాడు. అతడు తపఃకృశశరీరుడే కాని, దానివల్ల అతనికి అసౌఖ్యం కలుగలేదు. అతని శరీరం తప్తమయ్యేది. కాని ఆ తపోజ్వలనాన్ని ఒక అలౌకికసుఖకల్పన చల్లబరచేది. విషయవాసనలు పాపకారణములని అతడు గ్రహించియుండెను. అందుచే వాని నతడు నిగ్రహించియుండెను.

అతడు సుఖవంతుడు; ఆలోచనాసాగరంలో అతడు నిమగ్నుడై ఉండేవాడు. అతని ముందు ఇచ్ఛాప్రపంచం లేదు, ఇచ్ఛాపరంపరల అపరిపూర్ణతవల్ల జనించే పరితాప మతనికి లేదు. అతని జీవితం అకర్మణ్యతాపూర్ణం - ఐతే అది నిరంతరజ్ఞానచింతనాపరిపూర్ణం. సుఖము కల్పన - అట్లే తృప్తి కూడ. తృష్ణ లేనపుడు తృప్తికి నిజమైన మహత్త్వం లేదు. ఇట్టి స్థితిలో హృదయం భారరహితంగా, భౌతిక మానసికబాధల కతీతంగా ఉంటుంది. దుఃఖశూన్యమూ, భారరహితమూ ఐన హృదయాన్ని కాల్పనికజగత్తులోనికి సంక్రమింప జేయడం సులభం. యోగి కుమారగిరి విస్మృతియొక్క ఒడిలో కాలం గడిపేవాడు. ఆత్మవిస్మృతి, కల్పనలోని సజీవతాభ్రమ - ఈ రెంటిలో అద్భుతమైన ఆకర్షణ ఉంది. అందులోనే ఒక ఊహాకల్పితవాంఛ ఉంది; ఊహాకల్పితతృప్తికూడ ఉంది. వీనివల్ల కలిగే సుఖంలో అతడెప్పుడూ నిమగ్నుడై ఉండేవాడు.

అందుకొఱకే కుమారగిరి యోగి.

మధుపాలుడు కుమారగిరి శిష్యుడు. అతడు కుమారగిరి శక్తుల నెఱిగినవాడు. ఆ శక్తుల పట్ల ఆశ్చర్యచకితుడైనవాడు కూడ.

మధుపాలు డడిగాడు - "దేవా! సంయమమునకు లక్ష్యమేమిటి?"

కుమారగిరి సర్దుకొని కూర్చొని అన్నాడు - "శాంతి, శాంతిజనితానందం!"

మధుపాలుడు మళ్లీ అడిగాడు - "దేవా! సంసారంయొక్క వాస్తవికగతి ఏమిటి?"

"బాహ్యదృష్టిలో మార్పు, ఆంతరికదృష్టిలో శూన్యం. శూన్యము, పరివర్తన - ఈ రెంటి విచిత్రసంయోగం పట్ల నీకాశ్చర్యం కలుగవచ్చు. ఈ రెండూ ఒకటి ఎలాగౌతాయి? ఈ ప్రశ్న స్వాభావికం. ఐతే ఏస్థితిలోనైతే మానవుడు ఈ ద్వైతభావానికి అతీతుడై పోతాడో ఆ స్థితియే జ్ఞానానికి చివరిసోపానం. సంసారమేమిటి? శూన్యం! ఆ శూన్యంయొక్క నడవడికయే పరివర్తన. పరివర్తన కల్పితము. మఱి కల్పనయే శూన్యం. తెలిసిందా?"

మధుపాలున కీ ఉత్తరం సంతుష్టి కలిగింపలేదు. అతడన్నాడు -"దేవా! సంసారం శూన్యమన్నారు. అది నాకు బోధపడటం లేదు. ప్రత్యక్షంగా ఎదుట నున్న వస్తువు శూన్య మెలాగౌతుంది?"

కుమారగిరి నవ్వాడు. "ఇక్కడే యౌగికానుభవం అవసరం. యోగి కనులు నిమీలితాలౌతూనే ఒక అఖండశూన్యం నిష్పన్నమౌతుంది. ఇంకేమీ ఉండదు. ఆ శూన్యంలోనే సుఖదుఃఖాలు, అనురాగవిరాగాలు, దివారాత్రాలు, మాయాబ్రహ్మాలు - అన్నీ లుప్తమౌతాయి. అట్లు విద్యోతమానమగు శూన్యంలోనే యోగి విచరించి అక్కడే నిర్మగ్నుడౌతాడు. అట్లుత్పన్నమైన కాల్పనికజగత్తులో

కొన్ని క్షణాలపాటు యోగి విలీనుడౌతాడు. అట్టి బ్రహ్మమయమైన శూన్యంలో శాశ్వతంగా లీనమై పోవుటనే ముక్తి అంటారు. ఈ విధంగా యోగులు సశరీరంగా ముక్తి ననుభవిస్తారు."

గురువుగారిపట్ల మధుపాలుని శ్రద్ధాభక్తులు పొంగిపొరలాయి. గద్గదస్వరంతో అతడు గురువుగారి పాదాలపై శిరసు మోడ్చి నమస్కరించాడు. అతనికి గురువుగారి జ్ఞానంపట్ల గర్వం, ఆయన అచంచలత్వంపట్ల విశ్వాసమూ ఉన్నాయి. ఇదే సమయంలో రత్నాంబరుడు విశాలదేవునితో సహా కుమారగిరి కుటీరంలో ప్రవేశించాడు.

రత్నాంబరుని చూచి కుమారగిరి ఆసనంనుండి లేచి నిలుచున్నాడు. ఇద్దరూ పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. పిదప రత్నాంబరుని ఆసీనుని జేసి కుమారగిరి అడిగాడు - "ఆచార్యులవా రెందులకో శ్రమపడి వచ్చారు?"

నిశ్చలుడై రత్నాంబరుడు ప్రత్యుత్తరమిచ్చాడు - "అఖండతేజోవిభూషితుడైన యోగీశ్వరుడు కుమారగిరితో నా శిష్యునికి దీక్ష నిప్పించడానికి ఇక్కడికి వచ్చాను."

కుమారగిరి అన్నాడు - "ఆచార్యా! ఈతుచ్ఛసేవకునికి మహోన్నతస్థాన మిస్తున్నారు. నేనందులకు సర్వదా అయోగ్యుడను."

"కాదు యోగి కుమారగిరి, ఇది నీ ఔదార్యం. నీవు వస్తుతః శ్రేష్ఠుడవు. నీవు సంసారమును వీడి మహోన్నతస్థానానికి ఎదిగావు, నేనేమో ఈ సంసారంలోనే పడి ఉన్నాను. ఎక్కడ కేవలతర్కం సమస్యను విడదీయుటకు పర్యాప్తం కాదో అక్కడ అనుభవం మఱియు కల్పనాశక్తి అవసరం. నీలో జ్ఞానకల్పనలు రెండూ ఉన్నాయి, నాలో అనుభవంమాత్రముంది. ఇందుకే నీ వద్దకు వచ్చాను. నిన్నాశ్ర యించిన మానవుడు జటిలాతిజటిలసమస్యలను ఫలవంతంగా పరిష్కరించుటకు సమర్థుడు కాగలడు. ఇందుకొఱకే నేను విశాలదేవుని నీ శిష్యునిగా జేయనెంచుతున్నాను. యోగీ కుమారగిరీ! నీవు నా అభీష్టమును కాదనవుగదా! నా ప్రార్థనను స్వీకరింతువుగదా!"

కుమారగిరి విశాలదేవునివంక చూచాడు - `నాయనా! ఏ జీవితసమస్యాపరిష్కారానికై నీవు నాకడకు రాదలంచినావు?`

విశాలదేవుడు కుమారగిరికి అభివాదం చేసి ప్రశాంతచిత్తంతో ఉత్తరమిచ్చాడు - `దేవా! నేను పాపమంటే ఏమిటో తెలుసుకొన గోరుతున్నాను.`

కుమారగిరి నవ్వ నారంభించాడు. అతని నవ్వులో ఏదో మాధుర్యముంది. అతడన్నాడు - "నీకు పాపమంటే ఏమిటో తెలుసు కొనాలని ఉందా! పాపమంటే ఏమిటో అధికతరమైన అనుభవంవల్లగాని తెలిసే విషయం కాదు. కాని నాకడ నుండి నీవు పాపాన్ని అనుభ వింపజాలవు. నా క్షేత్రం సంయమ,నియమాలకు స్థానం - మఱి సంయమ,నియమాలకు పాపం దూరవర్తినియై మెలగుతుంది. ఐనా నిన్ను నేను శిష్యునిగా పరిగ్రహింపవలెనని ఆచార్యులవారి అభిమతం. కాని ముందుగా నీకు, ఆచార్యులవారికి ఇది స్పష్టంచేయడం సముచితమనుకుంటాను. నీకు నేను పుణ్యస్వరూపాన్ని చూపుతాను - ఆ పుణ్యస్వరూపాన్ని ఎరిగిన నీవు పాపస్వభావం ఆచూకి నరయగలవు."

కుమారగిరి మాటలు విని రత్నాంబరుడు లోలోపలనే నవ్వుకొన్నాడు. అతడన్నాడు - "యోగీ కుమారగిరి! నీవు చెప్పిందేదో సముచితంగా చెప్పావు! వివేకవంతులకెవఱికీ ఈ విషయంలో విప్రతిపత్తి ఉండదు."

"ఐతే ఆచార్యులవారి అభిమతం నాకు స్వీకార్యమే!"

రత్నాంబరుడు లేచి నిలుచున్నాడు - "సరే, యోగీ కుమారగిరీ! ఇంక నేను నీ అనుజ్ఞ కోరుతాను. బహుశః నీకిది ఆశ్చర్యకరంగా నుండవచ్చు - అసలు నాకే పాపరూపం తెలియదు. ఏండ్ల తరబడి అధ్యయనానుభవాల తరువాతగూడ పూర్ణజ్ఞానపులోతులను నేనందుకొనలేక పోయాను. నా శిష్యులను యోగ్యుల చేతులలో పెట్టాను గనుక, నేనింక కించిత్తు తపస్సుకూడ చేసికొనవచ్చు. అధ్య యనంచేత, అనుభవంచేత అవగాహన చేసికొనజాలని విషయాలను ఆరాధనసాధనలచేత అవగాహన చేసికొనగలనేమో చూస్తాను."

అంటూ రత్నాంబరు డక్కడనుండి వెళ్లిపోయాడు.

రత్నాంబరుడు వెళ్లిపోయిన తర్వాత కుమారగిరి విశాలదేవుని కూర్చొనమని సైగ చేశాడు.

"నాయనా! విశాలదేవా! నీవు నా శిష్యుడవైతివి. ఇప్పుడు నిన్ను కొన్ని ప్రశ్నలకు ప్రత్యుత్తరమీయ గోరుతాను. వాసన అంటే ఏమిటో నీవెఱుగుదువా?"

విశాలదేవు డుత్తరమిచ్చాడు - "దేవా! కోరికలకు ప్రతినామమే వాసన అనేది."

"సరే! మఱి నీకు తెలుసా మానవజీవితంలో వాసనల కే స్థానముందో? - బహుశః తెలియకపోవచ్చు. వాసనయే పాపం, జీవితాన్ని కలుషితం చేసే ఏకైకసాధనం. వాసనలచే ప్రేరితుడై మానవుడు భగవత్కృతనియమావళి నుల్లంఘిస్తాడు. వానిలో మునిగిపోయి తనను, తనను సృష్టించిన బ్రహ్మనూ మరచిపోతాడు. అందుకే వాసనలు పరిత్యాజ్యములు. కోరికలను త్యజించినయెడల మానవుడు ఉన్నత స్థాయికి చేరుకొనగలడు. భగవంతునికి మూడుగుణములున్నవి - సత్తు, చిత్తు, ఆనందం - అనునవి. వాసనారహితమైన విశుద్ధ మనస్సున కీ త్రిగుణములు అందుబాటులో ఉంటాయి. కాని వాసనాపరీతచిత్తమునకు మమత్వమే ప్రధానమౌతుంది. మమత్వభ్రాంతి కలుషితమైన ఆవరణంలో మెలిగే మనస్సు వీనిలో ఒక్కటైనను పొందజాలదు. విశాలదేవా! నా శిష్యుడవై నీవు చేయవలసిన ప్రథమ కర్తవ్య మిది - వాసనాపరంపరలను త్యజించి, నీ మనస్సును పరిశుద్ధ మొనరించుకొనవలెను. ఇది యొక గొప్ప తపస్సు. కాని ఈ తపస్సులో క్లేశము లేదు. వాంఛల నణచివేయుట ఉచితం కాదు; వాంఛల నుత్పన్నం చేయకుండగనే ఉండవలెను. ఒకసారి వాంఛ పొడసూపిందంటే అది ప్రబలంగా పరిణమిస్తుంది. అందుచేత వాంఛలను శాశ్వతంగా చంపుకొనవలెను. చెప్పు! నీవింత చేయగలవా?"

"దేవా! ఇది చేయడానికే యత్నిస్తాను. కాని కృతకృత్యుడ నౌతానో కానో చెప్పలేను. మీరు సెలవిచ్చిన మార్గం సరళంగానే ఉంది. కాని అందులో కొంత క్లేశ మవశ్యంగా ఉంది. వాసనల ప్రతిఘాతనం జీవనక్రమానికి ప్రతికూలం కాదా? మానవు డుత్పన్నుడయ్యే దెందుకు? కర్మనిర్వహణ కొఱకు. అట్లాంటప్పుడు అట్టి కర్మకరణసాధనములను పోనాడుట విధివిధానమునకు ప్రతికూలము కాదా? దేవా! మీరెప్పుడు ఏతత్సంబంధమైన భ్రమను నాకు నివారణ చేయగలరో అప్పుడు మీరు నిర్ధరించిన మార్గములో నడచుకొనగలను." - అన్నాడు విశాలదేవుడు.

విశాలదేవునినుండి ఈ ఉత్తరం వస్తుందనే అనుకొన్నాడేమొ, కుమారగిరి దానికి సిద్ధపడే కూర్చున్నాడు. అతడన్నాడు - "నీవు చక్కగా చెప్పావు విశాలదేవా, ఎందుకంటే నీవొక గురువుగారిచేత ప్రభావితుడవయ్యావు. ఆ ప్రభావాన్ని దూరంచేసి దాని స్థానంలో నా ప్రభావాన్ని నెలకొల్పవలసి ఉంది. నేను నీభ్రమను నివారింపగలను, ఐతే నేడు కాదు. భ్రమలో పడిపోయిన గురువుగారి శిష్యునిలో భ్రమలు తలసూపడం స్వాభావికమే కదా! ఐనా విశాలదేవా! చూస్తాను, ఆచార్య రత్నాంబరుల బోధన లెంతవఱకు నాస్తికతవైపు మొగ్గుచూపు తున్నవో! నేను ఆస్తికుణ్ణి. నీవు నావల్ల ఏమైన అభ్యసించాలంటే రెండు మాటలు ముందుగా గుర్తుంచుకోవాలి. ప్రథమంగా బ్రహ్మము, ద్వితీయంగా కర్తవ్యం - ఈ రెండూ జీవితంలో ప్రధానాంగాలు అనేవి."

"దేవా! నాకీ రెండు మాటలూ తెలుసును" - అన్నాడు విశాలదేవుడు.

కుమారగిరి లేచి నిలుచున్నాడు. "ఐతే నిశ్చింత! నేను నీకు దీక్ష ప్రసాదిస్తాను, నీకు ముక్తిమార్గాన్ని చూపించి, తద్ద్వారా పాప రూపాన్ని పరిచయం చేస్తాను."

## 3

శ్వేతాంకుడు బ్రహ్మచారి. అనుభవరహితమైన అధ్యయన మతని రంగం, జ్ఞానసముపార్జన మతని ధ్యేయం. అతని వయస్సప్పుడు బహుశః ఇరువదియైదు వత్సరాలు. అప్పటికే అతడు దర్శనాలను, స్మృతులను అధ్యయనం చేసినాడు. సాహిత్యవ్యాకరణములను పఠించినాడు. కావ్యములందలి సజీవానురాగవర్ణనముల నతడు ఆసక్తితో చదివినాడు; ఆ వర్ణనముల నవగాహన చేసికొనుట కతడు యత్నించినాడు గాని అందులో కృతకృత్యుడు కాలేకపోయెను. స్త్రీస్వభావ మతని కపరిచితము, యౌవనపు నిషాతత్త్వాన్ని అత డెఱిగిన వాడు కాడు.

బీజగుప్తుని భవనంలో బ్రహ్మచారియైన శ్వేతాంకునికి నర్తకీమణి చిత్రలేఖతో పరిచయ మేర్పడింది. తొట్టతొలిగా బీజగుప్తుడు శ్వేతాంకునికి చిత్రలేఖను నవ్వులాటకు పరిచయం చేశాడు. కాని ప్రపంచానుభవశూన్యుడైన బ్రహ్మచారి, విషయాసక్తురాలైన నర్తకి - వీరి

ఇర్వురి పరిస్థితులను విచారిస్తే అతనికి కౌతూహలం కలుగజొచ్చింది. బ్రహ్మచారి, నర్తకి - బీజగుప్తునికి వీరి పరిచయం హాస్యాస్ప దంగా తోచింది.

కాని బీజగుప్తుని అపహాస్యం శ్వేతాంకుని జీవితంలో అలజడిని సృజించింది. దాదాపుగా ప్రతిరాత్రి శ్వేతాంకునికి చిత్రలేఖను సాగ నంపుట కామె భవనపర్యంతం వెళ్లవలసివచ్చేది. ఆ సమయంలో ఆమె మైకపు హాళాహాళిలో ఉండేది. ఆమె కన్నులలోని కైపు శ్వేతాంకుని హృదయంలో ఒక రకమైన కంపనను కలిగించేది. మగువ, మదిర - వీటి సంయోగం దీపం తైలాల ప్రజ్వలితజ్యోతి - శ్వేతాంకుడు ఆ జ్యోతిచుట్టూ చరించే శలభం (మిడుత). చిత్రలేఖవైపు చూచినపుడెల్లా శ్వేతాంకుని కొక విచిత్రమైన సుఖానుభూతి కలిగేది. మఱి ఆ సుఖ మేమిటి? ఏదోయొక అజ్ఞాతమైన ఇచ్ఛాజనిత మనఃప్రకంపన! ఎప్పుడు మైకం క్రమ్మిన చిత్రలేఖయొక్క అర్ధనిమీలితనేత్రాలతో శ్వేతాంకుని చూపులు కలుస్తాయో అప్పు డతడున్మాదివలె మైమరచి తూలుతుంటాడు.

బీజగుప్తుని భవనంలో శ్వేతాంకు డతని అనుజన్మునిగా పరిగణింపబడుతుంటాడు. బీజగుప్తుని సేవకులు శ్వేతాంకుని తమ రాశిగా దలపరు; అతనిని బీజగుప్తుని మాదరిగానే తమ యజమానిగా భావిస్తారు. భోగవిలాసాల సాధనాలన్నీ శ్వేతాంకునికి అందుబాటులో ఉన్నాయి. నగరంలోని ప్రభావశాలురైన వ్యక్తులతో అతనికి పరిచయమేర్పడింది. అగాధాంధకారంనుండి ఒక సుషమాపరీత విశ్వం లోనికి అతడు హఠాత్తుగా అడుగిడినాడు. అందుచే మునుముందు తానున్న పరిస్థితులను తానే నమ్మలేకపోయాడు. కాని మెల్లమెల్లగా వాటికి అలవాటుపడసాగాడు. తాను సంసారరంగంలో, పాపపుణ్యాల మధ్య, వాసనాపరంపరలచే నలుదిశలా ఆవరింపబడి యున్నట్లు అతడు గ్రహించాడు. తాను సంసారతరంగాలలో పడి ప్రవహిస్తున్న ట్లతడు తెలుసుకొన్నాడు.

ఒకరోజు బీజగుప్తుడు కారణాంతరాలవల్ల బయటికి వెళ్లాడు. ఆకస్మికంగా ఏర్పడిన అత్యవసరకార్యభారంవల్ల అతడు సాయం కాలానికి గృహోన్ముఖుడు కాలేకపోయాడు. సంధ్యావేళ నిర్ణీతసమయానికి చిత్రలేఖరథం బీజగుప్తుని ద్వారంముందు వచ్చి ఆగింది. శ్వేతాంకుడే చిత్రలేఖకు యజమాని లేని గృహంలోనికి స్వాగతం పలికాడు. ఇద్దరూ కలిసి బీజగుప్తుని సమావేశశాలలో ప్రవేశించారు. బీజగుప్తుని అక్కడ గానక, చిత్రలేఖ "నీ యజమాని ఎక్కడ?" - అని ప్రశ్నించింది.

"నీ యజమాని ఎక్కడ?" - అనే ప్రశ్న నర్తకిముఖంనుండి వెలువడేసరికి బ్రహ్మచారి శ్వేతాంకుని మనసు చిన్నబోయింది. ఆమె మాటతీరు ఎంతో నిశితంగా ఉంది - అట్లాంటి మాటలే వేరే సామాన్యస్త్రీముఖంనుండి వెలువడితే బహుశః శ్వేతాంకుడు కటువుగా ప్రత్యు త్తర మిచ్చేవాడేమో, లేదా మనస్సు చిన్నబుచ్చుకొనేవాడు కాడేమో! శ్వేతాంకునికి తొట్టతొలిగా తన నిమ్నస్థితి, అల్పత్వం గోచరము లయ్యాయి, వానితోబాటు అతనికి పరితాపంకూడ కల్గింది. కాని తన మనోభావాల నణచుకొని అతడన్నాడు - "దేవీ! కార్యవశమున వారు బయటికి వెళ్లారు."

చిత్రలేఖ అడిగింది - "వా రెంత సేపటికి రావచ్చు?"

"వస్తూనే వున్నా రనుకొంటా!"

"శ్వేతాంకా! నాకు దాహంగా ఉంది!"

శ్వేతాంకుడు లేచి నిలుచున్నాడు. అతనికి తన స్థితి తెలిసిపోయింది, దానితోబాటు "చిత్రలేఖ నీ స్వామిని!" - అనే బీజగుప్తుని మాటలు గుర్తుకు వచ్చినాయి. అతడు స్వయంగా తనచేతులతో స్వర్ణపాత్రలో శీతలజలాన్ని తీసుకొని వచ్చాడు.

చిత్రలేఖ ఆ జలాన్ని చూచి నవ్వింది. "శ్వేతాంకా! నీవు కేవలం అర్భకునిలాగున్నావు!"

శ్వేతాంకు డామె మాటలలోని వ్యంగ్యాన్ని గ్రహించలేదు - "దేవీ! నేనేం పొరపాటు చేశాను?"

చిత్రలేఖ మఱింతగా నవ్వింది. - "శ్వేతాంకా! నీవింకా అర్థంచేసుకోలేదు. ఈ దాహం తీరనిది. అగ్నికి జలావశ్యకత ఉండదు, దానిని రెట్టించే ఘృతం కావాలి. జీవితమొక తీరని దాహం. ఆ దాహాన్ని తీర్చడం దాని నంతం చేయడమే. నాకు కావలసింది జలం కాదు, మద్యం."

శ్వేతాంకు డా మాటలకు చకితుడయ్యాడు. ఆమె మాటలెంత భయానకములో అంత తర్కపూర్ణములు. అతడు గూడ నవ్వాడు - "బహుశః నేను పాటలీపుత్రపు సుందరతమనర్తకికి శిష్యత్వం చేయవలెనేమో దేవీ!" - అంటూ మదిరాచషకాన్ని చిత్రలేఖ ముందుంచాడు.

ఒకమారు మదిరను సేవించి చిత్రలేఖ శ్వేతాంకుని ముందా చషకాన్ని ఉంచింది. అప్పుడామె దిండునానుకొని కూర్చొని ఉన్నది. ఆ ప్రయత్నంలో ఆమె మేలిముసుగు తొలగిపోయి అంధకారతుల్యమైన ఆమె నల్లని శిరోజాలు వెలువడ్డాయి. ఆ శిరోజాలయందు గ్రథితమైన ముక్తాదామం విద్యున్మాలవలె ప్రకాశిస్తూ వుంది. ఆ ఆహార్యమెంత అందంగా ఉందో! శ్వేతాంకు డెప్పుడూ అటువంటి అనుపమ సౌందర్యమూర్తిని ఊహామాత్రంగానైనా చూచియుండలేదు. చిత్రలేఖాయౌవనం ఉన్మాదానికి ప్రతిరూపం. ఆమె అరుణకపోలాలు ప్రశోణము లైనవి. ఆమె అధరం మందహాసపరాగమజ్జితమై ఉన్నది. ఆమె కన్నులలో హాసం వెల్లివిరుస్తున్నది.

శ్వేతాంకుడు నిశ్చేష్టుడై ఆమె సౌందర్యాన్ని గ్రోలుతున్నాడు. చెత్రలేఖ అడిగింది - "శ్వేతాంకా! నీవు మదిరను త్రాగడం లేదు. నేను నీముందు మదిరాపాత్ర నుంచాను, కాని నీవు దానిని నీ ముఖందాక చేర్చడానికి సాహసింపలేకున్నావు, నేనొక ప్రశ్న అడుగుతాను - దానికి నీవు సరిగా సమాధాన మీయవలెను."

"నీవు బ్రహ్మచారివి గదా! నీగురువు నీకు మద్యపానం నిషేధించినాడనుకుంటాను! ఈ నిషేధానికి కారణం తెలియగోరుతున్నాను"

శ్వేతాంకుడు నెమ్మదిగా ప్రత్యుత్తరమిచ్చాడు - "దేవీ! సంయమనము జీవితంయొక్క ప్రధానాంగం. మదిర సంయమనమునకు విరోధి."

"మఱి సంయమనలక్ష్య మేమిటి?"

"సుఖశాంతులు"

చిత్రలేఖ మదిరాపాత్రను అధరానికి జేర్చుకుంటూ అడిగింది - "మఱి జీవనలక్ష్య మేమిటి?"

చిత్రలేఖ నేత్రాలు మత్తుతో కొంచెంకొంచెంగా ఎఱ్ఱబడసాగాయి. ఆమె స్వరంలో శ్వేతాంకుని కేదో సంగీతానుభూతి కలిగింది, ఆమె సంభాషణలో ఏదో కవిత తోచింది. అతడామెకు జవాబిచ్చాడు - "జీవనలక్ష్యమా? సుఖమూ, శాంతీను!"

"ఇక్కడే మరుస్తున్నావు నవయువకా! - చిత్రలేఖ సర్దుకొని కూర్చున్నది - "సుఖమే తృప్తి, అకర్మణ్యతయే శాంతి అంటున్నావు. కాని జీవితం ఎడతెగని కర్మతో, తీరని పిపాసతో కూడినది. అది సంచలనాత్మకమైనది. పరివర్తనాత్మకమైనది. మఱి సంచలనపరివర్తనలతో కూడిన జీవితంలో సుఖశాంతుల కెంతమాత్రం స్థానం లేదు." - అంటూ ఆమె చషకాన్ని శ్వేతాంకుని పెదవుల కడకు జేర్చింది.

ఒకమారు శ్వేతాంకు డా చషకాన్ని తొలగింప నెంచాడు; కాని చిత్రలేఖ నవ్వే కన్నులలో ఏదో ఒక వింత ఇంద్రజాలముంది. అత డామె నాపలేక పోయాడు; తనను తా నాపుకొనలేక పోయాడు. మదిర అతని కంఠంలోనికి దిగిపోయింది.

ఇదే సమయంలో బీజగుప్తుడు వెనుకనుండి నవ్వుతూ అన్నాడు - "బ్రహ్మచారీ! నర్తకి యిప్పుడు నీకు దీక్షను ప్రసాదించింది. ఇందుకు గురుతుగా చిత్రలేఖను నే నభినందిస్తున్నాను."

శ్వేతాంకుడు సమ్మోహనిద్రనుండి హఠాత్తుగా ఉలికిపడి లేచాడు. బీజగుప్తుని నవ్వు అతని పొరపాటును బయలుపరచింది. అతడు చిత్రలేఖ వైపు చూచాడు; బీజగుప్తుని వైపు చూచాడు. ఆపైని తలను దించుకొన్నాడు. బీజగుప్తుడు నవ్వుతూ వస్త్రాలు మార్చుకొనుటకు వెళ్లిపోయాడు. అతడు వెళ్లిన తర్వాత శ్వేతాంకుడు చిత్రలేఖతో అన్నాడు - దేవీ! నీవు నేడు నాసాధనను తుందునుకలు చేశావు. ఎందుకిట్లా చేశావు? నీవు నాయెదలో ఒక జ్వాలను ప్రజ్వలింపజేశావు. ఎందుకొఱకు? దేవీ! సుడిగుండంవలె అకస్మాత్తుగా నీవు నా జీవితంలో ఎందుకు ప్రవేశించావు?" - అంటూ చిత్రలేఖాహస్తాల నతడు గట్టిగా పట్టుకొన్నాడు.

చిత్రలేఖ నవ్వుతూ ప్రత్యుత్తర మిచ్చింది -"శ్వేతాంకా! మరుస్తున్నావా! నీవు దేన్ని సాధన అంటున్నావో అది ఆత్మహననం. మైకం (మాదకత్వం) జీవితంలో ప్రధానాంగమని మాత్రమే నేను నీకు చూపాను. నీవు నీహృదయంలో ఏదో వినూతనజ్వాలను ప్రజ్వలింపజేశాననుకుంటున్నావు గాని, జీవితంలోని వాస్తవికమహత్త్వాన్ని మాత్రమే నేను నీకు చూపాను." -- చిత్రలేఖ ఒక్కసారిగా గంభీరురాలైంది. శ్వేతాంకుని హస్తాలను త్రోసివేస్తూ అన్నది - "శ్వేతాంకా! ఇది గుర్తుంచుకో - నేను నీజీవితంలో ప్రవేశించడమనేది అసంభవం. ఏ

పరిస్థితిలో నున్నను, నా మనోవృత్తిమాత్రం నాకు బాగా తెలుసు. నేను జీవితంలో ఒకే ఒక వ్యక్తిని ప్రేమిస్తున్నాను - అతడే బీజగుప్తుడు. ఎప్పుడూ ఊహామాత్రంగానైనా తలపోయకు - నీ జీవితంలో నేను రాగలనని. ఇక నీవు వెళ్లవచ్చు."

శ్వేతాంకుని ముఖం పాలిపోయింది. అతడు జ్ఞానంలో, కర్తవ్యంలో, వ్యక్తిత్వంలో ఒక నర్తకిచేత ఓడింపబడ్డాడు. "దేవీ! మీ ఆజ్ఞాను సారం" - అంటూ అవమానితుడు, విజితుడైన బ్రహ్మచారి ద్వారంవైపు సాగాడు.

చిత్రలేఖ కొంచెం ఆలోచించింది, మనసులో ఏదో అనుకొన్నది. ద్వారం దాటిన శ్వేతాంకుణ్ణి మళ్లీ పిలిచింది - "ఆగు శ్వేతాంకా! నీతో చెప్పవలసింది ఇంకా ఉంది, తిరిగి రా!'

శ్వేతాంకు డాగిపోయాడు. అతడు తిరిగి రాలేదు గాని తిరిగి చూచి అన్నాడు - "దేవీ! నిందాలాప మింకా మిగిలిందా? నామనో దౌర్బల్యాని కింతవఱకు లభించిన పురస్కారం చాలలేదా? దేవీ! నీవు నా స్వామినివి, మఱి నా జీవన....! కాదు, కాదు - క్షమించాలి! నీవు కేవలం నా స్వామినివి, అందుకే నీ ఆజ్ఞ నాకు శిరోధార్యము. ఏం చెప్పాలో చెప్పండి దేవీ!" - శ్వేతాంకుని నయనా లశ్రుపూరితము లైనవి.

చిత్రలేఖాహృదయంలో శ్వేతాంకుని - బాలుడైన శ్వేతాంకుని ఈ వచనాలకు ఆఘాతం కలిగింది. ఆమె అన్నది - 'శ్వేతాంకా! నేను పొరపడ్డాను. నేను నీపట్ల కటువుగా వ్యవహరించాను, ఇందుకు క్షమాపణ కోరుకుంటున్నాను. శ్వేతాంకా! నీపై నాకు ప్రేమే ఉంది - నీవు నా సోదరునితో సమానుడవు. నీవు దుఃఖిస్తే నాకూ దుఃఖం కలుగుతుంది. తెలియకుండా నేను నిన్నవమానంకూడ చేశానేమో, ఇందుకు నీనుండి క్షమాపణ నర్థిస్తున్నాను."

చిత్రలేఖ క్షమాప్రార్థనతో శ్వేతాంకుని మనఃక్షోభ, దుఃఖము దూరమయ్యాయి. అతని హృద్వేదన మంచువలె కరగిపోయింది. అతడు చిత్రలేఖలో ఒక దేవతామూర్తిని సందర్శించాడు - ఒక విధమైన వెలుగురేఖ నవలోకించాడు. అతని దృష్టిలో ఇప్పుడు చిత్రలేఖ ఒక నర్తకిమాత్రంగా మిగుల లేదు; ఆమెతో తనకేదో పారలౌకికబాంధవ్య మున్నట్లుగా అతనికి అనుభూతి కలిగింది. అతడన్నాడు - "దేవీ! క్షమాయాచన కెంతమాత్రం అవసరం లేదు. పొరపాటు నాది, ఈ పొరపాటుకు నేను దండనార్హుడనై యుంటిని. కాని దండనకు బదులు నాపై కృపాపూర్ణతను కనబరచినావు. అట్టడుగుకు మునిగిపోయే నన్ను రక్షించి నీవు నాపై చూపిన అనుగ్రహ మింతింతని చెప్పజాల కున్నాను. నన్ను క్షమించు దేవీ!" - అంటూ శ్వేతాంకుడు భవనం దాటి వెళ్లి పోయాడు, చిత్రలేఖమాత్రం నిశ్చేష్టురాలై ప్రతిమవలె నిలబడి పోయింది. అజ్ఞానంతో తానొక అమాయకయువకుణ్ణి తన యౌవనమదానికి ఎరగా చేసింది - దీని కామెకు దుఃఖం కలిగింది.

శ్వేతాంకుడు నేరుగా బీజగుప్తుని వద్దకు వెళ్లాడు. వెళ్లగానే బీజగుప్తుని పాదాలపై బడి. "స్వామీ! నన్ను దండించండి" - అంటూ ప్రాధేయపడ్డాడు.

శ్వేతాంకుని వ్యవహారానికి బీజగుప్తు డులికిపడ్డాడు. శ్వేతాంకుణ్ణి లేవనెత్తి, "శ్వేతాంకా! ఏమైంది? ఎందుకు?" - అన్నాడు.

శ్వేతాంకుడు బొంగురుగొంతుతో అన్నాడు - "స్వామీ! నేను మీయెడల విశ్వాసఘాతుకత్వాపరాధం చేశాను. మీకు ప్రియురాలు, నాకు స్వామిని ఐన స్త్రీమూర్తిని ప్రేమించడమనే అపరాధం నేను చేశాను."

బీజగుప్తుని కంతా అర్థమైంది. అతడు తనలో తాను నవ్వుకొన్నాడు. "శ్వేతాంకా నీవెట్లా తెలుసుకొన్నావు ఆ స్త్రీమూర్తి నన్నుగూడ ప్రేమిస్తున్నదని?" - అని అన్నాడు.

"ఆమే స్వయంగా నాతో చెప్పింది." - శ్వేతాంకునిపై మదిరాప్రభావం ప్రబలం కాజొచ్చింది. అతని శరీరంలో నూతనోద్వేగ మారంభమైంది - "ఆమె హస్తాలతో మదిరను స్వీకరించి నేను నా సంయమనాన్ని విడనాడాను. నేను ప్రేమించే మగువ చేతులలోని మదిరను కాదనలేక స్వీకరించాను."

కృత్రిమగాంభీర్యాన్ని సంతరించుకొని బీజగుప్తుడు పలికాడు - "శ్వేతాంకా! ఒకవేళ ఆ స్త్రీ నన్ను ప్రేమిస్తున్నానకుండ, నీకు తన నర్పించుకొనడానికి సంసిద్ధురాలైతే నీవేం చేసి ఉండేవాడివి?"

కొంచెం సేపాలోచించి, శ్వేతాంకు డన్నాడు - "బహుశః నేను మీతో క్షమాప్రార్థన చేసి ఉండేవాడిని కానేమో! విశ్వాసఘాతుకుడనై స్వామిద్రోహమహాపరాధం చేసి ఉండేవాడినేమో!"

బీజగుప్తుడు హస్తాన్ని శ్వేతాంకునివైపు ప్రసరిస్తూ అన్నాడు - "శ్వేతాంకా! నీవు క్షమాప్రార్థన చేయవలసిన అవసరమింతైనా లేదు. నీపరిస్థితులలో నున్న ఏ యితరవ్యక్తికూడ నీవు చేసిన పనినే చేస్తాడు. నీవు చేసిందేదో సరిగానే చేశావు, చేయబోయేదికూడ సరిగానే చేసియుండేవాడివి. దీంట్లో నీ దోష మెంతమాత్రం లేదు; పరిస్థితులదే దోషం. నేనుమాత్రం నీపట్ల ప్రసన్నునిగానే ఉన్నాను. నీవపరాధం చేశావు, కాని ఆ అపరాధ మెవరిపట్ల చేశావో వారికి నీఅపరాధాన్ని తెలుపుకొని దాన్ని క్షాళనం చేసుకొన్నావు. నీవు నాతో సత్యం పలికావు, ఇది ఉచితమైన పద్ధతి. ఇక మిగిలింది నాపట్ల విశ్వాసఘాతుకత్వం చేశావన్న మాట. శ్వేతాంకా! మరచిపోతున్నావా, నీవిప్పుడిప్పుడే ప్రపంచంలోనికి పాదం మోపుతున్నావు. నీవు ప్రపంచానుభవశూన్యుడవు. ఎన్నిసార్లు నీవనుభవమనే నికషోపలంపై కెక్కుతావో చెప్పలేముగాని, ఎక్కినప్పుడు నీవు యుక్తాయుక్తవిచక్షణ పాటించవలసి ఉంటుంది. వాంఛలు ప్రబలములై నిన్ను పీడిస్తాయి, వాటిని అణచుకోవలసి ఉంటుంది. ఇక్కడే నీ ఆత్మశక్తికి పరీక్ష జరుగుతుంది. విజయావిజయాలు తేల్చే క్షేత్రం ప్రపంచమే కాని, నిర్జనస్థలం కాదు."

శ్వేతాంకుడు ఏడుస్తూ ఉత్తరమిచ్చాడు - "స్వామీ!, ఇదంతా చేస్తాను. కాని నా యీ అపరాధానికి దండన విధించండి."

బీజగుప్తుడు శ్వేతాంకుని శిరస్సుపై హస్తాన్నుంచి పలికాడు - "ఎందు కేడుస్తావు? ఈ అపరాధానికి దండన గోరుతావా? ఐతే నీవపరాధం చేయలేదు, మఱి దానికి దండన ఎలా సాధ్యం? అపరాధం కర్మవల్ల కలుగుతుంది. విచారంవల్ల కాదు. విచారం కర్మకు పరికరం మాత్రమే కాని విచారమే కర్మ కానేరదు. ఐనా నీవు దండన కావాలంటే, నీకు కఠినాతికఠినదండనను విధిస్తాను. నీవు మునుపటి వలె భవిష్యత్తులోగూడ చిత్రలేఖను ప్రతిరాత్రి ఆమె భవనందాక తోడ్కొని వెళ్లాలి - ఇదే ఆ దండన."

౪

విశాలదేవుడు కుమారగిరిలో ఒక మహనీయవ్యక్తిని కనుగొన్నాడు. అతని జ్ఞాన తేజస్సుల ప్రభావాని కతడు లొంగిపోయాడు. కుమారగిరి తర్కమనాక్షేపణీయము, అఖండితవ్యము. విశాలదేవుని భ్రమపరంపరల నతడు క్షణములో నివారణ చేయుచుండెను. విశాలదేవుని కతడు యోగాభ్యాసము నారంభించెను. కుమారగిరి యోగ్యుడైన గురువు; విశాలదేవు డా గురువునకు యోగ్యుడగు శిష్యుడు.

ఒకనాడు కుమారగిరి విశాలదేవునికి ఉపాసనామహత్త్వాన్ని బోధిస్తున్నాడు. అప్పటికి సూర్యాస్తమయమైంది; నిర్జనప్రదేశంలో కుమారగిరి కుటీరంలోని దీపమొక్కటే మిన్కుమిన్కుమంటున్నది. అనుకోకుండ ద్వారముఖంలో ఏదో పదధ్వని వినపడింది, దానితో బాటు, "దారి తప్పిన పథికు డీ రాత్రి కాశ్రయము కోరుతున్నాడు" - అనే మాటలు వినపడ్డాయి.

"ఆ వ్యక్తికి స్వాగతం. నా ఆశ్రమం దారితప్పిన ప్రతిప్రాణికీ తెరిచే ఉంటుంది" - అని, కుమారగిరి తన మాటలకు తానే నవ్వసాగాడు.

అప్పుడొక పురుషుడొక స్త్రీతో సహా లోనికి ప్రవేశించినాడు. స్త్రీని చూడగానే యోగి కుమారగిరి ఒక్కసారిగా త్రుళ్లిపడి, పురుషునితో అన్నాడు - "అతిథివర్యా! ముందుగానే ఒక స్త్రీకూడ నీతో ఉందని ఎందుకు చెప్పలేదు? ఇది సంసారాన్ని పరిత్యజించిన యోగీశ్వరుని ఆశ్రమమని నీవు గుర్తుంచుకొనవలెను."

"స్వామీ! ఇది యోగీశ్వరుని ఆశ్రమమని తెలుసు. కాని ఇంద్రియజేతయైన యోగికి ఒక స్త్రీకి - పురుషునితో గూడి వచ్చిన ఒక స్త్రీకి - ఒక్క రాత్రికొఱకు ఆశ్రయమిచ్చుటకు అభ్యంతరముండునని నేననుకొనలేదు."

ఆ మాటకు కుమారగిరి నిస్తేజస్కుడైనాడు. ఆలోపలనే ఆ స్త్రీ నిషణ్ణురాలైంది. దీపం యొక్క మందకాంతి ఆమె ముఖంపై ప్రసరిస్తూ ఉన్నది. కుమారగిరి అన్నాడు - "అతిథీ! స్త్రీమూర్తి కేవలం అంధకార-మోహ-మాయా-వాసనలకు మూలమని నేనీ కుటీరంలో ఆశ్రయమీయ సంకోచించినాను. జ్ఞానప్రకాశపరిపూర్ణమైన విశ్వంలో స్త్రీ కెంతమాత్రం స్థానం లేదు. ఐనా, మీరిద్దరూ నా అతిథులు. అందుచే మీ కతిథిసత్కారం చేయవలసినది నా కర్తవ్యం."

ఆ వాక్యార్థముల నా స్త్రీ కౌతూహలాశ్చర్యములతో విన్నది. కుమారగిరి మాట ముగియగానే అతనిముందు తలవాల్చి "ప్రకాశలుబ్ధమైన పతంగానికి అంధకారం యొక్క ప్రణామం" - అని అతనికి ప్రణమించింది. ఆమె పలుకు బాణంవలె నిశితంగాను, మనః ప్రహారకంగాను ఉన్నది. స్వనం కోమలంగాను, సంగీతమయంగాను ఉన్నది. ఆమె సౌందర్యంలో కవిత్వమున్నది; ఆమె వాసనాసక్తిలో అహంకారం అధివసిస్తున్నది. ఆ అసాధారణస్త్రీయొక్క అసాధారణప్రణామానికి కుమారగిరి త్రుళ్లిపడి లేచినాడు. ఆమెను తదేకంగా చూచినాడు. ఆమె రూపాని కాశ్చర్యచకితుడైనాడు. అంతటి సౌందర్యవతిని మున్నెన్నడూ అతడు చూచియుండలేదు. ఆ స్త్రీవాక్యానికి ప్రత్యుత్తరమీయడం అతనికి ఉచితంగా తోచలేదు. అతడు పురుషునితో అన్నాడు - "అతిథులనుగురించి తెలిసికొనడానికి నా కధికార మున్నదా?"

అప్పుడా పురుషుడు ప్రతివల్కినాడు - "స్వామీ! ఈ దాసుడు బీజగుప్తుడనే పేరు గల పాటలీపుత్రపు సామంతుడు. ఈమె పాటలీ పుత్రపు సుందరతమనర్తకి చిత్రలేఖ."

"బీజగుప్తుడు, చిత్రలేఖ!" - అంటూ కుమారగిరి చిత్రలేఖవైపు తిరిగినాడు. "నర్తకీ చిత్రలేఖా! నీ కవిత్వంలోని కర్కశత్వంలో ఉన్మాదస్పర్శ ఉన్నది. నీలోని విషాన్ని నీ సౌందర్యం కప్పిపుచ్చుతున్నది. నీవు నన్నతిథివై అభ్యర్థించినావు. అందుచే ఆశీర్వాదం చేయడం నా ధర్మం. భగవంతుడు నీకు సన్మతిని ప్రసాదించుగాక!"

చిత్రలేఖ నవ్వింది. ఆమె మధురహాసంలో మనోమోహనకరమైన పరాగమున్నది. ఆమె అన్నది - "స్వామీ! సన్మతి అనే పదానికి విభిన్నార్థాలున్నాయి. అనురాగవశమైన మతి కుపాదేయమైన సుఖానుభవమే, విరాగవశమైన మతికి హేయంగా భాసిస్తుంది. ప్రతివ్యక్తి కొన్నిసిద్ధాంతాల నేర్పరచుకుంటాడు, అవి సరియైనవని విశ్వసిస్తాడు. ప్రతిమానవుడు తాను చరించే పథమే సరియైనదని నమ్ముతాడు;అన్యమార్గానువర్తులయందు దోషము లెన్నుతాడు."

అనురక్తికి దాసియైన నర్తకి విరక్తుడైన యోగీశ్వరుని ప్రతిఘటించింది. క్రాంతి శాంతితో పోటీపడింది; జీవనం ముక్తితో పందెం వేసింది. కాని కుమారగిరి చలించలేదు. అవికలుడై అతడన్నాడు - "కాని సత్య మొక్కటే! అదే వాస్తవికతాజ్ఞానం. ఏ మార్గంవల్ల శాంతి, సుఖాలు లభిస్తాయో అదే సరియైన మార్గం." అతని స్వరం గంభీరంగా ఉన్నది, తపస్తేజము యువకుడైన ఆ యోగీశ్వరుని సుందరమూర్తిని ప్రకాశింపజేస్తూ ఉన్నది. అతని విశాలనయనాలలో శాంతిజ్యోతి విద్యోతమానమౌతున్నది.

యోగి కన్నులు నర్తకి కన్నులతో క్షణంపాటు కలిసినవి. వాసనాపరిధి తపస్సమక్షంలో ఉత్కంపితమైపోయినది. ఎదుట నున్న యోగి ఉత్తమకోటికి జెందినవాడుగా చిత్రలేఖకు తోచింది. ఐనా ఆమె సాహసించి అన్నది - "శాంతి, సుఖం - శాంతి అకర్మణ్యతకు మారుపేరు, మఱి సుఖానికి ఏకైకనిర్వచనం లేదు."

చిత్రలేఖ వికృతదర్శనసిద్ధాంతప్రతిపాదనలోని తర్కానికి కుమారగిరి స్తబ్ధుడైనాడు. ఆమె అతిలోకసుందరియే కాక విదుషీమణి కూడ. ఆమెలో ఆలోచనాశక్తి, ప్రతిభలున్నాయి. ప్రతిభతో ప్రతిభయే పోటీపడగలదు, మఱి జ్ఞానక్షేత్రంలో ప్రతిభ, సృజనాత్మకశక్తులకు సర్వోత్కృష్టస్థాన మున్నది. కుమారగిరి కొంతసేపు మౌనంగా ఉన్నాడు. ఆ తర్వాత మెల్లగా, నిష్కర్షగా అన్నాడు - "బాగానే అన్నావు.. శాంతి అకర్మణ్యతకే మారు పేరు, మఱి అకర్మణ్యతయే ముక్తి. ప్రపంచంలో అందరూ అకర్మణ్యతగా భావించేది నిజంగా అకర్మణ్యత కాదు. ఎందుకంటే ఆ స్థితిలో మేధస్సు పనిచేస్తూనే ఉంటుంది. అకర్మణ్యతకు అర్థం, ఏ శూన్యంలోనుండి ఉత్పన్న మైనామో, ఆ శూన్యంలోనే లయమై పోవడం. ఆ శూన్యమే జీవితంయొక్క నిర్ధారితలక్ష్యం. నీవు సుఖం నిర్వచనాన్నిగురించి కూడ వచించినావు, ఆ మాట నేనూ బాగా ఎఱుగుదును. కాని సుఖమొక్కటే - అందులో విభేదాలు లేవు. ఆ సుఖస్వరూపాన్ని తెలిసినవాడు తన సాధారణస్థితినుండి ఒకానొక ఉచ్చస్థితికి చేరుకుంటాడు." చిత్రలేఖ కుమారగిరి మాటల సారాంశాన్ని గ్రహించింది. తన అభీష్టానికి వ్యతిరేకంగా తానే నవయువకుడైన ఆ యోగీశ్వరుని వైపు మొగ్గుతున్నట్లుగా ఆమె కనిపించింది. ఐనా సాహసించి పలికింది - "యోగీశ్వరా! మీ శూన్యాన్నెవరు విశ్వసిస్తారు? ఎదుట ఉండేదేదో అదే సత్యమూ, నిత్యమూను. శూన్యమనేది కల్పితవస్తువు మాత్రమే. శూన్యమహత్త్వప్రతిపాదకుడవైన యోగీశ్వరా! నా మమకారానికి, మీ మమకారానికి భేదముందంటారా? ఒకవేళ భేదముందంటే, మీరు

శూన్యమునందు విశ్వసింపరు, లేదంటే మీరు ప్రవచించే జ్ఞానాంధకారములకు, సుఖదుఃఖాలకు, స్త్రీపురుషులకు, పాపపుణ్యాలకు మధ్య ఉండే భేదభావం మిథ్యామాత్రమే. మానవుని ఉత్పన్నం చేసినప్పుడే భగవంతు డతని కర్మక్షేత్రాన్ని నిర్ధారణ చేస్తాడు. భగవంతు డీ ప్రపంచంలో మానవుని సృష్టించింది కర్మనిర్వహణకే గాని, భీరునివలె సంసారబాధలనుండి పాఱిపోవుటకు గాదు. మఱి సుఖం - సుఖమనేది తృప్తికి ప్రతినామం. తృప్తి అనేది కోరికలు, విషయాసక్తులున్నప్పుడే సంభవమౌతుంది."

కుమారగిరి గంభీరంగా కూర్చున్నాడు. చిత్రలేఖావదనం మందహాసకలితమైంది. తన శిష్యురాలు, జీవితభాగస్వామిని ఐన చిత్రలేఖ నోట తన సిద్ధాంతాలను సతార్కికంగా విని, బీజగుప్తుడు లోలోపల మురిసిపోయాడు. విశాలదేవు డామె వైదుష్యం పట్ల ఆశ్చర్యచకితు డైనాడు. ఇద్దరూ కుమారగిరి ప్రత్యుత్తరానికి ప్రతీక్షిస్తున్నారు.

కుమారగిరి కొంచెంసేపు మౌనంగా కూర్చొని ఆపైని గంభీరంగా అన్నాడు - "భగవంతుడు! భగవంతునికి, మానవునికి భేదమే లేదు. భేదం కేవలం బాహ్యమైనది, ప్రాపంచికమైనది. మాయాబ్రహ్మల సంయోగాన్నే మమత్వమంటారు, వస్తుతః మాయ బ్రహ్మ యొక్క అంశమేయైనా, బాహ్యదృష్టిలో బ్రహ్మకంటె వేఱుగా కనిపిస్తుంది. మాయచేత ఆవరింపబడియున్నంతవఱకు బ్రహ్మము సంసారజాలంలో చిక్కుకొనియుండును. మాయ తొలగిన వెనుక బ్రహ్మము స్వస్వరూపముతో భాసించును. నీవు, నేను - వాస్తవంగా వేఱే కాదు - ఎందుకంటే నీలోనూ బ్రహ్మాంశమున్నది, నాలోనూ ఉన్నది. ఐతే నీలో మాయావలయితబ్రహ్మాంశ మున్నది, నాలో మాయావిముక్తబ్రహ్మాంశమున్నది. ఈ అవస్థనుండి తిర్యగ్గమించ కుండా ఉండేందుకే నేను మాయామయజీవనంనుండి వైదొలగి ఉండగోరుతాను. ఇంక తృప్తియే సుఖమంటున్నావు. ఈవిషయంలోగూడ నీవు పొరపడుతున్నావు. తృప్తియే సంతోషానికి ఏకైక సాధనమైతే, తృప్తి కల్గినపుడెల్లా సంతోషం అవశ్యంగా కలుగవలె; కాని కర్మజాలంలో కూరుకపోయిన ప్రాణికి తృప్తితోబాటు సంతోషం కలుగదు. మాయాసంయోగంవల్ల బ్రహ్మము స్వస్వరూపమును మరచి, కర్మజాలంలో పడి తిరుగుతుంటుంది. ఆ మాయను విడచి నప్పుడది స్వస్వరూపము నెరిగి తృప్తిని, ఆ తృప్తితోబాటు సంతోషాన్ని పొందుతుంది. దుఃఖమయసంసారాన్ని విడిచిపెట్టుటనే సుఖ మందురు" - అంటూ కుమారగిరి కొంచెం సేపాగినాడు. తదుపరి చిత్రలేఖకు ప్రత్యుత్తర మీయడాని కవకాశమీయకుండగనే మళ్లీ ఆరంభించినాడు - "ఇంకను గుర్తుంచుకొనవలెను. ఈ తర్కానికి అంతమనేది లేదు. సత్య మనుభవైకవేద్యమైనది. అనుభవవిశ్వాసములు లేనిది మానవునికి జ్ఞానసముపార్జన సాధ్యము గాదు." కుమారగిరి లేచి నిలబడ్డాడు. "రాత్రి ప్రొద్దుపోయింది. ఇంక విశ్రమించుట ఉచిత మనుకుంటాను." - అన్నాడు.

పై ప్రత్యుత్తరంవల్ల చిత్రలేఖకు సంతుష్టి కలుగలేదు. కుమారగిరి కూడ ఆ విషయం గ్రహించినాడు. ఐనా అతని వ్యక్తిత్వం చిత్రలేఖను ఏకమాత్రంగా ఆకట్టుకొన్నది. అతనిలో ఆమె సౌందర్యాన్ని దర్శించింది; ఆమెలో అతడు జ్ఞానాన్ని సందర్శించినాడు. కాని విచిత్రంగా వారు పరస్పరంగా సంతుష్టులు గాలేక పోయినా, అవశ్యంగా ప్రభావితులుమాత్ర మైనారు. వారొకరిలో నొకరు ఒక ఆకర్షణశక్తిని ఆవిష్కరించినారు - యోగి నర్తకిలో నొక జ్ఞానశక్తిని, నర్తకి యోగిలో నొక సౌందర్యశక్తిని. మఱి బీజగుప్తు డేమావిష్కరించినాడో అతనికే అర్థం కాలేదు. వారి ప్రసంగంవల్ల అతని హృదయంలో ఏదో అశాంతి నిష్పన్నమైంది. ఆ అశాంతి సిద్ధాంతాలకు సంబంధించినది కాదు. కాని అది ఎట్టిదో అతడు లక్షవిధాల యత్నించినా అతనికి బోధపడలేదు. చిత్రలేఖాహృదయంలో కుమారగిరిపట్ల ఒక క్షీణమైన ఆకర్షణ నెలకొన్నట్లు అతని కనిపించింది గాని, అది విశ్వసనీయమైనట్లుగా అతనికి తోచలేదు.

కుమారగిరి అన్నాడు - "నా శిష్యుడు విశాలదేవుడు నా కుటీరంలో ఈరాత్రి శయనిస్తాడు. అతని కుటీరం అతిథులకు శయనార్హమై ఉన్నది. అతిథులక్కడ శయనించవచ్చు."

బీజగుప్తుడు, అతనివెంట చిత్రలేఖ, లేచి నిలుచున్నారు. చిత్రలేఖ వెళ్లుతూ అన్నది - "ఇంతమాత్రం చెప్తున్నాను - యోగి కుమారగిరి! తపస్సనేది జీవితంలో ఒక పొరపాటు. తపస్సనేది వాస్తవికంగా ఆత్మహననం. మంచిది - శ్రీచరణాలకు నర్తకి చిత్రలేఖ ప్రణామాలు" - అని నవ్వుతూ చిత్రలేఖ బీజగుప్తునితోసహా కుటీరం బయటకు కాలూనింది.

ఆమె వెళ్లిన తర్వాత కుమారగిరి నవ్వుకొన్నాడు - "బాగా అన్నావు. ఆత్మహననాన్నే తపస్సంటారు. మఱి మాయాబ్రహ్మల సంయోగాన్నే ఆత్మ అంటారు. ఎప్పుడు ఆత్మహనన మౌతుందో అప్పుడు మాయ అంతరించి, సచ్చిదానందబ్రహ్మము శేషిస్తుంది. ఓ నర్తకీ! నీలో తపోనుభవమున్నచో, లేదా నీ పరిస్థితి మఱొకరకంగా నున్నచో బహుశః నీవీ రహస్యాన్ని గుర్తించియుండేదానివేమో! నీలో జ్ఞానముంది. కాని ఆ జ్ఞానానికి సన్మార్గదర్శకుడైనవాడు లేడు. నీస్థితి నాకు దుఃఖావహంగా ఉంది."

విశాలదేవుడు అతిథుల నిద్దఱినీ తన కుటీరానికి చేర్చి, గురువుగారి కుటీరానికి తిరిగి వచ్చినాడు. శయనించుటకు ముందు బీజగుప్తుడు - "చిత్రలేఖా!" - అని పిలిచినాడు.

"ప్రియతమా!" - ఆమె ప్రతిధ్వనించింది.

బీజగుప్తు డొక చల్లని నిట్టూర్పును విడిచి అన్నాడు - "హృదయంపై ఏదో ఒక భారం మోపినట్లుంది. మన జీవితాలపై ఏవో దుఃఖపుమబ్బులు ముసరుకొస్తున్నట్లుగా నాకనిపిస్తు న్నది. కుమారగిరి యోగీశ్వరుడు, పరాకర్షణశక్తిసంపన్నుడైనవాడు కూడ."

ఆమాటలకు చిత్రలేఖ ముఖ మొక్కసారిగా పాలిపోయింది. ఆమె సంబాళించుకొని అన్నది - "ప్రియతమా! కుమారగిరి యోగీశ్వరుడు సరే, మఱి మూర్ఖుడు గూడ. అతని ఆత్మ చనిపోయింది."

చిత్రలేఖ తనను, బీజగుప్తుణ్ణి, వంచించే ప్రయత్నం చేసింది. ఆమె అన్నది - "కుమారగిరి నిర్జనస్థలవాసి, మనమేమో కర్మక్షేత్ర సంవాసులం. కుమారగిరి వాసనాపరంపరలను చంపుకొన్నాడు, మనమేమో వాసనాపరిపూర్ణజీవులం. కుమారగిరి జీవితలక్ష్యం మనఃపరి కల్పితశూన్యం, మఱి మన లక్ష్యం ఉల్లాసం, ఉన్మాదం. ప్రియతమా! ప్రపంచంలో ఏవ్యక్తిగూడ మనలను వేఱుచేయజాలడు."

బీజగుప్తుని వదనం సుప్రసన్నతతో తేజరిల్లింది. అతడన్నాడు - "భగవంతుడట్లే చేయునుగాక!"

చిత్రలేఖ బీజగుప్తుని వంచించింది, కాని తనను తాను వంచించుకొనలేకపోయింది. ఆమె లోలోపల అనుకొన్నది - "ఐతే కుమార గిరి నిజంగా సుందరుడు."

✂

మహాయజ్ఞాభిమంత్రితధూమంచేత అధివాసితమైన రాజప్రాసాదవిశాలాంగణంలో అరుదెంచిన అతిథులందఱూ సమావేశ మైనారు. రత్నఖచితస్వర్ణసింహాసనంపై పూర్వాభిముఖుడై చక్రవర్తి చంద్రగుప్తమౌర్యు డాసీనుడైనాడు. చక్రవర్తికి కుడిపార్శ్వాన సువిశాలసామ్రాజ్యసమాగతులైన సామంతులు, వామపార్శ్వాన ప్రధానరాజ్యాధికారులు ఆసీనులైనారు. ఎదురుగా కర్మకాండపండితు లైన విప్రులు, తపస్వులు నిషణ్ణులైనారు.

సంప్రదాయం ప్రకారం మహాయజ్ఞానంతరం జరిగే దర్శనముల చర్చకొఱకై ఆ సభ సంఘటితమైంది. మహారాజు చంద్రగుప్తుడు నవ్వుతూ తన ప్రధానమంత్రి చాణక్యుని వైపు చూస్తూ అన్నాడు - "నీతికుశలుడవైన మంత్రివర్యా! మీ నీతిశాస్త్రం పలుచోట్ల ధర్మ సిద్ధాంతాల నవహేళన చేస్తుంది. ఈ వైరుధ్యానికి కారణమేమిటి? మీ నీతిశాస్త్రం ధర్మసిద్ధాంతానికి లోబడి ఉన్నదా లేక అందుకు బాహ్యంగా ఉన్నదా తమరుసెలవీయగలరా?"

మహామంత్రి చాణక్యుడు లేచి సభకు నమస్కరించినాడు. ఆ తర్వాత చంద్రగుప్తుని కభివాదంచేసి కూర్చున్నాడు. కూర్చొని అతడన్నాడు - "మహారాజులవారి అనుమానం అన్నివిధాలా సరియైనదే. నా నీతిశాస్త్రంలో నిర్ధారితమైన ఆచరణలకు విరుద్ధములైన సిద్ధాంతము లటనట గోచరిస్తాయి, ఈ సంగతి నేనెఱుగుదును. కాని నేనిది స్పష్టం చేస్తాను, ధర్మమనేది సమాజంచేత నిర్ధరింపబడేదే కాని అన్యం కాదు. ధర్మంవల్ల నీతిశాస్త్రం జనింపలేదు, అందుకు విపరీతంగా నీతిశాస్త్రంవల్ల ధర్మం జనించింది. సమాజాన్ని సజీవంగా ఉంచేందుకు సమాజంవల్ల నిర్ధారితమైన నియమావళినే నీతిశాస్త్రమంటారు. నీతిశాస్త్రం తర్కమూలమైనది, కాని ధర్మం విశ్వాస మూలకమైనది. విశ్వాసబద్ధులై ప్రజలు నీతిశాస్త్రనియమావళిని పాటించుట సమాజమునకు శ్రేయఃకరము కాగలదు. అందుచేత కొన్ని పరిస్థితులలో ధర్మవిరుద్ధమైన నడవడిక సమాజమునకు శ్రేయఃకరముగా నుండవచ్చును. అప్పుడు క్రమముగా ధర్మస్వరూపము మారి పోవచ్చును."

చాణక్యుని వాక్యాలు ముగుస్తూనే విద్వన్మండలిలో తీవ్రమైన నిశ్శబ్ద మావరించింది. చంద్రగుప్తసార్వభౌముడు గర్వంతో తన మహామంత్రివైపు, ఎదురుగా నుపస్థితులైన విద్వన్మండలివైపు దృష్టి సారించినాడు. మంత్రి వాక్రుచ్చిన అంశాలు ఘనంగాను, సారవంతం గాను, నవ్యంగాను, నిర్ధారితసిద్ధాంతాలకు వ్యతిరేకంగాను ఉన్నవి. వీనికి ప్రత్యుత్తర మిచ్చేవారెవ్వరు? అని అందరూ నిరీక్షిస్తున్నారు.

విద్వన్మండలిలో సమాసీనుడూ, నవయువకుడూ ఐన యోగీశ్వరుడొకడు ప్రత్యుత్తరం పలికినాడు - "రాజా! భగవంతుడు మానవునికి జన్మదాత, మఱి మానవుడు సమాజానికి జన్మదాత. ఈశ్వరునియొక్క సాంసారికరూపమే ధర్మము. అది మానవుని ఈశ్వరునితో కలుపుట కుద్దేశింపబడినది. ధర్మావహేళన ఈశ్వరావహేళన, సత్యమునుండి వైదొలగు క్రియ. సత్యమొక్కటే, ధర్మ మనేది దానికి మఱొక పేరు. ఒకవేళ నీతిశాస్త్రము ధర్మసిద్ధాంతాలకు ప్రతికూలమైతే, అది నీతిశాస్త్రమే కాదు, అనీతిశాస్త్రం. ఉచితా నుచితాలకు, న్యాయాన్యాయాలకు సర్వానికి గీటురాయి ధర్మం, ఈ ధర్మంలోనే విశ్వం సమస్తమూ నిక్షిప్తమై ఉన్నది."

వయోవృద్ధుడైన మహామంత్రి చాణక్యుడు ఎదుట గూర్చున్న నవయువకయోగిని - కుమారగిరిని - మహాదానవు డొక మఱుగుజ్జును చూచినట్లుగా నిశితంగా చూచినాడు. అతడు లోలోపల నవ్వుకొని అన్నాడు - "ధర్మాన్నే సర్వోత్కృష్టంగా నెంచి, ధర్మ దోహలుడవైన ఓ యోగీ! తెలుసా నీకు ధర్మజనకు లెవ్వరో?"

"ఈశ్వరుడే, మనుష్యునియొక్క అంతరాత్మద్వారా"

"మఱి ఈశ్వరునికి?"

చాణక్యుని ఈప్రశ్న కందఱూ ఆశ్చర్యచకితులైనారు. "ఈశ్వరునికి జనకు లెవ్వరు?" - ఇది ఎంత భయానకమైన ప్రశ్న? జన సముదాయంలో ఒకవిధమైన కోలాహలం బయలుదేరింది. కాని కుమారగిరి ప్రశాంతంగా ప్రత్యుత్తరమిచ్చినాడు - "ఈశ్వరుడు అనాది యైనవాడు."

"బాగా పలికినావు యోగీ! ఈశ్వరు డనాదియైనవాడని. ఈ మాట క్రొత్తేమీ కాదు. ప్రతిమనుష్యుడూ అంటాడు ఈశ్వరు డనాది యని. కాని నీవీశ్వరు నెఱుగుదువా? ఇక్కడ కూర్చున్న వ్యక్తులలో నెవ్వడైనా ఈశ్వరు నెఱిగినవాడున్నాడా?"- చాణక్యుని స్వరం గంభీరంగా ఉన్నది, అతని నేత్రాలు ప్రజ్వలిస్తున్నాయి. ఎవ్వరి ప్రత్యుత్తరానికీ ప్రతీక్షించకుండగనే అతడు మళ్లీ అన్నాడు - "ఔను! ఈశ్వరు డనాదియైనవాడే. కాని నేను నిష్కర్షగా చెప్తాను - ఆ ఈశ్వరు నెఱిగినవాడు లేడు. ఈశ్వరుడు కల్పనకతీతుడు. సత్య స్వరూపుడు. అత్యంతప్రకాశవంతుడగు నతని యెదుట మానవుడు నేత్రములు విప్పలేడు. ఆ సత్యాన్ని తెలిసి కొనుటకు యత్నింపవలెను. ఆ ఈశ్వరుని పొందుటకు ఘోరతపస్సొనరింపవలెను. మిగిలిన వన్నియు వ్యర్థములు, నిష్ఫలములు. ఒకవేళ నీ వీశ్వరు నెఱుగగల్గిన యెడల, ఒకవేళ నీ కల్పనలోనే ఆ అఖండనిస్సీమానంతరచయిత ఉన్నయెడల అత డీశ్వరు డెట్లగును? ఐతే యోగీ! నీ ఈశ్వరుడూ, నా ఈశ్వరుడూ, ఎవరినైతే మనం పూజిస్తామో, ఆ ఈశ్వరునికంటె భిన్నమైనవాడు. నా ఈశ్వరుడూ, నీ ఈశ్వరుడూ కల్పనా జనితుడు. తన అవసరాలను పరిపూర్తి చేసికొనుటకు సమాజం నిర్మించుకొన్నవాడు."

చాణక్యుడాగి నలుదిక్కులా చూచినాడు. అంతటా గాఢమైన నిశ్శబ్ద మావరించి యున్నది. యోగికుమారగిరి కన్నులు నిమీలితములై యున్నవి - అతడేదో గాఢాలోచనామగ్నుడై యున్నట్లున్నాడు. చాణక్యుడు లేచి నిలుచున్నాడు; నిల్చొని నాల్గువైపులా సభామండలిని పరికించినాడు. ఆ చూపులో గర్వం, ఆత్మవిశ్వాసం ప్రతిబింబిస్తున్నవి. ఆ చూపు లా సభామండపమందున్న విద్వద్వతంసులెవరైనా ప్రతిఘటింపదలిస్తే వారితో పంతమాడేట్లుగా నున్నవి. ప్రత్యుత్తరమునకై కొంతసేపు నిరీక్షించి, చాణక్యుడు మళ్లీ ఆరంభించినాడు - "ఇంకా పరిపూర్ణంగా చెప్పలేదు. నా ఈశ్వరుడూ, నీ ఈశ్వరుడూ, ఎవరినైతే మనం పూజిస్తామో, అతడు కల్పనా జనితమైనవాడు, సమాజం నిర్మించుకొన్నవాడన్నాను నేను. వివిధములైన సమాజముల కల్పనావసరములనుబట్టి అతనికి వివిధ రూపము లేర్పడుతున్నవి. ఇక అంతరాత్మవిషయం తీసుకుంటే,అందులోనూ నిర్ధారితమతం ఎక్కువభాగం భ్రమాత్మకం గానే ఉన్నది. అంతరాత్మ భగవంతునిచే నిర్మింపబడలేదు గాని, సమాజంద్వారా నిర్మితమైంది. ఒకవేళ అది ఈశ్వరదత్తమనేదే వాస్తవమైతే, అప్పుడు విభిన్నసమాజాలలోని వ్యక్తులయొక్క అంతరాత్మలు విభిన్నంగా నుండవు. ఈశ్వరుడొక్కడే. ఆ ఈశ్వరుడే వాస్తవంగా ధర్మ

నియామకుడైతే, ప్రతివ్యక్తివిషయంలోనూ ఒకే నియమముంటుంది. కాని అనుభవంలో ఈవిధంగా లేదు. ఒక సమాజంలోని వ్యక్తియొక్క అంతరాత్మ తరచుగా వేఱొక సమాజంలోని వ్యక్తియొక్క అంతరాత్మవలె నుండదు. మానవునిలోని అంతరాత్మ కేవలం సమాజం అనుచితంగా దలచే దానినే అనుచితంగా దలుస్తుంది. అందుచే నంతరాత్మ సమాజం ద్వారా నిర్మితమైనదని నిశ్చయంగా చెప్పవచ్చు. సమాజనియమాలపట్ల మానవునికి గల పరిపూర్ణ మైన శ్రద్ధ, మూఢవిశ్వాసాలనే అంతరాత్మ యని అంటారు. సమాజానికంటె వేఱుగా అంతరాత్మకు అస్తిత్వం లేనే లేదు." అని పల్కి, చాణక్యు డాసీనుడైనాడు. విద్వాంసులలో అనేకు లతని అఖండితవ్యతర్కధారచే ప్రభావితులై అతనికి ప్రణతులైనారు.

కుమారగిరి ఈ చాణక్యుని వాక్యాలను విన్నాడో లేదో చెప్పలేము. అతడు తన ఆలోచనలలో అప్పటికీ నిమగ్నుడయ్యే ఉన్నాడు. అతని నేత్రములు నిమీలితములై యున్నవి; అతని ఆస్యము నొక అలౌకికతేజ మావరించియున్నది. కాని అప్పుడు విజయం మాత్రం కౌటిల్యునికే చెందియుండెను. కౌటిల్యుని అఖండితవ్యమైన తర్కానికి కుమారగిరి ఏమీ ప్రతివల్కజాలడయ్యెను. చంద్రగుప్తుడు మందహాసవదనుడయ్యెను. కొంతసేపు ప్రతీక్షించి, చక్రవర్తి పరిచారకునికి సంకేతమొనరించెను. పరిచారకుడు లేచి, "పండితవాగ్వి వాదములు ముగిసినవి. ఇప్పుడు నృత్యమారంభమగును" - అని పలికెను. దానితో నిస్తబ్ధత భంగమయ్యెను. సామంతాదులు హర్ష ధ్వానములు చేసిరి.

నేపథ్యగృహమునుండి చిత్రలేఖ సభామండలిలో ప్రవేశించెను. ఆమె భూషణముల శింజితము లప్పు డపూర్వమైన సంగీతమును సృజించెను. నీరసమైన ధర్మచర్చతో నిండిన శుష్కసభామండల మప్పుడు రాగమయసౌందర్యమత్తతలో దేలిపోయెను. ఉషఃకాలశిశిర వలయాన్ని చీల్చుకొనుచూ ప్రాతస్సూర్యుని కోమలారుణరోచిస్సులు ప్రవేశించినవా యన్నట్లుండెను. హేమంతశుష్కశీతలవాత స్థానంలో మధుమాసకదుష్ణతాసౌరభములు సమావేశమైన తీరుగా నుండెను. సభావాతావరణం పరిపూర్ణంగా మారిపోయెను.

ప్రాంగణమధ్యంలో నిలిచి చిత్రలేఖ ముందుగా చక్రవర్తి చంద్రగుప్తున కభివాదం చేసెను. అప్పుడామె మూర్తి అత్యంతాకర్షణీయంగా నుండెను. ఆమె మోము నిండుచంద్రునివలె నుండెను. మెలికలు తిరిగే ఆమె వేణి నల్లనాగువలె సాగుతూ ఆమె ముఖచంద్రునిలోని అమృతాన్ని హరించుటకై ఆమెను వలయించుచున్నదా యనునట్లుండెను. ఆమె వేణియందు గ్రథితములైన మౌక్తికములు అమృత హరణాసక్తమైన ఆ నాగు నాపుటకై వరుసగట్టి వచ్చిన తారకలవలె నుండెను. అమె ఉన్నదా లేదా అన్నట్లున్న మేలిమిజిలుగు పట్టుత్తరీయమును ధరించియుండెను. ఆ ఉత్తరీయంలోపల మేలిమిజరీతో కూడిన పట్టురవిక ప్రకాశించుచుండెను. ఆ రవికలోనుండి అమె సువర్తులపీనపయోధరములు విస్ఫుటములగుచుండెను. ఆమె సభామండలినెల్ల మిఱుమిట్లుగొలిపే స్వర్ణతారాంచితమైన అధోంశుకమును (లంగాను) ధరించియుండెను. రత్నఖచితస్వర్ణభూషణముల నామె అలంకరించుకొనియుండెను. ఆ సమయమున నామె సాక్షాల్లక్ష్మీరూపముతో దేజరిల్లుచుండెను. మహారాజున కభివాదము చేసిన పిమ్మట ఆమె సామంతమండలివైపు తన హాసరస పూర్ణదృష్టులను సారించెను. సభాస్థలమంతట సామంతగణముల ఉల్లాసభరితధ్వనులతో ప్రతిధ్వనించెను. సామంతగణములపై బ్రాకుచు నామె యాలోకములు బీజగుప్తునిపై నిలిచిపోయెను. అంతవఱకు కన్నులలో నున్న హాస మప్పుడామె ముఖమునెల్ల గప్పి కొనెను. బీజగుప్తుడు మందహాసమొనరించెను. ఇట్లామె మౌనాభివాదమునకు మౌనప్రత్యుత్తరము లభించెను. ఆతర్వాత ఆమె విద్వన్మండలికి నమస్కరించెను. అప్పుడామెకు కుమారగిరి గోచరించెను. ఆమె దృష్టు లతనిపై నిలిచిపోయెను. అట్లు దృష్టులను నిలిపి ఆతడు తనను జూచునేమో యని కొన్నిక్షణము లామె నిరీక్షించెను. కాని ధ్యానవ్యవస్థితుడైన ఆ యోగి మఱొక ప్రపంచములో నుండెను. నిరాశతో ఆమె తన చూపుల నా దిశనుండి త్రిప్పికొనెను.

మృదంగగంభీరరావం తోడగుచుండగా సారంగి కల్యాణరాగ మాలాపించెను. చిత్రలేఖ రంగప్రవేశం చేసినప్పటినుండి ఆరంభ మైన సభాసదుల హర్షపూరితమంద్రరావము లాక్షణమే శాంతించెను. ఆవాద్యఘోష కనువుగా చిఱుగజ్జెలతో నలంకృతమైన చిత్రలేఖా కమలకోమలపదద్వయం తాళం వేసెను; నాట్య మారంభమయ్యెను. చిత్రలేఖ అడుగిడిన ప్రతిచోట విద్యుల్లతాప్రకాశ ముద్యోతిత

మయ్యెను. మృదంగనాదం మేఘధ్వనివలె గంభీరంగా నినదించెను; నలుదిక్కుల సభాసదులను నిశ్శబ్దమావరించెను. వారందఱూ మంత్రముగ్ధుల వలె ఆ సర్వోత్తమకళాప్రదర్శనాన్ని అవలోకింపసాగిరి.

హఠాత్తుగా కుమారగిరి కన్నులు దెఱిచెను. అప్పుడతని కన్నులలో నొక దివ్యజ్యోతి దేదీప్యమానమగుచుండెను. అతడు లేచి నిల్చొని, గంభీరస్వనంతో ఇట్లనెను - "అమాత్యచాణక్యా! నే నీశ్వరు నెఱుగుదును. నిన్ను, ఈ సమస్తసభాస్తారులను సంతుష్టుల జేయుటకై ఆ ఈశ్వరు నిచ్చటనే చూపింపగలను."

సభానిశ్శబ్దము భంగమయ్యెను. కుమారగిరి మాటలను కొందఱు విన్నారు, కొందఱు వినలేదు. విననివారిలో నాట్యావలోకన తత్పరులైన నవయువకసామంతరాజు లధికముగా నున్నారు. "ఆ యోగిని కూర్చుండబెట్టండి" - అని వా రరచినారు.

చిత్రలేఖకూడ యోగివాక్యములను వినలేదు. ఆమె మనస్సప్పుడు నృత్యమందు విన్యస్తమై యుండెను. ఆమె పదములందు అద్భుతమైన గారడీ యుండెను, అపూర్వమైన కళాకౌశలముండెను. చంద్రగుప్తసార్వభౌముడు చాణక్యునివైపు అర్థపూర్ణదృష్టులను సారించెను; చాణక్యుడుగూడ మహారాజువైపు జూచెను. యోగి కుమారగిరి ఏదో గొప్ప విషయాన్నిగుఱించి మాట్లాడ నుంకిస్తున్నట్లుగా వారిర్వురూ గ్రహించిరి. చాణక్యుడు లేచి, "సామంత,విద్వాంసగణములారా! యోగికుమారగిరి వాచనము వారీశ్వరు నెఱుగుదురని, ఇప్పుడే, ఇచ్చటనే సర్వులకూ ఈశ్వరదర్శనము గావింపగలరని. ఇందుకు మహారాజులవారు సుముఖంగా ఉన్నారు. అందుచే కొంచెంసేపు నాట్యాన్ని ఆపడం ఉచితంగా ఉంటుంది."

ఇప్ప డామాటలను సామంతు లందఱూ విన్నారు, చిత్రలేఖకూడ విన్నది. ఆమె నాట్యము నాపివేసి క్రోధారుణనేత్రాలతో కౌటిల్యుని వైపు జూచింది; అంతకు రెండింతల క్రోధంతో కుమారగిరిని జూచింది. ఆతర్వాత ఆమె నెమ్మదిగా ఒక మూలకు వెళ్లి కూర్చున్నది. కౌటిల్యుడు మళ్లీ లేచి అన్నాడు -"యోగీ కుమారగిరీ! మేమందఱమూ ఈశ్వరుని జూచుటకు సిద్ధంగా ఉన్నాము."

కుమారగిరి తన ఆసనాన్ని వీడి సభామధ్యంలో నిల్చున్నాడు. అతనిని సభామండలి సమస్తం కఠోరనిశ్శబ్దంతో చూస్తున్నది. అతడు కొంచెంసేపు కన్నులు మూసికొని, ఆ తర్వాత అన్నాడు- "సభామండనులైన పండితులారా, సామంతులారా! నావైపు జూడండి!"

సభాసదులందఱూ కుమారగిరి నిల్చున్నచోటుకు సమీపంలో నున్న యజ్ఞవేదికనుండి ఒక అగ్నిశిఖ వెడలి అది చూరువైపు ప్రసరించడం జూచినారు. ఆ అగ్నిప్రకాశం గ్రీష్మకాలమధ్యాహ్నసూర్యప్రకాశంకంటె అధికంగా ఉన్నది. ఆ అగ్నిజ్వాల చూరును చీల్చుకొంటూ ఆకాశంవైపు ప్రాకింది. అట్లు ప్రాకుతూ అది క్రమంగా సన్నగిల్లింది. దాని ప్రకాశం ఎంత తీవ్రతరమైనదంటే ఆప్రకాశాన్ని చూడలేక అందఱూ కన్నులు మూసికొన్నారు. కాని ఆశ్చర్యమేమంటే ఆ జ్వాలలో కేవలం ప్రకాశమే గాని తాపం లేదు. కుమారగిరి అన్నాడు - "ఇదే సత్యం"

చాణక్యు డరచినాడు - "యోగీ! నీవబద్ధ మాడుతున్నావు. అక్కడేమీ లేదు."

ఇప్పుడు సభాసదులందఱూ చాణక్యునివైపు ఆశ్చర్యంతో చూచినారు. యోగి కుమారగిరి అన్నాడు - "ఏం, వయోవృద్ధమంత్రివర్యులు సత్యప్రకాశాన్ని చూడజాల కున్నారా?"

కౌటిల్యుడు మళ్లీ అన్నాడు - "ఎట్లాంటి ప్రకాశం? అక్కడైతే ఏమీ లేదు."

కుమారగిరి చాణక్యుని కేమీ ప్రతివల్కలేదు. అతడన్నాడు - "ఇంకా చూడండి!"

ఈసారి ఆ అగ్నిశిఖ సుళ్లు దిరిగింది. దానిలోనుండి అనేకాగ్నిపుంజాలు వెలువడ్డాయి. ఆ అగ్నిపుంజాలలో అనేక ప్రాణులు కన్పడ్డాయి. ఆ ప్రాణు లాపుంజాలలో ఒకవైపునుండి వెలువడి మఱొకవైపు మాయమౌతున్నాయి. ఆ అగ్నిపుంజాలలోనే విశాలనగరాలేర్పడుతున్నాయి, లయమౌతున్నాయి. వాటిలోనే పంచభూతాలు (పృథివ్యప్తేజోవాయ్వాకాశాలు) విద్యోతితము లౌతున్నాయి. క్రమక్రమంగా అవన్నీ లుప్తమై చివరికి అగ్నిపుంజాలు మాత్రమే మిగిలినవి.

యోగి కుమారగిరి అన్నాడు - "ఇదే ఈశ్వరరూపం."

చాణక్యు డీసారి పిచ్చివానివలె అరచినాడు - "నాకేమీ కన్పడటం లేదు. యోగీ! మళ్లీ అంటున్నాను - నీవబద్ధమాడుతున్నావు."

కుమారగిరి కన్నులు మూసికొన్నాడు. అప్పుడే అన్నీ మాయమైనాయి. మఱల కన్నులు దెఱచి నవ్వుతూ అతడన్నాడు - "మంత్రీ! మీ రబద్ధమాడుతున్నారని నేనంటున్నాను. దీని కీసభ సొంతం సాక్ష్యముంది. ఇక్కడ ఉపస్థితులైన సజ్జనులందఱూ మీకు జవాబిస్తారు."

అప్పుడందఱూ అరచినారు - "మంత్రి అబద్ధమాడుతున్నారు. మేమందఱమూ సత్యాన్ని, ఈశ్వరునీ దర్శించినాము."

మర్మహతుడైన కౌటిల్యు డిప్పుడు చంద్రగుప్తునివైపు జూచినాడు. చక్రవర్తికూడ అన్నాడు - "మంత్రీ! కుమారగిరి అబద్ధమాడటం లేదు. నేనూ సత్యాన్నీ, ఈశ్వరునీ చూచి నాను."

"నేడు నాకన్నులు నన్నే మోసం చేసినవి. నవయువకయోగీశ్వరా! నేడు నీవు గెలిచావు, నేనోడిపోయాను." - అని పలికి చాణక్యుడు కూర్చున్నాడు.

కుమారగిరి లేచి వెళ్లబోయాడు. అంతలో అతనికి నర్తకి చిత్రలేఖమాటలు వినిపించాయి - "యోగీ! ఆగు. నా భ్రమ ఇంకా నివారణ కాలేదు."

అందఱి చూపులూ చిత్రలేఖపై మూగినవి. జనసమూహం కుతూహలం హెచ్చింది. కుమారగిరికి ఆగవలసివచ్చింది. చిత్రలేఖ ముందుకు సాగి అన్నది - "యోగీ! నీవు చూపించిందేదీ నేను చూడలేదు. అందఱూ మంత్రి చాణక్యుణ్ణి అప్రమాణుడుగా నిలదీస్తున్నారు. కాని నేను కాదు. నేను నీ సత్యంపై, ఈశ్వరునిపై ఒట్టువేసి అడుగుతున్నాను - నీవూ నిజంగా సత్యాన్నీ, ఈశ్వరుణ్ణీ ఈ సభకు చూపించిన రూపంలోనే చూస్తావా?"

నర్తకి చూపులూ యోగి చూపులూ కలిసినవి. యోగి కన్నులలో విశ్వాసతేజం, తపోబలాలు ప్రతిబింబిస్తున్నాయి; నర్తకి కన్నులలో ఉల్లాసపు తళతళలు, అవిశ్వాసపుచాయలు విద్యోతమానములౌతున్నాయి. అకస్మాత్తుగా కుమారగిరిముఖంనుండి "లేదు" - అనే మాట వెలువడింది.

సభాసదులందఱూ ఒక్కసారిగా హడలిపడ్డారు. మంత్రి చాణక్యుడు ఆనందవిహ్వలుడై లేచి నిలుచున్నాడు. కాని చిత్రలేఖ అది గమనించలేదు. "యోగీ! నీవు నిజంగా నీ ఆత్మశక్తిద్వారా అందరినీ ప్రభావితులను జేసినావుగదా! నీ కల్పనాశక్తివల్ల నిర్మితమైన సత్యాన్ని, ఈశ్వరుని చూపించినావుగదా? అబద్ధమాడగూడదు. నేను సత్యంపైన, ఈశ్వరునిపైన ప్రమాణం చేసి ఈప్రశ్న అడుగు తున్నాను. గుర్తుంచుకో! నీవు యోగీశ్వరుడవు!"

కుమారగిరి కొంచె మాలోచించి అన్నాడు - "నీ వన్నది సరియైనదే!"

ఈ ప్రశ్నోత్తరాలను విని అందఱూ మ్రాన్పడినారు. చిత్రలేఖ మళ్లీ అడిగింది - "ఇంకో ప్రశ్న! నీ ఆత్మశక్తిచే అప్రభావితమయ్యేంత దృఢమైన ఆత్మశక్తిగలవారికి నీ కల్పనాసంజనితస్వరూపాలు కన్పడవుగదా? ఇదికూడ నిజంగదా!"

సభలో ఒక వింత అలజడి వ్యాపించింది. యోగి కుమారగిరికి తనస్థితి తెలిసిపోయింది. కొంచెం సేపాలోచించి అతడు శాంతంగా పలికినాడు - "ఎవరైతే ఈశ్వరుని నమ్ముతారో వారియందే ఆత్మశక్తి ఉంటుంది; నాస్తికులయం దాత్మశక్తి ఉండదు. ఒకవేళ మానవునిలో కాల్పనికశక్తి నిద్రాణంగానైన ఉన్నచో, అది తప్పకుండా ప్రభావితమౌతుంది. కాని ఎక్కడ అది మరణించిందో, నాస్తికతయొక్క కాలావరణం కల్పనాగళాన్నెక్కడ నొక్కివేసిందో, అక్కడ మానవుని కీశ్వరునిగుఱించి తెలియడం అసంభవం. ఎవరైతే ఇప్పు డిక్కడ సత్యాన్నీ, ఈశ్వరుణ్ణీ చూడలేకున్నారో వారిలో కల్పనాశక్తి నశించింది; వారు నాస్తికులు, నాస్తికులలో ఆత్మశక్తి ఉండుట అసంభవం."

చాణక్యుడు చంద్రగుప్తునివైపు చూచినాడు. చంద్రగుప్తుడేదో సంకేతించినాడు చాణక్యునికి. చాణక్యుడు ముందునకు సాగి చిత్రలేఖామస్తకంపై సౌవర్ణవిజయకిరీటాన్ని అలంక రించినాడు. "నర్తకి చిత్రలేఖా! ఈరోజు విజయం నీదే. ఏ సత్యాన్నైతే ఈ యోగి తన ఆత్మశక్తిని దుర్వినియోగం చేసి భ్రమావరణంలో దాచే యత్నం చేసినాడో, ఆ సత్యాన్ని అందఱికీ ప్రకాశమానం చేసినావు." అని ఆమె

నభినందించి, కుమారగిరివైపు తిరిగి అన్నాడు - "యోగి కుమారగిరీ! నీవనుచితకార్యం చేసినావు. ఇందుకు నీవు దండనార్హుడవు. కాని నిన్ను దండించే అధికార మిప్పుడు చిత్రలేఖకే చెందుతుంది."

కుమారగిరి నేత్రాలు క్రోధారుణములైనవి. "ఈ సభలో నన్నెవ్వరూ జయించలేరు, నన్నెవ్వరూ దండించే సాహసం చేయలేరు" - అంటూ అతడు కొయ్యబారి నిటారుగా నిలబడ్డాడు.

కుమారగిరి క్రోధాకృతికి సభ యావత్తూ కంపించిపోయింది. కాని చిత్రలేఖ మాత్రం నవ్వింది. చిఱునవ్వుతో ఆమె కుమారగిరి వైపు సాగింది. సభలో అందఱూ ఏమౌతుందా అని ఉత్కంఠతో చూస్తున్నారు. ఆమె కుమారగిరిని సమీపించి, "యోగీ! నిన్ను దండించే అధికారం నాకు సంప్రాప్తమైంది. నీకు దండనను విధించే తీర్తాను. ఇదిగో నా దండనవిధాయకసాహసాన్ని చూడు!" - అంటూ అమె విజయకిరీటాన్ని తన శిరస్సునుండి తీసి కుమారగిరి శిరస్సుపై తొడిగింది. అదే సమయంలో సారంగి పైన యమన్ రాగం మ్రోగింది, చిత్రలేఖ మెఱుపువలె సమగతిలో పదవిన్యాసం చేసింది. నాట్య మారంభమైంది - ప్రజల హర్ష ధ్వానాలు మిన్నంటిపోయినవి.

కుమారగిరి అవాక్కయి నిలుచున్నాడు. చిత్రలేఖ దూరం తొలగిన పిమ్మట అతనికి చైతన్యం కలిగింది. అప్పుడు సభ యావత్తూ హర్షధ్వానాలు చేస్తున్నది. "పరాజయం, దండన! వీనిపై విచారం జరుగవలసి ఉన్నది" - అంటూ అతడు చకచకా సభామండపంనుండి బయటికి నడచినాడు.

౬

సభాసమక్షంలో అవమానితుడూ, పరాజితుడూ ఐన యోగి కుమారగిరికి ఒక నూతనానుభవం కలిగింది. ఆ అనుభవతీవ్రతవల్ల అతడు నిస్తేజస్కుడైనాడు. తనకు పరాజయం కలుగుతుందనీ, అదీ ఒక స్త్రీవల్ల కలుగుతుందనీ, అతడు కలలోనైనా తలంచియుండ లేదు. ఆ స్త్రీయైనా ఎవ్వరు? ఒక సాధారణనర్తకి! ఇది అతని హృదయాన్నెంతగానో కలవరపరచింది. తన పరిస్థితి నతడు బాగుగా విశ్లేషించు కొన్నాడు. తాను విజయుడై యుండి కూడ పరాజితుడైనాడు. చంద్రగుప్తసార్వభౌముని సువిశాలసామ్రాజ్యంలోని విశ్రుతవిద్వన్మణుల పై తానుజ్జ్వలవిజయం సాధించినాడు. కాని ఒక అంధకారంచేత పరాజితుడైనాడు. మఱి అంధకారంచేతిలో ఓడిపోవడం స్వాభావికమే కదా! మహాతపస్సంపన్నులెందఱో స్త్రీల చేతిలో ఓడిపోయారు. కాని వారా స్త్రీల విలాసక్షేత్రంలో ఓడిపోయారు గాని జ్ఞానక్షేత్రంలో కాదు. కుమారగిరి పరిస్థితిమాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నది.

విజయం, పరాజయం - ఇవి స్వాభావికములే! కాని కుమారగిరికి చేకూరిన పరాజయం విచిత్రంగా ఉన్నది. బహుశః ఆ స్త్రీ యొక్క జ్ఞానంచేత గాక, ఔదార్యంచేత అతడు పరాజితుడైనాడు. అతని శిరస్సుపై సౌవర్ణవిజయకిరీట మింకా ప్రకాశిస్తూనే ఉన్నది; ఈ విషయం అతనికి స్ఫురిస్తూనే, ఆ కిరీటాన్ని దీసి నేలకు విసిరికొట్టాడు. ఆతర్వాత అతడు మళ్లీ యోచించడం మొదలు పెట్టినాడు. "పరాజయం" - ఈ మాట అతని క్షేత్రంలో లేదు. విజయంకొఱకే సాంసారికసుఖాల కతడు తిలోదకాలిచ్చుకొన్నాడు; విజయంకొఱకే అతడు ప్రగాఢమైన తపస్సును చేసినాడు. మఱి ఈ పరాజయమెందుకు? కుమారగిరి ఒక్కసారిగా లేచి నిలుచున్నాడు - "లేదు! పరాజయ మసంభవం. నేను పరాజితుణ్ణి కాలేను. నా కఠోరసాధనకు పరాజయం అంత్యఫలమౌతుందా? కాదు, ఎప్పుడూ కాదు!" - అనుకొన్నాడు.

కుమారగిరిచూపులు నేలపై ధూళిలో పడియున్న స్వర్ణకిరీటంపై పడ్డాయి. కొంతసేపు తదేకంగా అత డాకిరీటంవైపు చూచి నాడు. కిరీటం, "యోగీ! నీవు పరాజితుడవు కాలేదు, విజయుడవే!" - అని అంటున్నట్లుగా అతని కనిపించింది; అతని శరీర మొక్కసారిగా కంపించిపోయింది. అతడా కిరీటం చెంతకు మెల్లమెల్లగా సాగి, దాని ప్రక్కనే నిలబడ్డాడు. "విజయంతోడుత పరాజయం! ఎంత విచిత్రమైన సమస్య? నాకీ విజయోపహారంపైన ఏమైన అధికారమున్నదా? లేదు - సర్వసభాదృష్టిలో నేనా స్త్రీచేత పరాజితుడ నైనాను. ఈ కిరీట మా స్త్రీకి దొడిగినది. తదుచ్ఛిష్టభూయిష్ఠమైనది" - కుమారగిరి ఆకిరీటంనుండి తన ముఖాన్ని త్రిప్పుకొన్నాడు. అత డక్కడనుండి వెళ్లజూచినాడు - కాని కాళ్లాడలేదు. ఆకిరీట మక్కడనే పడియున్నది, సముజ్జ్వలచంద్రికాధవళకాంతులు సోకి దాని ప్రకాశాన్ని సహస్రధా అధికం చేస్తున్నాయి. కుమారగిరి ఆ కిరీటాన్ని మళ్లీ చూచినాడు - "ఐతే నాకీ కిరీట మెట్లా లభించింది?

సర్వసభాస్థలి ఎవ్వరిని విజేతగా దలంచిందో ఆవ్యక్తి నావల్ల తాను పరాజితురాలైనట్లు దలంచిందంటే మఱి విజయ మెవ్వరిది? నాదే! నర్తకీ! నీవు నానుండి పరాజయం స్వీక రించినావు - ఎందుకొఱకు? నీవల్ల నేను పరాజితుడ నైనాననా!"

కుమారగిరి వెఱగుపడ్డాడు. ఎదుట చిత్రలేఖ నిలిచింది; మధురమందహాసం ఆమె ఆస్యంపై లాస్యమాడుతున్నది, ఆమె అక్షులలో హాసం విలాసం చేస్తున్నది. విచిత్రం! తనచే పరాజితురాలైనదని యోగి అనుకునే ఆమె మాత్రం కళాప్రపూర్ణప్రఫుల్లవదనంతో విలసిస్తున్నది, తాను విజయుడ నైనాననుకునే యోగి మాత్రం కళవళపడుతున్నాడు.

కుమారగిరి ఏమీ మాట్లాడలేదు, అతడా మకుటంవైపే చూస్తూ ఉండిపోయినాడు.

"ఇదేమిటి యోగీ! విజయమకుటం ధూళిగ్రస్తమైంది? మీరింకా విజయాన్ని అంగీకరించలేదా?" - అంటూ చిత్రలేఖ తన ముఖం లోని చిఱునవ్వు నణచివేసింది.

ఇది అతనికి గడ్డుప్రశ్నగా మారింది. ఆత్మాభిమానియైన యోగికి స్వీయాపజయాన్ని ఒప్పుకొనడం అసంభవమైంది. అత డామె కేమీ జవాబీయలేదు.

చిత్రలేఖ మకుటాన్ని లేవనెత్తింది - "ఉద్ధతుడవైన యోగీ! ఇంత మాత్రం నమ్ము. నిన్ను పరాజితుని జేయడం నా కసంభవం." - అంటూ ఆమె కిరీటాన్ని కుమారగిరి శిరస్సునం దలంకరించింది. కోపంతో నేలకు విసరికొట్టిన కిరీటాన్ని మళ్లీ తొడుగుతుంటే దాని కతడు సంకోచింపలేదు, ఆ ప్రయత్నాన్ని నిరోధింపలేదు. ఆ సమయంలో కన్నులు మూసికొని అతడేదో ఆలోచిస్తున్నాడు.

"యోగీ! ఏమాలోచిస్తున్నావు?"

ఇప్పుడు కుమారగిరి కన్నులు దెఱచినాడు - "నర్తకీ చిత్రలేఖా! నీవు నన్ను జయించినా ననుకొని మాటిమాటికి నన్నవమానం చేస్తున్నావు. కాని నీ యీచేష్టలు, పూనిక వ్యర్థములు. సంసారాన్ని త్యజించిన యోగికి మానావమానాలతో ఎట్టి సంబంధమూ లేదు. ఐనా నీవివన్నీ వ్యర్థంగా చేస్తున్నావు."

చిత్రలేఖ శాంతంగా ఉత్తరమిచ్చింది - "యోగీ! నీకీ పంతం అనుచితం. నేను మళ్లీ విన్నవిస్తున్నాను. నిన్ను జయించేంత శక్తిగాని, యోగ్యతగాని నాకు లేదు!"

కుమారగిరి చిత్రలేఖను తన కన్నులతో గప్పివేసినాడు. కొన్ని క్షణాలపాటతడు తన యెదుట నిలుచున్న ఆ అసాధారణస్త్రీ మూర్తిని అనిమేషదృష్టులతో అవలోకించినాడు - పాలిపోయిన అతని ఆస్యం ప్రశోణమైంది. నిశ్చలమూ, స్థిరమైన అతని దేహంలో హఠాత్తుగా వేపథు వుద్భవించింది. అతడు బలంగా చిత్రలేఖాకోమలహస్తాలను పట్టుకొని అన్నాడు - "నర్తకీ! నిజం చెప్పు - నీవు నీడవలె నాకడ కెందుకు వచ్చినావు? నన్నిక్కడగూడ ఇట్లు లజ్జితుని జేయుటలో నీ ఉద్దేశ్యమేమి?"

ఆవేశంతో అతని శరీరం సమస్తం కంపించిపోయింది. చిత్రలేఖ అట్లాగే నిలబడిపోయింది, ఆమె చూపులు కుమారగిరి చూపులతో కలిసినవి. ఆ చూపులలో ఏదోయొక మదిర నిక్షిప్తమై ఉన్నది. ఆమె చిఱునవ్వుతో ప్రత్యుత్తర మిచ్చింది - "నన్ను జయించిన వారినుండి దీక్షను స్వీకరించడానికే నేనిక్కడికి వచ్చినాను."

సమయం సౌరభపూర్ణమధుమాసం. వాతావరణం మంజులమలయానిలసమవేతం. సర్వం నిర్మలచంద్రికాహాసవిలాస విలసితం, తారకావారమందహాసమధురం. ప్రగాఢనిశ్శబ్దరజనిలో నిర్జనప్రదేశంలో యోగి కుమారగిరికి ఎట్టెదుట నర్తకి చిత్రలేఖ నిల్చింది.

కుమారగిరి ఆవేశం అంతరించింది. అతడు వెఱపుతో కొంచెం వెన్కకు తగ్గి, నాలుక కఱచి ఇట్లన్నాడు - "సుందరీ! దీక్ష వహించడంలోని ఆంతర్యాన్ని గుఱించి నీవెప్పుడైనా ఆలోచించినావా?"

చిత్రలేఖ నవ్వింది. ఆ నవ్వులో విచిత్రమైన సౌందర్యముంది; అందులో సజీవసంగీతమాధుర్యముంది. "ఆ! ఒక్కసారి కాదు, పలుసార్లు" - ఆమె జవాబిచ్చింది.

కుమారగిరి ఆ అపూర్వసుందరినుండి తన చూపులను మరల్చుకొన్నాడు - "కాదు. నీవు నా వాక్యార్థాన్ని గ్రహించలేదు. నా దీక్ష కర్థం సంసారంలోని సమస్తభోగవిలాసాలకు, వాసనలకు, శాశ్వతంగా స్వస్తిచెప్పడం. ఏ అకర్మణ్యతను నీ వేవగించుకొంటావో ఆ అకర్మణ్యతను స్వీకరించడం; ఏ శుష్కసాధనను నీ వెగతాళిచేస్తావో ఆ శుష్కసాధనతో నీ శిరీషకుసుమపేశలశరీరాన్ని శోషింప జేయడం.."

చిత్రలేఖ మాట్లాడలేదు; ఆమె ఏమి ప్రత్యుత్తరమీయవలెనా అని ఆలోచిస్తూ ఉండిపోయింది. ఆమె నర్తకియైనా, వికృతదర్శన సిద్ధాంతాలకు దాసియైనా, అబద్ధమాడడం మాత్రం ఆమె కలవాటు లేదు. ఆమె అత్మ ఆ దీక్షను కాదంటున్నది గాని, హృదయమేమో కావలెనంటున్నది. చివరకు హృదయమే గెలిచింది; ఆ హృదయ మామె జీవితంలో ఎన్నడూ లేని గొప్ప అబద్ధాన్ని పలికించింది - "యోగీ! వీటన్నిటికీ సిద్ధమయ్యే వచ్చినాను" - అమె అన్నది.

"వీటన్నిటికీ సిద్ధమయ్యే వచ్చావా?" - కుమారగిరి పాలిపోయి అన్నాడు. "సుందరీ! నీవు పొరపడుతున్నావు. నీవు చేయ దలచిన కార్యాలన్నీ బహుకఠినమైనవి. అందఱూ వాటిని చేయలేరు. మమకారాన్ని విస్మరించడం బహుదుస్సాధకార్యం తెలుసా? నీవిది చేయజాలవు."

చిత్రలేఖ గంభీరురాలైంది - "నీవు చెప్పేది సరియైనదే యోగీ! ఇది అవశ్యంగా కఠినమైనదే, కాని అసంభవం మాత్రం కాదు."

కుమారగిరి ఆమె నొకసారి నఖశిఖపర్యంతం తేరిపార జూచినాడు. అమె సభామండపంలో ధరించిన నాట్యాహార్యాన్నే ధరించి వచ్చింది - అదే సౌందర్యం, అదే మాదకత్వం! ఆమె కన్నులలో ఆకర్షణోల్లాసాలు వెల్లివిరుస్తున్నాయి. అమె నవలోకించి, "ఈమె అసామాన్యసుందరి!" అని కుమారగిరి లోలోపల అనుకున్నాడు. అంతవఱ కతడు సౌందర్యాన్ని గుఱించి పట్టించుకొనలేదు, వాసనాను రాగాలపై ధ్యాస నిల్పలేదు. కాని నే డామె సౌందర్యమతనిలో నొక అల్పమైన కంపనను సృజించింది. జీవితంలో తొట్టతొలిగా నతడట్టి కంపనాసంకలితసాంసారికసుఖానుభవాన్ని పొందినాడు. ఆ సుఖమెంతో విచిత్రంగా ఉన్నది. అతడన్నాడు -"సుందరీ చిత్రలేఖా! నీకు దీక్షను ప్రసాదించుట యెంతమాత్ర ముచితమో ఆలోచింపవలసియున్నది. ఇప్పుడు నేనేమీ చెప్పజాలను."

"ఇప్పుడే నీవేమీ చెప్పలేవా యోగీ!" - చిత్రలేఖ కుమారగిరి వాక్యాన్నే కాస్త త్రిప్పి పలికింది. "ఎందుకు? నాపైన నీకు విశ్వాసం లేకనా లేక నీపైనే నీకు విశ్వాసం లేకనా? యోగీ! నాకు దీక్ష నీయడం, ఈయకుండటం నీదృష్టిలో ఏమీ కాకపోవచ్చు; కాని నాకు మాత్ర మిది జీవన్మరణసమస్య. అందుచేత ఇందులో నీ జవాబుదారి చాలా ఉంటుంది. జలాశయస్వామియైన ఒకడు పిపాసాబాధితుడైన పథికునికి జలదానం చేయకుండా, దాహంతో నోరెండి అతడు మరణిస్తుండగా చూస్తాడో, అట్టివాడు మహాపాతకుడౌతాడు. వానికి అత్మశాంతి లభించడమసంభవం. యోగీ! నీవిది గుర్తుంచుకొనవలెను."

ఈ మాటలకు కుమారగిరి భయపడ్డాడు - "సుందరీ! నీకన్ని విషయాలు స్పష్టంగా తెలుపుతాను. నేను నీకు దీక్షనీయ వెనుకాడ టానికి కారణం నీలో దర్శనాల వికృతసిద్ధాంతవ్యాఖ్యానాల పునాదులేర్పడ్డాయి. నా భయం ఆ సిద్ధాంతాలను నీలోనుండి వెడలనడ చేందుకు బదులుగా నేనే వానిలో ఇరుక్కుంటానేమో యని - కాదు, కాదు - ఇది జరుగనేరదు!" - కుమారగిరి అగిపోయాడు. తన మనోదౌర్బల్య మతనికి తొలిసారిగా అనుభవమైంది, దానికి తోడుగా అనుకోకుండా అది బయటికిగూడ వ్యక్తమైంది. అదీ దౌర్భాగ్య వశాత్తుగా ఒక నర్తకిముందర వ్యక్తమైంది. అతనపై అతనికి కోపం వచ్చింది. అతని ప్రశాంతవదన ముద్విగ్నతతో ఎఱ్ఱబడింది. అత డన్నాడు - "సుందరీ! నేనన్న మాటలవల్ల ఏమీ ప్రయోజనం లేదు. దయచేసి నీవిక్కడినుండి వెళ్లిపో! నాకు పరిస్థితులనుగుఱించి విచారించుకునేందుకు వ్యవధినీయి."

"చాలా మంచిది యోగీ! నేనిక్కడ ఉండడం నీకు దుఃఖకారణమైతే నేనిక్కడనుండి వెళ్లడమే ఉచితం. నీ యెదుట నున్న ఈ స్త్రీ అంధకారం, మాయ అని నీవు దలంపవచ్చు. ఈమె వికృతసిద్ధాంతాలు నీకు భయావహములుగా నుండవచ్చు. కాని యీ నిర్ధారణ ఆధారరహితం. దీక్షార్థమై నిన్నాశ్రయించినప్పుడే నేను నా పూర్వభావనలకు, విశ్వాసాలకు, సంస్కృతికి తిలోదకము లిచ్చుకున్నాను. ఇక మిగిలింది స్త్రీ అంధకారం, మాయ అనే విచారం. యోగీ, ఇక్కడగూడ నీవు పొరపడుతున్నావు. స్త్రీ శక్తిస్వరూపం. ఆమెను

సంచలితం జేసే వ్యక్తి యోగ్యుడైతే ఆమె సృష్టికి రూపంగా భాసిస్తుంది; అతడే అయోగ్యుడైతే ఆమె వినాశాకృతిగా పరిణమిస్తుంది. అందుచేత స్త్రీకి వెఱచే వ్యక్తి అయోగ్యుడైనా కావలె, లేదా భీరుడైనా కావలె. అట్టి పురుషుని వ్యక్తిత్వం అపరిపూర్ణమై ఉంటుంది."

చిత్రలేఖ అక్కడనుండి వెళ్లిపోసాగింది. కాని కొంచెం దూరం సాగి, ఆగిపోయింది. అప్పుడు కుమారగిరి చూపులు శూన్యోన్ముఖములై యున్నవి. ఆమె మళ్లీ అన్నది - "ఆ.. ఒక్కమాట చెప్పడం మరచినాను. రేపు మళ్లీ నేనిక్కడికి వస్తాను. మీకు యోచించుకొనడానికి కావలసినంత వ్యవధినిస్తున్నాను. ఒకవేళ నాకు దీక్షనొసగడం ఉచితమైనదని అనుకుంటే, రేపు నాకు తెలియ జేయాలి. శ్రీచరణాలకు దాసి చిత్రలేఖ ప్రణామం."

కుమారగిరి నిర్గమిస్తున్న చిత్రలేఖ నవలోకించినాడు; ఒక్కసారిగా త్రుళ్లిపడ్డాడు. చిత్రలేఖాసంగీతమయకోమలనిస్వనం అతని చెవులలో ఇంకా ప్రతిధ్వనిస్తూనే ఉన్నది; ఆమె తనూలావణ్యం అతని కన్నులలో ఇంకా లాస్యం చేస్తూనే ఉన్నది. అతడు చేష్టాశూన్యుడ నౌతానేమో అని భయపడుతూ, ఎదుట పుష్కలంగా నున్న సుగంధమయసురాప్రవాహాన్ని నేలపాలొనరించే అతృప్తుడైన మధుపాయి వలె ఆమెను చూస్తూనే ఉన్నాడు. అతనికి తనను సంయమించుకొనడ మసాధ్యమైంది - "సుందరీ! చిత్రలేఖా!" అని ఆమెను పిలిచినాడు.

కుమారగిరి చూపు లవనతములైనవి. అతని ఆత్మ అతని హృదయంయొక్క ఉచ్ఛృంఖలతతో విరోధించింది - కాని "ఈమెకు ప్రత్యుత్తర మొసగి, నా స్థితిని స్పష్టీకరించడ మవశ్యం", అంటూ అతని హృదయం ఆత్మయొక్క భర్త్సనను సరకుగొనలేదు. చిత్రలేఖ తిరిగి వచ్చింది. ఆమె ముఖంలో మందహాసం, హృదయంలో ప్రకంపనం సమావిష్టమైనాయి.

"యోగీ! బహుశః నీవు నీ పొరపాటును గ్రహించినావేమో! చెప్పవలసిందేదో చెప్పు!"

కుమారగిరి ఏమీ జవాబీయలేదు. అతడు నిశీథచంద్రికలో చిత్రలేఖామనోహర సౌందర్యాన్ని నిర్వర్ణిస్తూ ఉండిపోయినాడు.

ఆమెలో నతడొక శృంగారరసమూర్తిని జూచినాడు, ఆ శృంగారరసంతో పులకితమైన సౌందర్యాన్ని జూచినాడు; ఆమెలో మదిరను జూచినాడు, మాదకత్వాన్ని జూచినాడు. కోరికలయొక్క అనుభూతిని పొందినాడు, ఆ కోరికలయందలి మనోహరత్వాన్ని చవిచూచినాడు. హఠాత్తుగా అతని హృదయంలో, "స్త్రీ అంటే ఎవ్వరు, సౌందర్యమంటే ఏమిటి? భగవంతుడు వీని నెందుకు సృష్టించి నాడు?" - అన్న ప్రశ్నలుత్పన్నమైనాయి. కాని ఈప్రశ్న లనుచితమైనవి - సంవత్సరాల తరబడి సంచయించిన అతని అంతర్విచారధార హెచ్చరించింది - "ఏమి? నీ ఋజుమార్గం నుండి నీవు వక్రిస్తున్నావా?" - అతి ప్రయత్నంతో అతడా ఆలోచనాపరంపరల నణచివేసి అన్నాడు - "సుందరీ! ఏం పొరపాటు చేసినానంటున్నావు? నాకు గుర్తున్నంతవఱకు నేనెట్టి పొరపాటునూ చేయలేదు."

అతనితో ప్రతివాదం చేయడ మనుచిత మనిపించిందామెకు. ఆమె నెమ్మదిగా అన్నది - "స్వామీ! క్షమించవలెను. నేను గురువుగా నెంచి చెంతజేరిన వ్యక్తి పొరపాటు చేయజాలడు. నా మాటలకు క్షమాపణ కోరుకొంటున్నాను."

"అవును - నీవిప్పుడే అడిగినావు నేను నీతో చెప్పదలచిందేమని, బహుశః నీవింకా అడుగుతావేమొ నేను నిన్ను తిరిగి ఎందుకు పిలిచినానని. అసలు నాకే తెలియదు నేనిదంతా ఎందుకు చేసినానో, నిశ్చయంగా నేనిప్పుడు గొప్ప పొరపాటునే చేసినాను. ఏమైతేనేం నిన్ను తిరిగి పిలిచినందుకు ఈమాట చెప్తాను. నేను నీకు దీక్ష నొసగుట కసమర్థుడను. అసమర్థుడనే కాదు, నాకిది చేయడ మసంభవం. నీకు దీక్షనీయడం బహుశః నీనుండి నేనే దీక్షను పొందడ మౌతుందేమో! దీనికి నేను సిద్ధంగా లేను" - అంటూ కుమారగిరి అస్తమిస్తున్న చంద్రబింబంపై చూపులు సారించినాడు.

చిత్రలేఖ గాంభీర్యం దాల్చింది. ఆమె ముఖం నిరాశతో వివర్ణమైంది, కన్నులలో కరుణచ్ఛాయలు కనపడ్డాయి. ఆమె నెమ్మదిగా అన్నది - "స్వామీ! మీ పొరపాటు మీకంటె నా కధికంగా విచారం కలిగిస్తున్నది. మీరు దీక్షనొసగకుండుటవల్ల నా జీవనం ఎట్టి ప్రభావానికి లోనౌతుందో ఇప్పుడు నేను సరిగా చెప్పజాలకున్నాను. కాని మీరు నాజీవితాన్ని అత్యంత ప్రభావితం జేసినారనేది మాత్రం సత్యం. ఇంతవఱకు మీరు బహుశః నాకు దీక్షనిస్తారనే ఆశ పడ్డాను. ఆ ఆశపై ఆధారపడి నా భవిష్యత్తు నూహించుకొంటున్నాను. కాని నేడా ఆశ వమ్మైపోయింది. మీ మతానుసారం నా జీవితం అంధకారమయం, అందువేత నేను మీ ప్రకాశజ్యోతిని దర్శింప నాకాంక్షించి

నాను. కాని ఆ కాంక్ష పరిపూర్ణం కాలేకపోయింది. ఇందుకు నేను మిమ్ములను నిందించను, నా భాగ్యాన్నే నేను నిందించుకొంటు న్నాను." - అంటూ ఆమె కుమారగిరికి చేరువగా జరిగింది.

కుమారగిరి నిస్తబ్ధంగా నిలుచున్నాడు. చిత్రలేఖ అతని చేతులను పట్టుకొన్నది. ఆమె కరస్పర్శ అతనిలో ఒక వినూత్నకంపనను కలిగించింది. కాని ఆకంపన సుఖానందసంధాయకంగా ఉంది - "ఔను.. మన యిద్దరి సాహచర్యం అసంభవం. నేను స్త్రీని, మీరు పురుషులు; నేను నర్తకిని, మీరు యోగీశ్వరులు. నాది వాసనామయక్షేత్రం, మీది సాధనామయక్షేత్రం. మన ప్రకృతులు పరస్పరవిరుద్ధాలు. అందుచేత మీరు సుడిగాలివలె నా జీవితంలో ప్రవేశించి, నిర్గమించడం సరియైనదే. ఇంక మీదట మీనుండి దూరంగా ఉండడానికి యత్నిస్తాను. కాని మీనుండి వేఱుపడడానికి ముందుగా మీకాళ్లపై నాశిరం మోపగోరుతున్నాను" - అంటూ ఆమె కుమారగిరి పాదాలపై పడిపోయింది.

కుమారగిరి గుండె ఝల్లుమన్నది. చిత్రలేఖ పాదాలపై బడడం చూచి అతడొక్కసారిగా త్రుళ్లిపడ్డాడు. అతడామెను లేవనెత్తాడు. ఆ ప్రయత్నంలో అతనిహస్తాలకు ఆమె సువర్తులపీనస్తనద్వయంతో స్పర్శ కలిగింది. చిత్రలేఖ సానందపులకాంకురయై లేచి నిలుచున్నది. కాని అతనికేమీ ఆనందవికారం కలుగలేదు. అనుకోకుండా ఆ స్పర్శ అతనికి కలిగింది, కాని అదే సమయంలో అతడేదో పరధ్యానంలో ఉండడంవల్ల దాని నతడు పట్టించుకొనలేదు. కాని చిత్ర లేఖ మాత్రం మఱొకలాగు అర్థం చేసుకొన్నది.

"నాచరణాల నెందుకు పట్టుకొంటున్నావు సుందరీ!"

చిత్రలేఖ కుమారగిరితో కలిసే నిలబడి ఉన్నది. ఆమె తన ముఖాన్ని కుమారగిరి ముఖానికి చేరువగా చేర్చి అన్నది - "మీరు నా ఆరాధ్యదైవము!"

కుమారగిరి చూపు లామె చూపులతో కలిసినవి. ఆమె కన్నులలోని మాదకత్వప్రభావం అతని కన్నులకు వ్యాపించింది. ఆమె తన ముఖాన్ని అతని ముఖంలోనికి చేర్చింది. కుమారగిరి తనముఖాన్ని త్రిప్పుకొనలేదు - అతని శ్వాస వేడెక్క నారంభించింది, అతని తను వంతా కంపింపసాగింది..

అదే సమయంలో "గురుదేవా!" - అనే పిలుపు వినవచ్చింది కుమారగిరికి.

కుమారగిరి హడలిపడ్డాడు. అతడు తటాలున చిత్రలేఖాసన్నిధానంనుండి తప్పుకున్నాడు. చూడకుండా ఒక స్త్రీసర్పాన్ని సమీపించి, ఆ సర్పిణి కాటువేయబోతుండగా ఒక ఎదుటివ్యక్తిప్రేరణచే తన అస్తిత్వాన్ని తెలిసికొని హఠాత్తుగా ప్రక్కకు తప్పుకొన్న పథికునివలె అతడు ప్రక్కకు జరిగినాడు. ఎదురుగా విశాలదేవుడు ప్రత్యక్షమైనాడు. విశాలదేవుని చూచి కుమారగిరి తాను ధూళిలో కూరుకపోయినట్లుగా లజ్జావనతుడైనాడు. తన శిష్యుని సమక్షంలోనే తానొక నర్తకిచేత నేడు పరాజితుడైనాడు.

చిత్రలేఖకు విశాలదేవునిపై పట్టరాని కోపం వచ్చింది. ఆమె దృష్టిలో విశాలదేవునికి అక్కడికి రావలసిన అవసరం లేదు. సంయోగావస్థలో నున్న సమయంలో తన కెదురైన మానవునిపై తటాలున దూకిపడే సర్పిణిలాగా ఆమె రోజుతూ విశాలదేవుని వైపునకు మళ్లి, తీవ్ర స్వరంతో అన్నది- "యువకా! నీవెవ్వరు? నీ వీసమయంలో ఇక్కడి కెందుకు వచ్చినావు?"

"నేను గురుదేవుని శిష్యుడను, వారింతరాత్రికీ తిరిగిరానందువల్ల వారిని వెదకికొంటూ నేను వచ్చాను."

చిత్రలేఖ మెల్లగా అనుకొన్నది - "హా! నా భాగ్యం!" - ఆ తర్వాత ఆమె కుమారగిరితో అన్నది, "గురుదేవా! నేనింక వెళ్లివస్తాను. కాని గుర్తుంచుకోండి, నేను దీక్షను కోరుతున్నాను, మీరు నాకు దీక్షను ప్రసాదించవలసే ఉంటుంది." - ఆమె మృదుమధురస్వనంలో ఆజ్ఞాపించే స్వామినికంఠంలోని కటుత్వం ధ్వనించింది. "నేను జనసమ్మర్దంనుండి తప్పుకొని ఏకాంతంగా నుండ నభిలషిస్తున్నాను; మాయను త్యజించి, బ్రహ్మలో లీనమైపోవగోరుతున్నాను. మీ కవకాశమిస్తున్నాను, ఈ విషయమై విచారించడానికి. మఱి మీరు మానవాతీతులు - నావల్ల మీరేమీ భయపడనక్కఱలేదు. మీరు విషయవాసనలపై విజయం సాధించినారనే నేనిది అర్థిస్తున్నాను. మంచిది - శ్రీచరణాల కీదాసి ప్రణామం" - అంటూ ఆమె అక్కడనుండి వెళ్లి పోయింది.

కుమారగిరి విశాలదేవుని హస్తాన్ని గట్టిగా పట్టుకొని అన్నాడు - "నీవు మూర్ఖుడవు!" అదే సమయంలో చంద్రుడస్తాచలంనుండి అధోగతుడౌతున్నాడు.

౭

"శ్వేతాంకా!"

"స్వామీ!"

"నీవీరోజేం చూచావో తెలుపుతావా?"

"ఓ! ఈరోజు స్వామిని కుమారగిరిని పరాజితుణ్ణి చేసింది. నాకెంత సంతోషమైందో!"

"నీకు సంతోషమైందా!" - కటువుగా నవ్వినాడు బీజగుప్తుడు. "నీకు సంతోషమైందేమో కాని శ్వేతాంకా, నాకుమాత్రం దుఃఖం కలిగింది. నా యీమాటలపట్ల నీకాశ్చర్యం కలుగవచ్చు. కాని యిది నిజం. నీకు హర్షం కలుగవచ్చు, నాకూ కలిగితే కలుగవచ్చు. కాని నా ఆత్మమాత్రం రోదిస్తున్నది."

శ్వేతాంకు డాశ్చర్యంతో అడిగినాడు - "దేవరవారి తాత్పర్యం నాకర్థం కావడం లేదు."

"అర్థం కాలేదా? ఔనులే, నీకెట్లా ఔతుంది? నీవింకా సంసారవైఖరి నెఱుగవు, నీ వనుభవశూన్యుడవు. నీవు దేన్ని చిత్రలేఖా విజయంగా భావిస్తున్నావో అది ఆమెకు గొప్ప పరాజయం. చిత్రలేఖా, కుమారగిరీ1 వీరెవ్వరూ విజయులు కారు, ఇద్దఱూ పరాజితులే! ఝటితిగా పరిభ్రమించే పరిస్థితుల చక్రంలో వారిద్దఱూ చిక్కుకొనిపోయారు."

బీజగుప్తుని మాటలు శ్వేతాంకుని కింకా బోధపడలేదు. అప్పటికి రథం బీజగుప్తుని ప్రాసాదద్వారాన్ని చేరుకున్నది. ఇద్దఱూ రథాన్ని దిగారు. బీజగుప్తుడు శ్వేతాంకుని హస్తాన్ని గ్రహించి అన్నాడు - "నీతో కొంచెం మాట్లాడాలనుకుంటున్నాను. రా! కాస్సేపు నాతో వచ్చి కూర్చో."

శ్వేతాంకునికి నిజంగా బీజగుప్తుని మాటలలోని ఆంతర్యం అర్థం కాలేదు. స్వామి, సేవకుడు - ఇద్దఱూ అధ్యయనభవనం లోనికి వెళ్లారు. శ్వేతాంకుని కూర్చొనమని ఆదేశిస్తూ బీజగుప్తుడు గూడ ఆసీనుడై అన్నాడు - "శ్వేతాంకా! నీవెఱుగుదువా కుమారగిరి కెందుకు పరాజయమైందో?"

"లేదు."

"దీని రహస్యం నేను చెప్తాను విను. చిత్రలేఖను నే నెఱిగినంతగా నీవెఱుగవు. ఆమె వ్యక్తిత్వ మున్నతమైనది, ప్రభావవంతమైనది కూడ. కుమారగిరి విద్వాంసుడు, యోగీశ్వరుడు కూడ; వాసనాపరంపరల యెడ నాతనికి వైముఖ్యమున్నది. చిత్రలేఖకు వైదుష్య మున్నను సాధనయెడ వైరుధ్యమున్నది. వారిర్వురికీ అహంభావపూరితమైన మమత్వ మున్నది, అ మమత్వపరిపూర్తిపై విశ్వాస మున్నది. కాని వారది సాధింపనెంచిన మార్గాలు వేఱుగాను, విపరీతంగాను ఉన్నవి. యోగి సాధన నాశ్రయిస్తే, నర్తకి ఆత్మవిశ్వాసాన్ని ఆశ్రయించింది. కాని నేడు జరిగినదాన్నిబట్టి చూస్తే వారిర్వురూ తమతమ మార్గాలయందు విరక్తులైనారు. త్వరలోనే వారు తమ శక్తులను కోల్పోగలరు."

బీజగుప్తుని మాటలు శ్వేతాంకునికొక ప్రహేళిక (Puzzle) వలె భాసించినవి. అత డన్నాడు - "స్వామీ! మీ విచారధారలోని ఆంతర్యాన్ని నేనందుకొనలేక పోతున్నాను."

బీజగుప్తుని స్వనం మందగించింది. అతడన్నాడు - "ఈ మాటల నింకా స్పష్టం చేయడానికి నాకు ఓపికా లేదు, అట్లా చేయడం ఉచితమనీ నేననుకోను. తెలియగోరితే నేను సూచించిన మార్గంలో నీవు ప్రవర్తించు."

శ్వేతాంకుడన్నాడు - "స్వామివారి ఆజ్ఞాపరిపూర్తికి ...."

"ఈరోజు నీవు చిత్రలేఖ నభినందించుటకు వెళ్లి ఆమె ముఖగతభావాలను పరిశీలించు."

శ్వేతాంకు డప్పుడే చిత్రలేఖాభవనానికి వెళ్లాడు. చిత్రలేఖాభవనద్వారం ఆమె నభినందించుటకు వచ్చిన యువకసామంతరాజుల సమూహంచేత సంవలయితమై ఉన్నది. ఆమె దాసీలు వారల కతిథిసత్కారం చేస్తున్నారు; కాని చిత్రలేఖమాత్ర మక్కడ లేదు. శ్వేతాంకు డొక దాసి నడిగినాడు - "స్వామిని యెక్కడ?" - దాసి అతణ్ణి లోనికి దీసుక వెళ్లి ఒక సుసజ్జితమైన గదిలో కూర్చుండబెట్టి అన్నది - "స్వామిని యింకా రాలేదు. వస్తూనే ఉన్నదనుకుంటా!" - శ్వేతాంకు డామెకై నిరీక్షింపసాగినాడు.

ఆమెకై నిరీక్షించి నిరాశాపూరితులైన సామంతరాజులు క్రమక్రమంగా అక్కడనుండి నిర్గమించినారు. భవనం నిస్సామంతమైంది. గంటలు గడచినవి. కాని చిత్రలేఖమాత్రం రాలేదు. ఈ సమయంలో ఆమె ఎక్కడికేగిందో అని శ్వేతాంకుడు విస్మయపూరితుడైనాడు. అతడు మళ్లీ దాసి నడిగినాడు - "స్వామిని ఎప్పటివఱకు రావచ్చు?' - దాసి జవాబిచ్చింది - "నేను చెప్పలేను."

శ్వేతాంకు డామెకై నిరీక్షించి, నిరీక్షించి విసుగు జెందినాడు. అర్ధరాత్రి కావచ్చింది. ఐనా ఆమెజాడ లేదు. అతడెన్నో సార్లు తిరిగి వెళ్లిపోవాలనుకున్నాడు. కాని ఆమె దర్శన కౌతూహలంవల్ల అక్కడనే ఉండిపోయాడు. ఇంతలో మధ్యరాత్రిని సూచించే ఘంటానాదం మ్రోగింది. శ్వేతాంకుడు లేచి దాసితో, స్వామిని వచ్చినప్పుడు తానామె నభినందించడానికి వచ్చి వెళ్లినానని తెలుపుమంటూ బయటికి అడుగు మోపినాడు. అప్పుడే చిత్రలేఖారథం వస్తున్నట్టుగా అతనికి స్ఫురించింది. అతడక్కడే ఆగిపోయినాడు.

శ్వేతాంకు డామె కాసరాయొసగి రథంనుండి దింపినాడు. ఆమె చిఱునవ్వుతో అడిగింది - "శ్వేతాంకా! ఇంతరాత్రివఱకు లేచి ఉండవలసిన కష్టం నీకెందుకు వచ్చింది?"

"స్వామినికి అభినందనలు తెలుపడానికి" - శ్వేతాంకుడు మందహాసం చేసినాడు.

చిత్రలేఖాహస్తాన్ని పట్టుకొని శ్వేతాంకు డామెను కేళీగృహానికి జేర్చినాడు. ఆమె అన్నది - "శ్వేతాంకా! నీ వతిథిగృహంలో వేచి ఉండు. నేనిప్పుడే వస్తాను."

బట్టలు మార్చుకొని చిత్రలేఖ అతిథిగృహానికి వచ్చింది. అప్పు డామె ఒక తెల్లనిచీర మాత్రం ధరించింది. "నాకభినందనలు తెల్పడానికి వచ్చావా శ్వేతాంకా? ఎందుకు? దేనికొఱకు?"

"మీ విజయంకొఱకు!"

"నా విజయంకొఱకా?" - అంతవఱకు సముల్లాసితమైన ఆమె వదనం వివర్ణమైంది. యౌవనోల్లాసంలో దాగిన ఈవిషాద చ్ఛాయను శ్వేతాంకుడు తొట్టతొలిగా జూచినాడు. అతనికి దాని ఆంతర్యం బోధపడలేదు. సుందరవదనంలో ప్రకటమయ్యే ప్రతిభావపరి వర్తన కూడ సుందరంగానే ఉంటుంది. విషాదవివర్ణమైన ఆమె ముఖంకూడ శ్వేతాంకునికి మోహకంగానే తోచింది. పైగా ఆ గృహంలోని సహస్రదీపకళికలకాంతి ఆమె వదనంపై ప్రసరిస్తూ ఉన్నది. "అభినందలా శ్వేతాంకా? నేనందుకు తగను. నాకది విజయం కాదు. గొప్ప పరాజయం" - అన్నది.

బీజగుప్తుడన్న మాటనే చిత్రలేఖకూడ పలికింది. పైగా ఇర్వురూ చాలా గంభీరంగా పలికినారు. ఇది శ్వేతాంకుని కాశ్చర్యం కలిగించింది.

చిత్రలేఖ శ్వేతాంకునివదనంలోని భావాన్ని పఠించింది. "నీకు నామాట లాశ్చర్యం కలిగించవచ్చు. కాని ఆశ్చర్య మెంతమాత్రం అవసరం లేదు. నీకు తెలుసా నేనింతవఱ కెక్కడికి వెళ్లానో?"

"ఈ ప్రశ్న నేనూ అడగాలనుకున్నాను. కాని సాహసింపలేక పోయాను."

"ఐతే విను. నేనిప్పుడు కుమారగిరి కుటీరంనుండి వస్తున్నాను. కుమారగిరిని అవమానించడానికి, అతనిలో దోషమెన్నడానికి నాకు కారణమేమీ లేదు, అధికారమూ లేదు. నా క్షేత్రం వేఱు. విద్వాంసుల క్షేత్రంలో పాదార్పణం చేయడం నా కనుచితం. నేను చేసిందేదో అది తప్పుగానే చేసినాను. అందుచే క్షమాపణ వేడుకొనడానికి అతనివద్దకు వెళ్లి వస్తున్నాను."

శ్వేతాంకుడు నమ్మలేక పోయాడు. చిత్రలేఖ కిట్టి భావపరివర్తన ఎందుకు కలిగిందో అతనికి బోధపడలేదు. అత డడిగినాడు - "కాని ఏది సరియైనదో అది తెలుపడం అందఱికీ తగినదే. అంతేకాక ప్రజలను భ్రమపూరితులను జేసి మోసంచేసేవారికి, వాస్తవికతా ప్రదర్శనం చేయడం మానవులకు కర్తవ్యం. దేవీ! మీరు చేసిందేదో అది చక్కగానే చేసినారు."

"ఈ మాటకు నాకు విచారం కలుగుతూ ఉంది. నేను చేసిందందఱూ సరియైనదనే అనుకొంటారు, కాని నాకుమాత్ర మలాగనిపించదు. కుమారగిరి యోగీశ్వరుడు, శక్తిసంపన్నుడు. అతని సత్యం, ఈశ్వరుడూ అతడు కల్పించుకొన్నవి. ఐతే మానవునిలో అంతటి ఉత్కృష్టమైన కల్పనాశక్తి ఉండుట అసంభవం. ఈ కల్పనాప్రవాహం ఎక్కడనుండి వచ్చిందనేదే ప్రశ్న. కుమారగిరిలో సృజనాత్మకశక్తి ఉన్నది. నేను చేసిందేదో అది వినాశకరమైన కార్యము. వ్యక్తియొక్క ఉత్కృష్టత ఒకరి వాదనను ఖండించుటలో కాదు, ఆ వాదనను సంసిద్ధపరచుటలో ఉంటుంది, వినాశంచేయుటలో కాదు, సృష్టించుటలో ఉంటుంది."

"మఱి ఒక మానవుడు నిర్మించే మేడలు అందులో నివసించే వారికి హానికరములైతే వానిని వినశింపజేయట విహితం కాదా?"

చిత్రలేఖ నవ్వింది. "తర్క మనవసరం. నాకు మాత్రం నేను చేసింది దోషంగానే అనిపిస్తున్నది. చేసిందేదో చేశాను, దానివల్ల కలిగే పరిణామాన్ని అనుభవింపక తప్పదు."

"పరిణామమా?" - శ్వేతాంకుని కిదేమీ బోధపడలేదు. "ఎట్టి పరిణామం దేవీ?" - అత డడిగినాడు.

"అది నీకు త్వరలోనే బోధపడగలదు" - అంటూ చిత్రలేఖ దాసిని పిలిచింది.

"నేనింకా భోజనం చేయలేదు. శ్వేతాంకా! నీవుకూడ భోజనం చేయలేదేమో ఇంత వరకు?" - చిత్రలేఖ దాసిని రెండు పాత్రలలో భోజనం తెమ్మన్నది.

దాసి వెళ్లిపోయింది. చిత్రలేఖ మదిరాకుంభాన్ని తీసి తాను కొంత మదిరను సేవించి, శ్వేతాంకుని ముందు కొంత మదిర నుంచింది. శ్వేతాంకు డప్పటికి మదిరను సేవించుట కలవాటు పడ్డాడు. అతడుకూడ మదిరాపాత్రను ఖాళీచేసినాడు. చిత్రలేఖ శ్వేతాంకునితో చెప్ప సాగింది - "శ్వేతాంకా! నీవు నాకు స్నేహితుడవు. స్నేహితునినుండి మఱుగుపరచవలసిన మాటలుండవు."

శ్వేతాంకుడు చిత్రలేఖను తన యజమానురాలిగానే భావించేవాడు; ఐతే ఆమెపట్ల చనువుగా వ్యవహరించేవాడు. అతడన్నాడు - "దేవీ! నన్ను విశ్వసించు. నేనే విషయంలోనూ సానుభూతి కొఱవడకుండా వింటాను."

చిత్రలేఖ శ్వేతాంకుని హస్తాన్ని గ్రహిస్తూ అడిగింది - "చెప్పు నాలోని మార్పును నీ వెవ్వరికీ ప్రకటింపవుగదా!"

"నేనలా శపథం చేస్తాను"

"మఱి నాకు సాయం చేస్తావా?"

"నేను శపథం చేస్తాను"

చిత్రలేఖ అతని చేతిని వదలేసి చెప్పింది -"ఈనాటి నావిజయం విజయం కాదు. అది పరాజయం. కుమారగిరి నన్ను దుష్ప్రభావితురాలిని చేసినాడు."

శ్వేతాంకునికి లోగడ బీజగుప్తుడు సంకేతించిన భయంకరసత్యం అనుభవమైంది. నమ్మకం కుదిరించుకొనడానికి అత డడిగినాడు - " ఎట్లాంటి ప్రభావం?"

"ఎట్లాంటి ప్రభావం? ఇంతమాత్రం గ్రహింపలేవా? ఐతే విను - నేను కుమారగిరిని ప్రేమింపసాగాను. నాకూ, అతనికీ యుగ యుగాంతరాల సంబంధమున్నట్లు నాకు తోస్తున్నది. ఈనాడతడు భరతఖండంలోని అఖండపండితమండలిపై విజయం సాధించి నాడు, వారందరూ అతనిచేత ప్రభావితులైనారు - కాని నేను కాలేదు. ఎందుకని? ఎందుకంటే నేను కుమారగిరి నెఱుగుదును, అతడు నన్నెఱుగును. మా కిర్వురకు జన్మజన్మాంతరాల బాంధవ్యం అవశ్యంగా ఉన్నది"

శ్వేతాంకునికి పునర్జన్మపై నమ్మకముంది. అతడు చిత్రలేఖ మాటల నడ్డుకొనలేదు - ''ఆ! గ్రహించాను'' అన్నాడు.

“కుమారగిరిని చూచిననాటినుండి నేనతనిచే ఆకర్షితురాల నౌతున్నాను. అతని హృదయాన్ని చక్కగా నెఱిగినవారే అతని హృదయంలోతును పరామర్శింపగలరు. నేను అతనిని, అతని హృదయాన్ని చక్కగా నెఱుగుదును. అతడే నాజీవితానికి ప్రధానాభినేత!”

“తెలిసింది దేవీ! ఐతే నేనెట్లా సహాయం చేయగలను?”

ఇంతలో దాసి ఇర్వురికీ భోజనం తెచ్చింది. చిత్రలేఖ శ్వేతాంకుణ్ణి భోజనం చేయ నాదేశించి, తానూ భోజనం చేసింది.

భోజనానంతర మామె అన్నది - "ఆ! ఏవిధంగా సాయం చేయగలనని అడిగావు. నీవు చేయవలసిందొక్కటే. నీవు బీజగుప్తునికి నా మనఃపరివర్తననుగూర్చి ఇప్పుడే తెల్పరాదు. బీజగుప్తునికి నాపై అవిశ్వాసం కలుగవచ్చు. నీవా అవిశ్వాసాన్ని దూరం చేయ వలెను."

శ్వేతాంకు డేదో ఆలోచింపసాగాడు. ఆమె అభీష్టాన్ని నిర్వర్తించడం అతనికి కష్టంగా తోచింది. బీజగుప్తుడతనికి యజమాని. అట్టి బీజగుప్తునికి మోసంచేయడం అతనికి విశ్వాసఘాతుకత్వ మనిపించింది. కాని చిత్రలేఖకూడ తనకు యజమానురాలు, సహ చారిణి...

చిత్రలేఖ అతని ముఖలక్షణాలను గమనించింది. ఆమె మదిరాపాత్రను మఱోసారి నింపి మందహాసం చేస్తూ అతని పెదవుల కందించింది. అతడా పాత్రను ఖాళీచేసాడు. ఆమె అట్లే నవ్వులొలికిస్తూ అడిగింది - "చెప్పు! నీవు నా ప్రార్థన నంగీకరిస్తావా? "

శ్వేతాంకుడు మౌనంగానే ఉండిపోయాడు - ఔననలేదు, కాదనలేదు.

చిత్రలేఖావదనంలోని మందహాసం మాయమైంది. క్రోధారుణిమరేఖ లామె కపోలాల నావరించాయి. ఆమె కోమలహస్తా లావేశంతో వణకసాగాయి. ఆమె శ్వేతాంకుని హస్తాలను పట్టుకొని అన్నది - "శ్వేతాంకా! నిన్నాజ్ఞాపిస్తున్నాను. నేను చెప్పింది నీవు చేయవలెను. "

ఆమె ఆగ్రహాని కతడు లొంగిపోయాడు. అతడు నెమ్మదిగా అన్నాడు- "మీరు సెలవిచ్చింది నా కంగీకార్యమే!"

"నీవు శపథం చేయవలెను" - చిత్రలేఖ కొంచె మాగింది - "లేదు. నీవు శపథం చేయవలసిన అవసరం లేదు. నీవు నాకు మాట యిచ్చావు, నీ మాట పవిత్రతను నీవు కాపాడుకొంటావని నాకు విశ్వాసముంది" - అంటూ ఆమె మూడవసారి మదిరాపాత్ర నతని పెదవుల కందించింది.

శ్వేతాంకుడు కన్నులు మూసికొని అపూర్వమధురానుభూతి ననుభవిస్తూ ఆ మదిరను సేవించి ఇట్లన్నాడు - "దేవీ! నేను నిన్నెప్పుడూ ఆరాధిస్తుంటాను. నీతో నాకు గాఢమైన సంబంధమున్నది. నీవు నా స్వామినివి, నేను నీకు దాసుడను. నీ వాక్యం నాకు వేద వాక్కు. మాటయందలి పవిత్రతను నిలబెట్టుకొనే విషయంలో నేనింతమాత్రం చెప్పగలను - నేను నీచుణ్ణి గాను."

శ్వేతాంకుడు లేచి నిలబడ్డాడు. "ఇప్పుడు నిన్నింటికి జేర్చవలసిన యేర్పాటు చేయవలెనా?" - ఆమె అడిగింది. శ్వేతాంకుని కింకా నిషా యెక్కలేదు. అతనికి నడకలో కంపంగాని, మైమఱపుగాని లేదు. "లేదు. తెలివితోనే ఉన్నాను, తెలివితోనే ఉంటాను." - అంటూ అత డక్కడనుండి వెళ్లిపోయాడు.

శ్వేతాంకుడు తిరిగివచ్చేసరికి బీజగుప్తుని అధ్యయనశాలలో దీపం వెలుగుతూనే ఉన్నది. పరిచారిక అతనితో అన్నది - "యజమానులవారు నీకొఱకు నిరీక్షిస్తున్నారు"

శ్వేతాంకు డధ్యయనశాలలో ప్రవేశించినాడు. బీజగుప్తు డక్కడ కూర్చొని ఏదో చింతిస్తున్నాడు. ఆంతవర కెప్పుడూ శ్వేతాంకుడు బీజగుప్తుని చింతాక్రాంతునిగా చూచియుండలేదు. బీజగుప్తునిముందు ఖాళీయైన మదిరాపాత్ర యుండెను; అతని ఆత్మ ప్రగాఢచింతాసాగరమగ్నమై యుండెను. కల్పనోద్యానంలో భయవాయుకంపన మావేశించియుండెను; సుఖసామ్రాజ్యంలో దుఃఖ సంక్రమణ మొదవియుండెను. శ్వేతాంకుని జూచిన బీజగుప్తుడు హఠాత్తుగా నిద్రలోనుండి లేచినవానివలె ఉలికిపడుతూ, "వచ్చావా శ్వేతాంకా! ఐతే చాలా సేపైంది! " అన్నాడు.

శ్వేతాంకుడు కూర్చున్నాడు. కూర్చొని కూజాలోని శీతలజలాన్ని స్థాలీలోనికి వంచుకొని ఒక్క గ్రుక్కలో త్రాగివేసినాడు.

బీజగుప్తుడు ప్రత్యుత్తరానికి కొంతసేపు నిరీక్షించి మళ్లీ అడిగినాడు - "శ్వేతాంకా! నీవు నా ప్రశ్నకు జవాబీయడం లేదా? ఎందుకొఱకు? "

"స్వామీ! స్వామినికై నిరీక్షించడంవల్ల నాకింత ఆలస్యమైంది."

"చిత్రలేఖానిరీక్షణలోనా?"- బీజగుప్తుడు సర్దుకొని కూర్చున్నాడు - "ఏమీ! నీవు వెళ్లిన సమయానికి ఆమె ఇంటిలో లేదా? "

శ్వేతాంకుడు తడబడ్డాడు. తాను ప్రతీక్షించిన విషయం, చేసిన శపథం అతనికి గుర్తుకు వచ్చాయి. "దేవరవారి అనుమానం సరియైనదే. చిత్రలేఖ భవనంలో లేదు. "

బీజగుప్తుడు శ్వేతాంకుని మాటలలోని తడబాటును గ్రహించాడు. అతడు మళ్లీ అడిగినాడు - "బహుశః నీకామె ఎక్కడికి వెళ్లిందో చెప్పిందనుకుంటా! "

శ్వేతాంకుని హృదయంలో తర్కవితర్క మారంభమైంది. ఏదో ఒక నిర్ణయానికి రావటాని కతనికి తగినంత వ్యవధి లేకపోయింది. అతడు తడబడకుండా ఉత్తరమిచ్చాడు - "స్వామిని నాకేమీ చెప్పలేదు. కాని ఆమెను మంత్రి చాణక్యుడు పిలువనంపినట్లుగా తోస్తున్నది. "

బీజగుప్తుని హృదయంనుండి ఏదో భారం దించినట్లైంది. ఎందుకో యేమొ అతని హృదయంలో చిత్రలేఖ కుమారగిరి కడకు వెళ్లిందనే భావన ఉత్పన్నమై ఉండింది. కాని శ్వేతాంకుని యీమాటలను వినేసరికి అతని హృదయభారం దూరమైంది. అతడు శ్వేతాంకుణ్ణి మళ్లీ అడిగాడు - "ఐతే శ్వేతాంకా చెప్పు! నీవు చిత్రలేఖ నభినందించినావా? "

"ఆ.." - శ్వేతాంకుడు నెమ్మదిగా పలికినాడు - "కాని తాను అభినందనపాత్రురాలు కాదని ఆమె నాతో అన్నది. తన విజయం పట్ల ఆమెకు గర్వంకాని, ఆనందంకాని కలుగలేదు. ఇది నా కాశ్చర్యం కలిగించింది. తన విజయ మామెకు దుఃఖకారణమైంది."

బీజగుప్తుడు అల్పహాస మొనరించినాడు. ఆ హాసంలో ఒక కరుణాసాగరం నిక్షిప్తమై ఉంది - "నేను నీతో చెప్పానుగదా! ఆమె తన విజయాన్ని స్వీకరింపకపోవడమే ఆమె పరాజితురాలైందనే దానికి సూచకమని! "

‘‘తమ మాటల సారాంశాన్ని కొంతకొంతగా అర్థం చేసికొంటున్నాను.’’

"కొంతకొంతగా అర్థమైందనేది అర్థవంతంగా లేదు. ఐతే పూర్ణంగా అర్థం కావాలి లేకుంటే అసలే కాగూడదు.’’- అంటూ బీజగుప్తుడు లేచి నిలబడి అన్నాడు. "శ్వేతాంకా! గుర్తుంచుకో! మానవునికి స్వతంత్రవిచారసామర్థ్యమున్నాగాని అతడు పరిస్థితుల ప్రభావానికి దాసుడౌతాడు. మఱి ఈ పరిస్థితులచక్రం పూర్వజన్మకర్మఫలితం. పరిస్థితుల చక్రంలో పడిపోయి భ్రమించకుండా కర్తావ్యాకర్తవ్యవిచక్షణతో ఆ పరిస్థితుల నధిగమించినప్పుడే మనిషికి విజయం చేకూరుతుంది. చిత్రలేఖ పరిస్థితుల చక్రంలో పడిపోయింది; ఆమె కుమారగిరి జీవితంలో ప్రవేశించడం కుమారగిరికి హానికరం, కుమారగిరి ఆమె జీవితంలో ప్రవేశించడం ఆమెకు హానికరం. దౌర్భాగ్యవశాత్తూ అప్రయత్నంగా వారొకరి జీవితంలో మఱొకరు ప్రవేశించి పరస్పరసాధనలను భ్రష్టం చేసికొంటున్నారు - భగవంతుడే వారికింక దిక్కు!"

౮

మహాసాగరంలోపెనుతుఫాను రేగేందుకు ముందుగాఘోరనిస్తబ్ధత క్రమ్ముకొంటుంది. అప్పుడు వాయుమండలమంతా ఉత్తేజితమౌతుంది, రాబోయే విప్లవాన్ని సూచిస్తున్నట్లుగా వాతావరణం చలనరహితమౌతుంది. మఱి ఆతర్వాత? ఝంఝానర్తనం, తరంగాల విలయతాండవం, విప్లవవిరావం!

ఆకాశవక్షంలో అగ్నిపర్వతం బ్రద్దలయ్యేందుకు ముందుగా అశాంతిగర్భితమైన ప్రశాంతత విస్తరిస్తుంది, నీలంగా నున్న ఆకాశం ధూమలవర్ణం దాలుస్తుంది, కలుగబోయే వినాశానికి భయపడి స్తంభించినట్లుగా ఆకాశమంతా వాయుహీనమౌతుంది. మఱి ఆ తర్వాత? మహోగ్రాగ్నిజ్వాలలు, మహత్తరవినాశం!

చిత్రలేఖారథం బీజగుప్తుని గుమ్మం ముందాగింది. అది సంధ్యాసమయం. దినమందలి తీవ్రతరోష్మం కొంతగా శాంతించిన ఆ సమయంలో సామంతుల రథాలతో పాటలీపుత్రపు వీథులు సంకులంగా ఉన్నవి. పుష్పలావికలు పూలమాలలతో సామంతుల నలంకరిస్తున్నారు. సువాసితశీతలపానీయాలు ధనికయువతీయువకుల అధరాలను చవిచూస్తున్నాయి. ఎక్కడ జూచినా ఉల్లాసవిలాసాలు వెల్లివిరుస్తున్నాయి. రాజమార్గమంతా ఉత్సవపూరితమైనట్లుగా శోభిస్తున్నది. రత్నవ్యాపారులవిపణులలో రమణులు విహరిస్తున్నారు; తమలపు విపణులలో యువకులు తచ్చాడుతున్నారు. నాడా జనసమ్మర్దంలో బీజగుప్తుడుగూడ భాగస్వామియై ఉన్నాడు.

శ్వేతాంకు డా సమయంలో బయటికి వెళ్లే ప్రయత్నంలో ఉన్నాడు. అతని రథం బయట ఆయత్తమైంది, లోపల ఒక పరిచారకు డతని కాహార్యం తొడుగుతున్నాడు. ఇంతలో ప్రతీహారి వచ్చి చిత్రలేఖ బయట నిరీక్షిస్తున్నదని తెలిపాడు.

శ్వేతాంకుడు చకితుడైనాడు. అప్పుడు బీజగుప్తు డింట లేకపోవడం అతనికి చెడుగా దోచింది. ఇంతవఱకే అతడు పాపం చేశాడు, ఇప్పుడు మఱికొంత చేయవలసివస్తుందేమో! దీని కతడు సిద్ధంగా లేడు. ఐనా ప్రతీహారితో త్వరగా వస్తున్నానని చెప్పమన్నాడు.

శ్వేతాంకుడు బయటికి వచ్చాడు. అతడప్పుడు చాలా సుందరంగా ఉన్నాడు. "ఏమి ఆజ్ఞ దేవీ!" - అన్నాడు.

చిత్రలేఖ ఎప్పటివలె నవ్వుతూ పలికింది - "బీజగుప్తునితో కలిసేందుకు వచ్చాను. బహుశః వారింట లేరనుకుంటా!"

శ్వేతాంకుడు కూడ నవ్వుతూ "మీ అనుమానం సరియైనదే" - అన్నాడు.

"ఐతే నీతో కలియాలనుకొంటున్నాను."

"దాసుణ్ణి చాలా అనుగ్రహిస్తున్నారు. ఈ దాసు డెప్పుడూ మీ సేవాతత్పరుడే!"

"అదేమీ అక్కఱ లేదు. నేడెందుకో మనస్సు వికలంగా ఉన్నది. జనసమ్మర్దంలో ఆ మనస్సును కొంతగా శాంతింపజేయాలనుకొని తిరుగడానికి బయలుదేరాను, బీజగుప్తుడు లేకుంటే లేకపోయె, నీవైతే ఉన్నావుగదా!"

"సరే మంచిది." - అంటూ శ్వేతాంకుడు తన రథంవైపు మొగ్గాడు. చిత్రలేఖ అతని హస్తాన్ని గ్రహించి , "లేదు. నీవు నా రథంలో రావలె" నన్నది.

మంత్రముగ్ధునివలె శ్వేతాంకు డామె రథంలో కూర్చొని కళ్లెములు చేతగొని రాజమార్గంవైపు నడిపించాడు. రాజమార్గం వస్తూనే చిత్రలేఖ ఆ కళ్లెముల గ్రహించి నడుపసాగింది. గుఱ్ఱాలు సగర్వంగా ముఖాలెత్తుకొని చకచకా పదవిన్యాసం చేయసాగినవి. బహుశః వాటికి తెలిసిపోయిందేమో పాటలీపుత్రమందలి సకలసామంతులను కనుసైగమాత్రంచేత నర్తింపజేసే నర్తకిచేతుల్లో కళ్లెములున్నవని! అవికూడ చకచకా నర్తిస్తూ పురోగమించినవి. ఆమె రథాన్ని చూచి గొప్పగొప్ప సామంతుల రథా లాగిపోయినవి, ప్రజలామె కభివాదం చేస్తూ ప్రశంసించినారు. శ్వేతాంకు డామెతో ఉండటాన్ని చూచి కొందఱు వ్యంగ్యంగా భాషించినారు. కాని చిత్రలేఖ వారిమాటలకు నవ్వుకొని, ఆమాటలను పరిగణింపలేదు.

అప్పుడు చిత్రలేఖాతనువు పూలహారాలతో నిండియుండెను. చూచిన సామంతులందఱూ ఆమెవైపు పూలమాలలను విసరివేస్తుంటే, వానిని ధరించి వారి నామె కృతార్థులను చేసింది. ఆమె సాక్షాత్తు పార్వతివలె ప్రకాశించింది. జనులందఱూ ఆమెకు సన్మానం చేస్తు న్నారు; ఆమె ముందర శిరమును వంచి ఆమెను పూజిస్తున్నారు. సమస్తరాజమార్గం ఆమెను సత్కరించుటకే సమాయత్తమైనట్లుగా సంశోభించింది!

ఆమె రథాన్ని ఆపి ఒక నవయువకునితో మాట్లాడుతున్నది. అప్పుడు మఱొకవైపునుండి ఒకరథం వచ్చి ఆమె రథం చెంత ఆగింది. ఆ రథంవైపు చూచేసరికి హసన్ముఖుడైన బీజగుప్తుడు సాక్షాత్కరించినాడు.

"నేడు రాజమార్గంలో చిత్రలేఖను చూడడం ఆశ్చర్యకరంగా ఉన్నది!"

"నేడు ప్రాసాదంలో బీజగుప్తుణ్ణి చూడలేకపోవడం ఆశ్చర్యకరంగా ఉన్నది!"

ఉత్తరం, ప్రత్యుత్తరం - రెంటిలోను గూఢరహస్యం దాగి ఉన్నది. ఈ సంగతి ఇద్దఱూ గ్రహించినారు. అంతలో శ్వేతాంకుడు రథంనుండి దిగిపోయినాడు. "చిత్రలేఖకు ఇక్కడే ఆహ్వానం పలుకుతున్నాను. ఇది అనంగీకార్యం కాదనుకుంటా!" - బీజగుప్తు డామె నాహ్వానించినాడు. "నేను సహర్షంగా స్వీకరిస్తున్నాను" - ఆమె ప్రతివక్కింది.

అది సంధ్యాకాలచరమదశ. రాజమార్గంలో సాయంకాలదీపకాంతి ప్రసరిస్తున్నది. బీజగుప్తుడు తన రథంనుండి దిగి చిత్రలేఖా రథంలో ఉపవిష్టుడై కళ్లెములను చేపట్టాడు. శ్వేతాంకుడు బీజగుప్తుని రథాన్ని నడిపాడు. రెండురథాలూ బీజగుప్తుని ప్రాసాదం వైపు మళ్లినవి.

బీజగుప్తు డన్నాడు - "నీవు వచ్చినప్పుడు నేనింట లేకపోవడం నాకు విచారకరంగా ఉంది".

చిత్రలేఖ నవ్వుతూ అన్నది - "విచారంతో పని లేదు. నేను వేళ కాని వేళ వచ్చాను. మీరు భవనంలో లేకపోవడం స్వాభావికమే." ఇద్దఱూ మఱోమాటలేక కొంతసేపు మౌనంగా ఉన్నారు. ఆ తర్వాత బీజగుప్తు డారంభించినాడు - "చాలానాళ్లనుండి నా మనస్సు ఉద్విగ్నంగా ఉన్నది. దీనికి కారణం చెప్పలేకుండా ఉన్నాను. కాని చిత్రలేఖా! చాలా నాళ్ళనుండి నీవిక్కడికి రావడం లేదు. దీనికి కారణం?"

చిత్రలేఖ మొగమెత్తి చూచి పలికింది - "కారణమా? రావడానికి ఇష్టంలేదు, అందుచేత రాలేదు."

బీజగుప్తు డా జవాబు నాశింపలేదు. ఆమె ఇంకేదో కారణం చెప్తుందనుకున్నాడు; కాని ఈవిధంగా కుండ బ్రద్దలు కొట్టినట్లు ఆమె యథార్థాన్ని పలికే సరికి అతనికి ఆశ్చర్యమూ, కించిత్క్రోధమూ కలిగినవి; క్రోధం తనపై తనకే కాక చిత్రలేఖపై కూడ కలిగింది. "రావడానికి ఇష్టం లేదా? దీనికి కారణం తెలుసుకునే అధికారం నాకుందా?" - బీజగుప్తు డడిగినాడు.

చిత్రలేఖ బీజగుప్తుని ముఖంవైపు చూచింది. అతని ముఖంలో దృఢత్వం, గాంభీర్యం ప్రతిబింబిస్తున్నాయి; క్రోధముద్రతో, ప్రభుతా గాంభీర్యం ముడివడింది. చిత్రలేఖ ముఖ మెఱ్ఱబడింది. ఐనా ఆమె భావగోపన చేస్తూ పలికింది - "అధికారమా? ఇంతమాత్రం నాకు తెలియదు. ఒక మనిషికి మఱొక మనిషిపై ఏమధికారముంటుందో నాకర్థం కాదు. ఐనా కారణం కావాలంటే వినండి. ఈరోజుల్లో ఏదో విషయాన్నిగుఱించి నాచిత్త ముద్విగ్నమౌతున్నది; తత్కారణంగా నన్ను నేనే కాక నా వారినీ మఱచిపోతున్నాను."

అప్పటికి రథం బీజగుప్తుని ద్వారంముందు వచ్చి ఆగింది. శ్వేతాంకుడు తన రథాన్ని దిగి చేయూత నిచ్చి వారిద్దరినీ రథంనుండి దింపినాడు. ముగ్గురూ బీజగుప్తుని కేళీగృహంలో ప్రవేశించినారు. ఆ తర్వాత శ్వేతాంకు డక్కడనుండి నిష్క్రమింపజూచినాడు. నిష్క్రమించే శ్వేతాంకుణ్ణి చూచి బీజగుప్తు డన్నాడు - "శ్వేతాంకా! ఉండు. నీవు వెళ్లవలసిన అవసర మేమీ లేదు." కాని చిత్రలేఖ బీజ గుప్తునితో అన్నది - "కాదు. శ్వేతాంకు డిక్కడ ఉండవలసిన అవసర మేమీ లేదు."

"శ్వేతాంకు డిక్కడ ఉంటే వచ్చే హాని ఏమీ లేదు" - అంటూ బీజగుప్తుడు నవ్వాడు - "పోతే శ్వేతాంకునికే ఇందులో కొంత లాభ ముంది. అనుభవశూన్యుడైన వీనికి బహుశః కొంత అనుభవం కూడ కలుగుతుందేమో!" శ్వేతాంకు డాగిపోయినాడు. మదిరను తెమ్మని బీజగుప్తు డతనికిసైగ చేసినాడు.

ఆ పనికి శ్వేతాంకుడు బాగా అలవాటు పడ్డాడు. సురాచషకాలను బీజగుప్తుని ముందు, చిత్రలేఖ ముందుంచి, తానూ స్వయంగా ఒక చషకాన్ని తీసికొని వారికి కొంచెం దూరంగా కూర్చున్నాడు.

బీజగుప్తు డారంభించినాడు - "ఆ! ఇప్పుడే అన్నావు ఏదో ఉద్విగ్నత నిన్నూ, మమ్మూ విస్మరింపజేస్తున్నదని. ఇట్లు విస్మృతిని కలిగించే ఉద్విగ్నతాస్వభావం విచిత్రంగా ఉన్నది."

చిత్రలేఖ నవ్వింది. "ఐతే బీజగుప్తులు నామనఃప్రవృత్తిని విశ్లేషించే బాధ్యత నాపై మోపుతున్నారు."

"లేదు, బాధ్యత మోపడం లేదు గాని, దీని ఆంతర్యం నాకు తేటపడాలని ప్రార్థిస్తున్నాను."

"బీజగుప్తు లావిధంగా ప్రార్థిస్తున్నారంటే, వారికిది విదితం చేస్తున్నాను - ఇది అసాధారణ మైన ఉద్విగ్నత, దీనికి కారణం కూడ అసాధారణమైనదే. ఇంతకంటె ఎక్కువ చెప్పడానికి చిత్రలేఖ అసమర్థురాలు!"

బీజగుప్తుడు శ్వేతాంకుని వైపు చూచినాడు. శ్వేతాంకుడు మౌనంగా వారి సంభాషణను వింటున్నాడు. "చిత్రలేఖ అసమర్థురాలు!" - బీజగుప్తుడు మెల్లగా అన్నాడు - "మన యిద్దటి పరిచయమైనప్పటినుండి చిత్రలేఖ కిప్పుడు తొలిసారిగా బీజగుప్తునినుండి మాట దాచ వలసిన అవసరమేర్పడింది. చిత్రలేఖాహృదయం మారిపోయిందని నాకొక్కింత శంక కలుగుతూ ఉంది."

మదిరాప్రభావం వారిపై పడజొచ్చింది. రెండవ మదిరాచషకాన్ని నోటికి జేరుస్తూ చిత్రలేఖ పలికింది - "ఈ పరివర్తనాత్మకమైన ప్రపంచంలో మార్పుజెందడం దేనికీ అస్వాభావికం కాదు."

చిత్రలేఖ ఈవిధంగా జవాబిస్తుందని బీజగుప్తు డనుకోలేదు. అది వినేసరికి అతనికి స్తంభించినంత పనైంది. అతడు మళ్లీ అడిగాడు - "ఈ పరివర్తనాత్మకప్రపంచంలో మార్పు జెందడం దేనికీ అస్వాభావికం గాదా? ఐతే చిత్రలేఖప్రేమకూడ మారుతుందనుకుంటాను."

చిత్రలేఖ అన్న మాటల కామెకే పశ్చాత్తాపం కలిగింది. ఉత్తరత్రా కలిగే పరిణామాలను వివక్షించకుండా, అనాలోచితంగా ఆవేశంలో తానన్న మాటలకట్టి ఘోరమైన ప్రశ్నలుత్పన్నమౌతాయని ఆమె అనుకోలేదు. ఐనా ఆమె మళ్లీ సాహసం చేసింది - "లేదు. బీజగుప్తుని అనుమానం మిథ్య. చిత్రలేఖ ప్రేమ సాగరంవలె లోతైనది, అది మారడం అసంభ వమే. ఐతే ప్రేమ అనేది పరివర్తనశీలమనీ, అట్లు పరివర్తనచెందడం సరియైనదే అని నా అభిప్రాయం. పరివర్తన ప్రకృతినియమం, ప్రేమ ప్రకృతియొక్క అనుభావం. అందుచేత ప్రకృతి నియమంప్రేమకుగూడ వర్తిస్తుంది."

ఆమె అన్నది కటువుగానే ఉన్నా, అది చాలామట్టుకు సత్యమే అని బీజగుప్తునికి తోచింది. వారు పరస్పరం దూరమౌతున్నట్లుగా అతని కనిపించింది. ఏదో అజ్ఞాతశక్తి వారిర్వురి మధ్య నొక అగాధాన్ని సృష్టిస్తున్నట్లున్నది!

"చిత్రలేఖా! మరుస్తున్నావా? అనురాగానికి ఆత్మతో సంబంధం కాని ప్రకృతితో గాదు. ప్రకృతితో సంబంధముండేవి వాసనలు. వాసనలు బాహ్యసంబంధం గలవి. భగవద్దత్తమైన సుందరవిగ్రహాన్ని ఆకాంక్షించేవి వాసనలు. కాని అనురాగం ఆత్మీయమైనది, శారీరకమైనది కాదు. పరివర్తన ప్రకృతిధర్మమే కాని ఆత్మధర్మం కాదు. ఆత్మీయసంబంధం అమరంగా ఉంటుంది."

చిత్రలేఖ నవ్వసాగింది - "ఆత్మీయసంబంధం అమరం! బీజగుప్తులు చాలా విచిత్రంగా మాట్లాడుతున్నారు. "జాతస్య మరణం ధ్రువం" - ఏదైన అమరంగా ఉన్నదంటే అది జన్మరహితంగానే ఉండవలెను. సృష్టితోడనే ప్రళయమున్నది. ఆత్మకు జననమరణాలు లేవు - అందుచే అది అమరమైనది. కాని అనురాగం (ప్రేమ) జన్మరహితమైనది కాదు. ఏదో ఒక వ్యక్తిపైప్రేమ కలుగుతుంది. అప్పు డా వ్యక్తితో సంబంధ మేర్పడుతుంది. అంటే ఆత్మీయసంబంధ మనేది జనిస్తుంది. కాని ఈ సంబంధం అనంతమైనది కాదు. ఎప్పుడో ఒకసారి అది అంతం కావలసేవస్తుంది. అనురాగానికి, వాసనల కింతే భేదం - వాసనలు ఉన్మాదమూలకములు - క్షణికమైన ఉన్మాదం నశిస్తూనే దానితోబాటు వాసనలుగూడ నశిస్తాయి. కాని అనురాగ మనేది గభీరమైనది. దాని అస్తిత్వం క్షణికం కాదు, దీర్ఘకాలికం. అందుచేత ఆత్మ అమర మైనంతలో ఆత్మీయమైన సంబంధం అమరం కాదు."

ఆమె తర్కజ్ఞానం మితిమీరినట్లుగా బీజగుప్తునికి తోచింది. ఈ ప్రయత్నంకూడ అతనికి నిష్ఫలమైంది. అతడు కలవరపడి లేచినాడు. "నీవు చెప్పేది సరిగానే ఉండవచ్చు. దానితో నాకు విరోధం లేదు. కాని నేను విశ్వసించే ఈ మాటను చెప్పడం అనుచితం కాదనుకుంటా - ఉన్మాదానికి, జ్ఞానానికి మధ్య ఉండే అంతరమే వాసనానురాగాలకు మధ్య ఉంటుంది. ఉన్మాదం సంచారిభావరూపం, జ్ఞానం స్థాయీభావరూపం. కొన్నిక్షణాల పాటు జ్ఞానం లోపించవచ్చు, కాని అది నశింపదు. ఉన్మాదం విజృంభించినప్పుడు జ్ఞానం లోపించినట్లుంటుంది, కాని అది తగ్గగానే జ్ఞానం యథాపూర్వం ప్రకాశిస్తుంది. ఒకవేళ జ్ఞానం అమరం కాకుంటే ప్రేమకూడ అమరం కాదు. కాని జ్ఞాన మమరమని, అది భగవదంశమనీ నా నమ్మకం - అట్లేప్రేమ కూడ."

చిత్రలేఖ అప్పుడు నిద్రాళువైంది. ఆమె కన్నులు సగం మూతపడసాగినవి. ఆమె సుందరవదనంలో ఉన్మాదం నర్తనం చేస్తున్నది. ఆమె లేచి కూర్చొని అన్నది - "బీజగుప్తులవారు సరిగానే చెప్తున్నారు. నేను భ్రమలో పడ్డాను. ఈ భ్రమావరణంలో నన్ను నేనే మరచి పోయాను. క్షమించాలి" - అంటూ ఆమె బీజగుప్తుని ఆలింగనం చేసికొన్నది.

శ్వేతాంకు డది చూచి లేచి నిలబడ్డాడు. బీజగుప్తు డన్నాడు - "శ్వేతాంకా! నీవింక వెళ్లవచ్చు."

౯

ఆర్యశ్రేష్ఠుడు మృత్యుంజయుడు జన్మచేత క్షత్రియుడైనా కర్మచేత బ్రాహ్మణుడు. పాటలిలోని ఆ వయోవృద్ధసామంతుని ఇంటిలో ఉల్లాసవిలాసాల కుద్వాసన, వైరాగ్యాని కుపాసన! ప్రజలతణ్ణి జనకమహారాజుతో పోల్చేవారు - దాని కత డర్హుడుకూడ. అతని పేరు నగరవాసు లందఱికీ తెలుసు - అతనితో సరితూగే వ్యక్తు లానగరంలో అరుదు. నిరంతరకేళీకోలాహలమయమైన జనసమ్మర్దానికి దూరంగా, ఏకాంతంలో నతడు ధ్యానోపాసనాపరుడై కాలం గడిపేవాడు.

ఏకాంతవాసియైన ఆ క్షత్రియుడు ధనవంతుడు, వైభవపూరితుడు గూడ. పట్టణంలోని ప్రముఖసామంతులలో అతనికి పలుకుబడి, రాజాస్థానంలో ఉచ్చస్థానమూ ఉండేవి. అతని పేరు విన్నచో ప్రజలు ఆదరంతో తలవంచేవారు; అతనిని ప్రత్యక్షంగా చూచినవారి కతనిపై భక్తిభావం పెల్లెగసేది. అతని సాధన గొప్పది, అతనిలో ఆత్మబలం, ఆధ్యాత్మికప్రజ్వలనం ఉన్నవి.

అతనికి పుత్రులు లేరు; ఒక కూతురుమాత్ర మున్నది. ఆమె పేరు యశోధర. ఒకే ఒక సంతానం కావడంవల్ల ఆమెపై మృత్యుంజయునికి మక్కువ ఎక్కువ. అప్పుడు యశోధరాప్రాయం పదునెనమిదేండ్లు. ఆమెకది యౌవనవికాసకాలం, అతని కేమో అది జన్మవిరమణకాలం. అఖండైశ్వర్యానికి వారసురాలైన ఆమె కరగ్రహణానికి ప్రతియువకుడూ ఉవ్విళ్లూరడం సహజమే; దానికితోడుగా ఆమె సుందరి, ఆ సౌందర్యంకూడ సామాన్యమైనది కాదు, ఉచ్చకోటికి చెందినది. ఆమె శాంతముఖమండలంలో అమాయకత్వం ఆధిపత్యం వహిస్తున్నది; ఆమె మధురఝుంకారంలో యౌవనంచేత పరాజితమైన బాల్యం శరణ్యం పొందింది. ఆమె విశాలహరిణనయనాలలో అలసత్వం, ఆమె అరుణకపోలాలలో లజ్జ ప్రతిబింబిస్తున్నవి. ఆమె యౌవనం ఉల్లసామృతాల సంగమక్షేత్రం. అది గర్వమిళితమైన ఉచ్ఛృంఖలతకు దూరం, లజ్జామిళితమైన శాంతికి స్థానం.

వృద్ధుడైన మృత్యుంజయుడు యశోధరకై వరాన్వేషణ చేస్తున్నాడు. ఉన్నట్టుండి అతని దృష్టి బీజగుప్తునిపై పడింది. బీజగుప్తుని కింకా వివాహం కాలేదు; అతడు కులీనుడైన నవయువకుడు. మృత్యుంజయుని హితైషులు, ఆ హితైషులలో యశోధరను తమ కోడలుగా జేసికొననెంచిన కొందఱు వ్యక్తులూ, బీజగుప్తునికి, చిత్రలేఖకు గల సంబంధాన్నిగుఱించి అతనికి వివరించినారు. కాని అనుభవజ్ఞుడూ, వయోవృద్ధుడూ ఐన మృత్యుంజయుడు ప్రతిసారీ వారికొకే ఉత్తరమిచ్చినాడు - "ఇది బీజగుప్తుని ఉన్మాదదశ. భవిష్యత్తు సుదీర్ఘమైనది. దాని కతడు సుశిక్షితుడుగా నున్నాడు. ఇప్పు డత డనుభవసాగరంలో ఈదుతున్నాడు."

ఆరోజు బీజగుప్తుడు మృత్యుంజయుని యింటికి ఆహ్వానితుడైనాడు. నాడు యశోధర పుట్టినపండుగ. ఆ ఉత్సవం మృత్యుంజయుని యింట వైభవంగా జరుగుతున్నది. బీజగుప్తు డంతకు ముందొకటిరెండుసార్లు యశోధర కేవలం బాలికగా నున్నప్పు డామెను చూచినాడు. అతనికి మృత్యుంజయునితో అంతగా పరిచయం లేదు. అందుచేత మృత్యుంజయుని ఆహ్వానంపట్ల అతని కాశ్చర్యమైంది - ఆ ఆశ్చర్యం ఇనుమడించింది, చిత్రలేఖాసహితంగా తా నాహూతుడైనాడని తెలిసే సరికి!

బీజగుప్తుడు చిత్రలేఖతో అన్నాడు - "చిత్రలేఖా! ఇదొక వింత. నీకు వయోవృద్ధుడు మృత్యుంజయుడు తెలుసునుగదా!"

"ఔను!"

"అతని కూతురు యశోధరను కూడ ఎఱుగుదువేమో!"

కొంచె మాలోచించి చిత్రలేఖ చెప్పింది - " ఆ... ఆమెను కూడ ఒకటిరెండుసార్లు చూచినాను."

"యశోధర పుట్టినపండుగకు నన్ను మృత్యుంజయు డాహ్వానించినాడు. అతనితో నా కధికపరిచయం లేదు. ఐనా నన్నా హ్వానించడం నా కాశ్చర్యకరంగా ఉంది. ఇంతకంటె ఆశ్చర్యమేమంటే నిన్నుకూడ ఆహ్వానించినాడు, ఆ ఆహ్వానాన్ని నా ద్వారా నీ కంపినాడు. "

"దీని కర్థం నేను వెళ్లడ మనుచితమని!"

"కాదు చిత్రలేఖా! నీవూ నాతో రావాలని నాద్వారా ఆహ్వానం పంపినాడు. ఇది ఉచితంగానే ఉంది, ఎందుకంటే సమాజం మన యిద్దరి సంబంధాన్ని పవిత్రంగా భావిస్తున్నది కనుక."

చిత్రలేఖ కొంతసేపు మౌనం వహించి మళ్లీ అన్నది - "ఉన్నతకులాల వారిండ్లలోని ఉత్సవాలకు కేవలం నర్తకిగానే వెళ్లడం అలవాటు నాకింతవఱకు. ఇప్పుడు మీతో వెడితే కులీనస్త్రీలు నన్నవమానం చేయవచ్చు. అట్లవమానపరిస్తే ఏం చెయ్యాలో నాకు తెలియడం లేదు."

బీజగుప్తుడు నవ్వాడు - " నాతో నున్నప్పుడు నిన్నవమానం జేసే సాహస మెవ్వరికీ ఉండదు. ఇది మాత్రం నమ్ము!" - అంటూ శ్వేతాంకుణ్ణి పిలిచాడు.

రథంపై ముగ్గరూ బయలుదేరినారు. బీజగుప్తుని రథంలో చిత్రలేఖాబీజగుప్తులు కూర్చున్నారు. శ్వేతాంకుడు సారథ్యం వహించినాడు. నిర్ణీతసమయానికి వారు మృత్యుంజయుని ప్రాసాదాన్ని చేరుకొన్నారు. ప్రతీహారి వారిరాకను మృత్యుంజయునికి విన్నవించినాడు. యశోధరతోసహా మృత్యుంజయడు ద్వారంకడకు వచ్చినాడు. మృత్యుంజయుడు బీజగుప్తునికి, యశోధర చిత్రలేఖకు స్వాగతం పలికినారు. వారికి వెనుకగా శ్వేతాంకుడు నడచినాడు.

ద్వారం దాటి వారు నృత్యమందిరంలో ప్రవేశించినారు. బహుశః పాటలీపుత్రమందలి ప్రభావశాలురైన వ్యక్తులందఱూ అక్కడ సమావేశమైనారు. వారందఱూ చిత్రలేఖాబీజగుప్తులను చూచి హర్షధ్వానాలు చేసినారు. చిత్రలేఖ యశోధరతో బాటు స్త్రీసముదాయంలో కూర్చున్నది. బీజగుప్తుడు మృత్యుంజయునితోడనే ఉండిపోయాడు.

యశోధరను చూచి చిత్రలేఖ ఆశ్చర్యచకితురాలైంది. ఆమెకింతవఱకు తనసౌందర్యం పైననే గర్వం, ఆత్మవిశ్వాసం ఉండేవి. కాని యశోధరారూపం ఒక్కక్షణంలో ఆ గర్వాన్ని ఖర్వం చేసింది. ఆత్మవిశ్వాసాన్ని అల్పం చేసింది. యశోధర ఆదరపూర్వకంగా చిత్రలేఖ కాసనం చూపించి, ఆమె ప్రక్కనే తాను కూర్చొన్నది. చిత్రలేఖ కంత గౌరవం చూపిస్తూ, ఆమె ప్రక్కనే యశోధర కూర్చొనియుండడం ఇతరస్త్రీలకు క్రోధకారణమైంది.

బాల్యంలో యశోధర చిత్రలేఖానృత్యా న్నొకసారి చూచింది. ఆ నృత్యంచేత ఆమె ప్రభావితురాలైంది. ఈరోజు చిత్రలేఖతో నుండుమని మృత్యుంజయు డామె నాదేశించినాడు. ఈ ఆదేశం ఆమె కిష్టమైంది.

చిత్రలేఖ చుట్టూ యువతులు గుమిగూడినారు. వారిలో కొందఱు నవ్వుకొన్నారు; మఱికొందఱు వ్యంగ్యంగా మాట్లాడినారు. కాని చిత్రలేఖ కది చెడుగా అనిపించలేదు. తన స్థితి ఆమెకు బాగుగా తెలుసు. ప్రక్కనే నిలబడియున్న ఒక గొప్ప సామంతస్త్రీ ఆమెను చూచి అన్నది - "ఈరోజు చిత్రలేఖ మన సమానంగా మన సమాజంలోనికి రావడంపట్ల అభినందనలు!"

ఆ కటువైన మాటకు జవాబుకూడ అంతకంటే కటువుగా వచ్చింది - "తన సౌందర్యబలంచేత, తనకు స్వాగతం పల్కడానికి కులీన మానినులను బాధ్యులనుగా చేసిన ఆ స్త్రీని అభినందించవలసిన అవసర మెంతమాత్రమూ లేదు."

ఒకరి ముఖాన్ని మఱొకరు, వారి ముఖాన్ని ఇంకొకరు చూచుకొన్నారు. ఈ విధంగా పైమాటలలోని తీవ్రత స్త్రీ సమాజంనుండి పురుషసమాజానికి పాక్కింది. బీజగుప్తు డటువైపు తిరిగి చూచినాడు. చిత్రలేఖ కవమానం కల్గుతుందేమో అని అతడు ముందుగానే భయపడ్డాడు. ఈ ఉత్తరప్రత్యుత్తరాలవల్ల అతనిభయం తీవ్రతరమైంది. "ఏమౌతున్నది?" - అత డరచినాడు.

క్రోధంతో జేవురించిన చిత్రలేఖాముఖ మొక్కసారిగా శాంతమైంది - "ఏమీ లేదు. మా మధ్యలో వేళాకోళాలు! " - ఆమె నవ్వుతూ జవాబిచ్చింది.

చిత్రలేఖాముఖభావపరివర్తనకు యశోధర విస్తుపోయింది. బీజగుప్తుడు ప్రక్కకు వెళ్లిన తర్వాత ఆమె అన్నది - " సోదరీ! నీవు లౌకిక వ్యవహారాల్లో చాలా కుశలురాలవు!"

"అందుకొఱకే నేనింతటి ప్రభావవంతురాలను! " - చిత్రలేఖ నవ్వింది.

ఆమె నవ్వు అందఱికీ వినపడింది. నవయువకసమాజం చూపు లామెవైపు ప్రసరించినవి. అదే సమయంలో ఆ నవయువకులు బీజగుప్తుని గాన మాలపించమని కోరినారు. వీణను చేత గొని బీజగుప్తుడు బాగీశ్వరీరాగంలో ఆలాప మారంభించినాడు. నలుదిక్కులా నిశ్శబ్ద మావరించింది. స్త్రీపురుషులందఱూ మంత్రముగ్ధులవలె బీజగుప్తుని గానాన్ని వింటున్నారు. బీజగుప్తుడు గానాన్ని సమాప్తం చేసినాడు. ఆతర్వాత మృత్యుంజయుడు వీణను చేగొని యశోధరకుసైగచేసినాడు. యశోధరకూడ బాగీశ్వరినే ఆలపించింది. ఆ గానం విన్నవారికి బీజగుప్తునికంటె ఆమెగానం పేలవంగా ఉన్నట్లు తోచింది. చిత్రలేఖ వారి ముఖభావాలను పఠించి అన్నది - "యశోధర కిష్టమైతే కల్యాణిలో ఒక పాటను పాడమని నేను ప్రార్థిస్తున్నాను."

అందఱి దృష్టి చిత్రలేఖవైపు ప్రసరించింది. మృత్యుంజయుడు చిత్రలేఖవైపు చూచినాడు. ఆమె మాటలలోని ఆంతర్య మతనికి అర్థం కాలేదు. ఐనా ఆ ప్రార్థన ఆహూతురాలైన అతిథి ముఖతః వచ్చినదగుటచేత అతడు వీణపై కల్యాణీరాగాన్ని వాయించినాడు. దాని కనువుగా యశోధర గాన మాలపింపసాగింది. ఆమె గానాని కందఱు ముగ్ధులైనారు. అందఱూ ముక్తకంఠంతో ఆమెను ప్రశంసింప సాగినారు. ఆమె గానం ముగిసిన పిమ్మట చిత్రలేఖ ఆమె సుందరగానమహిమకు అభినందనలు తెల్పింది. మృత్యుంజయునికి చిత్రలేఖా ప్రార్థనలోని ఆంతర్య మిప్పు డర్థమైంది - "చిత్రలేఖా! యశోధరాపక్షాన నీకు కృతజ్ఞతలు తెల్పుకొంటున్నాను" - అని అతడన్నాడు.

ఈ మాటలను బీజగుప్తుడు వింటూనే ఉన్నాడు. అతడు నవ్వుతూ అన్నాడు - "నే నిప్పుడు చిత్రలేఖ నామె నాట్యాన్ని ప్రదర్శింప మని ప్రార్థింపవచ్చా?"

చిత్రలేఖ నవ్వుతూ అన్నది - "బీజగుప్తుని ప్రార్థన నాకు ఆజ్ఞతో తుల్యమైనది."

మృత్యుంజయుడు వీణను, బీజగుప్తుడు మృదంగాన్ని గైకొన్నారు. చిత్రలేఖ నాట్య మారంభించింది. అందఱూ ఆమెను ప్రశంసిస్తు న్నారు. చిత్రలేఖ ఆమె కళాకౌశల్యాన్ని ప్రదర్శిస్తున్నది. ఇంతలో ప్రహరీదారుడు కుమారగిరి సశిష్యంగా ద్వారం ముందు వేచి ఉన్నాడని అరచినాడు.

మృత్యుంజయుడు వీణను విడనాడి, కుమారగిరికి స్వాగతమీయడానికి బయటికి వెళ్లినాడు. మృత్యుంజయుడు వీణను త్యజించి నప్పుడే చిత్రలేఖానాట్య మంతమైంది.

మృత్యుంజయుడు కుమారగిరికి స్వాగతమొనరించి అతనిని లోనికి గొనితెచ్చినాడు. అతనివెంట విశాలదేవుడుకూడ ఉన్నాడు. కుమారగిరిని చూచి అందఱూ లేచి నిలబడ్డారు. అప్పుడే చిత్రలేఖ బీజగుప్తునితో అన్నది - "నేనిప్పుడు వెళుతాను. నాకు కావలసినంత అవమానమైంది."

"అదెట్లాగు?"

"నా దృష్టిలో కళకు సర్వోత్కృష్టస్థాన మున్నది. కళ నవమానపరిచే మానవుడు మానవుడు గాదు - పశువు. కుమారగిరికి స్వాగతం పలుకడానికై మృత్యుంజయుడు నా నృత్యాన్ని అంతంచేయడం నాకవమానం కాక మఱేమిటి?"

బీజగుప్తుడు మందహాసం చేసి, "నీ ఇచ్ఛానుసారమే కానీయి" - అన్నాడు.

ఈలోపల కుమారగిరి ఆసీనుడైనాడు. చిత్రలేఖ ముందుకు సాగి కుమారగిరికి అభివాదం చేసి, మృత్యుంజయునితో అన్నది - "నేను నిర్గమించేందు కనుజ్ఞ కోరుతున్నాను."

మృత్యుంజయుడు ప్రతివల్కే లోపలనే కుమారగిరి అందుకొన్నాడు - "అట్లెందుకు? నే నిక్కడ ఉండుట నీకిష్టంగా లేదా నర్తకీ? ఇది నీకు స్వాభావికమే ననుకుంటా!" - కుమారగిరి శిశుప్రాయమైన కోమలమధురహాస్యం సంగీతంవలె నినదించింది.

చిత్రలేఖ కొంచె మాలోచించి అన్నది - "కాదు యోగీ! మీ ఉనికి ప్రపంచంలో ఎవ్వరికీ అనిష్టంగా ఉండదు. ఇంతమాత్రం నమ్మండి. నేనిక్కడనుండి వెళ్లడానికి మఱొక కారణముంది."

"కాని నీవు వెళ్ళాలనుకొనడం బాగుగా లేదు .."

"ఐతే నేను వెళ్లను!"

మృత్యుంజయుడు మళ్లీ వీణానాదం చేసినాడు. కాని చిత్రలేఖ తిరిగి నాట్యం చేయడానికి నిరాకరించింది. అప్పుడు యశోధర ముందుకు సాగి చిత్రలేఖతో అన్నది - "సోదరీ! నీ కోరికను నేను కాదనలేదు. ఇప్పుడు నీవు నాట్యంచేయాలని నేను కోరుకొంటున్నాను. నా కోరికను నీవు త్రోసిపుచ్చవని విశ్వసిస్తున్నాను."

చిత్రలేఖ యశోధరాభిమతాన్ని నిజంగానే కాదనలేదు. ఆమె మళ్లీ నృత్యారంభం చేసింది. యోగి కుమారగిరి యశోధరవైపు జూచినాడు - చూచినవా డట్లాగే ఆమె నేకాగ్రంగా కొంత సేపు చూస్తూ ఉండిపోయినాడు. అతడు యశోధరను చిత్రలేఖతో పోల్చసాగాడు. ఇద్దరూ ఉత్తమసౌందర్యరాశులే - కాని ఒకరిది సమ్మోహనకరసుందరరూపం; ఇంకొకరిది శాంతస్వరూపం. చిత్రలేఖామాదకత్వం భయానకం, ఆమె నృత్యం ఆ మాదకత్వానికి సజీవమైన మూర్తి; మఱి యశోధరాశాంతమూర్తిత్వం సముద్రంవలె గంభీరమైనది; అందులో విగాహం చేసిన వ్యక్తికది ఆత్మవిస్మృతి నాపాదిస్తుంది. చిత్రలేఖ జీవనసంక్షోభానికి ప్రతిమూర్తి; యశోధర జీవనాంతశాంతికి ప్రతిమూర్తి. ఇట్లు పోల్చుకునే యోగికి తాను సాంసారికాకర్షణకు లోనౌతున్నట్లనిపించింది. అనురాగంలోని సజీవత్వం విరాగంలోని అకర్మణ్యతపై విజయం సాధిస్తున్నట్లు తోచింది.

నాట్యం ముగిసింది. మృత్యుంజయుడు దాసి నడిగినాడు - "భోజనాని కెంత ఆలస్యముంది?"

"భోజనం సిద్ధంగా ఉంది. మీ ఆజ్ఞదే తడవు!"

అతిథులందఱూ భోజనశాలలో ఉపవిష్టులైనారు. దాసీలు బోజనం వడ్డింప నారంభించినారు. బీజగుప్తుని ప్రక్కన యశోధర కూర్చున్నది; ఆమె ప్రక్కన చిత్రలేఖ, చిత్రలేఖకు ప్రక్కన శ్వేతాంకుడు కూర్చున్నారు.

భోజన మారంభమైంది; దానితోబాటు భోక్తల ఇష్టాగోష్ఠు లారంభమైనాయి. అంతవఱకు యశోధర బీజగుప్తునితో మాట్లాడియుండలేదు. బీజగుప్తు డారంభించినాడు - "దేవీ! ఈనాడు తొలిసారిగా నీతో పరిపూర్ణంగా పరిచయమైంది. ఈ పరిచయసందర్భంగా నీ కభినందనలు తెల్పుతున్నాను."

జీవితంలో తొలిసారిగా యశోధరావిశాలహరిణనేత్రాలు అన్యవ్యక్తి నేత్రాలముందవనతములై పైకి లేవలేకపోయినవి. ఆమె హృదయం అదిరిపోయింది. ఆమె మెల్లగా జవాబిచ్చింది - "నా పరిచయ మంత గొప్పవిషయమేం కాదు."

ఆ మాటలను విని చిత్రలేఖ నవ్వింది - "భగవత్కృతమైన ఈ పరిచయం ప్రవృద్ధమై పరిణతంగాని! ఆ ప్రవృద్ధి జీవనంయొక్క పవిత్ర బంధానికి మూలంగాని!"

యశోధర కృతజ్ఞతాపూర్ణదృష్టులతో చిత్రలేఖను చూచింది; బీజగుప్తుడు కౌతూహలంతో ఆమెను చూచినాడు. కాని శ్వేతాంకు డేకాగ్రంగా యశోధరవైపు చూస్తూ ఉండిపోయినాడు. హఠాత్తుగా వారిద్దరి చూపులూ కలిసినవి. అంతవఱ కామె శ్వేతాంకుణ్ణి గమనించియుండలేదు. ఆహూతులైన వ్యక్తులందఱినీ ఆమె గుర్తించేది, కాని శ్వేతాంకుని విషయంలో మాత్రం అది సాధ్యపడలేదు. ఆమె బీజగుప్తు నడిగింది, "ఈ నవయువకు డెవ్వరు?"

"వీడు నా సేవకుడు, నాకు సతీర్థ్యుడు (ఒకే గురువు దగ్గర చదువుకొన్నవాడు) కూడ! " - బీజగుప్తుడు నవ్వినాడు. విచిత్రం! "సేవకుడు, సతీర్థ్యుడు!" యశోధర కాశ్చర్యమైంది. ఆమె కుతూహలంతో అడిగింది - "అదెట్లాగు?"

"అదెట్లాగంటే ఇతని పేరు శ్వేతాంకుడు. ఇతడు గూడ క్షత్రియుడు, ఉత్తమకులసంజాతుడు. కాని ఇంతవఱకు బ్రహ్మచారియై గుర్వాశ్రమంలో ఉన్నాడు. పాపస్వరూపం కన్గొనుటకు గురుపీతనిని నాచెంత నుంచినాడు. నాద్వారా ఈతడు సమాజంలో పాదార్పణం చేస్తున్నాడు."

యశోధర ఆశ్చర్య మినుమడించింది - "పాపస్వరూపం తెలుసుకొనడానికి ఇతని గురువీతనిని మీచెంత నుంచినాడా? నిజంగా మీ సంస్థానం, మీ వ్యక్తిత్వసంపర్కం పాప స్వరూపావిష్కరణ కనుకూలంగా ఉందా?"

బీజగుప్తుడు లోలోపల నవ్వుకొన్నాడు- ఎంత అమాయకురాలు, ఎంత భ్రమపూరితురా లా బాలిక! అతడన్నాడు - "పాపాత్ముని కతడు పాపాత్ముడని మనం చెప్పలేమనుకుంటా. ప్రతివ్యక్తీ తాను సమంజసుడననే అనుకుంటాడు. కాని తనను తాను తెలిసికొనడం వ్యక్తికి అసంభవం. ఒకవేళ శ్వేతాంకుడు నేను పాపినని నిర్ణయిస్తే నేను నిజంగా పాపినే!"

యశోధరకు హృదయం ప్రతిహతమైనట్లు తోచింది. ఏవ్యక్తియొక్క ప్రణయబంధానికై ఆమెహృదయం ప్రఫుల్లమైందో, ఆవ్యక్తి ఒక ప్రసిద్ధాచార్యునిచే పాపపరిశీలనపరికరంగా పరిగణింపబడ్డాడు. ఆమె శ్వేతాంకుని వైపు జూచింది - అతడెంత అమాయకుడైన సుందర నవయువకుడు! మఱి బీజగుప్తుడు?

ఇంతలో భోజనం పరిసమాప్తమైంది. అందఱూ లేచి నిలుచున్నారు. కరముఖక్షాళనం చేసికొని అందఱూ ఒకచోట సమావేశ మైనారు. బీజగుప్తుడు శ్వేతాంకుని హస్తాన్ని గ్రహించి, అతనిని మృత్యుంజయునికి పరిచయం చేసినాడు. ఆ తర్వాత అతిథులు గృహోన్ముఖులైనారు.

౧౦

మృత్యుంజయుని కళామయమైన భవనం కళకళలాడుతూనే ఉండిపోయింది. కాని అందులోని కోలాహలం మాత్రం తప్పకుండా తగ్గిపోయింది. అనావశ్యకులైన అతిథులందఱు నిష్క్రమించిన పిదప నాటకంలోని ప్రధానపాత్రధారులు మాత్రం మిగిలిపోయారు. అతిథులందఱిని సాగనంపి మృత్యుంజయుడు యోగి కుమారగిరిని, బీజగుప్తుని, శ్వేతాంకుని, చిత్రలేఖను మాత్రమే అక్కడ నిలుపు కొన్నాడు. కొంతసేపు మౌనంగా ఉండి, మృత్యుంజయుడు బీజగుప్తుని హస్తాన్ని గ్రహిస్తూ బరువైన కంఠస్వనంతో అన్నాడు - "సామంతబీజగుప్తా! ఈ ఉత్సవంలో ఒక నిగూఢమైన రహస్యం గుప్తమై ఉన్నది; ఆ రహస్యంతో నీకు గొప్ప సంబంధమున్నది" - అంటూ అర్థపూర్ణమైన దృష్టులతో యశోధరవంక జూచినాడు. బీజగుప్తుని ముఖవర్ణం మారిపోయింది, చిత్రరేఖ చిరునవ్వు చిందించింది.

"నాకు పరిపూర్ణమైన ఆశ ఉంది. నీకీ వృద్ధమృత్యుంజయుని మాట అనంగీకార్యం కాదని."

మృత్యుంజయుని మాటల సారాంశాన్ని అక్కడున్నవారందఱూ గ్రహించే ఉంటారు, ఐనా బీజగుప్తు డన్నాడు. "ఆర్యా! అంగీ కారము, అనంగీకారము అనేది ప్రస్తావనయొక్క ఉపయుక్తత, పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. మీ ప్రస్తావన ననుసరించి నా ప్రత్యుత్తర ముంటుంది."

కొంచెంసేపాలోచించి మృత్యుంజయు డడిగాడు - " బీజగుప్తా! నీకు వివాహమింకా కాలేదుగద!"

ఆమాట విని బీజగుప్తుడు చిత్రలేఖ వైపు జూచాడు. ఆ ప్రశ్నకేమి ప్రత్యుత్తర మీయవలెనో అతడు నిర్ణయించుకొనలేక పోయాడు. వివాహం కాని విషయం వాస్తవమే కాని, అతని మతం ప్రకారం అది యథార్థం కాదు. "శాస్త్రానుసారంగా నైతే కాలేదు" - అన్నాడు.

అప్పుడు కుమారగిరి గంభీరస్వరంతో అన్నాడు, "యువకా! శాస్త్రవిహితంగాని వివాహం కూడా ఉంటుందా?"

"స్త్రీపురుషుల చిరస్థాయిసంబంధాన్నే వివాహమంటారు" - అన్నాడు బీజగుప్తుడు.

కుమారగిరి నవ్వాడు. "కాని వివాహశబ్దం సమాజం ద్వారా నిర్మితమైనది. శాస్త్రం స్త్రీ పురుషుల మధ్య సంబంధాన్ని పవిత్రీకృతం చేసి, దానికి సమాజంలో మాన్యతను కల్పిస్తుంది. బీజగుప్తా! నీ వర్ధసత్యా న్నాశ్రయిస్తున్నావు."

బీజగుప్తుడుగూడ దానికి సమానమైన గంభీరస్వనంతోనే అన్నాడు - " యోగీశ్వరా! అర్ధసత్య మనేది ఉండదు. సత్యం పూర్ణంగానే ఉంటుంది. కాని తర్కవితర్కాల కిది సమయం గాదు. అందుచే దీని కిప్పుడు ప్రత్యుత్తరమీయడం భావ్యం కాదు" - అని మృత్యుంజ యుని వైపు తిరిగి అవనతదృష్టుడై అన్నాడు - " ఆర్యా! శాస్త్రానుసారంగానైతే వివాహం కాలేదన్నాను. దీని కర్థం వివరించవలసి యున్నది. లోకం దృష్టిలో నేను వివాహితుడను గాను; కాని నేను వాస్తవంగా వివాహితుడను. చిత్రలేఖ నా పత్ని. శాస్త్రరీత్యా నేను చిత్ర లేఖను పాణిగ్రహణమాడకున్నను, సమాజనియమాల ప్రకారం ఇట్లు చేయడం పొసగకున్నను, నాకూ,చిత్రలేఖకూ గల సంబంధం

పతిపత్నీసంబంధం వంటిది. నేను ప్రేమయందు విశ్వాసం గలవాడను. ఇట్టి స్థితిలో నా ప్రేమకు మఱొక స్త్రీని అధికారిణిగా జేసి పరిణయ మాడుట అసంభవం."

మృత్యుంజయుడన్నాడు - "బీజగుప్తా! నీవు చెప్పేది ఉచితమే కావచ్చు. కాని నిన్ను లోకం అవివాహితునిగా తలచిందంటే నీవు అవివాహితుడవే. ఇక వివాహవిషయమంటావా, ఈ విషయంలో ఈమాటను నీ దృష్టికి తేవాలనుకొంటున్నాను. సంతానోత్పత్తికి వివాహ మావశ్యకం. చిత్రలేఖాసంతానం బీజగుప్తుని సంతానం కానేరదు. అట్టి సంతానం బీజగుప్తునికి ఉత్తరాధికారిత్వం పొందజాలదు. ఈ విషయ మెప్పుడైనా ఆలోచించినావా?"

వాస్తవంగా బీజగుప్తు డీ విషయమై ఆలోచించలేదు. ఆమాట కతడేమీ జవాబీయలేదు. అతనికిది సరిక్రొత్త సమస్యగా తోచింది. మృత్యుంజయు డీసారి చిత్రలేఖ వైపు తిరిగి అన్నాడు - "దేవీ చిత్రలేఖా! నీవు విదుషీమణివి. నీతో అధికంగా చెప్ప నక్కఱ లేదు. నీవు బీజగుప్తుని అవస్థను చక్కగా అర్థం చేసికొనగలవుగదా!"

చిత్రలేఖ అంతవఱకు మౌనంగానే ఉండింది. కాని ఇప్పుడు జవాబిచ్చింది - "ఆర్యశ్రేష్ఠా! మీ కథన మన్నివిధాలా సముచితమైనదే. నేను సమాజచ్యుతురాలనైన నర్తకినే. బీజగుప్తునికి పత్నినగుట నా కసంభవం. ఈస్థితిలో బీజగుప్తునికి శ్రేయఃకరమైన పనిని చేయుటకు నేను సిద్ధంగా ఉన్నాను. ఐతే మీరు గ్రహించాలి దీనికై నేను మహాత్యాగం చేయవలసి ఉంటుందని..."

"మహాత్యాగం చేయవలెనా సుందరీ!" - కుమారగిరి చిఱునవ్వు దొరలించినాడు. "చాలా విచిత్రంగా చెప్తున్నావు. నీ మనఃప్రవృత్తిని మఱచి మాట్లాడుతున్నట్లున్నావు. నీవొక తూరి వైరాగ్యాన్ని స్వీకరింపగోరుతున్నానని నాతో అన్నావు గుర్తుందా? దానికై ఇది మంచి తరుణం. "

ఈ కుమారగిరి మాటలకు బీజగుప్తు డాశ్చర్యచకితుడైనాడు. అతడన్నాడు - "యోగీశ్వరా! మీరు వైరాగ్యమునందు విశ్వాసము గలవారై, వేఱొక వ్యక్తికి బంధవిముక్తిని కల్గించి వైరాగ్యోపదేశమును చేయగల్గినవారైనచో, నన్నెందుకు బంధములో నిరికించుటకు యత్నించుచున్నారు?"

"ఎందుకంటే నీవు వైరాగ్యమున కయోగ్యుడవు. అంతేకాక నీవు సమాజనియమాలకు ప్రతికూలంగా ప్రవర్తిస్తున్నావు. కనీసం సమాజనియమాలను పాటించుట నీకుచితం."

ఇంతవఱకు చిత్రలేఖ కుమారగిరి అన్న మాటలను గుఱించి ఆలోచిస్తున్నది. ఇప్పు డామె అన్నది -"యోగీ! మఱొక ప్రశ్న అడుగుతాను. నీవు నాకు గురుదీక్షను ప్రసాదించేందుకు సిద్ధంగా ఉన్నావా? అట్లైతే ఈక్షణమే నీ శిష్యురాలనౌతాను."

కుమారగిరి నేత్రాలు వాటంతటికవే విశాలదేవునిపై మూగినవి. విశాలదేవు డప్పుడు గురువుగారి వైపే చూస్తున్నాడు. కొంత సేపాలోచించి కుమారగిరి అన్నాడు - "నర్తకీ చిత్రలేఖా! నీకు దీక్షనొసగుట నాకసంభవం."

ఈసారి చిత్రలేఖ నవ్వుతూ అన్నది - "నోటితో చేస్తాననడం సులభం, కాని చేయటం బహుకష్టం. యోగీ! మీకు విరాగం తేలికే అనిపించవచ్చు. నాకుమాత్ర మది కఠినం. ఒంటరినై వైరాగ్యక్షేత్రంలో విచరించుట నాకసంభవ మనిపిస్తుంది. ఇంతవఱ కనురాగక్షేత్రంలో మెలగినాను. ప్రపంచం దీని నపవిత్రంగా భావించినా, నాదృష్టిలో, దైవదృష్టిలో అది పవిత్రమైనదే. దానినుండి వైదొలగుట దూషితక్షేత్రంలో పాదార్పణ మొనరించుటయే. అట్లొనరించి వ్యర్థపాప మొనరించుటకు నేను సిద్ధంగాలేను."

మాట కుదిరింది - అంతలో మాట చెదరింది. మృత్యుంజయుని కిది అనుభవమైంది.

మాట చెదరింది - అంతలో మాట కుదిరింది. బీజగుప్తుని కిది అనుభవమైంది.

కుమారగిరి చిత్రలేఖ మాటల ఆంతర్యాన్నెఱుగును; చిత్రలేఖ కుమారగిరి మాటల ఆంతర్యాన్నీ. శ్వేతాంకుడూ విశాలదేవులు గూడ ఈ మాటల ఆంతర్యాన్ని గ్రహింపగలిగినారు. ఐతే యశోధర కేమీ అంతు చిక్కలేదు. అమె కేమీ అనుభవం కాలేదు, అర్థం కాలేదు. ఆమె మృత్యుంజయునితో అన్నది - "నాన్నా! రాత్రి చాలా మీరిపోయింది."

వృద్ధమృత్యుంజయుడు పుత్రికవైపు, మఱల చిత్రలేఖవైపు చూచినాడు. ఇద్దరిలో ఎంత అంతరముంది? ఒకర్తె దేవత, మఱొకర్తెదైత్యురాలు; ఒకర్తె శాంతస్వరూపిణి, వేఱొకర్తె ఉన్మాదరూపిణి. మఱి బీజగుప్తుడో! పరిస్థితులవలలో చిక్కుకొన్న అభాగ్యమృగసన్నిభుడు; పరిపూర్ణమానవత్వం ప్రతిబింబించిన పురుషమూర్తి.

మృత్యుంజయుడు చిత్రలేఖతో అన్నాడు - "నీ ప్రవర్తన అపవిత్రమైనదని ఎవరంటున్నారు? నీ మనఃప్రవృత్తి ప్రకారం నీవు చేస్తున్నావు; నీ ఆచరణసమస్తం ప్రేమమూలకమైనదని నే నెఱుగుదును. ప్రేమక్షేత్రంలో అపవిత్రత కెంతమాత్రం స్థానం లేదు. కాని దేవీ! నీవు ప్రేమించే వ్యక్తి అపమార్గంలో చరిస్తుంటే, ఆ వ్యక్తిని సన్మార్గంలో పెట్టే కర్తవ్యం నీకు లేదా? ప్రేమకు త్యాగంయొక్క ఆవశ్యకత ఉన్నది; బీజగుప్తుని విషయంలో చేసిన త్యాగమేదైనా ప్రశస్తంగా ఉంటుంది."

మృత్యుంజయుని ప్రసంగవైఖరి చిత్రలేఖపై ప్రభావం చూపజొచ్చింది. కాని బీజగుప్తుడు మధ్యలోనే అందుకొన్నాడు - "ఆర్యశ్రేష్ఠా! చిత్రలేఖ కిది చెప్పుట వ్యర్థం. చరితాచరితాలకు బాధ్యత నాపైననే ఉన్నది. చిత్రలేఖ నన్నుద్ధరింపజాలదు, పతనమొనరింపజాలదు. మా యిర్వురి సంబంధం అమరమైనదని మాత్రం మీతో నేను చెప్పగలను."

బీజగుప్తుడు లేచి నిలుచున్నాడు. కాని చిత్రలేఖ అక్కడే కూర్చున్నది. ఆమె మృత్యుంజయునితో అన్నది - "ఆర్యశ్రేష్ఠా! మీరు చెప్పేది మంచిదో చెడ్డదో కాని, అది నేను చేయవలసే ఉన్నది - నాకొఱకు గాకున్నా బీజగుప్తునికొఱకు. ఇంత మాత్రం నన్ను నమ్మండి" - అంటూ ఆమె యశోధరవైపు జూచింది - "ఆర్యశ్రేష్ఠా! మీ కన్యకు బీజగుప్తుడు యోగ్యుడైన వరుడు. వీరి వివాహం బహుప్రశస్తంగా ఉంటుంది"- అని బీజగుప్తుని చూస్తూ అన్నది - "మీకు యశోధరవంటి పత్ని లభించుట అసంభవం. నేటినుండి మీ యిర్వురి సంబంధం నిశ్చయమైంది."

అప్పుడు బీజగుప్తుడు ద్వారానికి చేరువగా నిలబడ్డాడు. అతడన్నాడు - "చిత్రలేఖా! నీ వనేది అనుచితం. ఇది నా కసంభవం. ఇప్పుడు నేనింతమాత్రమే చెప్పగలను. ఆర్యశ్రేష్ఠా!సెలవు" - అంటూ బీజగుప్తు డక్కడనుండి నిష్క్రమించినాడు.

చిత్రలేఖ లేచి నిలుచున్నది. "ఆర్యశ్రేష్ఠా! బీజగుప్తుని మాటలను మీరు చెడుగా దలపకండి. ఆవేశపూరితుడైన వ్యక్తి ఉచితానుచితము లెఱుగక మాట్లాడుతాడు. ఆమాటలపై ధ్యాస నిల్పుట ఎదుటివారికి తగదు. మీరింతమాత్రం నమ్మండి - మీ కన్యకు బీజగుప్తునితోడి సంబంధం పరమశ్రేష్ఠంగా ఉంటుంది, ఇది జరుగుట ఆవశ్యకం కూడ."

శ్వేతాంకునితో బాటు చిత్రలేఖ బీజగుప్తుని వెనుకవెనుక నడిచింది. వీరు వెళ్లిన తర్వాత మృత్యుంజయునికి పరిస్థితుల పరిపూర్ణస్వరూపం అవగతమైంది. కొంతసేపు మౌనంగా ఉండి, తర్వాత కుమారగిరితో అతడన్నాడు - "యోగీశ్వరా! నాకేమీ అర్థం కాలేదు గాని వీరి మాటలను వింటుంటే ఈ నర్తకికి బీజగుప్తునిపై అత్యంతప్రభావ ముందని మాత్రం స్పష్టమైంది."

"మీ అనుమానం సరియైనదే!"

"అంతేకాదు. చిత్రలేఖాహృదయం స్వచ్ఛతరమైనదని కూడ!"

ఈమాటకు కుమారగిరి మాఱు పలుకలేదు. అనుకోకుండా అతని కన్నులు విశాలదేవుని వైపు చూచాయి. విశాలదేవుడు లోలోపల నవ్వుకొన్నాడు.

మృత్యుంజయుడు మళ్లీ అన్నాడు - "యోగీశ్వరా! బీజగుప్తుని నిర్బంధపెట్టడం సరియైనదేనా? అసలు ప్రశ్న యిది. చిత్రలేఖ చెప్పింది చేస్తుందనే విశ్వాసం నాకుంది. కాని ఆమె బీజగుప్తుణ్ణి విడనాడితే ఆమె మనస్సు దెబ్బతింటుందేమో, ఇది ఆమెకు మంచిది కాదేమో!"

దీనికి కుమారగిరి అన్నాడు - "చిత్రలేఖ మనస్సు దెబ్బతింటుందని నేననుకోను. ఆమెయే స్వయంగా బీజగుప్తుని విడనాడుటకు సిద్ధపడుతున్నట్లుంది. ఇది జరిగితే బీజగుప్తుని జీవితం కుదుటపడగలదు. చిత్రలేఖతో బీజగుప్తుని సంబంధాన్ని త్రెంచివేయడమే ఉచితమని నేనంటాను."

కుమారగిరి లేచి నిలబడి అన్నాడు - "మృత్యుంజయా! యశోధరకు బీజగుప్తునికంటె శ్రేష్ఠుడైన వరుడు దొరకడు - ఇది నీవు గుర్తుంచుకొనవలెను."

౧౧

మృత్యుంజయుని ప్రాసాదంలో జరిగిన చర్చలో నిష్కారణంగా అతనిని అవమానించినానేమో అనే శంక బీజగుప్తునికి కలిగింది. మఱునాటి ఉదయం శ్వేతాంకుడు తనను చూడవచ్చినప్పు డతడన్నాడు - "శ్వేతాంకా! మృత్యుంజయుని విందులో నేను బహుశః అనుచితంగా మాట్లాడినానేమో! కాని ఏది అనుచితంగా జరిగిందో అది నాకు బోధపడడం లేదు. కాని నీవక్కడే ఉన్నావుగదా! నీకన్నీ గుర్తున్నాయనుకుంటా!"

కొంచె మాలోచించి శ్వేతాంకు డన్నాడు - "దేవరవారు పలికింది సత్యంగానే పలికారు. ఐతే అంత బాహాటంగా పలుకటంవల్ల ఆర్య శ్రేష్ఠుడు తానవమానితుడైనట్లు భావించడానికి ఆస్కారం లేకపోలేదు. కాని ఆ విచారం దేనికి? సత్యం సత్యమే - ఒకరి సిద్ధాంతం మఱొకరికి విరుద్ధంగా ఉండవచ్చు."

"కాదు శ్వేతాంకా! నీవు మరుస్తున్నావు. సత్యం సత్యమే - కాని అది అప్రియం కారాదు. నేను పలికింది మఱొకవిధంగా సుప్రియంగా పలికియుండవలసింది."

మృత్యుంజయుని అవమానానికంటె తన మాటలు యశోధరకు అకారణదుఃఖం కలిగించాయన్న విచారం బీజగుప్తునికి అధిక మైంది. అతని కనుల ముందు యశోధరామూర్తి నర్తింపసాగింది. ఆమెది ప్రేమార్ద్రమైన మూర్తి. ఆమె అమాయకత, అమృతమయమైన ఆమె ప్రశాంతాలోకములు, ఆమె సిగ్గుపాటు, తేజోమండితమైన ఆమె మంజులముఖమండలము - ఇవన్నీ మాటిమాటికి అతని ముందు నర్తిస్తున్నాయి. కాని ఆతడామెను ప్రేమింపలేకున్నాడు; అతడు చిత్రలేఖ కంకితుడైనాడు. చిత్రలేఖలోని మాదకత్వం ఆమెలో లేదు. ఐతే చిత్రలేఖలోని హృదయస్పందన ఆమెయందున్నదో లేదో అతడు తేల్చుకొనలేక పోయాడు. పత్ని కాకున్నను చిత్రలేఖ తనకు పత్నియే. నట్టువకత్తె యైనను తనను ప్రేమింపగల్గిన వ్యక్తి ఆమె. అది ధనాపేక్షవల్ల గాదు. ఆమెకు ధనానికి కొదువలేదు. ఆమె ప్రేమ కేవలం ప్రేమ కొఱకే. అతనికి ప్రప్రథమంగా చిత్రలేఖతో పరిచయమేర్పడిన రాత్రి గుర్తుకువచ్చింది. చిత్రలేఖకూ యశోధరకూ ఎటువంటి సామ్యమూ లేదు. చిత్రలేఖది ఉచ్చస్థాయి - బహుళోచ్చస్థాయి. ఐతే యశోధరనుగుఱించి తానెందు కాలోచిస్తున్నాడు? అతడు శ్వేతాంకునితో అన్నాడు - "శ్వేతాంకా! నా కటువైన మాటలకు క్షమింపవలసిందని మృత్యుంజయుని కోరుకొనుట నాకర్తవ్యం."

"దేవరవారి ఇష్టానుసారమే కానిండు!"

"కాని నాకక్కడికి వెళ్లుట కిష్టములేదు" - బీజగుప్తునికి యశోధరను మఱచిపోవాలనిపించింది. "నేనొక లేఖ నిస్తాను. దానిని మృత్యుంజయునికి చేరవేయి."

"దేవరవారి ఆజ్ఞ!"

బీజగుప్తుడు మృత్యుంజయుని కొక లేఖ వ్రాసి శ్వేతాంకుని కిచ్చినాడు. శ్వేతాంకు డా లేఖను తీసికొని మృత్యుంజయుని భవనానికి వెళ్లి ప్రతీహారి నడిగినాడు - "ఆర్యశ్రేష్ఠులు లోపలనే ఉన్నారా?"

"వారు కార్యవశమున బయటికి వెళ్లినారు. అవసర మేమిటి?" - ప్రతీహారి అడిగినాడు.

"వారికై ఒక లేఖను తీసికొని వచ్చినాను."

"అది నాకీయి. వారికి నేనిస్తాను."

"లేదు. అది నేనే వారి కీయాలి" - శ్వేతాంకుడు కొంచె మాగినాడు. "లేదా వారి కూతురు యశోధరకైనా ఈయాలి" - శ్వేతాంకుని ముఖంనుండి అనుకోకుండా ఆ మాట వెలువడింది.

ప్రహరీదారుడు యశోధర కీవిషయం సూచించి శ్వేతాంకుణ్ణి అతిథిశాలలో సమాసీనుని జేసినాడు. కొంతసేపటికి అతిథిశాలలో యశోధర ప్రవేశించింది. శ్వేతాంకుడు ఆమె కభివాదపూర్వకంగా నిలుచున్నాడు. యశోధర అతనిని చూచి కూర్చుంటూ అడిగింది - "ఇక్కడికి రావలసిన శ్రమ ఎందుకు కలిగింది?"

"సామంతబీజగుప్తులు మీ తండ్రిగారి కొక లేఖ వ్రాసి పంపినారు. ఆ లేఖావాహకునిగ వచ్చినాను" - బీజగుప్తుని తన యజమాని అని అనడం అతనికి ఇష్టం లేకపోయింది.

"మా తండ్రిగారు వస్తున్నారనే అనుకుంటా! అంతవఱకు వేచియుండుట మీకిబ్బందిగా ఉంటుందేమో!" - యశోధరా విశాల నయనాలు శ్వేతాంకుని నయనాలతో నిస్సంకోచంగా మేళవించినవి. శ్వేతాంకుడన్నాడు - "పాటలీపుత్రపు సర్వోత్కృష్టసుందరీ సమక్షంలో కూర్చొనుటకు కష్ట మెవఱికుంటుంది?"

యశోధర కిటువంటి మాటలు - అందులోనూ కొన్ని గంటలు , లేదా కొన్నిక్షణాలు మాత్రమే పరిచయమున్న వ్యక్తినుండి - వినడం అలవాటు లేదు. ఐనా అవి మధురంగానే తోచినవామెకు. ఆమె ఆలోకములు హర్షాంచితమైన లజ్జతో అవనతములైనవి. సహజారుణములైన ఆమె కపోలములు ద్విగుణీకృతారుణితామనోజ్ఞములైనవి. శ్వేతాంకు డామె అతిథి. అతనిని ఆదరించుట ఆమె కర్తవ్యం. ఆమె శ్వేతాంకుణ్ణి అడిగింది - "ఆర్యబీజగుప్తులను నీవు పరిపూర్ణంగా ఎఱుగుదువనుకుంటా!"

"ఆ! ప్రపంచమందలి సర్వోత్కృష్టవ్యక్తులలో నొకనిగా అతనిని పరిగణించుటలో ఎవరికీ విప్రతిపత్తి ఉండదు!"

"మఱి నర్తకి చిత్రలేఖావిషయంలో నీ అభిప్రాయమేమిటి?"

"ఆమె ఉచ్చకోటికి జెందిన స్త్రీమూర్తి. ఆమె దేవీస్వరూపిణి యనికూడ నేను చెప్పగలను. ఆమె నెఱిగిన మనుజుడు సౌందర్యాన్నీ, సౌందర్యజనితకర్తవ్యాన్నీ ఎఱిగినవాడని నే నంటాను."

యశోధర నవ్వింది. "ఐతే నా జ్ఞాపకం నిరాధారం కాదన్నమాట. నీ పేరు శ్వేతాంకుడు గదా!"

"ఔను! దేవి అనుమానం నిజమైనదే!"

"ఆర్యశ్వేతాంకా! ఇంకొక మాట అడుగుతాను. నిజంగానే నిన్ను నీ గురువు పాపావిష్కరణకై బీజగుప్తుని కడకు పంపినాడా? అట్లే జరిగియుండినచో నిజంగా బీజగుప్తుని వ్యక్తిత్వం పాపావిష్కరణ కనుకూలమైన క్షేత్రమేనా?"

శ్వేతాంకుడు మందహాస మొనరించినాడు. "ఔను! నా గురువు నన్ను పాపావిష్కరణ కొఱకే ఆర్యబీజగుప్తుని చెంతకు పంపినాడు. ఐతే బీజగుప్తుని వ్యక్తిత్వం పాపావిష్కరణకు అనుకూలమైన క్షేత్రమేనా అన్న మాట మిగిలింది. ఈ విషయంలో నేనుకూడ చాలా సందిగ్ధం గానే ఉన్నాను. మఱొక విషయం. నిన్న విందులో కుమారగిరి వెంట వచ్చిన నా సహాధ్యాయిని కూడ నా గురువు పాపావిష్కరణకై కుమారగిరి చెంతకు పంపినాడు. ఇది కూడ నీ కాశ్చర్యకరంగా ఉండవచ్చు!"

అందుకు యశోధరకు నిజంగానే ఆశ్చర్యమైంది.

"ఆశ్చర్యపడవలసిన అవసరమేమీ లేదు దేవీ! ఎందుకంటే మేమాశ్రయించిన వ్యక్తులు స్వయంగా పాపులు కానక్కఱ లేదు. వారికి సంబంధించిన ఇతరవ్యక్తులు పాపులై యుండవచ్చు. ఇంతకు పాపమంటే ఏమిటి? దాని స్వరూప మెవరికి తెలుసు? నేను పాపంగా భావించినదానిని వేఱొక వ్యక్తి పాపంగా భావించక పోవచ్చు; నాకెప్పుడూ పాపంగా తోచని దానిని ఇతరులు ఘోరపాపంగా తలంపవచ్చు."

ఈ మాటలు యశోధరకు సంతృప్తిని కలిగించలేదు. ఆమె అన్నది - "ఆర్యశ్వేతాంకా! నీ వభివందనీయుడవు. ఎదుటి వ్యక్తిలోని గుణగ్రహణమందే నీకు విశ్వాసమున్నది."

ఇంతలో ఆర్యశ్రేష్ఠుడు మృత్యుంజయుడు అతిథిశాలలో ప్రవేశించినాడు. శ్వేతాంకుడు లేచి అతని కభివాదం చేసినాడు. యశోధర లోపలికి వెళ్లిపోయింది.

మృత్యుంజయుడు శ్వేతాంకుణ్ణి కూర్చొనమని ఆదేశిస్తూ అడిగినాడు - "నీవు నిన్న బీజగుప్తునితో నున్న అతని సేవకుడవే కదా?"

"ఆర్యశ్రేష్ఠుల అనుమానము సరియైనదే. నా యజమాని మీకై ఒక లేఖను పంపినాడు."

మృత్యుంజయుడు లేఖ నందుకొన్నాడు. దానిని చదివి అతడు హర్షోన్ముఖుడైనాడు. "సామంతబీజగుప్తునితో చెప్పు, నాతో క్షమాయాచన చేయవలసిన అవసరం కించిత్తుగూడ లేదని, అతనిపట్ల నాకు మునుపున్న నిష్కల్మషమైన, నిర్మలమైన భావమే ఇప్పుడూ ఉన్నదని. మఱొకమాట గూడ చెప్పు - తీరిక ఉంటే వారిని నేటి సాయంత్రం ఇక్కడికి వేంచేయమని, భోజనంకూడ ఇక్కడే చేయమని" అంటూ కొంచెమాగి మళ్లీ అతడన్నాడు - "శ్వేతాంకా! బీజగుప్తునితోబాటు నీకూ ఇదే ఆహ్వానం."

శ్వేతాంకుని వదనం హర్షవికసితమైంది. అతడన్నాడు - "మీ ఆజ్ఞాపాలన తప్పకుండా జరుగుతుంది. నా యజమాని వస్తే వారి వెంట నేనవశ్యంగా వస్తాను. కాని వారి ఆజ్ఞ లేనిదే నేనెంతవఱకు రాగలననేది విచారణీయము."

మృత్యుంజయుడు నవ్వసాగాడు. "నీవు శాంతుడవు, గంభీరుడవు, కర్మనిష్ఠుడవూ ఐన నవయువకుడవు. నీపట్ల నేను ప్రసన్నుడ నైనాను. నీ వంశమేది? నీ తండ్రిపేరు, నివాస మేది?"

"నేను సూర్యవంశీయుణ్ణి. నా తండ్రిపేరు విశ్వపతి. అతని నివాసం కోసలదేశం."

"నీ తండ్రిపేరు విశ్వపతీ, అతని నివాసం కోసలదేశమా? అతడు కాశీలో విద్యాభ్యాసం చేసినాడా?"

"ఆర్యశ్రేష్ఠులు సరిగానే అంటున్నారు."

"ఎంతాశ్చర్యం! విశ్వపతి నా సహాధ్యాయి. నీకు స్వాగతం. నీవు నా పుత్రసముడవు."

తన తండ్రితో మృత్యుంజయునికి గల పరిచయంపట్ల శ్వేతాంకుని కెంత సంతోషమైందో చెప్పలేము. అతని హృదయంలో ఒకవిధ మైన ఆశ అంకురించింది. అత డనుకొనసాగాడు - "యశోధరకు, నాకూ వివాహం సంభవమే!"

"అసంభవం!" శ్వేతాంకునికి తెలుసు. తనతండ్రి వైభవం అంతరించింది. అందుకే తన తండ్రి గ్రామీణజీవనం సాగిస్తున్నాడు. అతడు కులీనుడే, ఐతే ఏం? మృత్యుంజయుడు తన తండ్రి కన్న ధనశాలి, వైభవశాలి, శక్తిశాలి. వీని సమానత్వం వివాహానికి అవసరం. ఐనా అతనికి ఆశ అడుగంటలేదు.

శ్వేతాంకుని మౌనాన్ని గమనించి మృత్యుంజయుడన్నాడు - "వత్సా శ్వేతాంకా! నా భవనాన్ని నీదిగా భావించుకో. నా కాశ్చర్య మౌతున్నది నీవిక్కడ ఉన్నావని విశ్వపతి నా కెందుకు కబురంపలేదో!"

"నా తండ్రి యిప్పుడు వానప్రస్థజీవనం గడుపుతున్నాడు. దీనికి కారణమదే కావచ్చు. మంచిది - నాకాజ్ఞ నిప్పిస్తారా?"

అప్పుడు భోజనసమయమైంది. "నాతో ఇప్పుడు భోజనం చేయడానికి నీకేమీ సంకోచం లేదుగదా?" - మృత్యుంజయు డడిగినాడు.

శ్వేతాంకుడు మందహాసం చేస్తూ అన్నాడు - "అసలు సంకోచం మాట లేదార్యశ్రేష్ఠా! కాని నేనిప్పు డార్యశ్రేష్ఠుడు బీజగుప్తుని సేవకుడను. వారి ఆజ్ఞలేనిదే నేనేమీ చేయజాలను. ఆలస్యమౌతున్నది - నా కనుజ్ఞ దయచేయండి. బీజగుప్తులు నాకై నిరీక్షిస్తుంటారనుకుంటా."

"మంచిది. నీ కర్తవ్యాన్ని నీవుత్తమంగా భావిస్తున్నావు. నాకు సంతోషంగా ఉంది. నీవింక వెళ్లవచ్చు. కాని బీజగుప్తునికి నేనన్న మాటను చెప్పడం మాత్రం మఱచిపోవద్దు."

శ్వేతాంకుడు తిరిగి వచ్చినాడు. మృత్యుంజయుని ఆహ్వానాన్నిగుఱించి బీజగుప్తునికి వివరించినాడు. బీజగుప్తుడన్నాడు - "ఆహ్వానమైతే వచ్చింది. కాని నేనక్కడికి వెళ్లుట సమంజసంగా ఉంటుందా?"

ఆరోజు మధ్యాహ్నంవఱకు బీజగుప్తు డా ఆహ్వానాన్నిగుఱించే ఆలోచిస్తున్నాడు. తన కక్కడికి వెళ్ళుట ఎందుకు అనుచితంగా తోచింది? ఈ ప్రశ్న అతని మనస్సులో ఉత్పన్న మైంది. వెళ్లడ మనుచితంగానే తోస్తున్నది గాని, దానికి కారణం తాను చెప్పలేకున్నాడు. ఎంతో తర్కవితర్కం తర్వాత అతడు మృత్యుంజయుని భవనానికి వెళ్లుటకు నిశ్చయించుకొన్నాడు. సాయంత్రం అతడు శ్వేతాంకునితో అన్నాడు -"శ్వేతాంకా! ఏ మాన్యపురుషుని ఆహ్వానాన్నీ తిరస్కరింపగూడదని నాకు తోస్తున్నది." అతని మనస్సులో యశోధరను తిరిగిచూడాలనీ, ఆమెతో మాట్లాడాలనీ ఒక అస్పష్టభావన భ్రమిస్తూ ఉన్నది.

రాత్రిసమయానికి బీజగుప్తుడు శ్వేతాంకునితోసహా మృత్యుంజయుని భవనానికి జేరినాడు. ఆర్యమృత్యుంజయుని భవనంలో గతరాత్రివలె అలజడి లేదు. వాతావరణం ప్రశాంతంగా ఉంది. మృత్యుంజయుడు బీజగుప్తునికి స్వాగతం పలికినాడు. అందఱూ విశ్రాంతి భవనంలో ప్రవేశించినారు. యశోధర అప్పటికే అక్కడ కూర్చొని వారికై ప్రతీక్షిస్తున్నది.

"ఆర్యబీజగుప్తా! ఆ లేఖతో అవసరమేమీ లేకుండినది." - మృత్యుంజయుడు ప్రస్తావన నారంభించినాడు.

"ఆర్యశ్రేష్ఠా! తన పొరపాటును గ్రహించుట ప్రతివ్యక్తికీ కర్తవ్యం."

మృత్యుంజయుడు నవ్వసాగాడు. "నీ సేవకుడు శ్వేతాంకుడు నా సహాధ్యాయి విశ్వపతి కుమారుడు. ఇది నాకీరోజు తెలిసింది." - అంటూ అతడు శ్వేతాంకునివైపు జూచినాడు.

"ఐతే ఆర్యశ్రేష్ఠా! శ్వేతాంకుడు నాసేవకుడు కాడు; నా సతీర్థ్యుడు."

" ఆర్యబీజగుప్తా! నీ కీరోజు కొంత ఆలస్యమైంది."

"ఔను. కాశీనుండి నా కెవరో అతిథులు వచ్చినారు."

ఈసారి యశోధర అడిగింది -"కాశీనగరం అతిసుందరమైనదనీ, ప్రాచీనమైనదనీ అంటారు. మీరు దానిని చూచినారా?"

బీజగుప్తుడు నవ్వుతూ అన్నాడు - "నా జీవితంలోని అత్యంతహృద్యమైన కాలం కాశీలోనే గడచింది. నా గరువు మహాప్రభువు రత్నాంబరుని నివాసం మొదట కాశీలోనే ఉండేది. యశోధరా! కాశీయైతే ఇక్కడికి చేరువలోనే ఉంది. నేను యావదుత్తరభారతాన్ని పర్య టించినాను."

"ఐతే హిమాలయాలను చూచినారా?"

"ఆ...! హిమాలయాలను, హిందూకుష్ పర్వతాలనుగూడ చూచినాను. ప్రకృతిశోభ యొక్క పరిపూర్ణస్వరూపం పర్వతాలలోనే గోచరిస్తుంది." - ఈసారి బీజగుప్తుడు మృత్యుంజయునితో అన్నాడు - "ఆర్యశ్రేష్ఠా! నేనెన్ని వింతలో అక్కడ పరికించినాను. కాని వానిలో నొక సంఘటనమాత్రం నా స్మృతిపథంనుండి తొలగిపోదు. దాన్ని వింటే ముక్కుపై వ్రేలు వేసికొనవలసిందే!"

యశోధర కుతూహలంతో అడిగింది - "మఱి ఆ సంఘటనను మాకు వినిపింపగలరా?"

"అవశ్యంగా!" - బీజగుప్తు డారంభించినాడు - "దాదాపు పది సంవత్సరాలనాటి మాట. ఆరోజుల్లో నేను విద్యార్థిని. మహాప్రభువు రత్నాంబరునితో నేను దేశయాత్రకు బయలు దేరినాను. గొప్పగొప్పనగరాలూ, ఉపవనాలూ దాటుకొంటూ గంగాతీరంలో సంచరిస్తూ మేము హరిద్వారాన్ని చేరుకొన్నాము. అంతటితో సమప్రదేశం అంతమైంది. ఆకాశంలోనికి మస్తకాలు నిగుడిస్తూ నిలబడ్డ పర్వతశిఖరాలు మాయెదుట సాక్షాత్కరించినవి. ఇంకా ముందఱ యేముందని నేను రత్నాంబరులవారిని అడిగినాను. "అజ్ఞాతదేశం"- అంటూ వారు ప్రత్యుత్తర మిచ్చినారు. అక్కడ గంగానదీతీరంలో ఒక వ్యక్తి ఆసీనుడై ఉన్నాడు. బహుశః అతడా మాట విన్నాడేమో! అతడన్నాడు - "ఏమన్నారు? ముందు అజ్ఞాతప్రదేశముందా? సరిగానే అన్నారు. కాని నేనింతమాత్రం చెప్పగలను. ఆ అజ్ఞాతప్రదేశమే దేవతల నివాసస్థానం. ఆ పర్వతప్రదేశంలోనే కైలాసమున్నది - ఆ ప్రదేశంలోనే గంధర్వులు నాట్యమాడుతుంటారు, అప్సరలు ఆనందవిహారాలు సల్పుతుంటారు." అతని మాటలకు రత్నాంబరులముఖంపై అవిశ్వాసభావం పొడసూపింది. కాని అనుభవ శూన్యుడనైన నన్ను ఆ అవిశ్వాసం వశం చేసికొనలేకపోయింది. నేనన్నాను - "మహాప్రభూ! అట్లాగే ఉండవచ్చు. ఆ పర్వతాల నధిరోహించి, వానిపై చరించి చూచుటలో అభ్యంతరమేముంది?" - "ఏమీ లేదు. ఒకవేళ నీవు వెళ్లదలిస్తే నేనూ సిద్ధమే."

మేమిద్దఱం ముందుకు సాగినాము. అచ్చటి ప్రకృతిసౌందర్యం కల్పనాతీతంగా ఉన్నది. వనంలో వివిధవర్ణాల విరులు వికసించినవి, వానితో పర్వతీయశీతలవాయువులు పరియాచక మాడుతున్నవి. పక్షులు కలరవగానం చేస్తున్నవి. అంతటా శాంతి సామ్రాజ్యం చేస్తున్నది. అక్కడ కోలాహలం లేదు, జనసమ్మర్దం లేదు, కేవలం ఒకదానిపై వేఱొకటి పేర్చినట్లున్న పర్వతపంక్తులు మాత్రమున్నవి. దారిలో అక్కడక్కడ గ్రామములు తగులుతున్నవి. అందలి ప్రజలు గౌరవర్ణీయులు. అచ్చటి స్త్రీలు సుందరులు. వారు వివిధవర్ణముల దుస్తులు ధరించియున్నారు. వారు నవ్వుతున్నారు; పాడుతున్నారు. ఆ స్త్రీలలో లజ్జాసంకోచములు లేవు. అప్పుడు నేను నవయువకు

డను, ఆ స్త్రీల సౌందర్యముచే విమోహితుడనైనాను. వారు జట్లుజట్లుగా మధురగీతము లాలపిస్తూ సాగిపోతున్నారు. నాకు వారి భాష తెలియకపోయినా, వారిగానం కవిత్వమయం, ప్రేమతత్త్వమయం అనిపించింది. "ఇదే కాబోలు అప్సరల నివాసదేశం?" - అని నా మనసుకనిపించింది. మేమింకా ముందుకు సాగినాము. ఇప్పుడు గ్రామాలు దూరదూరంగాను చిన్నవిగాను ఉన్నవి. శైత్య మధికతర మైంది. ఫలపుష్పాదులు అరుదుగా కనిపించసాగినవి. ఒకనాటి ఉదయం మేము దూరంలో ఒక బంగారుకొండను చూచినాము. అది చూచి నేను ఉన్మత్తునివలె అరచినాను - "గురుదేవా! ఎదురుగా కుబేరుని మేరుపర్వత మున్నది". గురుదేవులు నా మూర్ఖతకు నవ్వ సాగినారు. "అవి హిమాలయాలు. మంచుపై ప్రాతఃకాలసూర్యుని కాంతి ప్రసరించి, అది నీకు మేరుపర్వతభ్రమను కలుగజేస్తున్నది." నా మూర్ఖతకు నేను లజ్జితుడనైనాను. మేమింకా పైకి సాగినాము. అచ్చటి భూమి తరచుగా హిమావృతమై యున్నది; శైత్యాధిక్యతచే మా శరీరములు కొంకరలు పోవుచున్నవి. అప్పుడు రత్నాంబరులు "తిరిగిపోదమా?" అనిరి. కాని "కాదు ప్రభూ! ఆ హిమావృత శిఖరాల పాదభాగమువఱకు పోదము" - అని నేను సాహసము చేసితిని. అట్లు ముందుకు సాగగా మాకొక కుటీరము కన్పించినది. ఆ కుటీరమునం దొక స్త్రీ ఒక్కర్తెయే కూర్చుండి ఏదో ఆలోచిస్తున్నది. మమ్ములను చూచి ఆమె నిలుచుండి "అతిథులకు స్వాగతము" - అని పల్కినది. మహాప్రభువు రత్నాంబరు లామెను తదేకముగా చూచిరి. వారు మెల్లగా నా చెవిలో "ఇది ప్రమాదకరమైన ప్రదేశము. ఇచ్చటినుండి తిరిగివెళ్లుట మంచిది" - అనిరి. అప్పు డాకస్మికముగా "వృద్ధాతిథి అనుమానం సరియైనదే. కాని ఇంతదూరం ఎట్లాగూ వచ్చినారుగదా! జీవితాంతం మఱువలేని ఈమాట వినిపోండి" - అని ఆ స్త్రీ పల్కినది. దానికి రత్నాంబరులు విస్మయావహులైరి. కాని వారామె అభ్యర్థన నంగీకరించుట అనుచితముగా దలంచిరి. కొంచెము ముందుకు సాగి మేము హిమశిలపై నాసీనుడైన ఒక యోగిని చూచితిమి. అతని జటలు సుదీర్ఘములై చరణముల దాకుచుండెను; నఖములు సింహముగోళ్లవలె పెరిగియుండెను. అతడు మేము వచ్చుదిశకే తదేకముగా చూచుచుండెను. మేము వెళ్లి అతని కభివాదము చేసితిమి. అతడు మమ్మాశీర్వదించి తనచెంగట కూర్చుండ బెట్టుకొనెను. "ఎంతకాలమునకో ఈనాడు అన్యపురుషుని చూచితిని" - అని అతడు శీతలనిశ్వాసమును విడిచెను. అతని ముఖముపై కరుణావిషాదచ్ఛాయ లలముకొనియుండెను. "స్వామీ! మీరు దుఃఖంతో ఉన్నారా?"- అని రత్నాంబరు లాయన నడిగిరి. "ఆ! దుఃఖం తోనూ, సుఖంతోనూ గూడ ఉన్నాను" - అంటూ అతడు తన వెనుకవైపునకు సంకేతము చేసెను.

మేము లేచి వెనుకకు జూచి భయకంపితులమైతిమి. వెనుక ఒక రక్తకుండముండెను; అందులో దిగుటకు మెట్లుండెను. అది దుర్గంధ భూయిష్ఠమై యుండెను. "స్వామీ! మీరీ స్థానము నెందుకు త్యజించుట లేదు?"- అని రత్నాంబరు లాయన నడిగిరి. "త్యజింపదలతును గాని త్యజింపలేకున్నాను. ఎన్నిసార్లు ఈ స్థలాన్ని త్యజింపదలచితినో చెప్పలేను. కాని ప్రతిసారి ఆ యత్నము వ్యర్థమగుచున్నది. ఉఫ్ ---"

ఆ తర్వాత అతనితో జ్ఞానచర్చ జరిగెను. ఆయన సాధనోపాసనల మహత్త్వమును మా కెఱిగించెను. ఆయన జ్ఞాన మున్నత స్థాయిలో నుండెను. గంటలపాటు ఆ దుర్గంధమును సహించుచుగూడ మేమాయన జ్ఞానపాఠమును వింటిమి. అంతలో సంధ్యాకాల మాసన్నమయ్యెను. ఉన్నట్లుండి యోగి "సమయము వచ్చెను" - అని అరచుచు కుండమువైపు వడిగా పరుగెత్తెను. మేముగూడ కౌతూహలవశమున అతనివెంట పరుగెత్తితిమి. ఉన్మత్తునివలె యోగి ఆ కుండములో దూకెను. ఆశ్చర్యముగా నప్పు డా కుండమునందు రక్తమునకు మాఱుగా స్వచ్ఛజలము నిండియుండెను. మృతప్రాణులకు బదులు సుందరసరోజదళము లందుండెను. మేమది గాంచి అవాక్కులమైతిమి. అంతేకాక ఆ కుండములో నతనితో ఒక స్త్రీని కూడ మేము చూచితిమి. ఆమె యెవ్వరో కాదు - మేము ముందుగా కుటీరములో చూచిన స్త్రీయే. వారిర్వురూ కేళీపరులై యుండిరి. ఆ స్త్రీ నవ్వుచుండెను. ఆమె "మూర్ఖులారా! ఊరకే నిలబడి చూస్తారేమి? రండి. ఇందులో స్నానం చేసి జీవితసుఖాన్ని అనుభవించండి!" - అని మమ్ముల జూచి అరచెను. నేనంత స్నానము చేయ నిచ్చగించి వస్త్రములను విడనాడ నారంభించితిని. కాని రత్నాంబరులు నా చేతిని పట్టుకొని బలవత్తరముగా నీడ్చిరి. వారి హస్తములో నెంతబల ముండెనో కాని, నేను లక్షవిధముల యత్నించినను వారి పట్టును విడిపించుకొనజాలనైతిని. వారు నన్నచటినుండి లాగికొనిపోయిరి. ఊరకే కాదు - లాగికొని పఱుగెత్తిపోయిరి. దారిలో ఆ కుటీరమును దాటి, వచ్చిన మార్గమున తిరిగి వచ్చితిమి. తరువాత రత్నాంబరులు

నాతో ననిరి -"వత్సా! పరమేశ్వరునికి కృతజ్ఞతలు తెల్పుకో - మన మచ్చటినుండి సురక్షితముగా వచ్చితిమి." అప్పటినుండి చాలా యేండ్లవఱకు ఆ స్త్రీరూపం నా కనుల ముందు నర్తనం చేసేది.

యశోధర అడిగింది - "దీని రహస్యమేమిటో మహాప్రభువులు రత్నాంబరులు మీకు తెల్పినారా?"

"లేదు. వారింతే అన్నారు. ప్రపంచంలో తెలియని విషయాలెన్నో ఉన్నవి. వానిలో నిది యొకటి."

ఆ తర్వాత అందరూ భోజనశాలలో ప్రవేశించినారు. ఈసారి బీజగుప్తుడూ, శ్వేతాంకుడూ యశోధర కిరువైపులా కూర్చున్నారు. బోజనం చేస్తూ యశోధర బీజగుప్తునితో అన్నది-"ఆర్యా! మీ కథ అపూర్వముగా నున్నది. అది విన్నప్పటినుండి నా హృదయంలో అలజడి నెలకొన్నది. నేనూ ఇటువంటి విచిత్రాలను చూడాలనుకొంటుంటాను."

బీజగుప్తుడు నవ్వుతూ అన్నాడు - "దేవీ! మనుష్యుడు అనుభవాన్ని గడింపడు - పరిస్థితులు మనుష్యుని అనుభవం గడింప జేస్తాయి."

శ్వేతాంకుడు యశోధరతో మాట్లాడేందుకు అవకాశాన్ని వెదకుతున్నాడు - "దేవీ! అనుభవం గడించడానికి జీవితమంతా ఇంకా మిగిలి ఉంది."

యశోధరాముఖంపై ఒక విచిత్రమైన భావం స్ఫురించింది - "కావచ్చు! కాని ఈ స్వల్పజీవితంలో ప్రతిక్షణం ఎంత విలువైందో! జీవితం లోని ఈ క్షణాలను వ్యర్థంచేయుట మంచిది కాదు."

బీజగుప్తుడు నవ్వినాడు - "మనం చేసే ప్రతిదానిలోనూ ఏదోయొక అదృశ్యహస్తమున్నది. దాని యిష్టం గూడ కొంత ఉన్నది. ప్రపంచంలో రెండు మతములున్నవి. ఒకటి జీవితంలో అలజడి సృష్టిస్తుంది, మఱొకటి శాంతిని ప్రసాదింప ప్రయత్నిస్తుంది. దేనిని గుఱించిన తర్కం దానికదే సుందరమైనది. ఏది సత్యమనేది నిర్ణయించుట బహుకష్టమైనది."

బీజగుప్తుని వ్యక్తిత్వం చూపినంతగా తన వ్యక్తిత్వం యశోధరపై సుందరప్రభావం చూపుట లేదని శ్వేతాంకుడు గ్రహించినాడు. అతడు మఱొకసారి సాహసంచేసి అన్నాడు - "దేవీ! యశోధరా! మానవునికి సుఖసంతోషమయమైన జీవన మవసరమై యున్నను అందులో అలజడియొక్క చిలుకరింత కొంత ఉండవలెను. ప్రేమ మనుష్యుని నిర్ధారితలక్ష్యము. కంపన, ఆ కంపనలోని సుఖం, పిపాసా తృప్తులు - ఇవే ప్రేమకు లక్షణాలు. జీవితంలో ప్రేమ ప్రధానమైనది. ఒకరి ఆత్మ నింకొకరు బాగుగా అర్థం చేసికొనడం జీవితంలో ఆవశ్యకం - ఒకరితో నొకరు సహానుభూతిని పొందుట, వ్యస్తంగా నున్న పరస్పరాస్తిత్వాలను ఏకీకృతం చేయుటయే ప్రేమ - ఇదియే జీవితంయొక్క పరమసుందరలక్ష్యము."

యశోధర శ్వేతాంకుని వైపు చూచింది - ఆమె చూపులు అతని చూపులతో కలిసినవి. అతని యావచ్ఛరీరం సంపులకితమైంది. ఆమె అట్లెంత సేపు అతనివైపు చూచిందో చెప్పలేము గాని, ఆ కొద్దిక్షణాలు మాత్రం అతని నెంత మత్తుని జేసినవో! బీజగుప్తుడు నవ్వుతూ మెల్లగా అన్నాడు - "ఇదే జీవితం".

యశోధరాదృష్టి హఠాత్తుగా శ్వేతాంకునినుండి మఱలింది. ఆమె ముఖమెఱ్ఱబాఱింది. శ్వేతాంకుడు గాబరా పడి కన్నులు క్రిందికి దించుకొన్నాడు.

౧౨

చిత్రలేఖ జీవితంలో ప్రేమతత్త్వాన్ని ఎన్నిసార్లు వ్యాఖ్యానించిందో చెప్పలేము, కాని ప్రతిసారి తన పూర్వపు వ్యాఖ్యానం తప్పనిపించిం దామెకు.

ప్రప్రథమంగా ఆమెకు ప్రేమ అనేది ఈశ్వరాంశగా తోచేది. ఆమె తొట్టతొలిగా తన భర్త నెంతో ప్రేమించింది. అది పవిత్రమైన ప్రేమ. అమెకు భర్తపై ఎనలేని భక్తి ఉండేది. ఆ అనురాగం తన అస్తిత్వాన్ని పతి అస్తిత్వంతో మేళవించింది; కాదు, ఆ యత్నంలో తన అస్తిత్వాన్నే కోల్పోయింది. ఆమె పలికేది పతిసంతుష్టికే; ఆమె నవ్వేది నాథుని ఆనందానికే. ఆమె జీవితమందలి ప్రతిక్షణం అతనికే అంకితం. పతియే ఆమె ప్రపంచం, ఆమె పరమేశ్వరుడు, ఆమె అస్తిత్వానికి ఆధారం. పతిప్రేమయే ఆమెకు పరమసౌఖ్యకరం. పత్యనురాగమే ఆమె

ఆత్మార్పణానికి పరమగమ్యం, పరాకాష్ఠ. అట్టి ఆత్మార్పణంలో ఉండే సౌఖ్యం అది చేసినవారికి దప్ప మఱెవరికి అర్థమౌతుంది?

పతిమరణంతో ఆమె బ్రతుకు అంధకారమయమైంది. తన నిరంతరసాధన, తపస్సు వ్యర్థమైన ట్లామె కనుభవమైంది. ఆమె అప్పు డప్పు డాత్మహత్యకూడ చేసుకోవాలనుకున్నది. ఐతే ఆత్మహత్య మహాపాతకం; ఈ సంగతి ఆమెకు తెలుసు. జీవితానికి తపస్సు ప్రధానాంగం, విధవాకర్తవ్యం సంయమనసంయుతసాధన - ఈవిషయం ఆమెకు స్పష్టీకరింపబడింది. ఆమె అదిగూడ చేసింది. కాని ఆ సాధన ఆమెకు దుస్తరమైంది. పతి బ్రతికియున్నంతసే పామె పూజలు చేయగలిగింది; తపస్సు చేయగలిగింది; సాధన చేయగలిగింది. వీటన్నికి కేంద్ర స్థానము, ఆధారము అప్పుడొకటుండేది. ఇప్పు డా ఆధారం అదృశ్యమైంది; ఆమె విశ్వాసం విచలించింది, తన్మయత్వం ధ్వస్తమైంది.

ఆ తర్వాత ఆమె కృష్ణాదిత్యుణ్ణిప్రేమించింది. ఈసారి ప్రేమ ఆమె కీశ్వరీయంగా తోచలేదు; ప్రాకృతికంగా తోచింది. ఈసారి ప్రేమకు భక్తికి బదులు ఆత్మవిస్మృతి ప్రధానమైంది. ఈసారి ఆమె తన అస్తిత్వాన్ని కోల్పోలేదు; ప్రియుని అస్తిత్వంతో తన అస్తిత్వాన్ని మేళవించింది. ఈసారి ప్రణయంలో తొలిసారిగా ఆమె పిపాసను చవిచూచింది, దానిచే ఆమె ఉత్తేజితురాలైంది.

అంతవఱ కామె అనురాగంలోని పిపాసామహత్త్వా న్నెఱిగియుండలేదు. పతిప్రేమలో ఆమె తన అస్తిత్వాన్నే కోల్పోయేది - ఇట్టి స్థితిలో పిపాసకు స్థానం లేదుగదా! ఈసారి ఆమె తన వాంఛాపరిపూర్తిని చేసికొన్నది. తన మనోవాంఛల తీవ్రతపట్ల మొదట్లో ఆమెకు భయం వేసేది; కాని దానివల్ల సుఖమే కలిగేది. ఈసారి ఆమె జీవితసారాన్ని అనుభవించింది. ప్రేమ అనేది భక్తికి రూపం కాదు; అందుచే అది ఏకపక్షంగా ఉండదు. ప్రేమ అనేది ద్వైపాక్షిక సంబంధం. ఆత్మలయొక్క పవిత్రసంబంధమే ప్రేమ. ప్రేమలో ఆత్మకంపన ఉంటుంది, పిపాస ఉంటుంది, ఆత్మవిస్మృతి ఉంటుంది. దానిలో తృప్తికి స్థానం లేదు. ప్రేమలో ఆత్మార్పణకు తావుంది - కాని అది ఏకపక్షంగా గాక ద్వైపాక్షికంగా ఉంటుంది. కాని ఇప్పుడు కృష్ణాదిత్యుడు గూడ గతించాడు. చిత్రలేఖ కీసారి ప్రేమ అనశ్వరమనిపించలేదు. ప్రతిదినం మదిలోమెదిలే పవిత్రస్మృతి క్రమంగా అంతరించి పోగలదు కూడ!

తరువాత బీజగుప్తు డామె జీవితంలో ప్రవేశించాడు. ఈసారి ఆమె ప్రేమలో కేవలం పిపాసనే చూచింది. అప్పుడప్పు డామెకు ఆత్మవిస్మృతిగూడ కలిగేది గాని ఆత్మార్పణ యొక్క అవసరం కనిపించలేదు. ఇప్పుడు ప్రేమలోని మైకాన్ని ఆమె చవిచూచింది. ఈ సారి ప్రేమతోబాటు ఐశ్వర్యాన్ని, తదుపలబ్ధమైన భోగవిలాసాల మనోహరత్వాన్ని అనుభవించింది. జీవితంలో ప్రేమ ఒక్కటే లేదు, జీవితం ప్రేమపై ఏకమాత్రంగా ఆధారపడదు - అనే నూత్నభావన ఆమె కీసారి కలిగింది. ప్రేమార్తియే కాక అన్యార్తులుగూడ మనిషి కుంటాయి; కేవలమైన ప్రేమ కొంతకాలం మాత్రమే సుఖానుభూతి కాధారభూతమౌతుంది. ఆ సుఖాన్ని స్థాయీభూత మొనరించుటకు ఆత్మవిస్మృతి అవసరం. కాని ఆత్మవిస్మృతి స్వాభావికంగా కల్గదు; ఆత్మవిస్మృతి నుత్పన్న మొనరించుటకు సురాపాన మవసరం, అని ఆమె కనుభవమైంది.

ఆ తర్వాత ఆమె కుమారగిరిచే ఆకర్షితురాలైంది. కుమారగిరి యువకుడు, సుందరుడు, ప్రతిభావంతుడు, మఱింకా ...! చిత్రలేఖ అంతకుమించి ఆలోచింపలేకపోయింది. తన అభీష్టానికి వ్యతిరేకంగానే ఆమె కుమారగిరిచేత ఆకర్షింపబడింది. ఇది ఆమెకు తెలుసు. కాని తన అభీష్టమేమిటో ఆమెకు తెలుసా?

తన ప్రియుడైన బీజగుప్తునితో ఉన్నప్పుడే ఆమె కుమారగిరియం దాసక్తురాలైంది. అందుచేత కుమారగిరిని జేరుట కామెకు సాహసం లేకపోయింది. కాని మృత్యుంజయుని భవనంలో జరిగిన సంవాద మామె కిప్పు డా సాహసాన్ని, అట్లు చేయుట కొక నెపాన్ని ప్రసాదించింది. ఆమె అనుకొన్నది -"బీజగుప్తుని సుఖవంతుని జేయుట నా కర్తవ్యం. అతనిని విడిచిపెట్టడమే నేను చేయవలసిన మహాత్యాగం, అతని జీవితాన్ని సార్థకమొనరించే సాధనం. నేను బీజగుప్తుణ్ణి విడువక తప్పదు - శాశ్వతంగా విడువక తప్పదు."

ఆరాత్రి చిత్రలేఖ నిదురింపలేక పోయింది. ఆమెపైవిధంగా ఆలోచిస్తూ ఉండిపోయింది. ఉషఃకాలంలో ఆమె కన్నులు మూతపడ్డాయి. అందుచే ఆమె ఆలస్యంగా లేచింది. అప్పటికి మధ్యాహ్నమైపోయింది. ఆమె దాసీ నడిగింది - "బీజగుప్తునినుండి సమాచారమేమీ రాలేదు గద?"

"రాలేదు"

చిత్రలేఖ స్నానమాడింది. కాని భోజనం చేయ నిరాకరించింది. రథం తెమ్మని సారథి నాజ్ఞాపించి, తాను వస్త్రాగారంలో ప్రవేశించింది. అక్కడ తాను ధరించిన ఆభరణాలన్నీ తీసివేసింది. ఒక కావిరంగు పట్టుచీరను తీసి కట్టుకొన్నది. శిరోజాల నామె ముడివేసికొనలేదు. అప్పటికి రథం ద్వారంముందు వచ్చి ఆగింది.

ఆమె బీజగుప్తుని కొక లేఖను వ్రాసింది. తాను సంధ్యాకాలంవఱకు తిరిగిరాకుంటే ఆలేఖను బీజగుప్తునికి చేర్చమని దాసి నాజ్ఞాపించింది. గృహభారా న్నొక విశ్వసనీయురాలైన దాసి కప్పగించింది. ఆ దాసి ఆశ్చర్యచకితురాలైంది. "ఆశ్చర్యపడకు సునయనా! నేను కొంతకాలంపాటు ఈవైభవాన్ని త్యజిస్తున్నాను. నేను తిరిగి వచ్చేంతవఱకు ఈ గృహస్వామినివి నీవే" - అని మాత్రమే ఆమె దాసితో అన్నది.

రథారూఢురాలై ఆమె కుమారగిరి కుటీరానికి బయలుదేరింది. రాజమార్గంలోనే రథాన్ని దిగి ఆమె సారథితో అన్నది - "నీ విక్కడే ఉండు. అపరాహ్ణకాలానికి నేను తిరిగిరాకుంటే నీవు తిరిగి పో! నాకై నిరీక్షింపకు."

చిత్రలేఖ కుమారగిరికుటీరాన్ని చేరిన సమయంలో అతడు ధ్యానవ్యవస్థితుడై కూర్చున్నాడు. చిత్రలేఖకూడ అక్కడే కూర్చున్నది. దాదాపుగా జాముసేపటికి కుమారగిరి తన సమాధినుండి లేచాడు. అతని నేత్రము లున్మీలితములౌతూనే ఎదుట చిత్రలేఖ కనిపించింది. ఆమె కన్నులు మూసికొని ఏదో ఆలోచిస్తున్నది. ఆమె శరీరంపై ఒకే ఒక వస్త్రముంది. ఇంతవఱ కతడు చిత్రలేఖయొక్క ఐశ్వర్యోన్మత్త తరళసౌందర్యాన్నే చూచాడు. కాని ఇప్పుడామె శాంతితేజఃపరిపూర్ణసౌందర్యాన్ని తిలకించాడు. ఆమె పాలిపోయిన కృశాస్యంలోని శాంతికళ ఆ ఆస్యంలోని లోలుపతను కప్పివేసింది. అట్టి చిత్రలేఖాసౌందర్యాన్ని కుమారగిరి మంత్రముగ్ధునివలె తిలకిస్తూ ఉండి పోయాడు. "నర్తకీ!" అని కొంతసేపటి కతడు మెల్లగా అన్నాడు.

"గురుదేవుల సమాధి సమాప్తమైందా?" - ఆమె కన్నులు తెరచి అడిగింది.

"ఆ! కాని నర్తకీ చిత్రలేఖా! నీవెందు కిక్కడికి వచ్చావు?"

"గురుదేవులనుండి దీక్షను గ్రహించుటకు!"

"కాని, నీకు గుర్తుందనుకుంటా, నేను నీకు దీక్షనిచ్చుటకు నిరాకరించినానని."

"ఆ! నాకు గుర్తుంది. ఐనా వచ్చినాను. నేనీరోజు సర్వం త్యాగం చేసినాను, నా సమస్తైశ్వర్యానికి తిలోదకములిచ్చినాను. కేవలం మమత్వశేషమే నాకు మిగిలింది. ఈ మమత్వాన్ని మీసన్నిధికి తీసికొనివచ్చినాను, దీనిని తొలగించుట మీ కర్తవ్యం, ధర్మం కూడ."

"లేదు, నర్తకీ! లేదు." - చిత్రలేఖావిశాలహరిణనయనాల ముందతడు కంపించిపోయాడు. "నర్తకీ! లేదు. ఇది అసంభవం. నేను నీకు దీక్షనీయజాలను" - కుమారగిరి గట్టిగా అరిచాడు. ఆ సమయంలో అతడావేశంతో ఒడలెఱుగకుండా ఉన్నాడు. "నీకు దీక్షనిచ్చుట కర్థం పతనం - అధఃపతనం. ఎక్కడికి? నిమ్నాతినిమ్నమైన అగాధానికి! నీ ప్రవృత్తిని నేనెఱుగుదును; నా ప్రవృత్తిని కూడ నేనెఱుగుదును. నిన్నుద్ధరించుట కష్టం, నేను పతనమౌట సులభం."

కుమారగిరి లేచి నిలబడ్డాడు. విక్షిప్తునివలె అటూయిటూ కుటీరంలో తిరుగ నారంభించినాడు. కాని చిత్రలేఖ ప్రతిమవలె మౌనంగా కూర్చున్నది. కుమారగిరి ఆగి, మళ్లీ అన్నాడు - "నర్తకీ! నిజం చెప్పు. నేను నీతో అసత్యమాడుట లేదు, చెప్పు నిజంగా నీవిక్కడి కెందుకు వచ్చినావో? నీవు వాస్తవంగా జ్ఞానసముపార్జనకై వచ్చినావా? నీవు నిజంగా భోగవిలాసాలను పరిత్యజించి వచ్చినావా? ఇది సాధ్య మేనా? చెప్పు నాతో జెప్పు! మౌన మెందుకు?" - కుమారగిరి నవ్వాడు - "నీవు సత్యం పలుక నిచ్చగించుట లేదు; అసత్యంగూడ పలుక జాలకున్నావు. నీ మౌనానికి అర్థం "లేదు" అనే ప్రకటమౌతున్నది."

చిత్రలేఖ మత్తత భంగమైంది. ఆమె కుమారగిరివైపు చూచింది. ఆమెచూపులు కుమారగిరి చూపులతో గలిసినవి. ఆమె శాంతంగా జవాబిచ్చింది - "యోగీ! నీ విజయాన్ని, అపజయాన్ని అవహేళన చేస్తున్న నాకు నీవొకసారి నిజం చెప్పావు. నేనుకూడ నీకు నిజం చెప్తాను విను - నేను నిన్ను ప్రేమించుటకు వచ్చినాను."

"ఐతే నా అనుమానం మిథ్య కాదన్నమాట! కృతజ్ఞతలు! నీవు నన్ను ప్రేమించుటకు వచ్చినావా? నన్నే? ఎవ్వరినీ ఎప్పుడూ ప్రేమించని నన్ను, ప్రేమంటే ఏమిటో తెలియని నన్ను! ఎంత విచిత్రం! ఐతే ఒక మాటడుగుతాను. ప్రేమ ఏవిధంగా ఉంటుంది? ప్రేమ మనుష్యునిలో స్వయంప్రభవమౌతుందని ఇంతవఱకు నేననుకున్నాను. కాని వ్యక్తి ప్రేమించుటకు ముందుగా కటిబద్ధుడై, తరువాత ప్రేమిస్తాడని నేనెఱుగను." - కుమారగిరి వ్యంగ్యగర్భితమైన శుష్కహాసాన్ని ఒలికించాడు.

కుమారగిరివైఖరికి చిత్రలేఖ ఉలికిపడి అన్నది - "యోగీ! నా మాటతీరు సరిగా లేదు. నాభావాలను నేను సరిగా వ్యక్తం చేయలేక పోయాను. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. ఇది నీకు తెలుసు - చాలానాళ్లనుండి నీకు తెలుసు. నీవుగూడ నన్ను ప్రేమిస్తావని ఇప్పుడు నీదగ్గరికి వచ్చినాను. ఇప్పుడు నేనున్న సంగతి సొంతం చెప్పినాను."

"నీవు నన్ను ప్రేమిస్తున్నావా - అంతగా ప్రేమిస్తున్నావా? ఇందుకు నేను నిన్నెప్పుడూ నిరోధింపలేదు, నిరోధింపజాలకుంటిని గూడ. ప్రేమకు ప్రతిగా ప్రేమ నాశించుట సరియైనదే, కాని ఆ ఆశ నెరవేఱుటకు గావలసిన కార్యము నీ అధీనంలో లేదు."

చిత్రలేఖాముఖం వివర్ణమైంది. కాని మఱుక్షణంలో అది యథాస్థితి దాల్చింది. ఆమె గంభీరంగా, బహుగంభీరంగా పలికింది - "సరిగానే చెప్పావు యోగీ! ఈసారి కూడ నేను సరిగా చెప్పలేదు. నేనిక్కడికి వచ్చింది అతృప్తప్రేమపిపాసను తృప్తిపఱచుకొనుటకు. నేనిక్కడికి వచ్చింది నేను ప్రేమించే వ్యక్తియొక్క పాదధూళిని ప్రతినిత్యమూ నా శిరస్సుపై ధరించుటకు. నేనిక్కడికి వచ్చింది నీలో నన్ను విలీనమొనర్చుకొనుటకు - ఆరాధనాసక్తులు, ఆత్మవిస్మరణ, అతృప్తపిపాస - ఇవన్నీ ప్రేమకు చిహ్నాములు. నేనీ సత్యాన్ని, విశ్వాస కర్తవ్యాల పరిధిలో, నావివాహంలో దర్శించియుంటిని; కాని నేనా పరిధిలో ఆ సత్యంయొక్క వాస్తవికమహత్త్వాన్ని తెలుసుకొన లేకపోయితిని. ఇప్పుడు మళ్లీ ఆ సత్యాన్ని కనుగొన్నాను, అందుకే నీకడకు వచ్చినాను."

ఈసారి కుమారగిరి గంభీరుడైనాడు. "వాసనలను త్రోసిరాజన్న ప్రేమ ఉంటుందా?" - అతని మనస్సు ప్రశ్నించింది. దాని కతని సాధనావిశ్వాసాలు ప్రత్యుత్తరమిచ్చాయి - "ఉండదు. ఇది అసంభవం!" - ఐతే అతని హృదయమన్నది - "మూర్ఖుడా! శుద్ధప్రేమలో వాసనాతృష్ణలకు స్థానం లేదు."

కుమారగిరి అన్నాడు - "కొంత సమయమిమ్ము దేవీ! ఇది చాలా కఠినసమస్య!"

చిత్రలేఖ కుమారగిరి పాదాలను పట్టుకొన్నది - "సమయమిచ్చే సమయం కాదు దేవా! జరుగవలసిందేదో జరిగింది. నేనీ విషయంలో చాల పురోగమించాను. ఇక తిరోగమించుట అసంభవం. నేనీ కుటీరంలో ఉండుటకు వచ్చాను - తిరిగిపోవుటకు రాలేదు."

పైమాటల కేమీ ప్రత్యుత్తరమీయకుండా కుమారగిరి అడిగాడు - "ఏమి? నీవిక్కడికి కాలినడకన వచ్చినావా?"

"లేదు. రథంపై.."

"రథమెక్కడుంది?"

"రాజమార్గంపై వదలి వచ్చినాను. అది వెళ్లిపోయిందనుకుంటా."

కుమారగిరి ఆకాశంవైపు జూచాడు -"ఓ భగవంతుడా! ఇందులో ఏమి రహస్యం దాగియున్నదో? నీ ఇచ్ఛ యేముందో, అట్లే సాగుతుంది..." - అంటూ పాదాలపైన వ్రాలిన చిత్ర లేఖను లేవనెత్తాడు. "మంచిది దేవీ! ఐతే నీకు దీక్షనిస్తాను. నేను సంసారవాసనాపరంపరలతో సమరం చేయాలని భగవదిచ్ఛ ఉన్నట్లున్నది. అట్లే యగుగాక!" - అని, విశాలదేవుని పిలిచాడు.

విశాలదేవుడు వచ్చాడు. అతనితో కుమారగిరి అన్నాడు - "నీవు దేవీచిత్రలేఖకై కుటీరాన్ని సిద్ధపరచాలి."

విశాలదేవుని ముఖంపై ఆశ్చర్యభావం ప్రస్ఫుటమైంది. ఈదీక్షలోని రహస్యాన్ని అతడు బాగుగా ఎఱుగును. అతడు చిత్రలేఖ కభివాదం చేస్తూ అన్నాడు - "దేవీ! నీకు స్వాగతం!" - ఈసారి అతడు కుమారగిరిపై అర్థపూర్ణదృష్టులను సారించాడు.

కుమారగిరికి విశాలదేవుని దృక్కులలోని ఆంతర్య మర్థమైంది. "నీకాశ్చర్యమౌతుండవచ్చు వత్సా! నీవు నా నిర్బలత నొకసారి చూచినావు; అందుచే నీ కాశ్చర్యం కల్గుట సహజమే! కాని గుర్తుంచుకో. నిర్బలతను జయించుటలోనే మానవుని కర్తవ్యముంది. ఈ రోజు భగవంతుడు నాకీ సత్యాన్ని ప్రకటించినాడు. జీవితంయొక్క ఉత్కృష్టత వాసనలతో యుద్ధ మొనరించుటలో నున్నది. నేనిది చేయబోవుచున్నాను. అందుచే చిత్రలేఖకు దీక్షనీయబోవుచున్నాను."

విశాలదేవుడు చిఱునవ్వుతో అన్నాడు - "గురుదేవుల కథనం సర్వథా ఉచితం. ఈరాత్రికి కుటీరాన్ని సిద్ధం చేయమంటారా?"

చిఱునవ్వు నవ్వుతూ విశాలదేవుడు వేసిన యీ ప్రశ్నకు కుమారగిరి యావచ్ఛరీరంలో క్రోధం మెఱుపువలె ప్రవహించింది. క్రోధ కంపితుడై అతడు నిటారుగా నిలిచి అరిచాడు -"లేదు. కుటీరంతో ఏమీ ఆవశ్యకత లేదు. చిత్రలేఖ నాకుటీరంలో ఉంటుంది. నా నిర్బలత నవహేళనం చేస్తున్న నవయువకా! విశాలదేవా! గుర్తుంచుకో! నేను నీగురువును. నీకంటె ఉచ్చస్థితియం దున్నవాడను. నేను నీకు చూపిస్తాను సాధనాతపస్సులతో తప్తమైన వ్యక్తిత్వం యెంత బలవత్తరంగా ఉంటుందో!"

కుమారగిరి రుద్రరూపాన్ని చూచి విశాలదేవుడు భయకంపితుడైనాడు. అతడు గురుచరణాలపై బడి అన్నాడు - "గురుదేవా! నా మొఱకుతనాన్ని క్షమించండి. నేను కుటీరాన్ని సిద్ధపరచుటకు పోతున్నాను."

"లేదు." - కుమారగిరి గర్జించాడు - "ఇపుడు కుటీరంతో అవసరమేమీ లేదు విశాలదేవా! ఒకసారి నేను పొరపడి నీ గురువైన రత్నాంబరుని అవహేళన చేశాను. దానికి దండన మిప్పు డనుభవిస్తున్నాను. రత్నాంబరుడు నిన్నిక్కడకి పాపావిష్కరణకై పంపినాడు. ఇక నీకా పాపావిష్కరణకు, ఆ పాపంపై జరిగే విజయావిష్కరణకు అవకాశం వచ్చింది. నీవిక వెళ్లవచ్చు. నాకు సంధ్యావందన సమయమైంది."

విశాలదేవుడు వెళ్లిపోయాడు. కుమారగిరి చిత్రలేఖతో అన్నాడు - "దేవీ! జరిగిందేదో స్వప్నంవలె జరిగింది. దీన్ని నేనే నమ్మలేక పోతున్నాను. కాని అయ్యేదేదో ఐంది, నా కప్పుడప్పుడు నిప్పుతో చెలగాట మాడబోతున్నానేమో అని భయం కలుగుతుంటుంది."

చిత్రలేఖాముఖంపై మధురమందహాసం దొరలింది - "దేవా! నావల్ల భయం పనిలేదు. మీ సాధనాతపస్సులకు నావలన బాధక ముండజాలదని మాత్రం హామీ ఇస్తున్నాను. నేను మిమ్ములను ప్రేమిస్తున్నాను;ప్రేమ కర్థం నిస్సీమమైన త్యాగం. మీకేది సుఖకరమో అదే నాకూ సుఖకరం."

"తథాస్తు!" - కుమారగిరి తన ఆసనంపై కూర్చున్నాడు - "నీవొక దర్భాసనం సిద్ధపరచుకో. దర్భలను విశాలదేవుని దగ్గర తెచ్చుకో. నాకు సంధ్యాకాలసమాధికి సమయ మైంది." - అంటూ కుమారగిరి నిమీలితనేత్రుడైనాడు.

౧౩

యశోధరలో ఆకర్షణ ఉంది; ఆ ఆకర్షణ ఎంత సుందరమో! ఎంత మధురమో! ఎంత చాంచల్యరహితమో! ఆమె చెంత నున్న వ్యక్తి ఆ పవిత్రతను చూడగలిగేవాడు; పవిత్రతను పొందగలిగేవాడు, పవిత్రుడయ్యేవాడు కూడ. కాని బీజగుప్తునికి మాత్రం అందులో ఆనందం కనిపించలేదు; సంతోషం పొడసూపలేదు. ఆమె వ్యక్తిత్వంలోని వాతావరణం అతనికి అపరిచితంగా తోచింది. అభేద్యమైన ఆమె గంభీరతలో ఏదోయొక మౌనప్రహేళిక దాగియున్నది. ఆమె విస్పష్టమైన, కవిత్వహీనమైన, నిష్కపటమైన సంభాషణలో సమావిష్టమైన సాధనను బీజగుప్తుడు కేవలం సమాదరింపగలిగాడు గాని దానిని తన జీవితంలో అభిలషణీయంగా భావింపలేకపోయాడు.

యౌవనం చాంచల్యాన్ని కోరుకొంటుంది. అడుగడుగునా కష్టాలను వెదకుకొంటుంది, వానిని అధిగమిస్తుంది కూడ. యౌవనం తన అస్తిత్వాన్ని చాటుకొంటుంది - ఎప్పుడూ తన వ్యక్తిత్వాన్ని లయింపజేసికొనుటకు గాని, మఱుగుపఱచుకొనుటకు గాని ఇష్టపడదు. ప్రాకట్యమైన, ప్రభావవంతమైన వ్యక్తిత్వం గల వ్యక్తులనే యౌవనం అభిలషిస్తుంది.

అందుచేత బీజగుప్తుని హృదయంలో యశోధరాస్మృతి ఒక భయాన్వితమైన సుఖంగా - ఒక భ్రమమిశ్రితానురాగంగా, ఒక జీవరహితమైనప్రేమగా ఉండిపోయింది.

హృదయమందిరంలో నిల్పుకొని నిత్యమూ పూజింపదగ్గది యశోధరామూర్తి. ఆదర్శనారీత్వముతో గూడిన పవిత్రమూర్తి ఆమెది. ధర్మమునందలి విశ్వాసమునకు ఆమెది ప్రతిమూర్తి. ఆమె కటాక్షామృతం శాంతికీ, శీతలతకూ నెలవు. కాని బీజగుప్తుడు కోరేది జీవితానుభవాన్నీ, జీవితంలోని చాంచల్యాన్నీ, యౌవనోద్రేకంలోని ఉడుకురక్తపు మాదకతనూ. అందుచే నతడు యశోధరను తన జీవితంలో వాంఛింపలేదు.

ఒకసారి మదిరను సేవించినవాడు - కాదు , మదిరలోని మాదకత్వాన్ని చవిచూచినవాడు - దానిని విడువలేడు. బీజగుప్తుడు చిత్రలేఖను ప్రేమిస్తున్నాడు; ఆమెను విడనాడడం అతనికి అసాధ్యంగా తోచింది.

బీజగుప్తుడు తన ప్రాసాదానికి చేరుకోగానే అతనికి చిత్రలేఖ లేఖ కనిపించింది. అది మామూలుగా, సంక్షిప్తంగా ఉంది. కాని ఆ సంక్షిప్తలేఖలో ఒక జీవితపు దీర్ఘవృత్తం గర్భితమై ఉంది; ఒక మనోవిజ్ఞానపు సంపూర్ణగ్రంథం ఇమిడి ఉంది. ఆ లేఖలోని విషయ మిట్లుంది ..

"పూజ్యశ్రేష్ఠా!

నేనీరోజేది చేస్తున్నానో అది చేస్తానని నేనెప్పుడూ ఊహింపనైనా లేదు. నేను నిన్ను ప్రేమించియుంటిని - ఇప్పుడూ ప్రేమిస్తున్నాను గూడ. ప్రేమలో త్యాగంయొక్క ఆవశ్యకత ఉంటుంది - ఆ త్యాగాన్నే నేనిప్పుడు చేస్తున్నాను. నేను నీ జీవితాన్ని నిరర్థకం చేసినాను - యోగ్యుడైన ఒక పురుషుణ్ణి కర్తవ్యచ్యుతునిగా చేసినాను. ఇప్పుడు దానికి ప్రతీకారంగా భోగవిలాసాలను సమస్తమూ త్యజించి సంయమనసాధనచేయడం సమంజసమని తలంచినాను. అందుచేత నేను యోగి కుమారగిరినుండి దీక్షను స్వీకరిస్తున్నాను. నీవు అవశ్యంగా పెండ్లి చేసికొనవలెను - నీకొఱకు గాకున్నా నా ప్రార్థనను కాదనకుండా. నేనున్నంతవఱకు నీవు వివాహం చేసికొనవు - అది నాకు తెలుసు. అందుకే నేను విడిపోతున్నాను. ఇక నావిషయం. నేను విధవను - ప్రేమలో చిక్కుకొని కర్తవ్యభ్రష్టురాలనైనాను. మఱొక సారి నా కర్తవ్యపాలనను చేస్తాను; విధవావిహితమైన సంయమనపాలనను చేయ యత్నిస్తాను.

ఇట్లు మీ చిత్రలేఖ"

బీజగుప్తు డా లేఖను చదివాడు - చదువుతుండగనే అతని చేతులు కంపింపసాగినవి. అతని వదనం వివర్ణమైంది. హృదయం దడదడలాడింది. ఆ లేఖ నతడు శ్వేతాంకుని కొసగి, ముఖాన్ని దాచుకొని తన శయనమందిరంలో ప్రవేశించాడు.

బీజగుప్తునికేది జరుగుందని భయంగా ఉండేదో అదే జరిగింది. చిత్రలేఖ - కూమారగిరి! ఎంత విచిత్రమైన సంబంధం! "వీరిద్దఱూ ఎక్కువకాలం కలిసి ఉండడం - ఇదైతే అసంభవం!" - అంటూ అతడరిచాడు.

కాని దానివల్ల అయ్యేదేమిటి? అది సంభవమైనా అసంభవమైనా తనకు ఒరిగేదేమిటి? చిత్రలేఖ కుమారగిరియందు ఎందు కాకర్షితు రాలైంది? ప్రేమ అంటే ఇదేనా? ఆత్మల సంబంధం అస్థిరమేనా? "ఆత్మల సంబంధం అనాదిగా ఉండదు బీజగుప్తా" - అని మునుపు చిత్రలేఖ అన్న మాట నిజమేనా? - ఈ ప్రశ్నలన్నీ అతని కుత్పన్నమైనాయి.

ఐతే చిత్రలేఖ బీజగుప్తుణ్ణిప్రేమించడం లేదని ఎప్పుడు నిర్ణయమైంది? ఆమె ఉత్తరమైతే అట్లా అనడంలేదు - అది మఱొక కథ చెప్పున్నది - అది ప్రేమకు సర్వోత్కృష్టపరాకాష్ఠయైన త్యాగాన్నీ, ఆత్మార్పణాన్నీ చిత్రలేఖ చేస్తున్నదని అంటున్నది. ఆమె బీజగుప్తుణ్ణి విడనాడింది అతనిని సుఖవంతుణ్ణి చేయుటకే - బీజగుప్తుని హృదయంలో చిత్రలేఖపై పొడసూపిన అవిశ్వాసం దూరం కాసాగింది. చిత్రలేఖ మాననీయురాలే . ఐతే ఆమె ఒక పొరపాటు - మహాఘోరమైన పొరపాటు - చేసింది. బీజగుప్తుని జీవితాన్ని సుఖమయం చేసేందుకు బదులు దుఃఖమయం చేసింది. అన్యస్త్రీని వివాహమాడుట బీజగుప్తునికి అసాధ్యం - అతని హృదయం ఒకే ఒక స్త్రీకి అర్పితం - అమెయే చిత్రలేఖ. మఱి ప్రేమతో వివాహానికి ప్రగాడమైన సంబంధ ముంటుంది గదా!

బీజగుప్తుడు నిద్రింపలేక పోయాడు. అప్పటికి మధ్యరాత్రి గడచింది. అతడు లేచినాడు. తన ప్రాసాదంనుండి కుమారగిరి కుటీరం వైపు పాదచారియై బయలుదేరినాడు.

కుమారగిరి కుటీరంలో దీపం వెలుగుతూ ఉంది. కుటీరంలో కుమారగిరి ధ్యానవ్యవస్థితుడై దర్భాసనంపై కూర్చున్నాడు. చిత్రలేఖ ఒక మూలకు కుశాసనంపై వ్రాలిపోయి శయనిస్తున్నది. బీజగుప్తుడు చిత్రలేఖను వైభవవిలాసాల తళుకుబెళుకులతో చూచినవాడే కాని శాంతిచ్ఛాయావరణంలో చూచియుండలేదు. ఇప్పుడామెను శాంత్యావరణంలో చూచినాడు. ఆమె శరీరంపై సొమ్ములు లేవు, కేసరి లేపం లేదు, నైగనిగ్యం లేదు. ఆమె వదనంలో శాంతియొక్క మధురమందహాసం లాసం చేస్తున్నది; బహుశః ఆమె స్వప్నలోకంలో శాంతిదేవతాచరణారవిందాలపై వ్రాలిపోయి శయనిస్తున్నదేమో! బీజగుప్తుడామె తలగడవైపు కూర్చొని తదేకంగా ఆమెనే చూస్తు న్నాడు.

ఉదయమైంది. కుమారగిరి సమాధిని విరమించాడు, చిత్రలేఖ నయనాలు తెఱచింది. ఇద్దఱొకేసారి బీజగుప్తుణ్ణి చూచినారు; ఇద్దఱొకేసారి "అరరే! బీజగుప్తుడా!" - అన్నారు.

కుమారగిరి ముఖంపై ఆశ్చర్యం పొడసూపింది.

చిత్రలేఖాముఖంపై భయం పొటమరించింది.

బీజగుప్తుడు కుమారగిరికి ప్రణామం చేసినాడు; అతడు చిత్రలేఖకుగూడ ప్రణామం చేసినాడు. కుమారగిరి అతని నాశీర్వదించి నాడు; చిత్రలేఖ కన్నులు మూసికొన్నది. బీజగుప్తుడు "చిత్రలేఖా!" అని నెమ్మదిగా పిలచినాడు.

"బీజగుప్తా!"

బీజగుప్తుడెంతో మాట్లాడాలని వచ్చినాడు. కాని అంతా మఱచిపోయినాడు. ఎంతో సాహసం చేసి, "నీవు నిర్ణయించుకొన్నావా?" - అన్నాడు.

అపరాధినివలె చిత్రలేఖ తల వ్రాల్చింది. ఆమె కన్నులనుండి రెండు బాష్పములు రాలినవి. ఆమె నెమ్మదిగా అన్నది - "నీవు చూస్తున్నావుగా, ఇదే నా తుదినిర్ణయం."

"కాని నీ నిర్ణయాన్నిగుఱించి తిరిగి ఆలోచించే అధికారం నీకున్నది. ఏమి నీవు నిర్ణయించుకునేందుకు ముందు నన్నడిగే అవసరం లేదా? నీ హృదయంలోని మాటను తెలుపవలసిన ఆవశ్యకతలేనంత పరాయివానిగా నన్ను నీ వెంచుతున్నావా? చిత్రలేఖా! ప్రేమ అనేది ఇర్వురియొక్క భేదభావముల నెంచదు; ప్రేమ అనేది ఇర్వురి హృదయాల అభిన్నతను ప్రకాశమానం చేస్తుంది. నీవీ నిర్ణయం తీసికొంటే నేను పెండ్లిచేసికొంటానని నీవనుకుంటున్నావు. కాని ఇది తప్పు. నీ నిర్ణయం నన్ను సుఖపెట్టజాలదు - ఇంతమాత్రం నమ్ము. నేను జీవితంలో నిన్ను మాత్రమే ప్రేమించినాను. మఱింకెవ్వరినీ ప్రేమించలేను, వివాహం చేసికొన లేను కూడ! "

చిత్రలేఖ బీజగుప్తుని పాదాలపై పడిపోయింది. ఒక్కసారిగా ఆమెకు బీజగుప్తుని వెంట వెళ్లిపోవాలనిపించింది - కాని ఎకాయెకిన ఆమె ఆగిపోయింది. ఆమె బహుదూరం పయనించింది; ఇప్పుడు తిరోగమించడం ఆమెకు అసాధ్యమైంది. బీజగుప్తుని పాదాలపై ఆమె వెక్కి వెక్కి ఏడ్వసాగింది. బీజగుప్తుడు ఆమెను లేవనెత్తాడు. ఆమె శాంతురాలై అన్నది- "బీజగుప్తా! నీవు పూజ్యుడవు. నీవు మనుష్యమాత్రుడవు గావు, దేవతవు. నేను నిన్నెఱుగుదును. కాని నిన్ను ప్రేమించి నీ జీవితాన్ని నిరర్థకం చేసినానని కూడ నేనెఱుగుదును. నీవు వివాహం చేసి కొననేవలెను. నీవు నన్ను ప్రేమిస్తున్నావంటే నన్ను సుఖవంతురాలుగా చేయాలి. కాని నిన్ను వివాహితునిగా చూడందే, నన్ను "అమ్మా" అని పిలువని నీ సంతానాన్ని చూడందే నాకు సుఖం కల్గదు. నీవు వివాహం చేసికో. ఇంతమాత్రం గుర్తుంచుకో బీజగుప్తా! నేను నిన్నెప్పుడూ ప్రేమిస్తూనే ఉంటాను. ప్రేమ ఎప్పుడూ ఆంగికభోగప్రధానంగానే ఉంటుందా, ఆంగికభోగరహితంగా ఉండదా యేమి? నేనిప్పుడు నీతో శారీరకసంబంధాన్ని మాత్రమే త్రెంచుకొన్నాను. ఇది లేనందున మన ఆత్మీయసంబంధం మఱింత దృఢమౌతుంది."

బీజగుప్తు డింతే అన్నాడు -"చిత్రలేఖా! మళ్లీ ఆలోచించుకో. నీవేది చేయమంటున్నావో అది నాకు అసాధ్యం."

చిత్రలేఖ కరములతో బీజగుప్తుని గళమును పెనవేస్తూ అన్నది - "కొంతకాలం మనలను వేర్వేరుగా నుండనిచ్చి చూడు. బహుశః కొన్నిరోజుల తర్వాత నీవు వివాహమాడుటకు సిద్ధపడుతావేమో! ప్రేమలో వియోగముండదా యేమి? ఈ వియోగాన్నే మనం కొంత కాలం సహించి ఉందాం."

బీజగుప్తుడు లేచి నిలుచున్నాడు - "చెప్పవలసిందేమో చెప్పినాను. దీనిని పాటించుట, పాటింపకపోవుట నీపైన ఆధారపడి ఉంది. నీవు కోరుకొన్నట్లు ఔతుందో కాదో కాని, కొన్ని రోజలలోపలనే నీ పొరపాటు నీకు తెలిసివస్తుంది" - అంటూ బీజగుప్తు డక్కడనుండి వెడలిపోయినాడు. చిత్రలేఖ అతనిని రాజమార్గంవఱకు అనుగమించి, అక్కడ ఆగిపోయింది. ఆమె బీజగుప్తుని చుంబనాన్ని స్వీకరించింది. ఆ చుంబనంలో బీజగుప్తుడు ఎన్నో ఏండ్లనుండి అనుభవించని మాదకత్వాన్ని, ప్రగాఢప్రేమాతిశయాన్ని కన్నాడు. వీడ్కోలు చెప్తూ చిత్రలేఖ అతనిపాదాలను పట్టుకొని అన్నది - "నేను బహుశః అనుచితకార్యాన్నే చేస్తున్నానేమో బీజగుప్తా - నన్ను క్షమించాలి!"

బీజగుప్తుని వీడ్కొలిపి చిత్రలేఖ కుటీరానికి తిరిగివచ్చింది. అప్పుడు కుమారగిరి ఏదో ఆలోచిస్తున్నాడు. అతడు చిత్రలేఖ నొక ఆసనంపై కూర్చొనమని ఆదేశిస్తూ అన్నాడు - "చిత్ర లేఖా! నీవు నన్ను ప్రేమిస్తున్నానని నాతో అన్నావు. ఇది నిజమేనా?"

చిత్రలేఖ ఆశ్చర్యంతో పలికింది - "ఔను! ఐతే యేం?"

"మఱి ఇప్పుడే బీజగుప్తునితో అన్నావు గదా, అతనిని ప్రేమిస్తున్నానని, అవశ్యంగా ప్రేమిస్తూనే ఉంటానని!"

"ఆ! అదీ నిజమే!"

"ఐతే నీవొకేసారి ఇర్వురు వ్యక్తులను ప్రేమించగలవా?" - కుమారగిరి శాంతముఖమండలంపై కొంత అవిశ్వాసచ్ఛాయ ముద్ర వేసింది.

"ఇది అసంభవమని మీరనుకొంటున్నారా? గురుదేవా! పురుషుడు ఇర్వురు స్త్రీలను పెండ్లాడి, ఆ యిర్వురినీ ప్రేమించగలడు. మఱి స్త్రీ యెందుకట్లు చేయజాలదు? స్త్రీ తన పతినెంత ప్రేమిస్తుందో, పుత్రుణ్ణికూడ అంతే ప్రేమింపగలదు. ఆత్మీయసంబంధం అనేకవ్యక్తులతో ఒకేసారి కల్గడం సంభవమే."

"చిత్రలేఖా! నీవు నాకు మోసం చేయగోరుతున్నావో, లేక బీజగుప్తునికో, లేక నీన్నే నీవు మోసం చేసికొంటున్నావో!"

"నేను మీకు మోసం చేయడంలేదు గురుదేవా - ఇంతమాత్రం నమ్మండి. బహుశః బీజగుప్తునికో, లేక నాకో మోసం చేసి కొంటున్నాను"

"కాదు చిత్రలేఖా! మళ్లీ ఇంకొకసారి బాగా ఆలోచించుకో! నాదగ్గర నుండి నీవు బీజగుప్తుణ్ణి ప్రేమింపజాలవు - ఇది నిశ్చయంగా తెలుసుకో. నాతోనుండి నీవు సంసారమునకు అతీతమైన స్థాయికి ఎదుగవలసి ఉంటుంది. నాలో తపస్సాధనల శుష్కక్షేత్రమే ఉంది. హృదయదుర్బలత కిక్కడ పనిలేదు. నేను నీకు సమయమిస్తాను - మఱొకసారి ఆలోచించుకో!"

"ఆలోచించినాను గురుదేవా! మీరు చెప్పినట్లే నేను చేయగలను. మీరన్నట్లుగా నేను మమత్వాన్ని త్యంజించుటకే తలపడి ఉన్నాను; మఱి ప్రపంచాన్ని త్యజించడ మంతకంటే సులభం గదా!"

కుమారగిరి చిత్రలేఖను అర్థంచేసికొనలేకపోయాడు. ఆమెదొక అసాధారణవ్యక్తిత్వం - ఆ వ్యక్తిత్వమెంత ప్రభావశాలియైనదో! కుమారగిరికి మఱొకసారి చిత్రలేఖకు దీక్షనీయగూడ దనిపించింది. అతడామెతో అన్నాడు - "దేవీ చిత్రలేఖా! నాకు నిన్నర్థం చేసికొనే సామర్థ్యం లేదు. నీ వ్యక్తిత్వం నాకంటె తక్కువది కాదు. అందుచేత నీకు శిక్షనీయడం ఎంతవఱకు ఉచితమో దానిని నిర్ణయించవలసి ఉంది. నేనిది నిర్ణయించనంతవఱకు ...."

కుమారగిరి వాక్యం పూర్తయ్యేలోపలనే విశాలదేవుడు కుటీరంలో ప్రవేశించాడు. అతనిని చూచి కుమారగిరి వాక్యాన్ని పూర్తి చేయకుండనే మధ్యలో ఆపివేశాడు. విశాలదేవుడు ముందుగా గురువుగారి పాదములను తాకి, ఆ పైన చిత్రలేఖకు అభివాదము చేసి అక్కడనుండి వెడలిపోయినాడు.

విశాలదేవుడు వెళ్లిపోయిన మీదట కుమారగిరి నవ్వుతూ అన్నాడు - "భగవంతుని ఆదేశం నీకు దీక్షనీయాలని, నిన్ను నా సన్నిధిలో ఉంచుకోవాలని, నీకు శిక్షణ నీయవలెనని ఉన్నట్లున్నది. నర్తకీ! నేనింతవఱకన్న మాటలపై ధ్యాస నిల్పకు."

౧౪

పగటి తర్వాత రాత్రి, రాత్రి తర్వాత పగలు; సుఖానంతరము దుఃఖము, దుఃఖానంతరము సుఖము - రాత్రి లేనిదే పగటికి మహత్త్వం లేదు; పగలు లేనిదే రాత్రికి మహత్త్వం లేదు. దుఃఖం లేనిదే సుఖానికి విలువ లేదు, సుఖం లేనిదే దుఃఖానికి విలువ లేదు.

ఇదే పరివర్తనయొక్క నియమం. ప్రపంచం పరివర్తనశీలం. మనుష్యుడు దానిలో నొక భాగం. బీజగుప్తుడట్టి మనుష్యుడు - అతడు సుఖమును చూచియుండెను, దుఃఖమును కూడ చూడవలసిన ఆవశ్యకత అతనికుండెను. కాని బీజగుప్తుడు దుఃఖభారంతో క్రుంగి పోయెను. అతడూహామాత్రముగానైనా ఎన్నడూ తలంపని దిప్పుడు జర్గెను. తానెందుకు జీవించియున్నానని అతనికి ఆశ్చర్యము కల్గెను. అతనికి జీవనము భారమయ్యెను.

ఐనను సుఖదుఃఖములను సహించి జీవించుటకే మానవుడు నిర్మింపబడ్డాడు. వీనిలో ఏదో యొకదానినుండి వెనుదీయడం పిఱికి తనం. బీజగుప్తునికిది అనుభవమైంది. చిత్రలేఖావియోగాన్ని సాహసంతో సహించడానికే అతడు నిశ్చయించుకొన్నాడు.

ఐతే ఒక బాధ - తాను పాటలీపుత్రంలో ఉంటే చిత్రలేఖను చూడవలసిన అవసరం కలుగుతుంది. ఇది జరిగితే తన వియోగావస్థకు విలువేమి ఉంటుంది? దీనికంటె తీవ్రమైన విషయం మఱొకటి - చిత్రలేఖ తనను వీడి సాధనానిరతురాలైందని ఇతరసామంతులకు తెలిస్తే వారికి తన ముఖమెలాగు చూపగలడు? మూడవవిషయం - యశోధర ప్రేమతో తనను ప్రభావితుని చేస్తుందా?

బీజగుప్తుడు మధ్యాహ్నంవఱకు ఈసమస్యల ముడులను విప్పడానికి యత్నించాడు. కాని ఎంత విప్పితే అవి అంత బిగుసుక పోయాయి. చివరకు విసుగెత్తి లేచాడు. ఈ విషయాల నాలోచించినకొలదీ అతనిలో దుస్సహమైన బాధ కలుగసాగింది. సాయంకాల మతడు శ్వేతాంకునితో అన్నాడు - "శ్వేతాంకా! నాదొక మాట!"

"అదేమి స్వామీ?"

"మనం కాశీకి పోదాం - కొన్ని రోజులపాటు దేశాటన చేయాలనే కోరిక నాకు కలుగుతూ ఉంది."

"ఇంత త్వరగానా!" - శ్వేతాంకు డాశ్చర్యంతో అడిగాడు. యశోధరతో తనకు ప్రవృద్ధమౌతున్న ప్రేమ నతడు పరిపుష్టం చేసికొన దలుస్తున్నాడు. అందుచేత అతనికి పాటలీపుత్రంలో ఉండడం అవసరంగా ఉంది - "ఐదు, పదిరోజులింకా ఉండలేమా? ఏర్పాట్లు చేయ డానికి వ్యవధి చాలా తక్కువగా ఉంది."

బీజగుప్తుడు నిరీహతో అన్నాడు - "కాదు. ఎల్లుండే పోవలెను. ఏర్పాట్లకేమి క్షణంలో ఔతాయి. నేనూ, నీవూ పొయ్యే ఏర్పాట్లు చేయి."

'స్వామివారి ఆజ్ఞానుసారమే కానిండు!"

శ్వేతాంకుడు రాత్రంతా మేల్కొన్నాడు. బీజగుప్తుని ఈ నిర్ణయం అతనికి నచ్చలేదు, కాని అతడు చేయగలిగిందేమిటి? అతడు బీజ గుప్తునితో పోవుటకు నిరాకరించుదామని అనుకొన్నాడు గాని, అందుకు సాహసింపలేకపోయాడు. అట్లు చేయుట నీచత్వమౌతుందని అతని హృదయం వాకొన్నది. ఉదయం లేచి బీజగుప్తునితో అతడన్నాడు - "స్వామీ! నే నార్యమృత్యుంజయునితో కలిసికొనడానికి మీ అనుజ్ఞ కోరుతున్నాను."

కారణం తెలిసికూడ బీజగుప్తుడడిగాడు - "ఎందుకు?"

"బయటికి పోతున్నాము. ఎన్నో రోజులపాటు బయటనే ఉండవచ్చు. అందుచేత అతని వీడ్కోలును కోరుకొనుటకు పోతున్నాను."

"నీవు వెళ్లవచ్చు" - బీజగుప్తుడు లోలోపల నవ్వుకున్నాడు. ఒకడు ప్రేమించి పశ్చాత్తాపపడుతున్నాడు; మఱొకడు ప్రేమించుటకు తాపత్రయపడుతున్నాడు.

శ్వేతాంకుడు మృత్యుంజయుని ప్రాసాదం చేరుకొన్నాడు. అప్పుడు మృత్యుంజయు డింటిలో లేడు. తాను వచ్చినట్లుగా శ్వేతాం కుడు యశోధరకు ఎఱుకపరిచాడు.

విశ్రాంతిభవనంలో యశోధర శ్వేతాంకుణ్ణి కలిసికొన్నది. పరస్పరాభివాదం చేసికొని ఇద్దఱూ కూర్చున్నారు. కొంతసేపటివఱకు ఎవ్వరూ మాట్లాడలేదు. అప్పుడు శ్వేతాంకు డారంభించాడు - "దేవీ! ఱేపు బీజగుప్తునితోసహ నేను పాటలీపుత్రం వదలి వెళ్లుతున్నాను. అందుచేత నేడు మీ వీడ్కోలు నర్థించడానికి వచ్చినాను. బహుశః చాలా రోజులపాటు బయటనే ఉండవలసి వస్తుందనుకుంటా."

శ్వేతాంకుడు యశోధరాముఖాన్ని పరికిస్తున్నాడు. కాని ఆమె ముఖంపై ఎట్టి భావపరివర్తనా కలుగ లేదు - "బీజగుప్తుడు పాటలీ పుత్రం వదలిపోతున్నాడా? మఱి నిన్న బీజగుప్తుడు ఈ విషయమై ఏమీ చెప్పలేదే!"

శ్వేతాంకునికి యశోధర చూపిన ఔదాసీన్యం నచ్చలేదు. అతలకుతలమైన మనస్సుతో అతడన్నాడు - "దేవీ యశోధరా! చిత్రలేఖ బీజగుప్తుని సాహచర్యాన్ని త్యజించి కుమారగిరినుండి దీక్షను గ్రహించింది."

ఈ మాటకు యశోధర హఠాత్తుగా ఉలికిపడింది - "ఏమన్నావ్? చిత్రలేఖ వైరాగ్యాన్ని స్వీకరించిందా? ఎంత విచిత్రం! ఆర్యబీజ గుప్తుల కిది విశేషదుఃఖం కలిగించిందనుకుంటా!" - యశోధర కొంతకాలం మౌనం వహించి మళ్లీ అన్నది - "నేను చిత్రలేఖను కలిసి నప్పుడే అనుకొన్నాను - ఆమె మాన్యురాలనీ, బీజగుప్తునికై ఆమె ఎంత త్యాగమైనా చేయగలదనీ!"

శ్వేతాంకునికి తన దెబ్బ తనకే తగిలినట్లైంది. అతనిలో ప్రతీకారవాంఛ భగ్గుమన్నది - "ఐతే బీజగుప్తుడు చిత్రలేఖను విడిచి మఱే స్త్రీని ప్రేమించలేడు. నా కతని స్వభావం తెలుసు. సంతప్తహృదయాన్ని శాంతపఱచుకొనుటకై అతడు బయటికి వెళ్లాలనుకుంటున్నాడు. అతని సంతాపమెంత ప్రబలంగా ఉందంటే బయటికి వెళ్లక పాటలీపుత్రంలోనే ఉంటే అతడు ఆత్మ హత్యకు పాల్పడవచ్చు."

ఈసారి యశోధరాముఖం పాలిపోయింది - "బాగానే చెప్పావు శ్వేతాంకా! ఆర్యబీజగుప్తులను నేనుకూడ కొంత అర్థం చేసి కొన్నాను, ఇప్పుడు నీ మాటలలోని సారాన్నికూడ గ్రహించినాను. అతడెంత ఉత్తమవ్యక్తి అంటే అతనిలో ఇది దోషంగా నేను భావించను. ఈ మాట వింటుంటే అతనిపట్ల నా శ్రద్ధాసక్తులింకా ప్రవృద్ధమైనాయి."

శ్వేతాంకుడు క్రోధంతో ఉన్మత్తుడైనాడు - "యశోధరా! ఒక ఆటకత్తెకొఱకు ఇంత పిచ్చివాడగుట ఆర్యబీజగుప్తునికి గాని మఱొక వ్యక్తికి గాని ఎంతవఱకు సమంజసమనేది నాకింతవఱకు బోధపడలేదు. ఇంకొక మాట. దుఃఖం కలిగినంతలో ఇంత అధైర్యపడుట మానవుని మనోదౌర్బల్యానికి దర్పణం కాదా?"

శ్వేతాంకుని ఈ అకారణక్రోధానికి కారణం యశోధర కర్థం కాలేదు. ఆమె గంభీరంగా అన్నది - "శ్వేతాంకా! నీవనేది ఉచితమే కావచ్చు, దానిని నేను ఖండించడం లేదు. కాని నేనింతమాత్రం అనగలను. ఇందులో బీజగుప్తుల దోషమేమీ లేదని. ఆర్యబీజగుప్తుల జీవితంలో చిత్రలేఖ కేవలం ఆటకత్తె గాదు, ఆమె వారికి పత్నీతుల్యురాలు. ఇంతమాత్రం నాకు తెలుసు, నీకు తెలుసు, సర్వప్రపంచానికీ తెలుసు. అంతేకాక ప్రతివ్యక్తిలో బలహీనతలుంటాయి, ఎవ్వడూ పరిపూర్ణుడు గాడు. బలహీనతలవల్ల ఒక వ్యక్తిని చెడుగా భావించడం, శత్రువుగా నెంచడం మంచిది కాదు. ఈ విధంగా నెంచితే ఒక వ్యక్తి మఱొకవ్యక్తితో మైత్రి నెఱపలేడు. అట్టివాడు ప్రపంచంలోని ప్రతివ్యక్తినీ చెడువాడని అంటాడు; ప్రతివ్యక్తీ అతనికి శత్రువౌతాడు. అందువల్ల అతని జీవనం కష్టతరమౌతుంది. ఇతరవ్యక్తుల బలహీనతలపట్ల సానుభూతిని ప్రకటించడం మనిషి కర్తవ్యం."

ఆమె అన్నదానికి విరుద్ధమైన భావన శ్వేతాంకుని వివేకాన్ని మఱుగుపరచింది. అత డన్నాడు - "కర్తవ్యంలో సానుభూతికీ కనికరానికీ స్థానం లేదు. బలహీనతలను నిందించి, ఆ బలహీనతలను వ్యక్తినుండి దూరం చేయడం మంచిది."

యశోధర నవ్వింది - "మానవుడు తన స్వంత బలహీనతలను తొలగించుకొను యత్నం ముందుగా చేయవలెను. ఆర్యశ్వేతాంకా! సులభంగా ఇతరుల దోషములెన్నుట, తన దోషములను తెలిసికొనకపోవుట ప్రపంచరీతి అయింది. తన దోషములను తెలిసికొని వానిని తొలగించుకొనువాడే ఉత్తముడు."

యశోధర చివరివాక్యం శ్వేతాంకుని హృదయంలో బాణంవలె గ్రుచ్చుకొన్నది. కాని తననుగుఱించే ఆమె వ్యంగ్యంగా అంటున్న దని అతడు నిర్ణయించుకొనలేకపోయాడు. కాని అమె అన్నది మాత్రం యుక్తంగానే ఉంది - అది బీజగుప్తునికీ తగలుతుంది, శ్వేతాంకు నికీ తగులుతుంది. ఎందుకంటే బీజగుప్తుడు తన బలహీనతలను గుర్తించి వాని నధిగమింప యత్నిస్తున్నాడు. శ్వేతాంకుడేమో బీజగుప్తు

నిలో దోషము లెన్నుతున్నాడు, తన ప్రతీకారవాంఛ దోషయుతమని ఎఱుగకున్నాడు. శ్వేతాంకుని వదనం వివర్ణమైంది. కంపిస్తూ అతడు క్షీణస్వరంతో అన్నాడు - "నీ యెదుట ఆర్యబీజగుప్తునిలో దోషములెన్నుట అనుచితమైనది. నేను క్షమాపణ కోరుకుంటాను, ఇక మీదట నా దోషములను తొలగించుకొనుటకు యత్నిస్తాను."

"నీయెదుట ఆర్యబీజగుప్తునిలో దోషములెన్నుట అనుచితమైనది" - యశోధరముఖం క్రోధంతో ఎఱ్ఱబడింది. కాని మఱుక్షణంలోనే శ్వేతాంకుని అకారణక్రోధానికి కారణం గ్రహించి అది తెల్లబడింది. "ఆర్యశ్వేతాంకా! నీవు భ్రమపడుతున్నావు. నేను ఆర్యబీజగుప్తులను ప్రేమించడం లేదు - నీతో ఇది స్పష్టం చేయడం సముచితమనుకుంటా" - యశోధరానయనాలు బాష్పపూరితములైనవి. ఆమె ముఖమును కొంగులో దాచుకొన్నది.

శ్వేతాంకుని నోట పై వాక్యం అప్రయత్నంగా, అయాచితంగా వెలువడింది. అందు కతనికి సంతాపం కల్గింది. కాని వెలువడిన వాక్యాన్ని వెన్క్కకు తీసికొనలేడుగదా! అతడు యశోధర కెదురుగా చేతులు జోడించి పలికాడు - " దేవీ యశోధరా! నన్ను క్షమించు. నేను గొప్ప అపరాధం చేసినాను. అప్పుడు నాలో నేను లేను. నీవు బహుశః గ్రహించి ఉంటావనుకుంటా నేనిందు కింత కటువుగా ప్రవర్తించినానో .. "

"ఎందుకు?" - యశోధర అడిగింది. కారణాన్ని ఊహించినా, అతని ముఖతః స్పష్టంగా వినాలని ఆమె ఇష్టపడిందేమో!

"ఎందుకంటే నేను నిన్ను ప్రేమిస్తున్నాను."

యశోధర శ్వేతాంకునివైపు చూచింది. ఆమె నిస్సంకోచమైన చూపులు శ్వేతాంకుని చూపులతో కలిసినవి. "చాలా ఆశ్చర్యకరమైన విషయం శ్వేతాంకా!"

ఈ మాటలు శ్వేతాంకుని నిస్తేజస్కుని చేసినవి. ఈ చిన్నవాక్యంలో ఎంత నిగూఢత, ఎంత భయానకసత్యం దాగి ఉన్నది! యశోధర శ్వేతాంకుణ్ణి ప్రేమించడం లేదు. "నాకు తెలుసు దేవీ! నీవు నన్ను ప్రేమించడం లేదు. కాని నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నేనిది నీతో చెప్ప గూడదు, ఎందుకంటే ప్రేమించడమనేది చేయవలసింది గాని చెప్పవలసింది కాదు. నేనేం జేతును? ప్రసంగమిట్లా సాగింది. నా కటుత్వానికి నా దుస్సాహసానికి నీనుండి క్షమాపణ కోరుకొంటున్నాను." - అంటూ శ్వేతాంకుడు లేచాడు.

యశోధర లేచి నిలబడింది - "క్షమాయాచనకేమీ అవసరం లేదు. ఆర్యశ్వేతాంకా! నేను నీలో దోషమెంచడం లేదు. జీవితంలో ఇట్లాంటివి ప్రతినిత్యమూ జరుగుతుంటాయి, వానిని క్షమిస్తూ ఎంతవఱకు తిరుగగలము? సరే నేనిప్పుడు వెళుతాను. నాన్నగారు వచ్చినారేమో చూస్తాను."

యశోధర నిష్క్రమించింది. శ్వేతాంకుడు తాను ఘోరమైన పొరపాటు చేసినట్లు గ్రహించాడు. తాను వచ్చింది యశోధరకొఱకు. అదృష్టవశాత్తూ ఆమెతో ఏకాంతంగా బాగానే మాట్లాడగలిగాడు; మాటలింకా అధికంగా సాగేవేమో తన మూర్ఖత్వంవల్ల ఆమెకు కోపం తెప్పించకుంటే. తన మూర్ఖత్వంపై అతనికి క్రోధం రాసాగింది. తాను వచ్చిన కార్యం కూడే బదులు పాడయింది. ఇక అక్కడ ఉండడం అతనికి అనావశ్యకంగా తోచింది. అతడు లేచి బయటికి పోబోతుండగా మృత్యుంజయునితో బాటు యశోధర ఆ గదిలోనికి ప్రవేశించింది. మృత్యుంజయుని చూచి ఆగిపోయి, శ్వేతాంకు డతనికి ప్రణమించినాడు.

శ్వేతాంకుణ్ణి కూర్చొనమని ఆదేశిస్తూ మృత్యుంజయు డడిగాడు - "వత్సా! శ్వేతాంకా! నీవు బీజగుప్తునితో సహ దేశాటనకు పోతున్నావని విన్నా - ఇది నిజమేనా?"

శ్వేతాంకుడు చిఱునవ్వు నవ్వే యత్నం చేస్తూ అన్నాడు - "ఱేపే మేము పోతున్నాము."

"ఎక్కడికి పోవాలని ఆలోచన?"

"కాశికి"

"ఎప్పటికి తిరిగిరావాలని?"

"అది చెప్పలేను. అది పరిపూర్ణంగా బీజగుప్తులపై ఆధారపడి ఉంది"

యశోధర తండ్రితో అన్నది - "నాన్నా! మీరెందుకెప్పుడూ దేశాటనకు బయలుదేరరు? నేనెప్పుడూ కాశీకి వెళ్లలేదు. ఇప్పుడు ఆర్య బీజగుప్తులతోబాటు మీరూ కాశీకి వెళ్లగూడదూ?"

ఆమాట నిస్సారమైనదేమీ కాదు, పోగా పాటలీపుత్రానికి కాశీ దగ్గరగా ఉన్నది గూడ. మృత్యుంజయు డన్నాడు - " అమ్మాయీ! ఇంత త్వరగా వెళ్ళడమెట్లా సాధ్యమౌతుంది?"

"అన్నీ సాధ్యమే నాన్నా! మీరనుజ్ఞ యిస్తే ఈరోజ సాయంత్రంవఱ కన్నియేర్పాట్లూ ఔతాయి."

మృత్యంజయుడు నవ్వాడు - "యశోధరా! ఇది నీవు తొట్టతొలిగా బలవత్తరంగా కోరుతున్న కోరిక. దీనిని కాదనుటకు నాకు సామర్థ్యం చాలదు. ఒకవేళ నీ వేర్పాటు చేయగలిగితే చేయి. నన్నుమాత్రం శ్రమపెట్టకు సుమా!"

శ్వేతాంకుని ఖిన్నహృదయం మఱింత ఖిన్నమైంది. అవశ్యంగా యశోధర బీజగుప్తుణ్ణిప్రేమిస్తుంది, అందుకే ఆమె అంత హుటా హుటిగ కాశీకి ప్రయాణమైంది. ఐతే బీజగుప్తుడు యశోధరను ప్రేమించడం లేదు; కొన్నాళ్ళపాటు అతనివెంట ఉంటే ఆమెకే తెలుస్తుంది, తనను ఎవరు ప్రేమిస్తున్నారో, ఎవరు ప్రేమించడం లేదో - అనే ఆలోచన అతనిని శాంతపరచింది.

యశోధర శ్వేతాంకునితో అన్నది - "ఆర్యశ్వేతాంకా! మేమూ మీతో వస్తాము. గుర్తుంచుకొని ఆర్యబీజగుప్తులకిది చెప్పు." మృత్యుంజయుడు సంకోచిస్తూ అన్నాడు - "యశోధరా! ముందు ఏర్పాట్లు చేయి. ఒకవేళ నీవు ఱేపటిలోగా చేయకుంటే ఆర్య బీజగుప్తునికి ఒకరోజు వృథా ఔతుంది."

"ఏర్పాటు చేయలేనా? ఏమంటున్నారు నాన్నా! శ్వేతాంకా! మేము తప్పకుండా వస్తున్నాము."

శ్వేతాంకుడు లేచి నిలుచున్నాడు - "ఐతే నేననుజ్ఞ కోరుతాను. ఆర్యశ్రేష్ఠా! నేనిది ఆర్యబీజగుప్తులకు చెప్తాను" - అని యశోధరవైపు తిరిగి అన్నాడు - "దేవీ! ఏర్పాటు చేయడంలో ఏమైన కష్టమౌతే నేను సాయంచేస్తాను. సాయం చేయడానికి సాయంత్రం రమ్మంటారా?"

యశోధర నవ్వింది - "కృతజ్ఞతలు శ్వేతాంకా! సాయంకాలం వచ్చినపుడు నీవు చేయ గలిగిందేమైనా ఉంటే చెప్తాను."

శ్వేతాంకుడు వెళ్లిపోయాడు. అతడు బీజగుప్తునితోఅన్నాడు - "స్వామీ! ఆర్యశ్రేష్ఠుడు మృత్యుంజయుడు తన కూతురు యశోధరతో ఱేపు కాశీకి వెళ్లదలస్తున్నాడు. మీతో సహ ఆ యాత్ర చేస్తే బాగుంటుందని అడుగమన్నాడు."

బీజగుప్తుడీ వార్తకు సిద్ధంగా లేడు. ఏ కారణాలవల్ల అతడు నగరాన్ని వీడి దేశయాత్ర చేయాలనుకొంటున్నాడో, వానిలో నొకటి తన వెంటనే వస్తూ ఉంది - ఇంక అయ్యేదేమిటి? బీజగుప్తుడు పరధ్యానంగా అన్నాడు - "మంచిది!"

౧౫

యశోధర తానన్నంత పని చేసింది. ప్రయాణాని కన్నీ సిద్ధం చేసింది. రెండవరోజందఱూ కాశీకి బయలుదేరినారు.

అప్పుడు సంధ్యాకాలమౌతున్నది. గ్రీష్మఋతువులో రాత్రులు ఆహ్లాదకరంగా ఉంటాయి. కాని బీజగుప్తుని కవి ఆహ్లాదకరంగా తోచలేదు. పూర్వదిశారోదసీకుహరంలో చతుర్దశినాటి చంద్రుడప్పుడే మండిపడుతున్నాడు. బీజగుప్తుని హృదయకుహరంలో ఒక మహాజ్వాల మండుతున్నది. దాసదాసీజనబృందాలు దివిటీలు చేతగొని వెంట వస్తున్నారు; ఆ దివిటీల ఉజ్జ్వలజ్వాలలో బీజగుప్తుడు తన తప్తహృదయజ్వాలాప్రతిబింబాన్ని చూస్తున్నాడు. అతడు మౌనంగా ఉన్నాడు.

బీజగుప్తుని రథంలో అతనితో బాటు శ్వేతాంకుడున్నాడు; యశోధర మృత్యుంజయునితో బాటు మఱొకరథంలో వస్తున్నది. అప్పటికి అర్ధరాత్రి గడచింది. చంద్రుని వెన్నెల నలువైపులా వ్యాపించింది. మార్గసమీపమందలి ఉద్యానవనాలనుండి మల్లెపూల ఘుమఘుమలు నలుదిక్కులా గుబాళిస్తున్నాయి. నిశ్శబ్దాన్ని చీలుస్తూ శ్వేతాంకుడన్నాడు - "ఈ రాత్రికి విశ్రమించడం బాగుంటుంది గదా!"

బీజగుప్తు డప్పుడేదో ఆలోచిస్తున్నాడు. తానేమి ఆలోచిస్తున్నాడో అతనికే తెలియదు. ఒక దాని పిదప వేఱొకటి - ఏవో ఆలోచన లతని మెదడులో మెఱుస్తున్నాయి; లయిస్తున్నాయి. అట్టి మానసికస్థితిలో అతనికి సమయజ్ఞానం బొత్తిగా నశించింది. అదే సమయంలో

మృత్యుంజయుని రథం అతని రథానికి ప్రక్కగా వచ్చింది. అప్పుడు యశోధర అడిగింది -"ఆర్యబీజగుప్తా! విశ్రమించడం బాగుంటుంది గదా!"

బీజగుప్తుడు ఉలికిపడి ఆకాశంవైపు చూచాడు. చంద్రుడు ఆకాశపూర్వార్ధంనుండి పశ్చిమార్ధానికి సాగుతున్నాడు. బీజగుప్తుడు శ్వేతాంకునితో అన్నాడు - "శ్వేతాంకా! రథము నాపి సమీపంలో ఉండే ఏదైన పూదోటలో ఆగేందుకు వీలుందా కనుక్కో!" - రథ మాగింది. దానితో బాటు అన్యరథంకూడ ఆగిపోయింది. శ్వేతాంకుడు రథం దిగి పూదోటను వెదకుటకు వెళ్లినాడు. బీజగుప్తుడు మృత్యుంజయునితో అన్నాడు - "ఆర్యశ్రేష్ఠా! నన్ను క్షమించండి. నాకు సమయం జాడ తెలియకపోయింది, మీకు కష్టమైందను కుంటా! కాని అర్ధరాత్రి గడచింది. ఒకవేళ మీరు సుముఖంగా ఉంటే మనం ముందరికి సాగిపోదాం. ఉదయం సూర్యోదయ మయ్యే లోపల ఏదో ఒక గ్రామానికి చేరుకొని అచ్చట దినమంతా విశ్రమింతాం. ఎందుకంటే ఇక్కడ మధ్యాహ్నం ఎండకు తట్టుకొనే ఏర్పాట్లు చేసికొనలేము, మఱి ఈ యెండలో ప్రాతఃకాలం మళ్లీ ప్రయాణం చేయడం మంచిది కాదు."

మృత్యుంజయుడు కొంచెమాలోచించి అన్నాడు - "బాగానే చెప్తున్నావు బీజగుప్తా! ముందుకు సాగడమే మంచిదనుకుంటా!"

కొంతసేపటికి శ్వేతాంకుడు తిరిగివచ్చాడు. అతడన్నాడు - "ఇక్కడ ఒక అందమైన పూదోట ఉంది. అందులో నొక విశాలభవనం కూడ ఉంది. ఆ వాటిక ఏదో సామంతునికి చెందినది. అందులో ఆగడానికి చక్కని వసతి ఉంది."

మృత్యుంజయుడన్నాడు - "ఏదో సామంతునిదా? ఐతే అందలి వసతిలో ఏమీ లోపముండదు. బీజగుప్తా! నేనిటువంటి వాటికలో ముందాగినాను. ఇందులో సామంతుని సుందరభవనం కూడా ఉంది."

రథములు వాటికలోనికి మళ్లినవి. వాటికాపాలకుడు సామంతులకు స్వాగతము నిచ్చినాడు. అతిథులందఱికి ఉద్యానవనంలో మంచములు వేసినారు. అందఱూ అలసిపోయినందున వెంటనే వానిపై శయనించినారు; కాని బీజగుప్తునికి మాత్రం నిదుర రాలేదు.

తానెచ్చటికి పోతున్నాడు? ఎందుకు పోతున్నాడు? ఈరెండు ప్రశ్నలూ అతని మస్తిష్కంలో చక్రభ్రమణం చేయసాగినవి. అతడేగు చున్నది కాశికి - శాంతిప్రాప్తికి, మనశ్శోకనివృత్తికి, నిజకర్తవ్యాలసత్వవిముక్తికి. అతడు పాటలీపుత్రం వీడింది యశోధరనుండి దూరంగా ఉండేందుకు, చిత్రలేఖనుండి దూరంగా తొలగేందుకు. కాని యశోధరనుండి అతడు దూరం కాలేదు. పోగా యశోధర ఇంకా నికటవర్తిని అయింది. బహుశః ఆమె ఇంతకంటె చేరువ కాదుగదా! "అసంభవం" - అంటూ కొంచెం బిగ్గరగా అరుస్తూ బీజగుప్తుడు లేచాడు. అతడు యశోధరను ప్రేమింపలేకపోయాడు. ఇప్పుడతని కనుల ముందు యశోధరకు మాఱుగా చిత్రలేఖ నిలిచింది. చిత్రలేఖ ఎవరు? తన జీవితంలో తనకామెతో ఎట్టి సంబంధముంది? చిత్రలేఖ తన ప్రియురాలు; తన పత్ని. అతడు చిత్రలేఖను ప్రేమించేవాడు; ఆమె అతనిని ప్రేమించేది. ఇప్పుడుకూడ ఆమె అతనిని ప్రేమిస్తున్నదా? "కావచ్చు", "కాక పోవచ్చు". "కావచ్చు" - అతని హితమును కోరే అతనిని వదలివేసింది, కుమారగిరి సన్నిధానాన్ని స్వీకరించింది. "కాకపోవచ్చు" - అతని యిష్టానికి వ్యతిరేకంగా అతనిని వదలి వేసింది, అతని జీవితాన్ని దుర్భరం చేసింది.

ఇట్లాలోచిస్తుండగానే అతనికి పక్షుల కలగానం వినవచ్చింది. పూర్వదిశయందలి ఉషఃకాలకాంతి స్వర్ణాంచలములు నల్గడలా వ్యాపించి, ప్రాతఃకాలవాయువులతో పరియాచకాలాడుతున్నవి, తారల వెంటబడి ఒకతార తర్వాత వేఱొకతారను మటుమాయం చేస్తున్నవి. అతడు కనులు విప్పుతూనే అతనికి కొంచెం దూరంలో సగం విరిసిన మాలతీసుమంపై గురిసిన హిమంతో ఆడుకొనే యశోధర కనిపించింది. బీజగుప్తుడు లేచి నిలుచున్నాడు. నిత్యకృత్యములను ముగించుకొని అతడు గూడ ఉద్యానవనమందలి సుగంధిలశీతలసమీరంలో తన సంతప్తహృదయాన్ని శాంతపఱచుకొనుటకు బయలుదేఱినాడు. యశోధర అతనిని చూచి పిలిచింది. అప్పుడామె దోసిటినిండా పూవులు కోసికొనియున్నది. "ఆర్యబీజగుప్తా! చూడండి - ప్రకృతియొక్క ఈ సుందరస్వరూపాన్ని చూడండి! ఇందులో ఎంత శాంతి, ఎంత అందం, ఎంత ఆనందం ఉంది! సర్వప్రపంచంలోని చింతలూ, తృష్ణలూ, నిందలూ - వీనితో సంకీర్ణమైన అలజడికి దూరంగా, అతిదూరంగా ఇచ్చటి నిష్కళంకజీవితం రంగురంగుల సీతాకోకచిలుకల ఱెక్కలతో కేళి సల్పు తున్నది"

బీజగుప్తుడు దగ్గరికి వచ్చి యశోధర ప్రక్కన నిలుచున్నాడు. అతడు తనచుట్టూ నాల్గు దిక్కులా పరికించి అన్నాడు - "యశోధరా! నాకైతే ప్రకృతిలో ఏ అందమూ కనిపించడం లేదు."

"ప్రకృతిలో మీకేమీ సౌదర్యం కనపడుట లేదా?" - యశోధర ఆశ్చర్యచకితదృక్కులతో బీజగుప్తుణ్ణి చూచింది - "మీరు నిజంగా అంటున్నారా, లేక పరిహాసం చేస్తున్నారా?"

"పరిహాసం గాదు దేవీ! నేను యథార్థం పలుకుతున్నాను. నీవు ప్రకృతి సుందరంగా ఉందంటున్నావు. నేను కురూపిగా కన్పిస్తున్న దంటున్నాను."

యశోధర బీజగుప్తుని మాటలను అంగీకరించుటకు సిద్ధంగా లేదు. ఆమె అన్నది - "ఆర్యబీజగుప్తా! చూడండి - ఈ గఱికపోచ లెంత మృదులంగా ఎంత సుందరంగా ఉన్నవో! నాకైతే అనిపిస్తున్నది - ఈ గఱికపఱుపుపై ఉండి పోదాం, దీనిపై కూర్చుందాం, దీనిపై విశ్రమింతాం - అని"

బీజగుప్తుడు మందహాసం చేశాడు - "లేదు, అది చేయకూడదు దేవీ! ఇక్కడ వైద్యు డెవ్వడూ లేడు - ఉపచారం చేయించేందుకు. నీవు గఱికబయలు సుందరంగా, కోమలంగా ఉందంటున్నావు - ఎన్నడూ ఇంటి బయట గడపకుండుటచేత. ఈ బయళ్ళలో ఎన్ని క్రిమికీటకాదులున్నవో ఏమైన యోచించినావా? ఈ గఱికలో తేమ ఉంది. దీనిపై ఎక్కువసేపు విశ్రమిస్తే నీకు నిశ్చయంగా శైత్యం పట్టుకుంటుంది. దేవీ! ప్రకృతి అసౌకర్యకరమైనదీ, అసంపూర్ణమైనదీను."

యశోధర కీ మాటలు నవ్యంగా తోచినవి. ఐతే అవి మాట్లాడినతీరు ఆకర్షణీయంగా ఉంది, వానిలోని తర్కం అందంగాను, అఖండితవ్యంగానూ ఉంది. ఆమె అన్నది - "ప్రకృతి అసంపూర్ణమా?"

"ఔను, ప్రకృతి అసంపూర్ణమే! అది అసంపూర్ణమైనందుకే మానవుడు కల్పనకు పాల్పడ్డాడు. గఱిక సుందరంగా ఉంది, కోమలంగా ఉంది; కాని దానిలో తేమ ఉంది, క్రిమికీటకములున్నవి. అందుచేతనే మానవుడు తేమలేనివి, క్రిమికీటకరహితమైనవి, గఱికకంటె మెత్తనివైన మఖ్మల్‌మెత్తలను, పఱుపులను నిర్మించుకొన్నాడు. చలికాలంలోనైతే చూడు - ఈ సుందరస్థలాలు పొగమంచుతో గప్పబడి ఎంత అందవిహీనంగా ఉంటాయో; అప్పుడెంత చల్లగా ఉంటుందంటే, ఆ చలికి శరీరమంతా కొంకరలు వోతుంటుంది. వేసవిలో ఎంత తీవ్రమైన వడగాలి వీస్తుందంటే మధ్యాహ్నంపూట శరీరం మాడిపోతుంటుంది. ప్రకృతియొక్క ఈ అసౌకర్యాలనుండి తప్పించు కొనుటకే కదా మానవుడు భవనాలను నిర్మించుకొన్నాడు. ఉత్తరదిశాజన్యమైన వాతముల నరికట్టి, కుంపటులలో నగ్నిని ప్రజ్వలించి ఈ భవనాలలో శైత్యబాధను నివారించుకొనుచున్నాడు; జంబుతోను వట్టివేళ్లతోను కట్టిన దట్టీలతో చల్లదనాన్ని సృజించి, వేసవిని మధుమాసంగా మారుస్తున్నాడు. ప్రకృతి మానవుని సౌకర్యాన్ని చూడదు, అందుచే అది అసంపూర్ణమైనది."

"ఈ కుసుమాలెంత కోమలంగా ఉన్నవి! వీనిలోని సుగంధ మెంత మత్తుగొలుపుతూ ఉన్నది! ఈ కలరవమెంత మధురంగా ఎంత మనోహరంగా ఉంది! ఈ కోకిల గొంతు ఎంత తీయగా, ఎంత కరుణాత్మకంగా ఉంది! "

"ఈ కుసుమాలు కోమలంగానే ఉన్నవి, అది నిజమే; కాని వీనిలో ముండ్లు గూడా ఉన్నవి. వీనిలో ఎన్నెన్ని సూక్ష్మతరకీటకా లున్నవో ఎవరికెఱుక! ఇక వీని కోమలత్వం, సౌగంధ్యం క్షణికమైనవి. ఈ సుగంధంవల్ల ప్రయోజనమేమి - అది ఏకాంతప్రదేశంలో వ్యర్థంగా వ్యయింపబడుతుంది. ఈ కలరవంలో మాధుర్యం ఉండవచ్చు. అది స్వరానికే పరిమితం. ఆ స్వరం భాషాయుతంగా లేనందువల్ల అది ఆరోహణావరోహణలు లేని భావహీనసంగీతంవలె ఉన్నది. దీనికంటె మానవకంఠగానం మిన్నగా ఉంటుంది. కోకిల స్వరంలో కేవలం పంచమమే ఉంది. దానిని మఱిమఱి వింటుంటే విసుగే జనిస్తుంది. ఏమంటున్నదో ఎవరికీ తెలియదు కోకిల; బహుశః అది ఏమీ అనడం లేదేమో!"

యశోధర విస్మయావహురాలైంది. అమె భవనావరణంలో ఒక ఉద్యానవనముంది, దానిని ఆమె చూస్తూ ఉంటుంది. దాని ప్రాకృతికశోభ కామె ముగ్ధురాలౌతూ ఉంటుంది కాని ఇప్పుడు బీజగుప్తుని తర్కాన్ని విని అది ఎంత భ్రమపూరితమో ఆలోచింపసాగింది. వారి కెదురుగా అక్కడొక కృత్రిమజలపాత ముంది. దానికి కొంతదూరంలో నొక కృత్రిమమైన కాల్వలో కొన్ని కపోతములు గుంపులు

గట్టి స్నానమాడుతున్నవి. యశోధర వాని వైపుకు సాగింది; బీజగుప్తుడు ఆమెవెంట నడిచాడు. మంత్రముగ్ధురాలివలె ఆమె ఆ కపోతాల నాలోకింపసాగింది. ఆమె నెమ్మదిగా అన్నది - "ఈ కపోతాలెంత సుఖంగా ఉన్నాయి! కలిసి ఎంత ఆనందంగా ఆడుకొంటున్నాయి! మానవసామాన్యమైన ఈర్ష్యాసూయలూ, దౌష్ట్యాసహ్యతలూ వీనిలో మృగ్యములు. నాకే తెక్కలొస్తే నేనూ ఒక కపోతాన్ని కావాలనుకొంటున్నాను."

ఆ బాలిక బేలతనానికి బీజగుప్తుడు నవ్వుతూ అన్నాడు - "దేవీ యశోధరా! నేనంటాను నీవు నిజంగా కపోతివే ఐతే, అప్పుడు మానవకాంతగా మారాలనుకొంటావు. నీవీ కపోతాలు, సుఖంగా, నిశ్చింతగా, నిశ్శత్రువులుగా ఉన్నాయనుకొంటున్నావు. ఇది నీ భ్రమ. అభిలాష చేకూరడమే సుఖమూ, అది చేకూరకపోవడమే దుఃఖం. నీకు తెలుసా ఈ కపోతాల అభిలాషలు చేకూరినవో లేదో? అసలు వీనికి అభిలాషలనేవి ఉన్నవా అనేదే ఒక ప్రశ్న! ఈ పశుపక్ష్యాదులకంటె మనుష్యుడు శ్రేష్ఠుడు; అతని కభిలాషలుంటాయి గనుక వానిని పరిపూర్తి చేసికొని అతడు సుఖవంతుడౌతాడు. కర్తృత్వము మానవలక్షణం. మానవుడు జన్మించింది కర్తృత్వహీనుడై ఏదీ చేయకుండా బ్రతికి మరణించుటకు గాదు; అతడు నిర్మింపబడింది కర్మాచరణకే. పశుపక్ష్యాదులు ఉదరపోషణార్థం ఎంత ఘోరంగా కలహిస్తాయి! మానవుడు ఉదరపోషణకై శ్రమిస్తాడు. భూమిని దున్ని ఆహారాన్ని ఉత్పన్నం చేస్తాడు. కాని పశుపక్ష్యాదులు ఆహారానికై ప్రకృతిపైననే ఆధారపడుతాయి. భూమిలోని క్రిమికీటకాదుల భక్షించి పక్షులు జీవిస్తాయి. జంతువు లొకదాని నింకొకటి తిని జీవనం గడపుతాయి. ఈకపోతాల అవస్థ చూడు - వీని శత్రువు డేగపైకి దూకినప్పుడు. అప్పుడు వీనికెంత చింత కల్గుతుందో, ఎంత నిస్సహాయ స్థితి కల్గుతుందో!"

యశోధర ఆశ్చర్యంతో బీజగుప్తుణ్ణి చూస్తూ ఉండిపోయింది. బీజగుప్తుడు కొంచెమాగి మళ్లీ అన్నాడు - "దేవీ యశోధరా! నీవను కుంటుండవచ్చు - ప్రకృతివాతావరణంలో ఉండే మనుష్యుడు సుఖంగా ఉంటాడని. కాని గుర్తుంచుకో - మనుష్యుడు తన స్థితియం దెప్పుడూ సుఖంగా ఉండడు. నీవు రాజప్రాసాదంలో ఉంటే రాజప్రాసాదం నీకు నచ్చదు; దాని సౌందర్యం పట్ల, సార్థక్యం పట్ల నీ కౌదాసీన్యం కల్గుతుంది. ఔదాసీన్యమే కాదు, అప్పుడప్పుడా భవనాన్ని వదలి వెళ్లిపోవాలనిపిస్తుంది. నీవీ ప్రకృతిలో నికటస్థకుటీరాలలో సుఖం పొందాలని చూడవచ్చు, నీవు గ్రామాలలో ఆరుబయట గాలిలో పశువులమధ్య ప్రకృతితో క్రీడించడం సుఖప్రదమనే ఊహాకల్పనకు పాల్పడవచ్చు - అది సరియైనదే, స్వాభావికమైనదే. కాని కొంచెమా గ్రామస్థుల నడుగు - వారిప్పుడే చెప్తారు - భవనాలలో, దాసదాసీజనమధ్యంలో ఉండే బ్రతుకే సుఖవంతమని. ఈ భవనాలను నిర్మించిన మన తాతముత్తాతలు ముందుగా గ్రామవాసులై ఉండే ఉంటారు! మరి వారు గ్రామములను వీడి నగరాలలో ఎందుకున్నారు? ఎందుకంటే ప్రకృతియొక్క కురూపతను, అసౌకర్యాలను వారు కృత్రిమనిర్మాణములచేత దూరీకృతం చేసికొనడానికి. ఇప్పుడు నిన్ను విమోహింపజేస్తున్న ఈ వాటికయే కృత్రిమమైనది. నీవు నిజంగా ప్రకృతిని చూడదలిస్తే అరణ్యముల కేగి చూడు - ఎక్కడ సింహాలు తమ రక్తపిపాసను తీర్చుకొనుటకు నాలుకలు చాచుకొని తిరుగుతుంటాయో, ఎక్కడ ఏపుగా పెరిగిన గడ్డిలో పాకాడే విషసర్పాలు నిష్కారణంగా నిన్ను కాటువేస్తాయో - ఆ అరణ్యాలను చూడు. ఈ కృత్రిమమైన కుల్యను వీడి మహానదులను చూడు. వానిలో నరులను మ్రింగడానికై నక్రగ్రాహములు నీళ్లలో దాగి మాటువేసి కొని ఉంటాయి. అప్పుడు సుఖసౌందర్యాలు ప్రకృతిలో ఉన్నవో, లేక కృత్రిమత్వంలో ఉన్నవో నీవు చూడగలవు."

బీజగుప్తు డీవిధంగా మాట్లాడుతున్నాడు - యశోధర అతని ముఖంవైపు ఆశ్చర్యంతో చూస్తున్నది. ఇంతవఱ కామె బీజగుప్తుణ్ణి మాననీయుడైన వ్యక్తిగానే ఎఱుగును; కాని ఇప్పు డతనికి సచ్చరిత్రమే కాక ఉచ్చకోటి మస్తిష్కంగూడ ఉందని ఆమెకు తెలిసింది. అతని విద్వత్తుకు, అతని సృజనాత్మకతకు, అతని తర్కశక్తికి ఆమె చకితురాలైంది. అతనిపట్ల ఆమెకు గల శ్రద్ధాభక్తులు వృద్ధియౌతున్నట్లుగా ఆమెకు ప్రతీతమైంది. ఆమె కొద్దిసేపు మౌనంగా ఉండి అడిగింది - "ఆర్యబీజగుప్తా! నా ధార్ష్ట్యానికి క్షమించండి. ఐతే ఒక ప్రశ్న - మీరిదంతా ఎప్పుడు, ఎక్కడ పఠించారు?"

వస్తుతః ఆ ప్రశ్న అనుచితంగా ఉంది. కాని బీజగుప్తుడు దాన్ని పట్టించుకొనలేదు. "దేవీ! యశోధరా! ప్రపంచమనే పాఠశాలలో అనుభవమనే శిక్షాప్రణాళికలోని పరిస్థితులు నాకీ పాఠాలన్నీ నేర్పినాయి. ఇప్పుడు ఉపాహారానికి వేళయింది. ఇక వెళ్లడం మంచిది గదా?" - అంటూ బీజగుప్తుడు వసతిగృహం వైపు మళ్లాడు. యశోధర కూడ అతనితో బాటు వచ్చింది.

బీజగుప్తుడు సంతోషంగా లేడు - ఇది అతని ముఖంలో కనిపిస్తూ ఉంది. యశోధర అడిగింది - "ఆర్యబీజగుప్తా! నే డెందుకో అన్యమనస్కులై ఉన్నారు. మీరు దుఃఖంతో ఉన్నారా? దీనికి కారణం తెల్పగలరా?"

ఒక చల్లని నిట్టూర్పును విడిచి బీజగుప్తు డన్నాడు - " ఔను దేవీ యశోధరా! నేను దుఃఖం గానే ఉన్నాను. కాని నా దుఃఖకారణాన్ని తెలుసుకొని నీవేం చేయగలవు? నీకది తెలియక పోవడమే ఉచితం"

"ఆ కారణం రహస్యమైనదా?"

"కాదు. నా జీవితంలోని ఏ విషయమూ గుప్తం కాదు. అనుచితమైన విషయాలనే గుప్తంగా ఉంచవలసి ఉంటుంది. గుప్తంగా ఉంచ డానికి భయం కారణం, అట్టి భయం మనుష్యు డపరాధి యని సూచిస్తుంది. నేను చేసేదేదో నేనుచితంగానే తలుస్తాను, అందుచేత నేను వానిని గుప్తంగా ఉంచను. నా దుఃఖంతో ఇతరులకు దుఃఖం కలిగించడం తగదనే భావంతో నేను చెప్పడం లేదు."

యశోధర ఇంక మాట్లాడలేదు. ఈ విషయాలను ప్రస్తావించి బీజగుప్తుణ్ణి మఱింత ఖిన్నునిగా చేస్తున్నానని ఆమెకనిపించింది. అప్పటికి వారిర్వురూ వసతిగృహాన్ని చేరుకొన్నారు. ఉపాహారానికి ఏర్పాటు చేసి, శ్వేతాంకుడూ, మృత్యుంజయుడూ వారికై అక్కడ వేచియున్నారు. యశోధర పరుగెత్తి మృత్యుంజయుని కౌగలించుకొన్నది - "నాన్నా! ఈ నాడు బీజగుప్తులు నాకెట్టి విషయాలను వివరించినారంటే వానివల్ల నాకు జ్ఞానోదయం కలిగింది. నా ప్రాతనమ్మకాలు పూర్తిగా నిరాధారములని వారు నిరూపించినారు. ఆర్యబీజగుప్తులు మహావిద్వాంసులు - ఇది నా కీనాడు తెలిసింది" - అంటూ ఆమె బీజగుప్తుని వైపు చూచింది.

తరువాత ఆమె శ్వేతాంకునిపై దృష్టి సారించింది. అతని ముఖం పాలిపోయి ఉంది. అతని నేదో వ్యథ పీడుస్తున్నట్లు తోచింది. అతని హస్తాన్ని గ్రహించి "ఆర్యశ్వేతాంకా! నీ కస్వస్థతగా ఉన్నదా?" అంటూ ఆమె అతని నాడిని చూచింది. "లేదు. నీకు జ్వరమైతే లేదు. మఱి నీ ముఖమెందుకు ఇంత నీరసంగా ఉన్నదో!" - అన్నది.

"శ్వేతాంకుడు సరిగా విశ్రమించలేనందువల్ల అలసిపోయినాడేమో" - బీజగుప్తుడన్నాడు - "శ్వేతాంకా! నీవు మధ్యాహ్నమంతా నిద్ర పో!"

యశోధర శ్వేతాంకుని చేయి పట్టుకొని నిలుచున్నది. అతని ముఖంలోని నిస్తేజస్కత మెల్లమెల్లగా మాయం కాసాగింది. అత డన్నాడు - "లేదు. నాకస్వస్థత ఏమీ లేదు. కొంచెం అలసిపోయాను; విశ్రాంతి తీసికొంటే సరిపోతుంది."

అల్పాహారం సేవించిన తర్వాత బీజగుప్తుడు శ్వేతాంకునితో అన్నాడు - "నేను చాలా అలసిపోయినాను. నేనిప్పుడు శయనిస్తాను. భోజనం సిద్ధమైనప్పుడు నన్ను లేపు. అంతవఱకు నీవు మృత్యుంజయునితో బాటు కూర్చో - మన మతనిని ఉపేక్షించుతున్నామనే భావన అతనికి కల్గకుండా..."

శ్వేతాంకుడు యశోధరామృత్యుంజయులతో బాటు కూర్చొని వారితో మాట్లాడుతున్నాడు. యశోధర నాటి ప్రాతఃకాలంలో ప్రకృతినిగుఱించి జరిగిన సంభాషణలను వినిపించింది, అవి విని మృత్యుంజయు డాశ్చర్యచకితుడైనాడు. అత డడిగాడు - "శ్వేతాంకా! బీజగుప్తుడు కొంచెం అస్వస్థుడై ఉన్నాడనిపిస్తున్నది?"

శ్వేతాంకునికంటే ముందుగానే యశోధర అందుకుంది - "ఆ..! నాకూ ఆలాగే అనిపించింది. నేనతణ్ణి దాన్నిగుఱించి అడిగినాను కూడ. అతడు ఖిన్నుడై ఉన్నట్లంగీకరించి నాడు. నేను కారణమడుగగా, వారు కారణం తెలుపనన్నారు" - అని ఆమె శ్వేతాంకునిపైన దృష్టి సారించింది.

మృత్యుంజయుడన్నాడు - "చాలా విషయాలు తెలుపలేనివి ఉంటాయి."

"ఐతే కావచ్చు - ఐనప్పటికీ గుప్తంగా ఉంచడం మనుష్యునియొక్క దోషస్వభావానికి ద్యోతకం. సమాజానికి తెలిస్తే సమాజం విమర్శిస్తుందేమో, తప్పుగా తలస్తుందేమో అనే భయంతో మనిషి విషయాలను గుప్తంగా ఉంచుతాడు. కాని నేనింత మాత్రం చెప్ప గలను - బీజగుప్తుని దుఃఖకారణం గుప్తమైనది కాదు; వారిది స్వయంగా నాతో చెప్పినారు"

"బహుశః గుప్తంగా ఉంచడం మనుష్యునియొక్క దోషస్వభావానికి ద్యోతకం - అనే పరిభాష కూడా ఆర్యబీజగుప్తునిదే అయి ఉండవచ్చు!" - శ్వేతాంకుడు ముసిముసినవ్వుతో వ్యంగ్యంగా వ్యాఖ్యానించాడు.

"లేదు - సమర్థుని కిందులో దోషం లేదు. సమాజాన్ని త్రోసిపుచ్చి ఎవడైతే జీవితం గడపగలడో అట్టి వ్యక్తికి ఇది సర్వథా ఉచితమే. కాని ప్రపంచం సమర్థవంతంగా లేదు. ఉదాహరణకు నన్ను తీసికో - నే నార్యబీజగుప్తునకు సేవకుణ్ణి. అతని ఆజ్ఞయే నా అభిలాష, నా కర్తవ్యం. నాలోగూడ వ్యక్తిత్వముంది. కాని దానివల్ల ప్రయోజనమేమి? నేను పరాధీనుణ్ణి. అప్పుడప్పుడు నాలో విరోధజ్వాల ప్రభూత మౌతూ ఉంటుంది. అప్పుడా విరోధజ్వాలను ప్రకటం చేసి కలహించుట ఉచితమా, లేక దాని నణచుకొని కర్తవ్యనిరతుడనగుట ఉచితమా? దీనికి స్పష్టమైన పరిష్కారమున్నదా!"

మృత్యుంజయు డన్నాడు - "శ్వేతాంకా! నీకీ విరోధం అనుచితమైనది. అందుచేత దానిని గుప్తంగా ఉంచుకొనడమే మంచిది."

యశోధర నెమ్మదిగా అన్నది - "నీ విరోధం ఉచితమైనదే శ్వేతాంకా! నీ యీ అవస్థ నాకు శోచనీయంగా ఉంది." - శ్వేతాంకు డామె కన్నులలో సానుభూతితో కూడినప్రేమరేఖ నావిష్కరించాడు.

౧౬

ప్రపంచంలో కొందరికి ఎదుటి వ్యక్తిని ఆకర్షించే శక్తి ఉంటుంది. అట్లాకర్షించిన వ్యక్తిని లొంగదీసికొని, తనకు దాసునిగా చేసికొనే సామర్థ్యముంటుంది. చిత్రలేఖావ్యక్తిత్వ మిట్టిదే. ఐతే తనకిట్టి శక్తి ఉన్నట్లామెకు స్పష్టంగా తెలియదు; తనకు తెలియకుండగనే ఆమె ఈ శక్తిని ప్రయోగించేది. కుమారగిరి ఈ శక్తికి తాను తట్టుకొనలేక పోయాడు.

కుమారగిరికుటీరంలోనే వారిర్వురి సాహచర్యం సాగింది. కుమారగిరి ఆమెనుండి దూరంగా ఉండాలని అనుకునేవాడు - కాని అనుకున్నకొద్దీ ఆశ్చర్యకరంగా ఆమె కంతకంతకు చేరువయ్యేవాడు. చిత్రలేఖ అతనితో బాటే అతని కుటీరంలో ఉండసాగింది. అతడు ధ్యాననిమగ్నుడై కూర్చున్నప్పుడు ఆమె ఆకుటీరంలో ప్రవేశించి యిల్లాలువలె అన్ని యేర్పాట్లూ చూచుకునేది. కాని అప్పు డతనికి ధ్యానసమాధి సాధ్యమయ్యేది కాదు. అతడు కనులు మూసికొనేవాడు, అంతలో క్షణమాత్రం కనులు దెఱచి చిత్రలేఖను చూచేవాడు. మళ్లీ కనులు మూసికొని ధ్యాననిమగ్నుడయ్యే యత్నం చేసేవాడు - కాని అది సాధ్యమయ్యేది కాదు.

మఱి చిత్రలేఖ! ఆమె కుమారగిరికుటీరాన్ని చేరుకొన్నది అతనిని ప్రేమించడానికి. కాని ఆ కుటీరంలో ప్రవేశించగానే ఆమె కాభావం మారిపోయింది. ఇప్పుడామె ఆకాంక్షించేది తపస్సునూ, సాధననూ - కుమారగిరి పథంలో ఆమె కంటకం కాదలచుకొన లేదు.

ఆరాత్రి కుటీరంలో ఇంకా దీపం వెలుగుతూనే ఉన్నది. అప్పటికి అర్ధరాత్రి దాటింది, కుమారగిరి ధ్యానవ్యవస్థితుడయ్యే సమయ మైంది - అతడు ధ్యానాసనంపై కూర్చొని కనులు మూసికొన్నాడు. కాని అతడు ధ్యాననిమగ్నుడు కాలేకపోయాడు. అతడు ధ్యాన వ్యవస్థితుడైనట్లు భావించి, చిత్రలేఖ కుటీరంలోకి ప్రవేశించి తన ఆసనంపై కూర్చున్నది.

ఆమె అడుగుల అలికిడికి కుమారగిరి అక్షులు దెఱచి అన్నాడు - "దేవీ చిత్రలేఖా?"

ఆమె హఠాత్తుగా త్రుళ్లిపడింది. అతడు ధ్యానవ్యవస్థితుడైనాడని ఆమె అనుకొన్నది. ఆమె లేస్తూ అన్నది - "క్షమించండి గురుదేవా! పొరపడినాను. మీరు ధ్యానవ్యవస్థితులయ్యే లోపలనే నేను వచ్చినాను. మీకేమీ బాధ కలుగకుండా నేను వెడతాను."

కుమారగిరి చిఱునవ్వుతో అన్నాడు - "వెళ్లవలసిన అవసరమేమీ లేదు. నీవిక్కడే కూర్చో! ఈనాడు సమాధి నిప్పుడే పాటించను. నీతో కొంచెం మాట్లాడుతాను."

చిత్రలేఖ కూర్చొన్నది.

"చిత్రలేఖా! నే ననుకుంటున్నాను - మానవుడు కర్మమార్గాన్నీ, ధర్మమార్గాన్నీ ఒకేసారి స్వాయత్తం చేసికొన లేడా అని."

"నాకర్థం కావటం లేదు."

"నీవు దీక్షకొఱకై వచ్చినప్పుడు నాతో అన్నావు - నన్ను ప్రేమిస్తున్నానని."

"ఔను! నేను సత్యంగానే అన్నాను."

"మఱిప్రేమకర్థమేమిటి?"

"ప్రేమ కర్థం రెండు ఆత్మలకు మధ్య సంబంధం అనుసంధించడమే."

కుమారగిరి కొంతసేపు మౌనంగా ఉన్నాడు - "ఐతే యీ పరిభాషప్రకారం ప్రేమ కేవలం రెండు ఆత్మలకు మధ్యనే నెలకొంటుందా? ఇద్దఱు మనుష్యుల మధ్యనేప్రేమ సాధ్యమౌతుందా, మనుష్యునికి బ్రహ్మమునకు మధ్య ప్రేమ సాధ్యం కాదా?"

"మఱి మీ మతానుసారం ఆత్మ బ్రహ్మములో నొకభాగమే. అందుచే బ్రహ్మముతో గూడ ప్రేమ సాధ్యమే!"

"నేడొక క్రొత్తవిషయాన్ని ఆలోచించినాను చిత్రలేఖా! విరాగమనేది మనుష్యునికి అసాధ్యం. ఎందుకంటే అది నిరాకరణాత్మకమైనది. విరాగానికి ఆధారం కేవలం శూన్యమే - అంతకు దప్ప మఱింకేమీ లేదు. అందుచేత తాను విరాగినని ఎవడైనా అంటే అది వట్టి అబద్ధం - దాని కర్థం అతడు సంసారము పట్ల విరాగి అని. ఇట్టి వ్యక్తికి గూడ అనురక్తి ఆవశ్యకం - అతని అనురక్తికి కేంద్రం బ్రహ్మము. జీవన కర్తవ్యం నిర్మాణం, వినాశనం కాదు. మానవుని కర్తవ్యం అనురాగంగాని విరాగం కాదు. బ్రహ్మానురక్తికి అర్థం బ్రహ్మేతరపదార్థముల పట్ల ఉపేక్ష, విరాగమూను. వాస్తవస్థితిలో చూచినట్లైతే "విరాగి" యనబడే వ్యక్తి విరాగి కానే కాడు - అతడు ఈశ్వరానురాగి. ఇదంత గొప్ప విషయం కాదు గాని మఱొకటి గొప్పది - "సంసారం పట్ల విరాగం , బ్రహ్మము పట్ల అనురాగం - ఈ రెండూ ఒక్కటేనా?"

చిత్రలేఖ ఈ మాటలు విని గాబరాపడింది. ఆమెకు కుమారగిరి మనఃప్రవృత్తి తెలుసు, బహుశః అతని మనోదౌర్బల్యము గూడ తెలుసు. ఆమె అన్నది - "స్వామీ! దీనికి ప్రత్యుత్తర మిచ్చే సామర్థ్యం నాకు లేదు. నేను గురువర్యుల యొద్దకు జ్ఞానసముపార్జనకై వచ్చి నాను. గురుదేవుల ద్వారా జీవనలక్ష్యాన్ని ఆవిష్కరించడానికి వచ్చినాను. బ్రహ్మస్వరూపము నెఱుగు టకు వచ్చినాను."

కుమారగిరి శిరము అవనతమైంది. అతని సాధన అతని అపరాధహృదయాన్ని వినమ్రమొనరించింది. "బాగా చెప్పావు చిత్రలేఖా! జ్ఞానానికి తర్కం కాదు, అనుభవం కదా ఆధారం? ఈ కుతర్కం నాలో ఎందుకు ఉదయించిందో నాకే తెలియదు గాని ఇది నాలో చాలా ప్రబలమైంది. సంసారం పట్ల విరక్తుడైన వ్యక్తి ఈశ్వరునియందు అనురక్తుడై యుండగలడా? - ఈ ప్రశ్నకు జవాబు కావాలి. ఇది లభించ నంతవఱకు నాకు మనశ్శాంతి ఉండదు."

చిత్రలేఖ తనను బేరీజు వేసికొన్నది - ఆమెలో విచిత్రమైన పరివర్తన కలిగింది. తాను వచ్చింది కుమారగిరిని ప్రేమించుటకు - ఐతే ఆమె ఇప్పుడాతనిని ప్రేమించే స్థితిలోనూ లేదు; పూజించే స్థితిలోనూ లేదు. ఆమె అతనినుండి నేర్చుకొనే స్థితిలోనూ లేదు. నగరమందలి అశాంతిమయజీవితం ఆమెను వ్యాకులపరచింది. నిర్జనత్వమందలి శాంతిలో, సాత్త్వికతా ఆవరణంలో, విశ్వాసపు పరదాచాటున ఆమె సుఖాన్ని పొందనెంచింది. జీవనమందలి ఆమోదప్రమోదముల కామె విసుగుజెందింది; నిస్సీమమైన సుఖ మామెకు పీడాకరమైంది. కుమారగిరి కుటీరమందలి ప్రశాంతవాతావరణంలో ఆమె సుఖసంతృప్తులను పొందనెంచింది.

కుమారగిరి కొంతసేపు ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఆ తర్వాత అతడన్నాడు - "చిత్రలేఖా! నేను నిన్నింతవఱకు అర్థం చేసికొన జాలలేదు. ఐనా నా హృదయం చెప్తున్నది - మన యిద్దరి సంబంధం బహుకాలీనమైనదని."

కుమారగిరివద్దకు వచ్చేందుకు ముందుగా చిత్రలేఖ కూడా ఇలాగే అనుకొన్నది - " అయితే కావచ్చు! కాని గతజీవితాన్నిగుఱించిన భావన ఎంత అస్పష్టంగా ఉందంటే అది నాకిప్పుడు అగోచరంగా ఉంది."

కుమారగిరి నవ్వాడు - "బహుశః నా ధారణ గూడ ప్రమాదపూరితమే కావచ్చు. కాని చిత్రలేఖా! నీవొకటి స్పష్టం చేయవలె. నీలో నొక ఆకర్షణశక్తి ఉన్నది - అది నీవెక్కడనుండి సంపాదించినావు?"

చిత్రలేఖ ముఖ మెఱ్ఱబడింది. ఎన్నో నాళ్ల తర్వాత ఇప్పుడామెకు లజ్జానుభూతి కలిగింది - ఆమె ముఖం అవనతమైంది. ఆమె అన్నది - "గురుదేవా! నాలో ఆకర్షణశక్తి ఉన్నదా! ఈ సంగతి నాకు దెలియదు."

కుమారగిరి లేచి నిలబడ్డాడు. నిలబడి అటూయిటూ తిరుగనారంభించాడు. అతడన్నాడు - "నేడు తపస్సమాధిలో మనస్సు లగ్నం కావడం లేదు - నిరాకారమైన ఆధారంపై మనస్సును స్థిరీకరించడం ఈనాడెంత కష్టంగా ఉన్నదో! ఇట్లెందుకౌతున్నదో?" - ఈసారి అతని స్వరం తీవ్రతరమైంది - "నిరాకారంపై మనస్సెందుకు లగ్నం కావడంలేదు? హృదయం సాకారం, సాకారం కావాలంటున్నది" - అప్పటికి కుమారగిరి చిత్రలేఖకు చేరువగా చేరుకొన్నాడు. తన నేత్రాలతో చిత్రలేఖను గ్రుచ్చాడు - "నర్తకీ! నేనింతవఱకు నిరాకారాన్నే ఉపాసించాను. ఇప్పుడు సాకారోపాసన చేయగోరుతున్నాను. తెలిసిందా! నేనొక మహాప్రయోగం చేయబోతున్నాను - ఈ ప్రయోగంలో నీ సహకార మవసరమై యున్నది. లే! లేచి నిలబడు!"

చిత్రలేఖ కంపించిపోయింది. యోగి ముఖంపై ఆమె కొక ఆవేశచ్ఛాయ ద్యోతకమైంది. అతని ప్రశాంతసుందరవదనం వికృతమైంది. తనమూలంగా ప్రజ్వలించిన యోగియందలి అంగారజ్వాలాతీవ్రత కామె భయకంపితురాలైంది. ఆమె లేచి నిలుచున్నది. తనలోని శక్తి లోపిస్తున్నట్లుగా ఆమె కనిపించింది.

కుమారగిరి ఆమె హస్తాన్ని గ్రహించాడు. ఆమెకు నఖశిఖపర్యంతం శైత్యమావరించినట్లైంది. ఆ కరగ్రహణం మలమల మండే ఇనుపకంకణాన్ని ధరించినట్లుగా ఆమెకు తోచింది. అతని యావచ్ఛరీరం ఉడికిపోతున్నది. - "సాకారాన్ని స్వకీయం చేసికొనే ప్రయోగం చేస్తున్నాను నర్తకీ! ఈ సాకారభావనను నీవు నాలో జాగృతం చేసినావు - అందుచే ఈ ప్రయోగంలో నీవు నాకు సహకరించవలె - కాదు కాదు - నీవు దీనికి లక్ష్యం కావలె. తెలిసిందా!"

ఆమె కంతా అర్థమైంది. దీనికొఱకే ఆమె ఇక్కడికి వచ్చింది కూడ. కాని ఆమె ఊహించింది సాక్షాత్కరించలేదు. ఆమె మలయమారుతంతో దోబూచులాడుటకు వచ్చింది గాని జ్వాలాముఖంలో మాడిపోవుటకు గాదు. ఆమె అన్నది - "గురుదేవా!"

కుమారగిరి ఆమెను ప్రగాఢపరిష్వంగపాశంలో బంధించాడు. అతని అధరం ఆమె అధరంతో ఏకమైంది. "నర్తకీ! నేను నిన్ను ప్రేమిస్తున్నాను" - అన్నాడతడు.

చిత్రలేఖ అతని కవోష్ణశ్వాసధారలో కాలిపోతున్నది. ఆమె సాహసం చేసింది. బలవత్తరంగా తన ముఖాన్ని అతని ముఖంనుండి ప్రక్కకు త్రిప్పుకొన్నది - "గురుదేవా! మీరు మార్గచ్యుతులౌతున్నారు. మీరు మీ సాధనాపథానికి దూరమౌతున్నారు" - అన్నది. కుమారగిరి బాహుపాశం త్రుటితమైంది. అతడు వ్యాకులుడై వెన్కకు తగ్గాడు. అతని నయనాలలోని ఉన్మాదం ఒక్కక్షణంలో మాయమైంది. అతని ముఖం పాలిపోయింది. "అరెరే! ఎంతకు పాల్పడ్డాను? నన్ను క్షమించు దేవీ!" - అంటూ అతడు కుటీరంనుండి హుటాహుటిగా బయటపడ్డాడు.

చిత్రలేఖ అక్కడే కూలబడింది. కూర్చొని జరిగినదాన్ని గుఱించి ఆలోచించ నారం భించింది. మునుపు తాను కుమారగిరికి చేరువగా వచ్చిచేరింది - ఇప్పు డతనినుండి దూరంగా జరగాలనుకొన్నది. ఆమె అక్కడే భూమిపై పండుకొని వెక్కివెక్కి ఏడ్వసాగింది. తాను తప్పుచేసినట్లుగా ఆమె కనుభవమైంది. తాను పతనమగుటయే కాక అన్యవ్యక్తిని గూడ పతనమొనరించింది. ఇట్లాలోచిస్తూ ఆమె నిద్రాళువైంది.

కుమారగిరి కుటీరం వెలుపలి మైదానంలో తిరుగ నారంభించాడు. కొంతకాలం క్రితం అతని శరీరం మండుతూ ఉండింది - ఇప్పు డతని మస్తిష్కం మండనారంభించింది. మొదటి మంటలో సుఖముండింది గాని రెండవమంటలో శోకమే ఉన్నది. తన కర్మక్షేత్రంనుండి, తన సాధనాపథంనుండి అతడు ఘోరంగా పతనమైనాడు. తన మనోదౌర్బల్యంపై విజయం సాధించడం అతనికి కర్తవ్యంగా దోచింది.

ముందర గాఢాంధకారం అలముకొన్నది. వెనుక పాటలీపుత్రం దీపకాంతులు మిన్కుమిన్కుమంటున్నాయి. కుమారగిరి పాదములా అంధకారంవైపు పయనించాయి - "లేదు - నన్నాపుకొనడం నా కసంభవం. పతనమైపోవుట నా కనివార్యం. నన్ను నేను రక్షించుకొనే తీరాలి" - అని అతడరిచాడు. అప్పటికి కుటీరంనుండి చాలాదూరం అతడు నడిచాడు.

ఉన్నట్టుండి అతనిలో ఒక ధ్వని పలికింది - "నీవు పిఱికిపందవు కావుగదా?" - "ఎందుకు?" - అతడడిగాడు.

దానికి ప్రత్యుత్తరం ప్రతిధ్వనించింది - "నీవెక్కడి కేగుతున్నావు? నీ నిర్బలతపై విజయం సాధించడమనేదే పరమోత్కృష్టమైన సాధన. నీవు నిన్ను గెలువలేనంతవఱకు నీవు అపరిపూర్ణుడవు - అందుకే చిత్రలేఖ నీ చెంతకు వచ్చింది. నీవు చిత్రలేఖకు భయపడు తున్నావా? ఆమె నిన్ను పతనానికి ప్రేరేపించుట లేదు. నీకు నీవే భయపడుతున్నావు. నిర్బలత నీలోనే ఉన్నది. దానిని దూరం చేసికో! సాధన నీ చెంతనే ఉన్నది. నీవెక్కడికి పోతున్నావు?"

కుమారగిరి ఆగిపోయాడు. "ఐతే అదే సరి!" - అని నెమ్మదిగా పలుకుతూ తిరిగి కుటీరం వైపు మళ్లాడు. అతడు వచ్చేసరికి చిత్రలేఖ అక్కడ పడుకొని ఉన్నది. ఆమె కపోలాలపై శుష్కాశ్రుధారల జాడలు కనిపిస్తున్నాయి. కుమారగిరి ఆమె తలగడవైపు నిల్చొన్నాడు. కొంతసేపు ఆమె ముఖాన్ని పరికించాడు. ఆమె ముఖంపై తలను వాల్చి చూచాడు. అప్పుడే ఆమె పెదవులపై చిఱునవ్వు చిగురించింది. తన అధరాల నతడామె అధరాలతో కలిపాడు - కాని ఆ స్పర్శ కతడు త్రుళ్లిపడి వెనుకకు తగ్గాడు. ఆమె అధరం ఎంత శీతలంగా, జీవ రహితంగా ఉందో!

ఏదో యోచిస్తూ అతడు తన ఆసనంపై కూర్చున్నాడు. మళ్లీ సమాధి పొందడానికి యత్నించాడు, కాని అది సాధ్యపడలేదు. ఆ తర్వాత అతడు పడుకొన్నాడు. భవిష్యత్తులో తనపై తాను విజయం సాధించాలని యోచిస్తూ అతడు నిద్రావశుడైనాడు.

౧౮

ఉదయం చిత్రలేఖ లేచినపుడు నిత్యనియమానికి ప్రతికూలంగా కుమారగిరి ఇంకా నిద్రిస్తున్నట్టు గమనించింది. ఆమె బయటికి వచ్చింది, అప్పుడామెకు తలనొప్పిగా ఉన్నది; ఆమె యావచ్ఛరీరం మండుతూ ఉన్నది. రాత్రంతా ఆమె కేవో పీడకలలు. ఆమె హృదయం వ్యాకులితమై ఉన్నది.

అప్పుడు సూర్యోదయమౌతున్నది. ఖగకుల కలరవ కల్లోలితమై, నవ వికసిత కలికా సౌరభ కలితమై ప్రాతఃకాల సమీరం మంద మందంగా వీస్తున్నది. చిత్రలేఖ ఆరుబయట నిల్చున్నది. ఆరాధనాసక్తుడైన విశాలదేవుడు బయట ఒక వటవృక్షం క్రింద కూర్చొని ఉన్నా డు. అచ్చట నిల్చొని ఆమె ఆలోచింపసాగింది. కుమారగిరివద్ద ఉండడం ఉచితమా కాదా? - ఈ సమస్యముడిని విప్పడానికి ఆమె యత్నించింది. ఐతే ఇప్పుడు తానెక్కడి కేగగలదు? ఏ ముఖం పెట్టుకొని తాను బీజగుప్తునికడకు పోగలదు? పోయినా ఆయన తనను స్వీకరిస్తాడా? ఈ ప్రశ్నలకు ఆమె జవాబు చెప్పలేకపోయింది. ఆమె అక్కడినుండి ముందుకు సాగి విశాలదేవుని వద్దకు వచ్చింది. విశాలదేవు డప్పుడు కండ్లు తెఱచి, "దేవీ నమస్కారం" - అంటూ ఆమె కభివాదం చేసినాడు. హఠాత్తుగా ఆమె మస్తిష్కంలో ఏదో ఒక అలోచన మెఱిసింది. "నమస్కారం" అంటూ ఆమె అక్కడ ఆగిపోయింది.

చిత్రలేఖ తనను చేరవచ్చినందుకు విశాలదేవుని కాశ్చర్యం పొడమింది. "నాతో చెప్పేదేమైనా ఉందే దేవీ!" - అతడన్నాడు.

"ఔను!" - చిత్రలేఖ పలికింది - "మఱి ఆ మాట అత్యావశ్యకమైనదీ, అతిముఖ్యమైనది కూడ. కాని ఆ మాట చెప్పేందుకు ముందుగా నీవేమనుకోకుంటే అది నీవు మఱెవరికీ చెప్పనని ప్రతిజ్ఞ చేయాలి. అట్లైతే నీకది చెప్పగలను."

"నేను ప్రతిజ్ఞ చేస్తాను."

"ఐతే విను విశాలదేవా! నేనిక్కడికి వచ్చి పొరపాటు చేసినానని గ్రహించినాను. నేను పైకెదగడానికి ఇక్కడికి వచ్చినాను. కాని అది ఊర్ధ్వగమనంగా గాక అధఃపతనంగా పరిణమిస్తున్నది."

విశాలదేవుడు మందహాసం చేశాడు - "ఆ! నా కర్థమౌతున్నది." - అన్నాడు.

విశాలదేవుని మందహాసం వెనుక దాగిన వ్యంగ్యాన్ని ఆమె పూర్తిగా అర్థం చేసికొన్నది. ఆమె కలవరపడుతూ అన్నది- "నా మాటలను నమ్మజాలక నీవు నవ్వుతున్నావు. ఔను ! ఆ నాటి రాత్రి కుమారగిరిని నాతో జూచినావు. కాని నీకిది స్పష్టం చేస్తున్నాను. దేనికై నేనిక్కడికి వచ్చినానో దానిని చేయజాలకున్నాను. ఇక్కడికి వచ్చిన తర్వాత ఆత్మావిష్కరణ చేసికొంటే నేను పొరపడ్డానని

తెలుసుకొన్నాను. నేనిక్కడికి వచ్చి నన్ను పతనం చేసికొన్నాను. ఇంకా పతనం కావడానికి సిద్ధంగా లేను. దానికి తోడుగా నేను కుమారగిరిని కూడ పతితుని చేస్తున్నాను - అది మహాపాతకం. ఈ పాపంనుండి విముక్తి పొందేందుకు నాకు నీవు సాయం చేస్తావా మఱి, చెప్పు."

"దానికి నేను సిద్ధంగా ఉన్నాను."

"నీ కార్యబీజగుప్తుని భవనం తెలుసునా?"

"ఆ..!

"ఆ భవనంలో శ్వేతాంకుడనే ఒక నవయువకుడున్నాడు. అతనితో చెప్పు నేనతనిని కలియగోరుతున్నానని."

"చాలా మంచిది."

అప్పుడే కుమారగిరి కుటీరంనుండి బయటికి వచ్చాడు. అతనిని చూడగానే వారి సంభాషణ ఆగిపోయింది. అపరాధివలె తల వంచుకొని కుమారగిరి వారిచెంతకు వచ్చి నిలుచున్నాడు. కొంతకాలం అందఱూ మౌనంగా ఉన్నారు. ఆ మౌనాన్ని చీలుస్తూ కుమారగిరి అన్నాడు - "నేనీరోజు చాలాసేపటిదాక నిద్రించాను." - అతడు నవ్వాడు - "దీనికి నాకు విచారంగా ఉంది."

ఇంతమాత్రం మాట్లాడి కుమారగిరి ముందుకు సాగిపోయాడు. విశాలదేవు డతని ముఖంపై ఒక విచిత్రమైన భావపరివర్తనను గమనించాడు. దానికి విస్తుపోయి అతడు చిత్రలేఖ వైపు చూచి అన్నాడు - "దేవీ! నేడు గురుదేవులు కొంచెం అస్వస్థతతో ఉన్నట్లు కనిపిస్తు న్నారు!"

"ఔను. గురుదేవులు అస్వస్థులుగానే ఉన్నారు. దానికి కారణం నేనిక్కడ ఉండడమే. విశాలదేవా! నీవు నాకు సాయం చేయనే వలెను; నాకొఱకు గాకున్నా, మన గురుదేవుల కొఱకు."

"నేను చేస్తాను - ఈరోజే నేనార్య బీజగుప్తుల స్థావరానికి వెడతాను."

కుమారగిరి కుటీరంనుండి దూరంగా గమించాడు. అతడు దినమంతా తిరిగిరాలేదు. విశాలదేవుడు సంధ్యాసమయానికి పాటలీ పుత్రంనుండి తిరిగి వచ్చి అన్నాడు - "దేవీ! ఆర్య బీజగుప్తులు తీర్థయాత్రకై కాశీకి వెళ్లినారు."

ఈమాట విని చిత్రలేఖ నిర్విణ్ణురాలైంది. ఆమె విశాలదేవునితో అన్నది - "విశాలదేవా! ఇంకేమి ఉపాయమున్నది?"

"దేవీ! నాకేమీ తోచడం లేదు."

"నీకేమీ తోచడం లేదు, నాకూ ఏమీ తోచడం లేదు. ఇది విధివిలాసం." - ఆమె ఆగి పోయింది. కొంతకాల మామె ఏమీ మాట్లాడలేదు. అప్పుడామె నయనాలు అజ్ఞాతశూన్యంలో దేన్నో అన్వేషిస్తున్నట్లున్నాయి. "విధివిలాసం సరే, మన పాపఫలం కూడ ఉండవచ్చు. ఒక ఆధారముండినది. దాన్ని త్యజించినాను, బీజగుప్తుణ్ణి నేనెందుకు త్యజించినాను? -- లేదు, ఏమీ లేదు. నేనిక్కడికి జ్ఞానసముపార్జనకై వచ్చినాను - ఇదేనా జ్ఞానం? భగవంతుడు నాకు జ్ఞానదానం చేస్తున్నాడు. ఇదంతా ఎందుకు? విశాలదేవా! నీవేమీ చేయలేవు, గురు దేవు లేమీ చేయలేరు, నేనేమీ చేయలేను, బహుశః భగవంతుడుగూడ ఏమీ చేయలేడేమో! అయ్యేదేదో ఔతున్నది, ఇంకా ఔతుంది గూడ." - చిత్రలేఖానేత్రాలు ఉన్మాదపూరితాలై చకచకలాడినవి. ఆమె ప్రశాంతముఖమండలం వికృతమైంది; శరీరం ఆవేశంతో కంపింపసాగింది.

చిత్రలేఖావికృతరూపాన్ని చూచి విశాలదేవునికి హడలెత్తింది - "దేవీ! నీవు గతజీవితాన్ని తిరిగి స్వాయత్తం చేసికొనలేవా?" - అతడడిగాడు

చిత్రలేఖ నవ్వింది. "గతజీవితాన్ని తిరిగి స్వాయత్తం చేసికొనలేవా? - ఎంతటి మూర్ఖపు మాట విశాలదేవా! నేను పురోగమించింది తిరోగమించడానికి కాదు. తిరోగమించడం భీరుత్వం, ప్రకృతికి విరుద్ధం. ప్రపంచంలో ఎవడు తిరోగమించాడు, తిరోగమించ గలిగాడు? మనిషి అనుక్షణం అడుగడుగునా ముందుకు నడచి చివఱికి మృత్యుముఖంలో పడతాడు. ఒక వేళ అతడు తిరోగమింపగల్గితే

అమరుడయ్యేవాడే కదా! ముందరికి, ముందరికి - పాపంలోనూ పుణ్యంలోనూ తెలిసిందా!"- అంటూ చిత్రలేఖ అక్కడినుండి వెడలి పోయింది. తన సమక్షంనుండి తొలగిపోయే ఆమె ప్రతిమను విశాలదేవుడు తదేకంగా చూస్తూ ఉండిపోయాడు.

చిత్రలేఖ ముందరికి సాగింది. ఆమె లతానికుంజంలో ఆసీనుడైన కుమారగిరిని చూచి అతనివైపు నడిచింది. కుమారగిరి ఆమెను చూచి నిలుచున్నాడు. "ఈనాడు దినమంతా గురు దేవులు కుటీరంవైపు రాలేదు?" - ఆమె ప్రశ్నించింది.

"ఔను రాలేదు నర్తకీ! నీవన్నది నిజమే. కుటీరంలో ప్రవేశించడం - ఉఫ్ - భయావహంగా ఉంది."

"ఔనా! మఱి దీని కేదైనా ఉపాయముందా?"

"ఉపాయమా? కేవలమొకే ఉపాయముంది నర్తకీ! అది నీకు తెలియనే తెలుసు. నేను సాకారోపాసనయందు విశ్వాసంపెంపొందించు కొనసాగినాను. కాని నీ సహకారం లేకుండా అది అసంభవం."

"సాకారోపాసనేచ్ఛ భ్రమాత్మకం"

"ఇది భ్రమాత్మకమో కాదో నిర్ణయించడం నీ కర్తవ్యం గాదు నర్తకీ! నీవు నా శిష్యురాలివి. నా మాట వినడం నీ కర్తవ్యం." - అంటూ కుమారగిరి నిటారుగా నిలబడ్డాడు.

ఈసారి చిత్రలేఖ భయపడలేదు; తటపటాయించ లేదు. ఆమె నిష్కర్షగా అన్నది - "యోగీ! నీ సంగతి మఱచిపోకు. నీ ఎదుట నున్న ఈ స్త్రీ నీ శాసనానికి లొంగిపోయేంతటి అసహాయురాలు గాదు. నీవు నాకు దీక్ష నిచ్చినానని భ్రమపడుతున్నావు; కాదు, ఇట్లని నీకు నీవే ద్రోహం చేసుకుంటున్నావు. నీవెవరిని ఆజ్ఞాపిస్తున్నావు? నీవెఱుగవా ఏ స్త్రీని నీవు శాసింప నెంచుతున్నావో, ఆమెనే నిన్ను దాసుని జేసికొన్నదని!"

కుమారగిరి నిస్తేజస్కుడై కూర్చున్నాడు - కూర్చుంటూ దీనస్వనంతో కరుణాత్మకంగా పలికాడు - "నర్తకీ! నేను నిన్ను ప్రేమిస్తున్నాను."

చిత్రలేఖకు నవ్వు వచ్చింది. "నాకు తెలుసు నీవు నన్ను ప్రేమిస్తున్నావని. కాని నేను నిన్ను ప్రేమించడం లేదు. ఒక్కక్షణంపాటు నేను నీపై ఆధిపత్యం నెఱపాలనుకొన్నాను, దానికై యత్నించినాను. నేనందులో సఫలమైనానుకూడ. ఐనా దానికేమి? పురుషునిపై ఆధిపత్యం నెఱపడం స్త్రీకి ఆ పురుషునిపై గల ప్రేమకు చిహ్నంకాదు. ప్రకృతి స్త్రీని శాసకురాలిగా నిర్మించలేదు. స్త్రీ శాసింపబడడానికి, ఆత్మార్పణ చేసికొనడానికి నిర్మింపబడింది. స్త్రీ తనకంటె దుర్బలుడైన వ్యక్తిని ప్రేమింపజాలదు. ఆమె ఎవనిపై ఆధిపత్యం నెఱపగలదో అట్టి వ్యక్తి ఆమె ప్రేమకు పాత్రుడు కాజాలడు. ఆత్మార్పణద్వారా తన అస్తిత్వాన్ని ప్రియుని అస్తిత్వంతో మేళవించడం స్త్రీయొక్క స్వభావం. అందుచే ఆమె తనను జయింపగల్గిన వ్యక్తిని, తనపై ఆధిపత్యం నెఱపగల్గిన వ్యక్తిని వరిస్తుంది. యోగీ కుమారగిరీ! ఇదే తారుమారుగా ఉంది. పురుషుని ప్రేమకు స్త్రీపై ఆధిపత్యం చూపడం, స్త్రీ ప్రేమకు పురుషునికి తన్నర్పించుకొనడం చిహ్నాలు. కాని మన విషయంలో ఇది విపరీతంగా ఉంది. నేను స్వామినిని, నీవు నాకు దాసుడవు. నేను నీపై ఆధిపత్యాన్ని సంపాదించాను, నీవు నా కాత్మ సమర్పణ చేసికొొంటు న్నావు. నీవెట్టి బలంతో నాప్రేమనభిలషిస్తున్నావు?"

యోగి కుమారగిరి మౌనంతో ఈ మాటలు విన్నాడు. నర్తకి మాటలు కటువుగా ఉన్నా అవి యథార్థంగానే ఉన్నవి. ఈసారి తన బలహీనత నతడు గుర్తించాడు, తన పరాజయం యొక్క భయానకస్వరూపాన్ని అతడు పరికించాడు. అతడు కొంచెంసేపు ఆలోచిస్తూ ఉండిపోయాడు; ఆపైన అతడు లేచి నిలబడ్డాడు. అతని ముఖంలోని వివర్ణత అదృశ్యమైంది, అతని నేత్రాలలో మెఱుపు మఱల ఆవిష్కృతమైంది - "సరే! నేను నీ కాత్మార్పణం చేసికొన్నాను, నీకంటె నేను నిర్బలుడనని ఋజువుచేసికొన్నాను. నీద్వారా భగవంతుడు నా అభిమానాన్ని భంగపఱిచాడు, నాయొక్క లఘుత్వాన్ని ఎత్తిచూపాడు. ఇక ముందు జరుగవలసిన కార్య క్రమం నేను నిర్ణయించుకొన్నాను. నేను నీపై విజయం సాధిస్తాను - ప్రేమించడానికిగాదు, కేవలం నీపై విజయం సాధించడానికి, పతనావస్థనుండి నన్నుద్ధరించుకొనడానికి. విశ్వాస ముంచుకో! కుమారగిరి నింత నిర్బలునిగా భవిష్యత్తులో నీవు చూడవు."

చిత్రలేఖ గంభీరభావంతో అన్నది - "ఈ విషయంలో గురుదేవులకు నేను సాయం చేయగలను."

"ఏవిధంగా?"

"నేను గురుదేవుల ఆశ్రమాన్ని విడనాడిపోవాలనుకుంటున్నాను. గురుదేవుల మార్గంలో నేను కంటకంగా వచ్చి నిలుచున్నానని నాకు తెలుసు. నేనీ పాపాన్ని చేస్తున్నాను."

"ఇది అసంభవం నర్తకీ! నీవు నా ఆశ్రమాన్ని విడనాడలేవు. నీవు లేకపోతే నేనెవరిపై విజయం సాధింపగలను, నీ విక్కడే ఉండాలి తెలిసిందా!"

"యోగీ! నీవు నాపైన గాదు, నీపైనే నీవు విజయం సాధించుకోవాలి. నేనిక్కడ ఉన్నంతవఱకు ఇది జరుగదు - ఈ విషయం నాకు బాగా తెలుసు. నేను వెళ్లిపోవడమే నీకు శ్రేయ స్కరం."

కుమారగిరి ముఖమెఱ్ఱబడింది. - "లేదు నాతో నీవుండవలసిందే! నీవు నన్నతినిర్బలునిగా నెంచుతున్నావు. నీవు వెళ్లిపోతే నీపై నాకు విరోధముండదు గాని, నీవు లేనిదే నేనెవ్వరిపై ఏవిధంగా విజయం సాధించేది? నన్ను ఉద్ధరించుకొనడానికి ఒక సాధనమవసరమై ఉండింది, అందుకే దేవుడు నిన్నిక్కడికి పంపాడు. నేను అసఫలుడనయ్యాను, కాని అసాఫల్యమనేది నాప్రకృతిలో లేదు. నేను పరిపూర్ణంగా సఫలుణ్ణయ్యేంతవఱకు నేను నిన్ను పోనీయను. ఇంత మాత్రం గుర్తుంచుకో!"

"పోనీయవా? ఏమి నీవు నన్నాపగలవా?"

"లేదు, నేను నిన్నాపజాలను, బహుశః ఈ ప్రపంచంలో ఎవ్వరూ నిన్నాపజాలరు గూడ! నిర్బలుడు సబలుణ్ణి ఆపగలడా? ఇది అసంభవం. నేను నిన్ను ప్రార్థింపగలను, నిన్ను ప్రాధేయ పడగలను, నిన్నభ్యర్థింపగలను. ఇంతమాత్రం అర్థంచేసికో, నీవు నన్ను పతనం చేసినావు."

"నేను నిన్ను పతనం చేయలేదు, నిన్ను నీవే పతనం చేసికొన్నావు, కాని ఇందులో నా హస్తం అవశ్యంగా ఉన్నది."

"సరే! నేను నన్నే పతనం చేసికొన్నాను, నన్ను నేనే ఉద్ధరించుకొంటాను. నా పతనానికి సాధనమైన నీవు నా ఉద్ధరణకు గూడ సాధనం కావడం నీ కర్తవ్యం గాదా?"

చిత్రలేఖ ముఖం వంచుకున్నది. ఆమె చూపులు కుమారగిరి చూపులనుండి విడివడి భూమివైపు మళ్లినవి - "ఆ! సరిగానే చెప్తున్నావు."

"ఐతే నీవు నా ప్రార్థనను స్వీకరింపవా? కొన్నిరోజులపాటు నేను నా సాధనను పూర్తిచేసికొనేంతవఱకు నీవుండజాలవా?"

చిత్రలేఖ కొంతసేపు మౌనంగా ఉండిపోయింది. ఆ తర్వాత ఆమె మెల్లగా అన్నది - " యోగీ! ఎంత వ్యవధిని కోరుతున్నావు?"

"వ్యవధే! ఒకవేళ నేను విజయుడనైతే నాచెంత నుండడంలో నీకేమీ ఆపత్తి ఉండదుగదా! నేను విజయుణ్ణైతే నా మార్గం సరియైనది గానే ఉంటుందనుకొంటున్నాను. అట్టి సందర్భంలో నీవట్టి ఉచితమార్గంలో నన్ననుసరింపవచ్చు గదా!"

"లేదు - నేనీ మార్గంలో సంచరింపజాలను. ఇప్పుడైతే నేనాగిపోతాను. ఒకవేళ సంచరించే ఇచ్ఛ గలిగితే అప్పుడు నేను నీకు తెలుపుతాను. నీవు నన్నప్పుడాపజాలవుగదా?"

౧౮

తన అభీష్టానికి వ్యతిరేకంగా చిత్రలేఖ తనకు దూరమైంది, తన అభీష్టానికి వ్యతిరేకంగానే యశోధర తన జీవితంలో ప్రవేశించింది. బీజగుప్తుడు తన పరిస్థితికి తానే నవ్వుకొన్నాడు; యశోధరాసాన్నిహిత్యంలో జీవితం గడపడం అతనికి కష్టంగా తోచింది.

కాశీనగరకోలాహలంలో అతడు తన హృదయావేదనను మఱవదలచుకొన్నాడు. అది జరుగలేదు గాని, ఆ ఆవేదన మఱొక రూపం దాల్చింది. చలనచిత్రంవలె అతని కన్నుల యెదుట చిత్రలేఖాబింబం తొలగిపోయి, యశోధరాబింబం ప్రత్యక్షమైంది. అతని దుఃఖావేదన సుఖంగా పరిణమించింది. అతడు సపరివారంగా కాశీకి వచ్చి వారం రోజులు గడచింది.

ఆనాడు సాయంకాలమైంది. అందఱూ కూర్చొని కాశీనగరంలోని సుందరదృశ్యాలను గూర్చి మాట్లాడుకుంటున్నారు. అప్పుడు మృత్యుంజయుడన్నాడు - "నాకు కాశీలో ఉండిపోవాలనిపిస్తూ ఉన్నది. కాని ఏం చేయగలను? అది నా అధీనంలో లేదు. గృహస్థాశ్రమజాలంలో నే నింకా బందీనయ్యే ఉన్నాను" - అంటూ బీజగుప్తునివైపు సాభిప్రాయంగా దృష్టి సారించినాడు.

బీజగుప్తు డతని మాటల సారాంశాన్ని గ్రహింపకుండా ఉండడానికి ప్రయత్నిస్తూ ఇట్లన్నాడు - "ఆర్యశ్రేష్ఠా! రక్తునికీ, విరక్తునికీ, అనురాగికీ, విరాగికీ, సంసారికీ, సన్న్యాసికీ మధ్య గల భేదం అతిస్వల్పమే. ఆ భేదంగూడ లేదనే వైపే మొగ్గు చూపుతుంటుంది." - అంటూ బీజగుప్తుడు నవ్వి, మళ్లీ అన్నాడు - "నా మాటలపట్ల తమకు ఆశ్చర్యం, అవిశ్వాసం కలుగవచ్చు. కాని నే ననేది మాత్రం సత్యమే."

శ్వేతాంకుని కిప్పుడు మంచి అవకాశం దొరికింది. మృత్యుంజయుని పక్షాన్ని సమర్థిస్తూ అతడన్నాడు - "స్వామీ! సత్యమంటే ఏమిటి? దాని స్వరూపాన్ని మన మెప్పుడైనా తెలిసికొనగలమా? పరిస్థితుల అనుకూలతనే సత్యమనే రెండవపేరుతో అందఱూ పిలుస్తుంటారు. ఐతే పరిస్థితు లెప్పుడూ ఒకే విధంగా ఉండజాలవు గదా!"

ఆ మాటలకు మందహాస మొలికిస్తూ మృత్యుంజయు డన్నాడు - "శ్వేతాంకా! నీవన్నది నిజమైనా, అది నా కెదురైన సమస్య కెట్టి పరిష్కారం సూచింపదు. ఆర్యబీజగుప్తా! మీరన్న మాటను ఇంకా విశదీకరింపగలరా?"

శ్వేతాంకుని అనుచితసమాధానానికి బీజగుప్తుడు మర్మహతుడైనాడు. అతడు శుష్కస్వరంతో అన్నాడు - "నా మాట స్పష్టంగానే ఉంది. వస్తుతః మానవు డెప్పుడూ విరాగి కాలేదు. వైరాగ్యం మృత్యుచిహ్నం. సామాన్యంగా మనం దేన్ని విరాగం అంటున్నామో అది అనురాగకేంద్రపరివర్తనకు మఱొకపేరు. అనురాగమనేది ఇచ్ఛ, విరాగమనేది తృప్తి." - ఆకస్మికంగా బీజగుప్తుని దృష్టి యశోధరవైపు మళ్లింది, యశోధరాదృష్టి అతని దృష్టితో మిళితమైంది.

కొంతసేపటివఱకు మౌనం సామ్రాజ్యం వహించింది. ఆ మౌనంలో జీవరహితశూన్యం, విషాదచ్ఛాయలూ అలముకొన్నవి. శ్వేతాంకుడు మినహా మిగిలినవా రెవ్వరూ ఏమీ ఆలోచించడం లేదు. శ్వేతాంకుడు అనుచితంగా మాట్లాడినాడు.అతడు బీజగుప్తుని మాటలను ఖండించి అపరాధం చేసినాడు. అందు కతడు విచారగ్రస్తుడైనాడు.

యశోధర శ్వేతాంకుని వైపు చూచింది - అతని ముఖం తెల్లబారి ఉన్నది. ఆమె కతని మనోభావం అర్థమైంది, ఆమె నిశ్శబ్దాన్ని చీలుస్తూ అడిగింది - "ఆర్యబీజగుప్తా! ఎన్నాళ్లిక్కడ ఉండాలనుకొంటున్నారు?"

"సరిగా చెప్పలేకున్నాను. ఒక్కక్షణం పాటలికి తిరిగి పోవాలనిపిస్తుంది, మఱుక్షణం ఇక్కడే కొంతకాలం ఉండాలనిపిస్తుంది. " - ఈ సారి మృత్యుంజయుని వైపు చూస్తూ అత డన్నాడు - " ఆర్యా! మీకెంతవఱ కిక్కడ ఉండాలని ఉంది?"

మృత్యుంజయుడు యశోధరవంక చూస్తూ అన్నాడు - "ఇక్కడ నా యిష్టంతో నిమిత్త మేమీ లేదు. యశోధర ఇష్టానుసారం ఇక్కడికి వచ్చినాను గనుక, ఆమె యిష్టానుసారమే పోవడంకూడ ఉన్నది."

బీజగుప్తుడు యశోధరవైపు చూచాడు - ఆమె ముసిముసిగా నవ్వుతున్నది. ఆనాటి ఆమె మందహాసంలో ఏదో ఇంద్రజాలం నిక్షిప్తమై ఉన్నది, ఆనాడు తొలిసారిగా బీజగుప్తుడు ఆమె సౌందర్యసుధాయథార్థస్వరూపాన్ని ఆవిష్కరించాడు, ఆమెవంక అట్లే బహుకాలం చూస్తూ ఉండిపోయాడు. యశోధరకూడ బీజగుప్తునివైపు తదేకంగా చూస్తున్నది. ఆ సమయంలో మృత్యుంజయుడు బయటికేసి చూడసాగాడు.

శ్వేతాంకుని కీ సన్నివేశం అసహనశీలంగా తోచింది. అతడన్నాడు - "స్వామీ! ఈ రోజు నగరాటనం చేసే ఆలోచన లేదా?"

బీజగుప్తు డులికిపడ్డాడు. హఠాత్తుగా అతడు తన చూపులను యశోధరనుండి త్రిప్పుకొన్నాడు, యశోధర తన చూపులను శ్వేతాంకునివైపు మళ్లించింది. బీజగుప్తుడు మృత్యుం జయు నడిగాడు, " ఆర్యా! తమరికి నగరాటనం చేసే ఆలోచన ఉన్నదా?"

"ఈరోజు తిరుగాలని అనిపించడం లేదు."

శ్వేతాంకుడు యశోధర నడిగాడు - "దేవీ! నీవు వస్తావా?"

యశోధర నవ్వుతూ అన్నది - "ఇక్కడ కూర్చొని చేసేదేముంది?"

బీజగుప్తు డన్నాడు - "నాకూ పోవాలని అనిపించడం లేదు."

"ఐతే నాతో వెళ్లడానికి మీరు శ్వేతాంకునికి అనుమతిస్తారా? " - యశోధర బీజగుప్తుని అడిగింది.

"అవశ్యంగా" - అన్నాడు బీజగుప్తుడు. ఆమాట అతని అభీష్టానికి వ్యతిరేకంగా అనవలసి వచ్చింది..

యశోధర శ్వేతాంకునితో వెళ్లిపోయింది.

బీజగుప్తుడు మృత్యుంజయునితో అన్నాడు - "మీరు కాశీలో యజ్ఞం చేయాలనుకున్నారు. ఈ విషయంలో మీ ఆలోచన మారిందా?" మృత్యుంజయుడు నవ్వసాగాడు. "ఆ! కొన్నాళ్లవఱ కా విచారాన్ని స్తంభింపజేసికొన్నాను. ఆర్యబీజగుప్తా! ఒక్క విషయం నాకు బోధపడడం లేదు - యజ్ఞంలో పశుబలి అనే అంశాన్ని తొలగించలేమా?"

"ఎందుకు?" - బీజగుప్తుడుగూడ నవ్వసాగాడు. "తమరింకా బౌద్ధభిక్షువుల మాటలకు లోనుగాలేదుగదా?"

"దీనిలో ఆశ్చర్యమేముంది? ఇంత రక్తపాతంతో ఏమి లాభం? ఈ రక్తపాతంవల్ల ధర్మగ్లానియే కల్గుతున్నది. బుద్ధుని మాట లవశ్యంగా సారవంతమైనవే. "

"బహుశః సత్యమైనవి కూడాను" - బీజగుప్తుడు మెల్లగా అందుకున్నాడు.

ఇద్దరూ కొంతసేపు మౌనంగా ఉన్నారు. "ఇక్కడుంటే మనసొప్పడం లేదు. నగరంలో తిరిగిరావడానికి మీకేమైన అనను కూలమా?" - బీజగుప్తుడు లేస్తూ అన్నాడు . "తిరుగాలనే కోరిక అంతగా లేదు గాని, ఈ విషయంలో అననుకూలప్రసక్తే లేదు. మీరు వెళ్లాలనుకుంటే నేను సిద్ధమే." - మృత్యుంజయు డన్నాడు

నగరంలోని కోలాహలానికి విసుగుజెంది మృత్యుంజయుడు రథాన్ని గంగాతీరం వైపు మళ్లించాడు. గంగాతీరంలో అనేకనౌకలు నిల్చియున్నవి. ఒక నౌకలో శ్వేతాంకుడు, యశోధరా ఎక్కిపోవడానికి సిద్ధంగా ఉన్నట్లు బీజగుప్తుడు గ్రహించినాడు. "శ్వేతాంకా!" అని అతడు పిలిచినాడు. అప్పుడు గంగాహృదయంలో నర్తించే నౌకల విన్యాసాన్ని చూచుటలో నిమగ్నుడైయున్న శ్వేతాంకుడు ఆ పిలుపును వినిపించుకొనలేదు. కాని యశోధర శ్వేతాంకునితో అన్నది - "చూడటు! బీజగుప్తులవారు నాన్నగారితో సహ వస్తున్నారు."

శ్వేతాంకుడు తల నటువైపుకు ద్రిప్పినాడు. అప్పటికి ఆగిపోయిన రథాలనుండి బీజగుప్తుడూ, మృత్యుంజయుడూ క్రిందికి దిగినారు. బీజగుప్తు డా సమయంలో అక్కడికి రావడం శ్వేతాంకునికి నచ్చలేదు. అతని ముఖమండలం వికృతరూపం దాల్చింది. అతడు మెల్లగా "అంతా నాశనం!" - అన్నాడు, కాని అది యశోధరకు వినపడింది. ఆమె గంభీరస్వనంతో అన్నది - "శ్వేతాంకా! జీవితంలో సంయమనం పాటించడం అత్యంతావశ్యకం." ఆమె గాంభీర్యం అతనికి భయకారకంగా తోచింది. ఐనా అతడన్నాడు - "ప్రేమకూ, సంయమనానికీ పొత్తు కుదురదు " - అప్పటికి బీజగుప్తుడూ, మృత్యుంజయుడూ అక్కడికి చేరుకొన్నారు.

శ్వేతాంకుని ముఖంలో సంక్షోభమిశ్రితమైన నిరాశాభావం ఇంకా మాయం కాలేదు. బీజగుప్తుడు అతని ముఖభావాన్ని పఠించినాడు. అతడన్నాడు - "శ్వేతాంకా! మీరు వెళ్లిన తర్వాత మాకూ మనసు తోచలేదు, మేమూ చేరవచ్చినాము."

దాని కొక శుష్కహాసాన్ని దొరలిస్తూ శ్వేతాంకు డన్నాడు - "నేను రమ్మని మీతో ముందుగానే అన్నాను."

అందరూ నౌకలో ఆసీనులైనారు; నౌక గంగాప్రవాహంలో కదలిపోయింది. అన్ని వైపులా గంగాతరంగాలపైన నౌకలు స్వారి చేస్తున్నవి. ఒకవైపునుండి పాటలూ, మఱొక వైపునుండి మాటలూ, ఇంకొకవైపునుండి వాద్యాలూ, వేఱొకవైపునుండి నగవులూ వినిపిస్తున్నవి.

యశోధర శ్వేతాకుణ్ణి అడిగింది - "శ్వేతాంకా! నీకు కాశీ అందగా ఉన్నదా, లేక పాటలీపుత్రమే అందంగా ఉన్నదా?" - శ్వేతాంకుడు కొంతసేపు ఆలోచించి అన్నాడు - "నాకు పాటలీపుత్రమే యిష్టం. అందులో ఉన్న సంపద్వైభవం కాశిలో లేదు. కాశి విద్యాకేంద్రం మాత్రమే."

"ఆర్య బీజగుప్తా! మఱి తమకు?"

"ఈ రోజుల్లో నాకు కాశీనగరమే బాగుంది."

" ఈ రోజుల్లో ఎందుకు?" - యశోధర మఱల అడిగింది.

"దేవీ యశోధరా! ఏ ప్రదేశమైనా నచ్చడమనేది పరిస్థితుల అనుకూలతపై ఆధారపడి ఉంటుంది. మన మొక ప్రదేశాన్ని నచ్చం - ప్రదేశమనేది కేవలం జడమైనది. మనం నచ్చేది ఒక ప్రదేశంలో మన కలవాటైన వాతావరణాన్నీ, పరిసరాలను. ప్రతివ్యక్తికీ తాను పుట్టి పెరిగిన స్థలం ప్రియంగా ఉంటుంది. ఎప్పుడూ అదే స్థలంలో ఉండుటవల్ల అతనికి స్నేహితు లక్కడే సమకూడుతారు. మన జీవితం జడపదార్థాలతో నిర్మింపబడదు. అది చేతనాలతో, మనకు తటస్థపడే వ్యక్తుల సంసర్గంతో నిర్మితమౌతూ ఉంటుంది. ఈ విధంగా చూస్తే నాకు పాటలీపుత్రమే అధికప్రియం కావలసి ఉన్నది. కాని ఈ విచారం ఇంతటితో ఆగదు. పరిస్థితు లందటికీ ఎప్పుడూ ఒకే రకంగా ఉండవు. మన ప్రకృతులు పరివర్తనను కోరుకొంటాయి. పరివర్తనలు కొంతకాలం మనలను అన్యపరిస్థితులలో పయనింప జేస్తాయి. ఈ పరివర్తన మనకు పరిపూర్ణసంతోషకారి అయ్యేదాక ఆ మాఱిన పరిస్థితులు మనకు శోభాయమానములు కాజాలవు. కాశియందు మనఃపరిపూర్తి నా కింకా కలుగలేదు. అందుచేత ఇప్పుడు నాకు కాశీ ప్రియంగా ఉంది."

యశోధర నవ్వింది. "ఆర్యబీజగుప్తా! మీలో నొక విచిత్రప్రతిభ ఉన్నది. మీ తర్కం అఖండితవ్యము. " - అంటూ ఆమె శ్వేతాంకుని వైపు తిరిగి నవ్వుతూ అన్నది - "శ్వేతాంకా! జ్ఞానం తర్కం మాత్రమే కాదు. అది శుష్కతర్కానికంటె విశాలమైనది. నీవు బీజగుప్తులతో జాగ్రత్తగా నుండు!"

శ్వేతాంకుడు కూడ నవ్వుతూ అన్నాడు. - "నే నార్యబీజగుప్తుని సతీర్థ్యుడను. ఐతే నేను మా గురువు రత్నాంబరులతో గూడ జాగ్రత్తగా ఉండాలా?"

యశోధర నీళ్లునములుతూ అన్నది - "అది నేనెట్లు చెప్పగలను?"

బీజగుప్తు డన్నాడు - "ఎట్లెందుకు దేవీ యశోధరా! ఇది గూడ నీవు చెప్పవలసిందే. నీకు సదవగాహన గల విషయాన్ని చెప్పుటకు సంకోచమెందుకు?"

"లేదు. సంకోచమేమీ లేదు. మీ విషయంలో నేనేదైనా చెప్పగల నెందుకంటే మన యిద్దరి మధ్యగల సంబంధం గాఢమైనది; మన యిద్దరి మధ్య భేదభావం అధికంగా లేదు. కాని మహాప్రభువు రత్నాంబరుల విషయం వేఱు... వారు పూజ్యులు."

బీజగుప్తుడు యశోధరవైపు చూచినాడు. వారిర్వురి దృష్టులు కలిసినవి. ఇద్దరూ తదేకంగా కొంతకాలం ఒకరినొకరు చూస్తూ ఉండిపోయారు. యశోధర కన్నులలో లజ్జాసంకోచములు లేవు. ఏదో అపూర్వశోభ, విస్పష్టత, నిశ్చలత చోటు చేసికొన్నవి. బీజ గుప్తుని రక్తనాళాలలో రక్తం తీవ్రవేగం పుంజుకొంది, హృదయం దడదడలాడింది , శరీరంలో ఏదో కంపనం ప్రసరించింది. బీజగుప్తు డామెనుండి తన దృష్టిని త్రిప్పుకొన్నాడు. ఇప్పుడు శ్వేతాంకుని దృష్టి ఆమె దృష్టితో మిళితమైంది. అతని చూపులు బీజగుప్తుని చూపుల్లో గల మనోభావనను ఆకళించుకొని యున్నవి. బీజగుప్తునికి తనపై తనకే కొంచెం కోపం వచ్చింది, అట్లే శ్వేతాంకునిపైన గూడ.

"శ్వేతాంకా!"

"స్వామీ!"

బీజగుప్తుడు సర్దుకొని అన్నాడు - "ఏమీ లేదు - మనం ఇక్కడికి వచ్చి ఎన్ని రోజులైంది?" శ్వేతాంకుని కర్థమైంది - బీజగప్తు డేది చెప్పాలనుకొంటున్నాడో దానిని చెప్పలేక పోతున్నాడని. అతడు లెక్కించుకొని "ఎనమిది రోజులు" - అన్నాడు.

"ఐతే ఇప్పుడు పాటలీపుత్రానికి తిరిగి వెళ్లుట మంచిది" - అని, అటుపైన శ్వేతాంకునికి మాత్రం వినపడేటంత మందస్వరంతో అన్నాడు - "చిత్రలేఖను మఱచిపోవడం అసాధ్యంగా ఉన్నది. పాటలికి చేరుకొనే ఏర్పాట్లు చేయి."

ఉన్నట్లుండి బీజగుప్తుని కిట్లు మనసుమారడంపట్ల శ్వేతాంకునికి ఆనందమైంది. యశోధరామృత్యుంజయుల కాశ్చర్యమైంది. మృత్యుంజయు డడిగాడు - "ఆర్యబీజగుప్తులకు నిజంగా తిరిగిపోవాలని ఉన్నదా?"

బీజగుప్తుడు తలవంచుకొని అన్నాడు - "మృత్యుంజయులు నన్ను క్షమించవలెను. నా మనస్సులో మెఱసిన దానిని వెంటనే ఆచరించాలనే ఆకాంక్ష నాయందలి గొప్ప అవగుణం. ఒకగంట తర్వాత నేనేమి చేస్తానో చెప్పలేను. ఇప్పుడు ఏకాయెకిన నాకు పాటలీపుత్రం గుర్తుకు వచ్చింది. కాశీనివాసం కంటకంగా తోచింది. కాశీలో ఒక్క క్షణం కూడ ఉండడం నాకు కష్టసాధ్యం. "

యశోధర అడిగింది - "ఐతే ఎప్పుడు వెళ్లాలని ఉంది? మేము గూడ ఏర్పాట్లు చేసికొనవలెనుగదా! తమరు తమ చిత్తవృత్తిప్రకారం నడచుకొనేందుకు ముందు ఇతరుల సాధక బాధకాలను గూడ ఆలోచింపవలసిన ఆవశ్యకత ఉన్నది."

బీజగుప్తుని వదనం సిగ్గుతో పాలిపోయింది. అతడన్నాడు - "దేవీ యశోధరా! బాగా చెప్తున్నావు. నన్ను క్షమించు. మీ సాధ్యాసాధ్యాల మీదనే నేనాధారపడి ఉన్నాను. మీకు వీలైనప్పుడే నా ప్రయాణం కూడా!"

"కాదు బీజగుప్తా! నాకేమీ అసౌకర్యం లేదు. నేను సాధారణపద్ధతిని ప్రస్తావించినానంతే. మీకు కష్టం గాకూడదు. రేపు సంధ్యా కాలంవఱకు తిరిగిపోయే ఏర్పాట్లు చేసుకుందాం. ఏవో కొన్ని వస్తువులు కొనాలని ఉన్నది. అవి శ్వేతాంకునితో వెళ్లి రేపు కొంటాను."

౧౬

బీజగుప్తునికి తనపై తనకే ఆశ్చర్యమేసింది. అతడు తన కిష్టంలేకుండగనే, తనకు తెలియకుండగనే యశోధరయం దాకర్షితుడౌతున్నాడు; బహుశః ఆనాడు శ్వేతాంకుని ముఖగతభావం అతనిని జాగృతుని చేయకుంటే అత డామెను తన దానిగా చేసికొనేవాడేమో! అతడు కాశికి వచ్చింది తన దుఃఖాన్ని మఱవడానికి, మనస్సంక్షోభాన్ని దూరం చేసికొనడానికి. పాటలీపుత్రంలో ఉండి, చిత్రలేఖకు సమీపంగా ఉండి, తన ఐశ్వర్యవైభవాల మధ్యన ఉండి కాలం గడపుతుంటే తన గాయం మానదని అతడు పాటలీపుత్రంలో ఉన్నప్పుడు అనుకొన్నాడు. ఈ భావమే, ఈ వైరాగ్యమే అతనిని పాటలీపుత్రంనుండి ఇక్కడికి లాగుకొని వచ్చింది. ఒక లక్ష్యహీన పథికునివలె అతడు పాటలినుండి బయటపడ్డాడు.

"లక్ష్యహీనపథికుడనా?" - బీజగుప్తుని విచారధార మారిపోయింది - "లక్ష్యహీను డెవడైనా ఉంటాడా? లక్ష్యహీను డగుట మానవునికి సంభవమా? బహుశః కావచ్చు" - బీజగుప్తుడు సందిగ్ధావస్థలో పడ్డాడు. మఱొక ప్రశ్న అతనికి సాక్షాత్కరించింది - "మనుష్యుని కొక లక్ష్యమంటూ ఉంటుందా? ఎవడైనా చెప్పగలడా తానేమి చేసేందుకు వచ్చాడో, తానేమి చేయగోరుతున్నాడో, తానేమి చేస్తాడో? కాదు - ఇది సాధ్యం కాదు. మనుష్యుడు పరతంత్రుడు, పరిస్థితులకు దాసుడు, లక్ష్యహీనుడు. ఏదో ఒక అజ్ఞాతశక్తి ప్రతిమానవుణ్ణీ ప్రచోదిస్తుంది. మనుష్యుని కోరిక కేమీ విలువ లేదు. మనుష్యుడు స్వావలంబి కాడు, కర్త గాడు, అతడు కేవలం సాధనం మాత్రమే."

బీజగుప్తుడు అటూ యిటూ పొరలినాడు. అతడు నిద్రింపలేక పోయినాడు. అప్పటికి అర్ధరాత్రి దాటింది, అంతటా నిస్తబ్ధత ఆవరించింది. అతడు మళ్లీ యోచించ నారంభించినాడు -"రేపు నేను పాటలీపుత్రానికి పోతున్నాను - ఎందుకు?" - అత డాలోచించినాడు - "చిత్రలేఖను కలిసేందుకు, ఆమెనిక్కడికి లాక్కొని వచ్చేందుకు" - రమ్మని తాను పట్టుపడితే చిత్రలేఖ తనను నిరోధించదనే ఆత్మవిశ్వాసం అతనికున్నది - "లేదు. చిత్రలేఖ దగ్గరికి వెళ్లను. ఎందుకు వెళ్లాలి? నేనామెను విడిచిపెట్టలేదుగదా! ఆమెయే నన్ను విడిచిపెట్టినది. ఇట్లెందుకు జరిగినది? బహుశః ఇదే విధివిధానమేమో! ఇదే విధివిధానమైతే అది అవిలంఘ్యమైనది. మఱి దుఃఖమెందుకు? చిత్రలేఖ వెళ్లిపోయింది - పోనీ! నేను నా జీవితాన్ని ఎందుకు నష్టం చేసికొనవలె?"

బీజగుప్తుడు కనులు మూసికొన్నాడు. అతడు నిద్రింప యత్నించినాడు. "ఏం - త్యాగంతో, వేదనతో జీవితం నష్టమౌతుందా? జీవితంలో దుఃఖ మొక భాగం కాదా? ప్రతివ్యక్తి అదృష్టంలో సుఖమే ఉంటుందా? ఉండదు - సుఖమెంత మహత్త్వపూర్ణమైనదో దుఃఖమూ అంతే. ఐతే దుఃఖమే సహింపబడనీ! త్యాగమే నా మార్గం కానీ! నా కర్తవ్యం నేను చేయవలె. మఱి నా కర్తవ్య మేమిటి?" - బీజగుప్తుడు లేచి నిలబడ్డాడు. ఒక గ్లాసు శీతలజలం త్రాగి, ముఖం కడిగికొన్నాడు. ఆపైని అతడు పడుకొన్నాడు.

"నా కర్తవ్యమేమిటి? నేను ప్రభవించింది కర్మార్థమే. గృహస్థజీవితం గడపుతూ నా వంశాభివృద్ధిని చేయడం నా కర్తవ్యం. ఇందుకై నేను వివాహమాడుట ఆవశ్యకమై యున్నది. విధివిధాన మిదియేనా? బహుశః చిత్రలేఖ నా జీవితంనుండి ఇందుకే తొలగిపోయిందేమో? నేను వివాహం చేసికొందునా? ఒకపరి గృహస్థధర్మము నాశ్రయింతునా? మఱి యీ వివాహానికి యోగ్యురాలైన కన్యగూడ ఉన్నది. యశోధరా --- యశోధరా! సౌందర్యంలో యశోధర చిత్రలేఖ కే అంశంలోనూ తీసిపోదు. యశోధర ఒక రత్నం - ఒక పవిత్రప్రతిమ. నేను యశోధరను వివాహమాడవలసిందేనా? స్త్రీకుండవలసిన సద్గుణములన్నీ ఆమెయందున్నవి. ఆమెయే సరియైనది.

కాని అది సంభవమా? నేనిదివఱకే ఒకసారి యశోధరాహస్తమును తృణీకరించినాను. ఇప్పు డేముఖంతో యశోధరకై మృత్యుంజయుని అర్థించగలను? అట్లర్థించినను సామంతుడు మృత్యుంజయుడు నా కోర్కెను నిరాకరింపవచ్చును." - బీజగుప్తుడు నవ్వుకొన్నాడు - "కాదు - ఇది జరుగదు. ఇప్పుడు యశోధరతో నా వివాహాన్నిగుఱించి ఆలోచింపలేను. దీనికి ఆలస్యమైంది - చాలా ఆలస్యమైంది. చిత్రలేఖ - చిత్రలేఖయే నా జీవితంలో ఉన్నది."

బీజగుప్తుడు మళ్లీ లేచి నిలబడ్డాడు. తనకింక నిద్ర రాదని అతనికి తెలిసిపోయింది. అప్పుడు చంద్రోదయమౌతున్నది. అతడు బయటికి వెడలి గంగాతటంవైపు పయనించినాడు. అప్పటి కింకా రెండుజాముల రాత్రి మిగిలియున్నది. అతడు గంగాతీరం చేరి అక్కడ కూర్చున్నాడు.

గంగాతీరంలో అప్పుడు కొందఱు కూర్చొని ముచ్చట్లాడుతున్నారు. ఒకచోట ముగ్గురు వ్యక్తులు కూర్చున్నారు. వారిలో ఒకడు - దాదాపుగా డెబ్బది యేండ్లవాడు - మాట్లాడుతున్నాడు. అతడు మర్యాదస్థుడు లాగున్నాడు. అతని ముఖం ముడుతలు పడి యున్నది. అతని మాటలనుబట్టి అతడు సన్న్యాసిగా తోస్తున్నాడు. మిగితా ఇద్దఱు అతనికంటె వయసులో చాలా చిన్నవారు. అతనికి కుడివైపు పాతికయేండ్ల ప్రాయంగల ఒక సన్నని యువకుడున్నాడు. అతని యెత్తు సాధారణముగా నున్నది. అతని వదనంలో వేదనా ఛాయలు కనిపించుచున్నవి. సన్న్యాసికి ఎడమవైపున నడివయస్సులోనున్న ఒక లావుపాటి వ్యక్తి ఉన్నాడు. అతని ప్రాయం బహుశః ఐదుపదు లుండవచ్చును. అతనికి పొడుగైన బవిరిగడ్డ మున్నది. అతని కేశములు పలితము లగుచున్నవి.

సన్న్యాసి అంటున్నాడు - "నీకిప్పుడే సంన్యాసం స్వీకరింపవలసిన వయస్సు లేదు. పో! పోయి నీ తండ్రి ఆజ్ఞను పాలించు, నీ కర్తవ్యాన్ని నెరవేర్చు."

ఆ నవయువకుడు సన్న్యాసి పాదములు పట్టుకొని వేడుకొన్నాడు - "నేను మీ యాశ్రితుడను. నాకు సన్న్యాసదీక్ష ప్రసాదించండి. జీవితంపై నాకెట్టి అనురక్తి మిగుల లేదు. సంసారంలో ఉండాలంటే ఏదో ఒక ఆశయముండాలి. కాని ఒకసారి విరక్తుడనైనట్టి నేను సంసారకూపంలో పడి ఆత్మహననమే చేసికొంటాను. అందులో నాకు శాంతి లేదు. మా తండ్రి గారి నడగండి - ఈ రెండు సంవత్సరాలు నేనెంత యాతన ననుభవించినానో!"

అప్పుడు నడివయస్సువా డన్నాడు - "ఔను. నీవైతే నా మాట వినవు. నేనంటాను, రెండవ పెండ్లి చేసికొమ్మని. ఇప్పుడు నీ వయస్సెంతని? జీవనమరణాలు ప్రక్కప్రక్కనే ఉంటాయి. నీకు సంతానం లేనే లేదు. నీ కిప్పుడు సన్న్యాసస్వీకారం మంచిది కాదు. పెండ్లి చేసుకుంటే నీ జీవితం మళ్లీ అనురాగపరిపూర్ణమౌతుంది."

సన్న్యాసి ఆ యువకునితో అన్నాడు - "నీ తండ్రి బాగా చెప్తున్నాడు. అబ్బాయీ! ప్రేమ అనేది ఒక మిథ్యాకల్పన. స్త్రీపురుషుల మధ్య సంబంధం సంసారమూలకంగానే ఉంటుంది. సంసారం లేదంటే వారు భిన్నాత్మలు గల వేర్వేరు వ్యక్తులే. ఈ భిన్నాత్మలు సంసారమూలంగానే ఏకమౌతాయి. ప్రేమ అనేది కేవలం ఆత్మగతమైనస్నేహం. ఆ స్నేహ మేమంత మహత్త్వపూర్ణమైనది కాదు; అది తెగిపోవచ్చును గూడ. అది తెగిపోయినంతనే తన జీవితాన్ని దుఃఖమయం చేసికొనడం బుద్ధిమంతుని లక్షణం కాదు. నీ కర్తవ్య మిప్పుడు వివాహం చేసి కొనడమే - వివాహం చేసికొనక నీవు కర్తవ్యచ్యుతుడ వౌతున్నావు."

"అదేవిధంగా?"

"విను . స్త్రీ అనేది అబల. ఒక అబలకు ఆశ్రయమీయడం ప్రతిపురుషునికీ కర్తవ్యం. వివాహం ద్వారానే పురుషుడు అబలకు ఆశ్రయ మిస్తాడు. ఇట్లు పురుషు డాశ్రయ మీయని యెడల స్త్రీదశ శోచనీయమౌతుంది. దీనివల్ల పురుషునికిగూడ చాలా ఇక్కట్టు లెదురౌతాయి. నీ వెప్పుడైతే వివాహం చేసికొనకుండా సన్న్యాసిని గావాలంటున్నావో, అప్పుడు నీవు నీ మనోదౌర్బల్యాన్ని ప్రదర్శిస్తున్నావు. ఒకానొక అబలకు ఆశ్రయమీయవలసిన కర్తవ్యంనుండి నీవు తప్పుకుంటున్నావు."

అప్పు డా యువకు డన్నాడు - "కాని స్వామీ! నేను భోగవిలాసాలను పరిత్యజించి తపోగ్నిలో తపింపబోతున్నాను - అది మనోదౌర్బల్య మెట్లౌతుంది?"

సన్న్యాసి నవ్వాడు - " నీవు తపోగ్నిలో తపింప గోరుతున్నావా? ఎందుకు? నీవు ప్రేమించే వ్యక్తి నీకు దూరమైందనే? ఇట్టి తపస్సు వ్యర్థం - ఇది ఒక రకమైన ఆత్మహత్య. లక్ష్యం లేని ఈ తపశ్చర్యవల్ల నీ ఆత్మహననాన్ని నీవు కోరుకుంటున్నావు."

"మీరు చెప్పేది మాన్యమైన మాట! " - అంటూ ఆ యువకు డా సన్న్యాసి పాదాలపై శిరస్సును మోపి నమస్కరించి తండ్రితో బాటు అక్కడనుండి వెళ్లిపోయినాడు.

బీజగుప్తు డా సన్న్యాసికి నమస్కరించినాడు. అతడు మందహాసం చేస్తూ అడిగినాడు - "ఏమి? నీవు గూడ సన్న్యసింప గోరు తున్నావా?" బీజగుప్తు డన్నాడు - "లేదు. ఇప్పుడే సన్న్యసించే విచారమేమీ లేదు. మీ మాటలు నాకెంతో ఆనందప్రదములైనవి. అందుకే ఇక్కడ కూర్చున్నాను."

సన్న్యాసి చిఱునవ్వు నవ్వాడు - "ఈ సమయంలో గంగాతటానికి వచ్చిన వ్యక్తి గతిలేని వాడో, లేక సన్న్యసించినవాడో కావాలి - లేకుంటే అత్యంతమనస్సంక్షోభ మున్న వాడైనా కావాలి."

"మీ అనుమానం సరియైనదే." - బీజగుప్తు డుత్తర మిచ్చాడు - "నా మానసోద్విగ్నత అసాధారణమైనది. మీ మాటలలో నేను నా ఉద్విగ్నతకు సంబంధించిన సమస్యను చూచినాను. దీని విషయంలో మిమ్ముల నింకా అడుగవచ్చునా?"

"యథేష్టంగా!"

"మీరిప్పుడే యువకునితో అన్నారు అఫలితప్రేమకు తన జీవితాన్ని బలిచేయడం ఆత్మహత్యయే యని. కాని ప్రేమయొక్క స్మృతి వల్ల కలిగే జీవితబాధ స్వాభావికం, ప్రాకృతికం కాదా? ఇట్టి ఆవేదనను అణచుకోవడం, దాని స్వాభావికరూపాన్ని కృత్రిమో పాయాల ద్వారా మఱపడం ఆత్మహత్యయే కాదా?"

సన్న్యాసి కొంతసేపు మౌనంగా ఉన్నాడు. ఆ తర్వాత అత డారంభించినాడు - "నీవు చెప్పేది సరియైనదే. కాలం గడచిన కొలదీ ఆవేదన దానంత కదే దూరమౌతుంది. పురుషులయొక్క విభిన్నప్రకృతుల ప్రకారం దీని కెంతకాలం పడుతుందనేని భిన్నంగా ఉంటుంది. ఈ గడువులోపల కృత్రిమోపాయముల ద్వారా ఆవేదనను దూరం చేయడం అస్వాభావికమే. కాని ప్రతి అస్వాభావిక వ్యవహారం ఆత్మహననం కాదు - ఇది గుర్తుంచుకోవాలి. ఈ కృత్రిమత మనల నధికంగా ఆవరిస్తే అదే మనకు స్వాభావికంగా తోస్తుంది. మనం చేసే వస్త్రధారణ అస్వాభావికం, తినే తిండి అస్వాభావికం, ఉండే భోగవిలాసాలు అస్వాభావికం, ఈ ఐశ్వర్యమూ అస్వాభావికం. స్వాభావికమైన జీవనం భారతరమైనది - ఈ భారవంతమైన జీవితాన్ని ఉత్తేజపఱచుకొనుటకే మానవుడు ఆటపాటలు, నాట్యవిన్యాసాలు, పండుగపబ్బాలూ ఏర్పరచుకొన్నాడు. వీని సమాహారాన్నే మనం జీవన మంటున్నాము. దుఃఖాన్ని కృత్రిమో పాయముల ద్వారా దూరం చేయడంకూడ ఆత్మహననం కాదు. అది యెంత అస్వాభావికంగా తోచినను అది స్వాభావికమే."

"కృతజ్ఞుడను" - బీజగుప్తుడు లేచి నిలబడ్డాడు - "తమరు నా తలపైనుండి తీరని భారం తొలగించినారు. మీ మాటలవల్ల నా కర్తవ్యాన్ని నిశ్చయించుకొనుటకు నేను సమర్థుడ నౌతున్నాను. సెలవు!" - అంటూ అక్కడనుండి అతడు నిష్క్రమించినాడు.

అప్పుడు ప్రాతఃకాలవాతం వీస్తూ ఉన్నది. పూర్వదిశలో వెలుగురేకలు కించిన్మాత్రం పొడసూపుతున్నాయి. పక్షులు తమ నీడము లను విడిచి నింగి కెగుర నారంభిస్తున్నాయి. బీజగుప్తుడు తిరిగి వచ్చినాడు - సెజ్జపై శయనించినాడు. అతడు లేచే సరికి సమయం రెండుజాములు దాటింది. తన కిష్టమైన వస్తువులు కొనుటకై అప్పటికి యశోధర శ్వేతాంకునితో సహ బజారుకు వెళ్లింది.

కాలకృత్యములు నిర్వర్తించుకొని బీజగుప్తుడు మృత్యంజయుని యొద్దకు వెళ్లినాడు. బీజగుప్తుని చూస్తూనే మృత్యుంజయు డడిగినాడు - " ఆర్యబీజగుప్తా! తమరు చాలా ఆలస్యంగా లేచినారు, రాత్రి బాగా నిద్ర రాలేదా?"

"ఆ.. రాత్రంతా ఆలోచిస్తున్నాను."

"ఏమాలోచిస్తున్నారు?"

"భవిష్యజ్జీవితాన్ని గుఱించి కొంచెం ఆలోచిస్తున్నాను."

మృత్యుంజయుడు కించిన్మందహాసం చేస్తూ అన్నాడు - "జీవితంనుండి చిత్రలేఖ నిర్గమించిన పిదప భావిజీవితాన్ని గురించి ఆలోచించడం స్వాభావికమే. ఏమైన నిర్ణయం తీసుకొన్నారా?"

మృత్యుంజయుని మందహాసం వెనుక దాగియున్న వ్యంగ్యానికి బీజగుప్తుడు వ్యాకులితుడైనాడు. తాను చెప్తున్న విషయము నాపి వేస్తూ అతడన్నాడు - "ఇప్పటికేమీ నిర్ణయం తీసికొనలేదు. కాని త్వరలోనే ఏదో ఒకటి నిర్ణయించుకొనవలెను."

"నాకు తెలుసు మీ నిర్ణయ మేముంటుందో. నేను మనుష్యుల మనఃప్రవృత్తిని కొంతకొంతగా గ్రహింపగలుగుతున్నాను."

బీజగుప్తుడు మాట మారుస్తూ అన్నాడు - "పోయే ఏర్పాట్లు చేయడానికి తమరు తమ సేవకుల నాదేశించినారనుకుంటా!"

"ఔను. మీ సేవకులకు గూడ శ్వేతాంకుని ద్వారా ఆదేశములు పంపడమైనది."

"బాగా చేసినారు."

ఇంతలో బయటినుండి యశోధరాకంఠధ్వని వినిపించింది. "ఆర్యశ్వేతాంకా! ఈ మణిహారం నాన్నగారికి నచ్చకపోతే వాపసు చేయడం నీవంతే. నీవు చెప్తేనే నేనిది కొన్నాను." - అంటూ యశోధర అక్కడ ప్రవేశించింది. ఆమె బీజగుప్తునితో నవ్వుతూ అన్నది - "ఆర్యబీజగుప్తా! మీరు నిద్రిస్తూనే ఉన్నారు గాని నేను చూడండి ఎన్ని వస్తువులను తెచ్చుకున్నానో! మీరుమాత్రం ఏదీ కొనలేదు."

బీజగుప్తుడు నవ్వుతూ అన్నాడు - "దేవీ యశోధరా! నా కేవస్తువూ అవసరం లేదు."

"అవరమైతే నాకూ లేదు. కాని కాశీనగరాన్ని వదలి పోయేందుకు ముందు కాశీకి చెందిన జ్ఞాపికలు తీసికొనిపోవలెను గదా!" - అంటూ యశోధర తాను కొనివచ్చిన వస్తువులను విప్పసాగింది. అట్లు విప్పి "ఇదెట్లుంది?" - అంటూ ఆమె ఒక మణిమాలను బీజగుప్తుని చేతిలో నుంచింది.

"బాగుంది, కాని చాలా విలువైన దనుకుంటా."

"ఔను. దీన్ని నేనింకా బేరమాడలేదు. కేవలం నాన్నగారికి చూపెట్టుటకు తీసికొని వచ్చినాను."

మృత్యుంజయు డా మణిమాలను చేతిలోనికి తీసికొన్నాడు - "నీ కిష్టమైతే తీసికో" - అన్నాడు. యశోధర మిగిలిన వస్తువులను చూపించింది. అవి అందరికీ పసందైనవి. బీజగుప్తుడు శ్వేతాంకునివైపు చూచి అడిగాడు - "నీవేమీ కొనలేదా?"

"స్వామీ! నేను దేనినీ అడుగలేదు -- దేనితో నా కవసరం గూడ లేకుండినది."

"లేదు. నీవుగూడ ఎదో ఒకటి తప్పకుండా తీసికొనియుండవలసినది. నేను గూడ వస్తాను. దేవీ యశోధరా! కష్టమనుకోకుంటే మళ్లీ నగరానికి రాగలవా? కావలసిన వస్తువులను కొనడానికి నాకు నీవు సహాయం చేస్తావా?" - బీజగుప్తుడు యశోధరకేసి చూచాడు.

"నేను వస్తాను. కాని భోజనానంతరం. ఇప్పుడైతే నేను చాలా అలసిపోయినాను."

భోజనానంతరం బీజగుప్తుడు మృత్యుంజయునితో అన్నాడు - "మీరుగూడ రండి."

"లేదు నేను చాలా వృద్ధుడ నయ్యాను. నాకు నగరంలోని కోలాహలం నచ్చదు."

బీజగుప్తుడు యశోధరాశ్వేతాంకులను వెంటనిడుకొని బజారుకు వెళ్లినాడు. మొట్టమొదట వారు బంగారునగల దుకాణంలో ఆగినారు. బీజగుప్తుడూ, శ్వేతాంకుడూ అక్కడ వజ్రాల ఉంగరాలను కొన్నారు. వారికెదరుగా అతిమూల్యమైన ఒక ముత్యాలహారం కనిపించింది. యశోధర దానివైపే చూస్తున్నది. బీజగుప్తు డా హారాన్ని బయటికి తీయించి అడిగాడు - "దేవీ యశోధరా! ఈ హార మెలాగుంది?"

"చాలా అందంగా ఉంది. నేనిదివఱకు దీన్ని చూడలేదు, లేకుంటే మణిమాలకు బదులు దీనినే తీసికొనేదాన్ని" - అంటూ శ్వేతాంకుని కేసి చూచి అన్నది - "ఆర్యశ్వేతాంకా! ఇదంతా నీ మూలంగానే జరిగింది."

బీజగుప్తు డా హారాన్ని తీసికొని యశోధర మెడలో వేస్తూ అన్నాడు - "దేవీ యశోధరా! ఇది నా కానుక. దీనిని స్వీకరించు."

బీజగుప్తుని కరస్పర్శతో ఆమె శరీర మాపాదమస్తకం కంపించింది. ఆమె ఆ హారాన్ని తీసివేస్తూ అన్నది - "ఆర్యబీజగుప్తా! నాన్న గారి అనుమతి లేకుండా ఈ హారాన్ని నేను తీసికొనజాలను."

ఆ హారాన్ని తన చేతిలోనికి తీసికొంటూ బీజగుప్తు డన్నాడు - " దేవీ యశోధరా1 ఈ హారాన్ని స్వీకరిస్తే నీ కేమీ ఆపత్తి రాదు. ఐనా నీవు నీ తండ్రిగారి అనుమతినిగుఱించి పలికిన మాటలు సముచితమైనవే!"

౨౦

కుమారగిరికి చిత్రలేఖాప్రవర్తన ఆశ్చర్యకరంగా తోచింది. చిత్రలేఖ అతనియొద్దకు వచ్చుటకు ఉత్సుకురాలైంది గాని, అతనికి ఆమెయందు అకర్షణ ఉండలేదు. చిత్రలేఖయే అతనియందు ఆకర్షితురాలైనది. మఱి ఆమె ప్రవర్తనలో ఈ పరివర్తన ఎందుకు వచ్చింది?

ఆమె ప్రవర్తనకంటె అతని ప్రవర్తన పట్ల అతనికి అధికాశ్చర్యమైంది. అతడు చిత్రలేఖనుండి దూరంగా ఉండుటకు హరప్రయత్నం చేసినాడు. ఐనా ఆమె నతడెందుకు స్వీకరించినాడు? తనపై తనకు గల అవిశ్వాసాన్ని దూరం చేసికొనడానికా? కుమారగిరి మనః క్షేత్రంలో ఇంతవఱకు విజయమే ఉంది - అపజయం అతనికి క్రొత్త. బహుశః అతని బలహీనత అతనికి తెలుసునేమో! ఆ బలహీనతను దూరం చేసికొనుటకే అతడు చిత్రలేఖను స్వీకరించినాడేమో! అతడొక ప్రయోగం చేసినాడు - కాని అది విఫలమయ్యింది. ఆ వైఫల్యం గూడ ఎంత భయానకమైనది? అతడు తనను తాను జయింపలేక పోయినాడు ; దానికితోడు అతడొక సామాన్యనర్తకి చేతిలో ఓడి పోయినాడు. తనను తాను జయింపజాలనందు కతనికి మనసులో దుఃఖముండేది, కాని నర్తకిచే కల్గిన పరాజయంవల్ల కల్గిన క్రోధం ఇప్పు డా దుఃఖానికంటె అతిశయంగా ఉన్నది . "లేదు. చిత్రలేఖను వశం చేసికొనియే తీరవలెను. కాని యెట్లాగు?" - అంటూ అతడరిచాడు.

"చిత్రలేఖ నన్నెందుకు ప్రేమించుట లేదు?" - అతని మనస్సులో ఈ ప్రశ్న ఉత్పన్నమైనది. "బహుశః అమె మఱొక వ్యక్తిని ప్రేమి స్తున్నదేమో! ఆమె బీజగుప్తుని ప్రేమించడం మానినచో ఆమె నా కాత్మసమర్పణ చేసికొనడం సంభవం, - కాదుకాదు తథ్యం. అందుచేత బీజగుప్తుని ఆమె పథమునుండి తొలగింపవలెను."

చిత్రలేఖ కుమారగిరి ఆశ్రమానికి వచ్చి రెండునెలలకుపైబడింది. ఆమెకు, కుమారగిరికి మధ్య జరిగిన సంఘటన కూడా నెల రోజుల పాతబడింది. ఈ మధ్య కుమారగిరి నిగ్రహపూరితుడై వ్యవహరిస్తున్నాడు. కించిన్మనోదౌర్బల్యాన్నిగూడ అతడు ప్రదర్శించుట లేదు. చిత్రలేఖ తన ప్రక్కన ఉన్నను విషయవాసనలను దరిజేరనీయకుండా ఉండాలని అతడు కొంతకాలం అనుకున్నాడు. కాని ఈ భావన అతనిలో సుస్థిరంగా నెలకొనలేకపోయింది. ఒకసారి ప్రజ్వలితమైన అగ్ని నిత్యాహుతిని కోరుతూ ఉన్నది - కుమారగిరి తన నిశ్చయాన్ని మనసులో దృఢంగా నిలుపుకొనలేక పోయినాడు.

ఆ రోజు రాత్రి కుమారగిరి చిత్రలేఖను తన చెంత కూర్చొనమని ఆదేశించి, ఆమెతో అన్నాడు - " దేవీ! చిత్రలేఖా! ఒక నెలనాళ్లు గడచింది. ఈ లోపల నేను నన్నుద్ధరించుకొనే ప్రయత్నం చేసినాను. నా మనోదౌర్బల్య మిప్పుడు దూరమైందని నే ననుకుంటు న్నాను."

"కావచ్చు." - చిత్రలేఖ అరచిఱునవ్వు నవ్వుతూ అన్నది.

కుమారగిరి పెదవులను బిగబట్టి అన్నాడు - "నేను విన్నాను బీజగుప్తుడు కాశీయాత్రకు వెళ్ళాడని - అతని వెనుక మృత్యుంజ యుడూ, అతని కూతురు యశోధర కూడ వెళ్లినారనీ!"

"ఏమీ! యశోధర బీజగుప్తునితో కలిసి వెళ్లిందా?" - చిత్రలేఖ హడలిపడింది.

ఈసారి కుమారగిరి చిఱునవ్వు నవ్వాడు - "ఇందులో ఆశ్చర్యమేముంది? చిత్రలేఖా! నీవైతే యశోధరను వివాహమాడి గృహస్థా శ్రమమును స్వీకరింపుమని చెప్పి బీజగుప్తుని వదలి వచ్చినావు. నీవు మంచిపనే చేసినావు. మఱి బీజగుప్తునికి యశోధరను వివాహ మాడుట మంచిది కాదా?"

"నాకు దెలియదు. నాకేమీ తెలియదు. " - చిత్రలేఖా కంఠస్వరం తీవ్రతరమైంది - "దయచేసి బీజగుప్తుని విషయ మేదీ నాతో ప్రస్తావించకండి!"

"బీజగుప్తుని విషయ మేదీ ప్రస్తావించవద్దా? ఎందుకూ? నీవు బీజగుప్తుణ్ణి ఇంకా ప్రేమిస్తున్నావా? బీజగుప్తుడు అన్యస్త్రీని ప్రేమించుట నీ కసహ్యకరమా? మఱి నీవెందుకు బీజగుప్తుని త్యజించినావు? స్త్రీమాత్రమే అన్నీ చేయవచ్చును, పరుషునికి చేసే అధికారం లేదని నీ

ఉద్దేశ్యమా? బీజగుప్తుడు నీ దాసుడై పడియుండాలని నీ వనుకుంటావేమొ కాని ఇది అసంభవం." - కుమారగిరి స్వరంలో ప్రతిహింసాత్మకమైన తీక్ష్ణవ్యంగ్యభావం ప్రతిధ్వనించింది. తనను పరాజితుని జేసిన స్త్రీని తాను పరాజితురాలిని చేయాలనే ప్రతిహింసయే అతని ఆశయంగా ఉన్నది.

చిత్రలేఖ ఆవేశంతో వణకుతూ అన్నది - "నేను చేసిందంతా బీజగుప్తుని మేలుకే చేసినాను. సమాజదృష్టిలో నేను బీజగుప్తుని పతనం జేసియుంటిని, నేనతణ్ణి విడిచి అతడు ఉన్నతస్థాయిని చేరుకొనేందుకు తోడ్పడ్డాను."

"ఇదెట్లాగు చిత్రలేఖా! నీవు నిన్నే మోసం చేసికొంటున్నావు. నీవు బీజగుప్తుని విడిచిపెట్టినప్పుడు నన్ను ప్రేమించడానికి విడిచిపెట్టినావు. " - కుమారగిరిస్వరం తీవ్రతరమైంది. చిత్రలేఖ తనయొద్దకు వచ్చిన తర్వాత కోల్పోయిన పూర్వపు స్ఫూర్తి, పూర్వపు గురుత్వం, పూర్వపు తేజం కుమారగిరి ఈనాడనుభవించినాడు - "నీవు బీజగుప్తుని మోసగించవచ్చు, నన్ను మోసం చేయవచ్చు, కాని నిన్ను నీవు మోసం చేసికొనలేవు. నీవు వాసనావేశపరీతచిత్తురాలవై పవిత్రప్రేమను కాలదన్నినావు - నీవు నాలో ఏదో చూచి నాయందాకర్షితురాలవైనావు. అప్పుడు నీయందు పశుత్వం ప్రబలమైంది - మానవత్వం మృగ్యమైంది. బీజగుప్తుని యిష్టానికి వ్యతిరేకంగా నీవతని జీవితాన్ని దుర్భరం చేసి నా కడకు వచ్చినావు. మఱి బీజగుప్తుడో - అతడొక సామాన్యనర్తకికి తన గృహస్థజీవన సుఖాన్ని బలిదానం చేసినాడు. అంతే కాదు - అతడు తన జీవితాన్ని వ్యర్థం చేసికొన్నాడు - కేవలం నిన్ను ప్రేమించినందుకు, నీయందలిప్రేమ పవిత్రమైనదని అనుకొన్నందుకు."

"ఆపు! నీవింక ఆపు!" - అని చిత్రలేఖ బిగ్గరగా అరచింది.

కుమారగిరి తన నిశితదృష్టులతో ఆమెను గ్రుచ్చాడు. ఆపైని అతడు బిగ్గరగా నవ్వాడు - "ఆపాలా? ఇంతమాత్రానికే రెచ్చిపోతున్నావు నర్తకీ! నీవింకా వినవలసి ఉంది. నీవు చేసినదానికి ప్రతిఫలమే నీకు దొరికింది. నీవనుకుంటావేమో బీజగుప్తుడు నిన్నింకా ప్రేమిస్తున్నాడనీ - నీవనుకుంటున్నావేమో బీజగుప్తుడు తిరిగివస్తూనే నీ వతనిముందు సాక్షాత్కరిస్తే నిన్నతడు స్వీకరిస్తాడనీ, పాలిస్తాడనీ - ఇట్లనుకుంటే నీవు పొరపడుతున్నావు. నీ విషాన్ని నిర్మూలించే అమృతకలశం అతనికి చిక్కింది. నీవతన్ని నాశనం చేయటంలో దేనికీ వెనుదీయలేదు, కాని యశోధర అతణ్ణి రక్షించింది. ఇప్పుడు బీజగుప్తుడు యశోధరను గూడి వైవాహికసుఖాన్ని అనుభవిస్తున్నాడు."

చిత్రలేఖాముఖం నిస్తేజస్కమైంది. "నీవు నిజమే చెప్తున్నావా యోగీ? బీజగుప్తుడు యశోధరను వివాహమాడినాడా? లేదు యోగీ లేదు -- ఇది అసంభవం!"

"ఇది అసంభవమా?" - కుమారగిరిధ్వనిలో బల్లెంవలె ఎదలో నాటుకునే వ్యంగ్యం నిబిడీకృతమై ఉన్నది - "నీవు వాసనావశురాలవై పవిత్రప్రేమను త్రోసిరాజని నాచెంతకు రావడం సంభవమే; కాని బీజగుప్తు డొక దివ్యప్రతిమామూర్తిని పవిత్రవైవాహికసంబంధంలో స్వీకరించడం అసంభవమా? ఉఫ్.. నీలో ఎంత మిథ్యాత్మాభిమానమున్నది, నీయందు నీకెంత అచంచలమైన ఆత్మవిశ్వాసమున్నది! నా మాటలునమ్మకపోతే పో .. ఆ నవదంపతులు నేడుదయమే వచ్చినారు - ఫో వారి నభినందించేందుకు ఫో- పోయి నీ కన్నులతో నీవు నీ ప్రేమికుడు - కాదు కాదు నీ దాసుడు - పరకాంతాబాహుబంధాలలో ప్రణయక్రీడ లాడడం చూడు."

"ఏమీ వారు వచ్చినారా? " - చిత్రలేఖ లేచి నిలబడింది. ఆమె శరీరం వణకిపోతున్నది. ఆమె ముఖం తెల్లబడింది. లేచి ఆమె పాటలీపుత్రం వైపు చూచింది - "వారు తిరిగి వచ్చినారా? యోగీ! నీకు చేతులెత్తి మ్రొక్కుతాను - చెప్పు - నీవన్నదంతా అసత్యమని చెప్పు!"

"అసత్యమని చెప్పనా? హాః..హాః...హాః.. సత్యాన్ని అసత్యమని చెప్పనా? పో..ఫో.. నీ కన్నులతో నీ వే చూచి రా! ఫో!"

చిత్రలేఖ చతికిలబడింది - "పోను - అంతా అయిపోయింది. ఇక పోను. పోయి ఏం లాభం? నా ధనం కొల్లగొట్టబడింది." - ఆమె స్వనంలో కరుణ ధ్వనించింది.

కుమారగిరి చిత్రలేఖ ప్రక్కకు దూరి కూర్చున్నాడు.- "అంతా అయిపోయిందా? ఒక కథ అంతం కావడమంటే మఱొక్కటి ఆరంభం కావడం. అంతా ఎట్లా సమాప్తమైంది చిత్రలేఖా!" - కుమారగిరి స్వరం కోమలమైంది. అందులో ఏదో మృదువైన కంపనం

సమావిష్టమైంది. " నీకు దెలుసు. నేను నిన్ను ప్రేమిస్తున్నానని. నీవు గూడ నన్ను ప్రేమింపకున్నను ఏవగింపవు గదా! నీవు నా జీవితంలో ప్రవేశింపదలచినను బీజగుప్తుని కారణంగా అది ఇంతవఱకు సాధ్యపడలేదు. నీవు బీజగుప్తుని జీవితాన్ని దుఃఖమయం చేసినావు. అతడు నీజీవితాన్ని దుఃఖమయం చేసినాడు. కాని అతనికి ఒక ఆధారం దొరికింది. నీవూ ఒక ఆధారాన్ని అన్వేషించుకో! దేవీ చిత్రలేఖా! నేను నిన్ను ప్రేమిస్తున్నాను." - కుమారగిరి ఆమె హస్తాన్ని పట్టుకున్నాడు.

చిత్రలేఖ బదులాడకుండా తన హస్తాన్ని అతని చేతిలో నుంచింది. శిరస్సును లేపి తన చూపులను కుమారగిరి చూపులతో కలిపింది. "ప్రేమ! ప్రేమయే నా ధర్మమైంది. నీవు నా జీవితంలో ప్రవేశించినావు. నీవు నాకు ప్రేమదీక్ష నిచ్చేందుకు వచ్చినావు. రా! రా! మనమిద్దరం ఏకమౌదాం!" - అంటూ కుమారగిరి ప్రేలుతూనే ఉన్నాడు.

కుమారగిరి ముఖం కించిదవనతమైంది - చిత్రలేఖాముఖం కించిదున్నమితమైంది. వారిర్వురి అధరములు కలిసినవి. చాలా కాలం అవి కలిసే ఉండినవి.

కుమారగిరి ఉన్మత్తునివలె ప్రలాపించినాడు - " నీవు నన్ను ముంచడానికి వచ్చినావు. నేను మునుగుటకు సంసిద్ధుడనైనాను. కానీ. ఎంత సౌఖ్యం, ఎంత ఉత్తేజం! నా ఆరాధ్యదేవతా! నా ప్రాణేశ్వరీ! నేడు నీ అగాధయౌవనసాగరంలో మునుగుటకు నేను వచ్చినాను." - అతని నేత్రములు నిమీలితములైనవి. ఆమె నేత్రములు సైతము నిమీలితములైనవి. పరస్పరాలింగనపాశంలో ఇర్వురూ బందీలైనారు. చిత్రలేఖ అన్నది - "ఐతే అట్లాగే అగుగాక!"

ఉదయం చిత్రలేఖ లేచినప్పుడు ఉద్విగ్నురాలై యున్నది. బీజగుప్తు డామెను వదలివేసినాడు - ఈ భావన ఆమెకు సహింపరానిదైంది. ఆమెజీవితం అంధకారమయమైంది; ఉన్నట్టుండి ఆమెపై ఆమెకే కోపం రాసాగింది. అసలు తానెందుకు బీజగుప్తుణ్ణి విడనాడింది?

అప్పుడు కుమారగిరి నిద్రించే ఉన్నాడు. అతని ముఖం వికృతరూపం దాలుస్తున్నది. సంయమనాన్ని ఏకక్షణంలో నాశనం చేసే వాసన అతని తేజోమయముఖమండలంలో తాండవరంగాన్ని నిర్మించుకొన్నది. ఆమె తదేకంగా కొంతసేపు అతనివైపు చూస్తూ ఉండిపోయింది, కాని ఎకాయెకిన నిష్కారణంగానే ఆమెలో కంపం పుట్టుకొచ్చింది. ఆమె కక్కడ ఎక్కువసేపుండేదుకు ధైర్యం చాలలేదు. ఆమె బయటికి వచ్చింది. ఏ వ్యక్తితో రాత్రి సాంతం తాను భోగవిలాసాన్ని అనుభవించిందో ఆ వ్యక్తిముఖం తనకెందు కింత భయంకరంగా, అసహ్యంగా తోస్తున్నది? దీని కామె కాశ్చర్యమైంది. ఆ సమయంలో విశాలదేవుడు ఉపాసనను ముగిస్తున్నాడు. చిత్రలేఖను చూచి, నమస్కరిస్తూ అతడన్నాడు - "అమ్మవారి ముఖం ఈ రోజెందుకో ఎంతో దిగిపోయినట్లు కనిపిస్తున్నది?"

"నేను రాత్రంతా భయానకమైన స్వప్నాలను చూచినాను." - చిత్రలేఖ చిఱునవ్వు నవ్వింది. " ఆ స్వప్నాలు నన్ను ఉద్విగ్నురాలిని చేసినవి."

"నేడింతవఱకు గురుదేవులు కుటీరంనుండి బయటికి రాలేదు."

"వారింతవఱకు సమాధిస్థులై ఉన్నారు."

"సమాధిస్థులై ఉన్నారా?" - విశాలదేవుడు ఆశ్చర్యంతో అన్నాడు - "నేడు తొలిసారిగా గురుదేవులు తమ నియమాన్ని త్రోసిపుచ్చినారు."

కొంతకాల మిర్వురూ మౌనంగా ఉన్నారు. ఆ తర్వాత విశాలదేవు డన్నాడు - " దేవీ! చిత్రలేఖా! ఆ స్వప్నాలనుగుఱించి నేను కొంచెం అడుగవచ్చునా?"

"ఇంతమాత్రం చాలు - ఆ స్వప్నాలు నా గతజీవితానికి సంబంధించినవి."

"గతజీవనసంబంధులా? " - విశాలదేవుడు కొంచె మాలోచించినాడు - "దేవీ! మీరుచిత మనుకుంటే నేను బీజగుప్తుల ఆచూకీ తెలిసికొనిరానా? బహుశః వారు వచ్చియుండవచ్చు."

"వారు వచ్చినారు - ఇంతమాత్రం నాకు దెలుసు. " - అమె స్వనం శుష్కించింది. "ఐతే దానితో యేమి? వారు వచ్చినా, రాకపోయినా దానితో ప్రయోజనమేమి?"

విశాలదేవుడు చిత్రలేఖను చూచినాడు -"దేవీ! నీవు విచిత్రంగా మాట్లాడుతున్నావు. నీకు చెప్పడం కష్టంగా ఉంది. ఆరోజు నీవు బీజగుప్తుని యొద్దకు వెళ్లదలచినావుగదా!"

చిత్రలేఖాముఖం జేవురించింది - "ఔను. నాడు నేను వెళ్లదలచినాను. కాని నేడు వెళ్లదలచుట లేదు. ఐనా నా వ్యక్తిగతవిషయాలపై ఇంత కుతూహలాన్ని చూపడం నీకెంతవఱకు ఉచితమో ఎప్పుడైన ఆలోచించినావా?"

విశాలదేవుని తల వాలిపోయింది. అతడు దీనస్వనంతో చెప్పడానికి ఆరంభించినాడు - "నీవనేది యుక్తమే దేవీ! కాని నీ వ్యక్తిగత జీవనంపై ఉత్సుకత చూపడం నా గురువుగారి జీవనం పట్ల ఉత్సుకత చూపడమే. ఇది నాకు స్వాభావికమూ, ఉచితమైన కార్యమే. దేవీ చిత్రలేఖా! నీకు బాగా తెలుసు నీ ఉనికిచేత ఈ కుటీరంలోని సంయమనపూర్ణశాంతి నష్టమైందని. ఈ ఆశ్రమం ఒక గురుకులం వంటిది. ఇందులోని ప్రతివ్యక్తికీ ఇతరుల ఉచితానుచితకార్యములను విమర్శించేందుకు, అవసరమైతే వానిలో జోక్యం చేసికొనేందుకు అధికార మున్నదిగదా!"

"నాకు నీ మాటల నంగీకరించవలసిన బాధ్యత లేదు."

"లేదు సరే! ఐనా నేను బీజగుప్తుని కడకు పోయివస్తాను - నా సహాధ్యాయి శ్వేతాంకుని చూచుటకైనా. దేవీ! మాపై దయయుంచి నీవొక్కమారు మళ్లీ ఆలోచించవలసిందని ప్రార్థిస్తున్నాను."

చిత్రలేఖ నవ్వసాగింది - "దయా! ఎవరిపై దయచేయాలనీ, ఎవరు దయచేయాలనీ అంటున్నావు? నీవు తలారినుండి దయ నాకాంక్షిస్తున్నావా? ఘాతుకునినుండి సృష్టిని కోరుతున్నావా? పొరపడుతున్నావు! పొరపడుతున్నావు!" - అంటూ చిత్రలేఖ అక్కడ నుండి వెళ్లిపోయింది.

మధ్యాహ్నవేళకు విశాలదేవుడు నగరంనుండి తిరిగివచ్చినాడు. చిత్రలేఖ అతనికై నిరీక్షిస్తూ ఉన్నది. ఇంత కథ నడచిన తర్వాత గూడ, తాను తన నిర్ణయాన్ని తీసికొన్న తర్వాత గూడ - ఆమెకు బీజగుప్తునిగుఱించి వినాలనే కుతూహలమున్నది. విశాలదేవుడు వచ్చే వేళకు ఆమె కుటీరం ముందట నొక వటవృక్షం క్రింద పడుకొని యున్నది. విశాలదేవుని చూడగనే ఆమె లేచి కూర్చున్నది. విశాలదేవుడు నేరుగా ఆమె కడకు వచ్చినాడు. అత డన్నాడు - "దేవీ! చిత్రలేఖా! నేను బీజగుప్తుని కలిసికొనలేదు, కేవలం శ్వేతాంకుణ్ణి మాత్రమే కలిసికొని తిరిగి వచ్చినాను. నేనక్కడ ఎక్కువ సేపుండలేదు గూడ. ఎందుకంటే శ్వేతాంకుడు ఆర్యమృత్యుంజయుని చూడ బోవుచుండెను. శ్వేతాంకుతోగలిసి అంతదూరము మాట్లాడుచు పోయి, శ్వేతాంకుడు లోపలికి పోగానే నేను తిరిగి వచ్చినాను. "

"శ్వేతాంకుడు నావిషయాన్నేమైన అడిగినాడా?" - చిత్రలేఖ అడిగింది.

"ఆ.. నీ యోగక్షేమాలనుగుఱించి అత డడుగుచునే యుండెను. అతడు తొందరలో నుండెను - లేకుంటే ఇక్కడికి వచ్చేవాడు గూడ. ఇంకొక మాట చెప్తాను - బహుశః నీ కిది ఆశ్చర్యం కలిగించవచ్చు - శ్వేతాంకుడు యశోధరను ప్రేమిస్తున్నాడు, ఆమెను పెండ్లాడగోరుతున్నాడు."

చిత్రలేఖ త్రుళ్లిపడింది - "శ్వేతాంకుడు యశోధరను పెండ్లాడగోరుతున్నాడా? ఐతే బీజగుప్తునితో ఆమెకు వివాహమైందని నా అనుమానం."

ఈ మాటకు విశాలదేవుని కాశ్చర్యమైంది - "బీజగుప్తునితో యశోధరపెండ్లయ్యిందా? ఈ అనుమాన మెట్లా కలిగింది? శ్వేతాంకు డింతమాత్రం అన్నాడు - బీజగుప్తుడు యశోధర యందనురక్తుడైనాడు గాని ఆమె నతడు వివాహం మాత్రం కచ్చితంగా చేసికొనడని తాను గట్టిగా విశ్వసిస్తున్నానని. బీజగుప్తునికి నీయందే అనురాగం స్థాయీభూతమై ఉన్నదని."

చిత్రలేఖ లేచి నిలబడింది - "కృతజ్ఞతలు విశాలదేవా! నా పరుషవాక్కులకు నన్ను క్షమించు. నేనీరోజు ఇక్కడనుండి వెడలిపోతాను. ఇదిమాత్రం నమ్ము."

చిత్రలేఖ నేరుగా కుటీరంలోనికి దూసుకొనిపోయింది. ఆమె వ్యవహారం విశాలదేవుని కర్థం కాలేదు - "చాలావిచిత్రమైన స్త్రీ!" - అతడనుకొన్నాడు.

అప్పుడు కుమారగిరి పడుకొనే చిత్రలేఖనుగుఱించి ఆలోచిస్తున్నాడు. అతని మనస్సు ఉద్విగ్నతాపూర్ణమై ఉన్నది. చిత్రలేఖను చూస్తూనే "ఇంతవఱకు నీవెక్కడ నున్నావు నా రాణీ! రా! ఇటు రా!" అంటూ అత డున్మత్తునివలె ఆమెవైపు సాగినాడు. కాని చిత్రలేఖ చూపులతో అతనిచూపులు కలియగనే అతనిఉన్మాదం అంతమైంది. చిత్రలేఖ కండ్లు మండుతున్నవి - వానిలో సంక్షోభం, అసహ్యమూ, పశ్చాత్తాపమూ సమ్మిశ్రితములై యున్నవి. ఆమె విషణ్ణురాలై అన్నది - "నీచమైన అబద్ధాలకోరు పశువా! దూరంగా ఉండు!"

కుమారగిరి ప్రక్కకు జరిగాడు. ఆమె అతనితో అన్నది - "ఓరి వాసనాకృమీ! నీవు నన్ను మోసం చేశావు. నా కబద్ధం చెప్పావు. నీ తపస్సంతా వ్యర్థమౌతుంది, నీవు యుగయుగాలుగా నరకకూపంలో పడి మండుతావు. నేను పోతున్నాను - ఇప్పుడు నీవు నన్నాప లేవు."

కుమారగిరి ధైర్యం చేసినాడు - "నేను చేసిందంతా నీ ప్రేమబంధంలో అంధుడనై చేసినాను."

"వాసనాకీటకమా! నీకు ప్రేమంటే ఏమి తెలుసు? నీవు నీకొఱకే జీవిస్తావు. మమత్వమే నీకు కేంద్రం. నీకు ప్రేమించుట కూడా తెలుసునా? ప్రేమంటే బలిదానం, ఆత్మత్యాగం, మమత్వవిస్మరణం. నీ తపస్సూ, నీ జ్ఞానం - నీ సాధనా, నీ ఆరాధనా - ఇవన్నీ వట్టి భ్రమలు - వానికీ, సత్యానికీ క్రోసుల దూరం. నీ ఆత్మసంతుష్టికై గృహస్థాశ్రమబాధలకు వెఱచి సన్న్యాసివేషంతో ప్రపంచాన్ని మోసం చేసే నీముఖాన్నింక సమాజానికి చూపకు, దాచుకో! నీవు నీ వాసనాతుష్టికై నన్ను మోసం చేశావు - దానిని కప్పిపుచ్చుటకై ప్రేమ నాశ్రయింప యత్నించావు."

కుమారగిరి కీ అవమానం దుర్భరమైంది. అతడు లేచి నిలబడ్డాడు - " పో నర్తకీ పో! నాకు నీతో పని లేదు. నీవు నన్ను పతనం జేసినావు, నన్ను ఉద్ధరిస్తున్నావు గూడ. నీవు నన్ను కేవలం పరాజితుణ్ణి చేశావు - నేను గూడ నిన్ను పరాజితురాలను చేశాను. నీవు నాకేం చెప్తున్నావు? ముందు నీ ముఖం చూచుకో! నీ ముఖంలో తొంగిచూచే పశుత్వచ్ఛాయలను నీవు చూచుకొనలేవు - ఇంత మాత్రం నాకు దెలుసు. పో! నీతో బాటే నీ శాపారోపణలను గూడ తీసికొని పో!" - అంటూ అతడు ఆవేశంతో కంపిస్తూ బయటికి నడిచాడు.

౨౧

మృత్యుంజయుని ఇంటినుండి తిరిగివచ్చిన శ్వేతాంకుడు బీజగుప్తునితో అన్నాడు - "యోగి కుమారగిరి శిష్యుడు విశాలదేవుడు నేడు నన్ను కలిసినాడు. చిత్రలేఖ బాగుందనీ, స్వస్థురాలై ఉందనీ అతడన్నాడు."

దానికి బీజగుప్తుడేమీ బదులాడలేదు. శ్వేతాంకుడు మళ్లీ అడిగాడు - "మఱి నేనామెను వెళ్లి చూచిరావడం అనుచితంగా ఉండదు గదా?"

"లేదు" - బీజగుప్తుడన్నాడు - "కాని అదంతా వ్యర్థం."

చిత్రలేఖావిషయంలో బీజగుప్తునికి అంతగా ఆసక్తిలేదనీ, ఆమె మాయ పట్టుదప్పిందనీ శ్వేతాంకునికి తోచింది. అత డక్కడనుండి వెళ్లిపోయాడు.

బీజగుప్తుని హృదయవ్యాకులత పాటలీపుత్రానికి వచ్చిన తర్వాత తగ్గలేదు; ఇంకా హెచ్చుముఖం చూపసాగింది. అతని ఎదుట రెండు ప్రతిమలు నిల్చినవి - వాని మూలంగా అతని హృదయంలోని రెండుభాగాలకు మధ్య ద్వంద్వయుద్ధం ఆరంభమైంది. చిత్రలేఖ వెళ్లి పోయిన తర్వాత అతని జీవితంలో ఒక శూన్యమేర్పడింది - ఆ శూన్యం అతనికి దుర్భరంగా ఉండింది. ఆ శూన్యంలోనికి యశోధర ప్రవేశించింది. ఇప్పుడతడు యశోధరను తనదానిగా చేసికొనాలనుకుంటున్నాడు - ఆమెను పరిణయమాడాలనుకుంటున్నాడు. కాని యశోధర నింతకు ముందొకసారి అతడు నిరాకరించినాడు. ఇప్పుడామె హస్తానికై మృత్యుంజయుని అడగడం అతనికి పరాజయ స్వీకారంగా తోచింది - అతని ఆత్మ ఆ పరాజయాన్ని స్వీక రించుటకు సమాయత్తంగా లేదు.

బీజగుప్తుడు మౌర్యసామ్రాజ్యసేనాకూటమిలో సభ్యుడుగా ఉండేవాడు. పాటలికి తిరిగివచ్చిన తర్వాత అతనికి ఆ కూటమి కార్య క్రమాలపైగూడ మనసుపోవడం లేదు. అతని ఎదలోని వ్యాకులతవల్ల అతని కార్యవిముఖత ప్రవర్ధితమౌతున్నది. అతడు బయటికి వెళ్లడం మానివేసినాడు. నగరంలోని కోలాహలం, ఉత్సాహం, ఆమోదప్రమోదాలు అతనికి హృదయవిదారకములైనవి.

చిత్రలేఖాప్రస్తావనను తీసి శ్వేతాంకు డారోజు అతని హృదయంలో మఱింత అలజడిని రేకెత్తించినాడు. అతని కా రాత్రి నిద్ర పట్టలేదు. చిత్రలేఖ స్వస్థంగా, సంతోషంగా ఉంది - మఱి తానేమో దుఃఖితుడై ఉన్నాడు - ఎంత విషమత! ఎంత విభ్రాంతి! సరే! పరాజయమే సరి! యశోధరాహస్తము నర్థించవలసిందే! ఆమెను వివాహమాడి తన శూన్యతను శూన్యం చేసికొనవలసిందే!

బీజగుప్తుని స్వరంలో, అతని చేష్టలలో, చిత్రలేఖపట్ల అతడు కనబరచిన ఔదాసీన్యంలో మున్నెన్నడూ కనలేని నిజాన్ని శ్వేతాంకుడు కనుగొన్నాడు - ఆ రాత్రి అతనికిగూడ నిద్ర రాలేదు.

ఉదయమైంది. ఆనాడు బీజగుప్తుడెంతో ప్రసన్నంగాఉన్నాడు. యశోధరాహస్తానికై మృత్యుంజయునితో మాట్లాడవలెనని అతడు నిశ్చయించుకొన్నాడు. అతడింటి వెలుపలికి వచ్చినాడు - చాలాకాలం తర్వాత అతనిముఖంలో స్వభావతః కనిపించే మందహాసం కనిపించింది. అల్పాహారానికై అతడక్కడ కూర్చున్నాడు. శ్వేతాంకు డక్కడలేడు. పరిచారిక నంపి అతడు శ్వేతాంకుణ్ణి పిలిపించి నాడు.

శ్వేతాంకుడు వచ్చినాడు. అతని ముఖం వివర్ణమై ఉన్నది. అతడేదో గాఢబాధ ననుభవిస్తున్నట్లుగా అది చాటుతున్నది. బీజగుప్తు డడిగాడు - "శ్వేతాంకా! నీ స్వాస్థ్యం సరిగా లేదా?"

శ్వేతాంకుడు తల ఆడిస్తూ అన్నాడు - "స్వాస్థ్యం సరిగానే ఉంది. కాని మనసే బాగలేదు."

"ఎందుకు?"

శ్వేతాంకుడు కొంతసేపు మౌనంగా ఉన్నాడు. ఆ తర్వాత ముఖమెత్తుతూ అతడన్నాడు -"స్వామీ! నాపై మీకింతగా దయ ఉంది. మీరే నా కల్యాణమును జరిపించవలె."

బీజగుప్తుడు నవ్వుతూ అన్నాడు - "నీకు దెలుసు! నిన్ను సోదరునితో సమానంగా చూస్తానని. నా శక్తిమేరకు నీకు సాయం చేస్తాను."

"నాకు దెలుసు. అందుకే తమరి కీవిషయం విన్నవించుకొనే సాహసం నాకు కలిగింది. స్వామీ! నేను సామంతమృత్యుంజయుల కూతురు యశోధరను వివాహమాడగోరుతున్నాను."

బీజగుప్తునికి పిడుగు పైనబడినట్లయింది. వేయి తేళ్ళొక్కసారిగా తనను కుట్టుతున్నట్లుగా అతని కనిపించింది. కొన్ని క్షణాల పాట తడు నిశ్చేష్టుడై శ్వేతాంకుని వైపే చూస్తుండిపోయాడు - "ఏమన్నావ్? యశోధరను నీవు పెండ్లాడగోరుతున్నావా? దానికి నా సాయం దేనికి?"

"స్వామీ! మీరీ ప్రస్తావనను మృత్యుంజయుల ముందుంచవలెనని."

"నీకు దెలుసు మృత్యుంజయుడు మునుపు తన కన్యావివాహప్రస్తావనను నాతో చేసినాడని, చిత్రలేఖాకారణంగా నేనప్పుడు దానిని త్రోసిపుచ్చినానని. నీకిది గూడా తెలుసు - ఇప్పుడు చిత్రలేఖ నా జీవితంనుండి వైదొలగిందని, యశోధరయందు నేనిష్టుడనై ఉన్నానని."

"నాకు దెలుసు స్వామీ! కాని తమరి హృదయంలో యశోధరను పెండ్లాడే తలంపే తల యెత్తుతుందని నాకు దెలియదు."

"కాదు - నీ ఊహ సరియైనది కాదు. నేను యశోధరయం దనురక్తుడను కాసాగినాను. ఈరాత్రే ఆమెను పెండ్లాడాలనే నిశ్చయానికి వచ్చినాను." బీజగుప్తుడు ఉద్విగ్నుడైనాడు. అతని స్వనం తీవ్రగాంభీర్యపూరితమైంది - "నీవు నన్నేమి చేయమంటున్నావు శ్వేతాంకా? నా జీవితంలోనుండే ఈ ఆవేదన, ఈ ఆందోళన, ఈ విషాదం చాలవా? నా జీవితాన్ని నేను వ్యర్థం చేసికొనవలెనని నీవు కోరుకుంటు న్నావా శ్వేతాంకా! కాదు కాదు, ఇది మాత్రం జరుగదు. నేను యశోధరను పెండ్లాడుతాను. ఇంత మాత్రం గ్రహించుకో!"

శ్వేతాంకుని నయనా లశ్రుపూర్ణములైనవి. అతడు చేతులు జోడించి అన్నాడు-"స్వామీ! నన్ను క్షమించండి స్వామీ! నే నపరాధం చేసినాను. నన్ను క్షమించండి. నేను నా అధికారాన్ని అతిక్రమించి ప్రవర్తించినాను. నన్నుక్షమించండి. తమది బహువిశాలహృదయం. మీరు ఆదర్శపురుషులు. నన్ను క్షమించండి!"

బీజగుప్తుడరిచాడు - "నన్ను పిచ్చివానిని చేయకు శ్వేతాంకా! ఫో - ఇక్కడనుండి వైదొలగి ఫో! నిన్ను వేడుకుంటాను -నీవిక్కడ నుండి తొలగి ఫో!"

శ్వేతాంకు డక్కడనుండి మెల్లమెల్లగా జారుకున్నాడు.

బీజగుప్తుడు తన తలను తాను బాదుకున్నాడు - "ఏమి నా భాగ్యం!" - అతడు స్వగతంగా ప్రలాపించినాడు - "కాదు శ్వేతాంకా! కాదు, కాదిది సంభవం. నేను పెండ్లాడుతాను - నేను పెండ్లాడుతాను. ఏమి నాకు సుఖపడే అధికారం లేదా?"

బీజగుప్తుడు లేచి నిలబడ్డాడు - "నేనిప్పుడే వెడతాను. నా నిశ్చయాన్ని భగ్నంచేసే వారెవ్వరూ లేరు. యశోధరనే పెండ్లాడుటకు నేను నిశ్చయించుకొన్నాను - ఇప్పుడా నిశ్చయానికి వెనుదీయజాలను" - అతడు రథాన్ని తెమ్మన్నాడు.

అతడు మఱల ఆలోచింపసాగినాడు - "మఱి శ్వేతాంకుడు! యశోధరను ప్రేమించుట కతని కేమధికారముంది? వానికి తెలియదా నేను యశోధరపట్ల అనురక్తుడనైనానని?"- బీజగుప్తుని యావచ్ఛరీరం మండిపోతున్నది. అతని గొంతెండిపోతున్నది. అతడొక స్థాలీనిండ శీతలజలాన్ని త్రాగినాడు. అతని ఉద్విగ్నత కొంతగా శాంతించింది. మస్తిష్కం వేడి తగ్గింది - "మఱి యిందులో శ్వేతాంకుని అపరాధమేముంది? వాడు ప్రేమించుట స్వాభావికమే. వాడు యువకుడు, రక్తమాంసాలు వానిలోనూ ఉన్నవి. స్వభావసిద్ధమైన శారీరకమనఃప్రేరణలూ ఉన్నవి. నాకు చిత్రలేఖయందలి అనురక్తి నశించిందని వానికేమి తెలుసు?"

బీజగుప్తుని విచారధార మలుపు తిరిగింది. - "చిత్రలేఖయందు నా ప్రేమ నశించిందా? ఇదెందుకు? ముందొక స్త్రీని ప్రేమించి ఇప్పుడు మఱొక స్త్రీని ప్రేమించే మనోనిర్బలత నాయందున్నదా? ఏమి ప్రేమ చిరస్థాయి కాదా?"

అతడత్యంతమైన అస్తవ్యస్తస్థితిలో పడిపోయినాడు. ప్రేమ చిరస్థాయి కాదని నమ్ముట కతడు సిద్ధంగా లేడు. ఐనా, ఇప్పు డతడదే పరిస్థితి ననుభవిస్తున్నాడు -"కాదు ప్రేమ అస్థిరం కాదు. ఐతే నేనిదంతా చేసేందుకెందుకు తలపడుతున్నాను? చిత్రలేఖతో బదులు తీర్చుకొనుటకా? కాదు!" - చిత్రలేఖపట్ల అతని హృదయంలో ఎట్టి వైషమ్యమూ లేదు.

రథం ద్వారంముందు వచ్చి నిల్చింది. బీజగుప్తుడు యశోధరాభవనం వైపు పయనించినాడు. ఐనా అతని విచారశృంఖల తెగలేదు - "విషయసంయమనమున కిదే అర్థమా? ప్రపంచంలో స్వార్థమే పరమార్థమా? ఐతే మనుష్యునికి, పశువుకు అంతరమేమిటి? ప్రతిప్రాణి తనకై తాను జీవిస్తుంది. సామాన్యమానవుడు సైతం స్వీయప్రయోజనానికై పాటుపడుతాడు. ఇంక నాకూ అన్యమానవులకూ అంతర మేమిటి? యశోధరను నేను పెండ్లాడితే కలిగే పరిణామమేమిటి? ఒక వ్యక్తియొక్క జీవితం నష్టం గావటమే - ఆ వ్యక్తి యెవరు - నాకు ప్రియుడూ, సోదరతుల్యుడైన శ్వేతాంకుడు. నా సిద్ధాంతాలనుండి నేనే చ్యుతుడనవుతాను. నా చిత్తోద్విగ్నతను దూరం చేసికొనుటకు నేనిప్పుడు యశోధరను పెండ్లాడుతాను. మఱి భవిష్యత్తు? లేదు. నాకు వివాహం చేసికొనే అధికారం లేదు. శ్వేతాంకుని జీవితాన్ని దుఃఖ మయం చేసే అధికారం నాకు లేదు. బాగా ఆలోచించి నా పథాన్ని నేను నిర్ణయించుకొన్నాను. అది సఫలమైనా, విఫలమైనా, సుఖ మయమైనా, దుఃఖమయమైనా ఆ పథంలోనే పయనించవలె. అది కాదని నాసుఖంకొఱకు ఇతరుల సుఖానికి కాలొడ్డడం భీరుత్వమే - కాదు నీచత్వమే - ఔతుంది. నేను అన్యులకే కాదు, నాకూ అన్యాయం చేసికొంటున్నాను. సుఖమూ, దుఃఖమూ రెండూ నాపాలిట ఉన్నాయి. వానిని సాహసంతో ఎదుర్కొనుటయే నా కర్తవ్యం."

అప్పటికి రథం మృత్యుంజయుని భవనం చేరింది. తాను వచ్చినట్లుగా బీజగుప్తుడు మృత్యుంజయునకు తెల్పినాడు. మృత్యుంజ యుడు బయటికి వచ్చినాడు. ఉభయకుశలోపరి మృత్యుంజయు డడిగినాడు - "ఆర్యబీజగుప్తులు నా కడపను పవిత్రంచేయడానికి కారణమేమిటో?"

బీజగుప్తుడు కొంచెంసేపు ఆలోచించి అన్నాడు - "తమరి కూతురు యశోధరావివాహప్రస్తావనను తీసికొని వచ్చినాను."

మృత్యుంజయుని ముఖంపై మందహాసం దొరలింది. అతడన్నాడు - "వినిపించండి!"

బీజగుప్తునికి మృత్యుంజయుని మందహాసంలోని ఆంతర్యం అవగతమైంది. అతడుగూడ నవ్వుతూ అన్నాడు - "ఆర్య మృత్యుంజయా! నేను నావిషయంలో ఏమీ చెప్పడం లేదు. నావిషయాన్ని ముందే తమకు దెలియజేసినాను. మీ కన్యను శ్వేతాంకుని

కీయవలసినదిగా నేను ప్రస్తావనను తీసికొనివచ్చినాను. శ్వేతాంకుడు కులీనుడు. సుందరుడూ, సుశిక్షితుడు గూడ. వస్తుతః అతడు మీ కన్యకు యోగ్యుడు - బహుశః నాకంటె గూడ!"

ఈ ప్రస్తావనపట్ల మృత్యుంజయునికి ఆశ్చర్యమేసింది. బీజగుప్తుడు తన వివాహప్రస్తావననే చేస్తాడని అతడనుకొన్నాడు. శ్వేతాంకుని విషయం వింటూనే అతడు అవాక్కయినాడు. కొంతసేపు మౌనంగా ఉండి అతడన్నాడు - "శ్వేతాంకుడు యోగ్యుడే. కాని అతడు సంపన్న కుటుంబీకుడు గాడు. అతడు నిర్ధనుడు. ఇట్టి స్థితిలో అతనివిషయం పట్టించుకొనుటకు గూడ నేను సిద్ధంగాలేను."

ఈసారి బీజగుప్తుని కాశ్చర్యమేసింది. "కాని మృత్యుంజయా! తమకు అపారధనరాశు లున్నాయి. యశోధర గాక మీకు వేఱే సంతానం గూడ లేదు."

మృత్యుంజయుడు నవ్వాడు. "నా సంపదపైన నా కన్యకెట్టి అధికారమూ లేదు. అట్టి అధికారం నా దత్తపుత్రుని కుంటుంది. ఆర్య బీజగుప్తా! తమరెందుకు వివాహం చేసికొనుట లేదు?"

"లేదు. నేను వివాహం చేసికొనను ఆర్యమృత్యుంజయా! శ్వేతాంకునితో యశోధరావివాహం బొత్తిగా జరుగదా?"

మృత్యుంజయుడు మెల్లగా అన్నాడు- "ఔను! శ్వేతాంకుడు యోగ్యుడూ, కులీనుడూ ఐన వరుడైనా అతడు నిర్ధనుడైనంతవఱ కాతనికి కన్య నీయజాలను."

బీజగుప్తుడు కొంతసేపాలోచిస్తూ కూర్చున్నాడు. తర్వాత అతడన్నాడు - "ఆర్యమృత్యుంజయా! నేను శ్వేతాంకుణ్ణి దత్తు తీసి కొంటాను. అతడు నా ఆస్తికంతా వారసుడౌతాడు. ఇట్టి పరిస్థితిలో తమకేమి అభ్యంతరముండదుగదా!"

"కాదు బీజగుప్తా! ఇది అసంభవం. ప్రస్తుతం నీవు అవివాహితునిగా ఉన్నప్పటికీ, త్వరలోనే నీవు వివాహం చేసికొనవచ్చు. అప్పుడు నీ ఔరసపుత్రుడే నీ ఆస్తి కధికారి ఔతాడు."

"మీరనేది యథార్థమే మృత్యుంజయా! నా మనస్సిప్పుడు వివాహానికి విరక్తంగా ఉన్నా, మనిషి మనసు స్థిరంగా ఉంటుందని ఏమి నమ్మకం? ఐనాగాని నేను యశోధరాశ్వేతాంకుల వివాహం జరగాలనుకుంటున్నాను. అది వారిద్దరికీ సుఖదాయకమౌతుంది. దీనికై నేను అధికాధికమైన త్యాగాన్ని చేస్తాను. నేను నా ఆస్తిని యావత్తూ శ్వేతాంకునికి దానం చేస్తాను."

మృత్యుంజయుడు నింగినుండి నేలకు దిగివచ్చినాడు. అతడన్నాడు - "నీవేం మాట్లాడుతున్నావో నీకు దెలియదు బీజగుప్తా! నీ మనఃస్థితి బాగలేదు."

"మీరు నావిషయమేమీ చింతించవద్దు మృత్యుంజయా! నా సమస్తసంపత్తిని శ్వేతాంకునికి దానం చేస్తానని మీముందే చెప్పినాను. దీనికి మీరే సాక్షి. ఇక సామంతపదవి అంటారా! దానిని ధారపోయడానికి రాజాజ్ఞ అవసరం. ఈనాడే చక్రవర్తిని గలసి ఆ యేర్పాటు చేస్తాను. ఇంక మీకెట్టి బాధా ఉండదుగదా!"

మృత్యుంజయుడు కన్నులు చించుకొని చూస్తూ అన్నాడు - "నేనింకొకసారి హెచ్చరిస్తున్నాను. ఈ ప్రస్తావనను నే నంగీకరించిన తర్వాత మీరు మళ్లీ దీనిని వెనుకకు దోడలేరు."

బీజగుప్తుడు ఏకధాటిగా ఉచ్చైస్స్వరంతో అన్నాడు - "ఆర్యమృత్యుంజయా! నేను చెప్పిందంతా చేస్తాను. నేను మానవుణ్ణి - మాట తప్పడం నేనెఱుగను."

"ఐతే మీ ప్రస్తావన నంగీకరిస్తాను" - మృత్యుంజయుడు కంపితస్వనంతో అన్నాడు.

బీజగుప్తుడు లేచి నిలబడ్డాడు - "నేను వెడతాను. దానపత్రానికీ, రాజాజ్ఞకూ ఈరోజే యేర్పాటు చేస్తాను. ఆలస్యం అనవసరం. మీరు వివాహసుముహూర్తాన్ని నిశ్చయించుకోండి."

మృత్యుంజయుడు లేస్తూ అన్నాడు - "ఆర్యబీజగుప్తా! నేను ప్రపంచం తిరెరుగుదును. నేనంటాను తమరు మనుష్యమాత్రులు గారు - దైవస్వరూపులు" - మృత్యుంజయుని నేత్రము లశ్రుతరళితములైనవి.

బీజగుప్తుడు తన భవనాన్ని చేరుకున్నాడు. అతడు శ్వేతాంకుని భవనానికి వెళ్లి చూచినాడు. అప్పుడు శ్వేతాంకుడు పండుకొని ఉన్నాడు. అతని పచ్చడం ఆర్ద్రమై ఉన్నది. అతని కన్నులలోని చెమ్మ యింకా ఆరలేదు. బీజగుప్తు డతనిని లేపినాడు. "స్వామీ! ఏమి ఆజ్ఞ?" - అడిగినాడు శ్వేతాంకుడు.

"నన్ను నీవు స్వామీ అనకు సామంతశ్వేతాంకా!"

"మీరేమంటున్నారు బీజగుప్తా!" - విస్ఫారితనయనుడై అడిగినాడు శ్వేతాంకుడు.

"నేను యథార్థమే పలుకుతున్నాను. విను. నేను నీ వివాహాన్ని మృత్యుంజయునితో ప్రస్తావించినాను. దానికతడు కొంత అభ్యంతరం తెల్పినాడు. దానిని దూరం చేయడానికి నేను నా సంపత్తినీ, పదవినీ అతని ముందే నీకు దానం చేసినాను. ఇప్పుడు నీకు యశోధర నీయడాని కతని కేమీ అభ్యంతరము లేదు."

శ్వేతాంకుడు చేష్టాశూన్యుడై బొమ్మవలె నిశ్చలుడై నిలబడి బీజగుప్తుని వైపు చూస్తుండిపోయాడు. ఆ తర్వాత రోదిస్తూ అత డన్నాడు -"లేదు, లేదు. స్వామీ ఇది నాకు స్వీకార్యం కాదు. నేనెంత పాపిని స్వామీ! నన్ను క్షమించు. నేను వెళ్లిపోతాను. నన్ను క్షమించు. నేను మీ జీవితాన్ని నష్టం చేసినాను. ఈ నరాధమునిపై మీరింత దయ యెందుకు చూపుతున్నారు? నాకు మాత్రం ఇది అంగీకార్యం కాదు." - అంటూ అతడు బీజగుప్తుని పాదాలపై బడ్డాడు.

బీజగుప్తుడు అతనిని లేవనెత్తాడు. - "శ్వేతాంకా! అయ్యేదేదో ఐంది. నీకు నాయందు కించిత్తైనా స్నేహభావముంటే నేను చేసిందేదో దానిని అంగీకరించు. లోకం ముందర నన్ను అప్రమాణకునిగా చేయకు. నేనీ భోగాన్ని కావలసినంతగా అనుభవించినాను. ఇప్పుడు మనస్సు మారిపోయింది. ఇక ఈ వైభవాన్ని నీవనుభవించు. నీవు దీన్ని త్రోసిపుచ్చవలదని నిన్ను ప్రార్థిస్తున్నాను. పోదాం పద, దాన పత్రానికి, పదవీపరివర్తనకై రాజాజ్ఞకూ యేర్పాటు చేసుకుందాం."

## ౨౨

చిత్రలేఖ కుమారగిరి ఆశ్రమంనుండి తిరిగివచ్చింది. కాని ఆమె బీజగుప్తుని కలిసికొనలేదు. అతనిని కలిసికొనే సాహస మామెకు లేదు. అతనిముందు తా నపరాధినియైనట్లుగా ఆమె తననూహించుకొనజొచ్చింది. ఆమె నేరుగా స్వగృహానికి చేరుకున్నది. తన మహలులోనే ఆమె సాధనామయజీవితాన్ని గడపడం ఆరంభించింది. ఆ జీవితంలోనే ఆమె శాంతి ననుభవించింది. పశ్చాత్తాపాగ్నిలో సానందంగా జ్వలించుటకామె సంసిద్ధురాలైంది. ఆమె పరిస్థితిపై ఆమెకే కరుణ గలిగింది. రాత్రింబవళ్లు శోకతప్తురాలై ఆమె గడప సాగింది.

బీజగుప్తునియం దామెకు అనురక్తి ఉండేది. ఈ వియోగంవల్ల ఆ అనురాగమెంత ప్రగాఢమైనదో ఆమె కవగతమైంది. కాని కుమార గిరియొక్క ఉన్మాదానికి, మూర్ఖతకు ఒకానొక క్షణంలో వశురాలై ఆమె యిప్పుడు భ్రష్టురాలైంది. తాను ప్రగాఢంగా ప్రేమించే బీజ గుప్తునికి మోసంచేయడం ఆమె కిష్టంగా లేదు. కాని ఆ అపరాధ మామె చేసింది. ఆ అపరాధఫలస్వరూపమైన నిరాశామయదుర్భర వేదనాజ్వాలలో కాలిపోవడమే ఆమె కిప్పు డిష్టమైంది. అందులో ఎంతగా కాలితే అంతగా ఆమెకు సుఖం కలిగేది, ఎంతగా రోదిస్తే అంతగా మనశ్శాంతి కలిగేది.

ఇట్లొక నెల గడచింది. ఒకనాడామె కూర్చొని ఏడుస్తుండగా, దాసీ వచ్చి శ్వేతాంకు డామెను జూడ వచ్చినాడని తెలిపింది. ఆమె హడలిపడి లేచి నిలబడింది. ఒకవేళ బీజగుప్తుడు తనను పిలిపిస్తున్నాడా? - "అతడెక్కడ? నేను వెళ్లి కలుస్తాను" - ఆమె అన్నది.

శ్వేతాంకుడు అతిథిభవనంలో కూర్చొని చిత్రలేఖకై నిరీక్షిస్తున్నాడు. ఆమెను జూడగానే అతని కాశ్చర్యమైంది. ఆమె రూపం కృశించింది. ఆమె సౌందర్యం వికృతమైంది. ఆమెను గుర్తించడమే కష్టంగా ఉంది. "దేవీ ఇట్లున్నారేమిటి?" - అడిగినాడు శ్వేతాంకుడు.

"బాగానే ఉన్నాను" - అంటూ చిత్రలేఖ కూర్చున్నది. కొంతకాల మిర్వురూ మౌనంగానే ఉన్నారు. ఆ తర్వాత చిత్రలేఖ అడిగింది - "బీజగుప్తులవారు కుశలంగానే ఉన్నారుగదా!"

శ్వేతాంకుని ముఖంలో విచారరేఖ లొకసారి విరిసినవి. అతడన్నాడు - "ఆ! బాగానే ఉన్నారు. కాని వారిలో చాలా మార్పు వచ్చింది."

"మార్పు వచ్చిందా?"- ఆమె కుతూహల మినుమడించింది. "ఎటువంటి మార్పు? వారు పరిణయమాడినారా?"

ఒక శుష్కమందహాసం చేస్తూ శ్వేతాంకు డన్నాడు - "లేదు. వారు వివాహం చేసికొనలేదు. నేను మాత్రం వివాహం చేసికొంటు న్నాను. మహాసామంతమృత్యుంజయుని కూతురు యశోధరతో నా వివాహం - దాని కాహ్వానించుటకే నేనిక్కడికి వచ్చినాను. ఐతే సామంతబీజగుప్తులు ఒక మహాత్యాగాన్ని చేసినారు. వారు దైవస్వరూపులు. నేను నిర్ధనుడనని సామంతమృత్యుంజయులు తమ కన్యకను నాకిచ్చుట కిష్టపడలేదు. అప్పుడు సామంతబీజగుప్తులు తమ సమస్తసంపదను, పదవిని నాకు ధారపోసినారు. వారు పాటలీ పుత్రాన్ని విడిచిపోతున్నారు. కేవలం నా వివాహంకొఱకే ఇప్పుడాగినారు."

చిత్రలేఖాహృదయం దడదడలాడింది. ఆమెనేత్రము లశ్రుపూర్ణములైనవి. "ఏమి బీజగుప్తు లింతపని చేసినారా? ఇది చాలా గొప్ప త్యాగం శ్వేతాంకా! దీనికంతా మూలకారణం నేను. అదేమైనా శ్వేతాంకా! నీకు నా అభినందనలు. నీ వివాహ మెప్పుడౌతుంది?

"వచ్చే వారంలో ఆదివారంనాడు వివాహం జరుగుతుంది. సోమవారంనాడు విందుభోజనం. ఆనాడు చక్రవర్తీ, సామంతులూ అందఱూ అక్కడికి వస్తారు. దేవీ! ఆనాడు మీరు తప్పక రావలెను."

"శ్వేతాంకా! నన్ను క్షమించు. నేనింకొకరోజు వస్తాను గాని, ఆనాటి విందుకు రాలేను. నా జీవితమే మఱొకవిధంగా మారింది. నేనా ఉత్సవంలో పాల్గొనుట బాగుండదు."

"దేవీ చిత్రలేఖా! నన్ను తమ్మునిగా మీరు భావించినారు - మీరు రావలెనని నా ఆకాంక్ష!"

"అది సాధ్యం కాదు శ్వేతాంకా! నీకు దెలుసు నా నిశ్చయం తిరుగులేనిదని. ఒక సోదరి కుండవలసిన - అందునూ ఒక జ్యేష్ఠసోదరి కుండవలసిన మమకారం నీపై నాకుంది. నేను మఱొకనాడు వస్తాను."

"మీ యిష్టానుసారమే కానిండు. ఐతే ఒకమాట మీకు తెలియజేయడం మంచిది. సోమవారం రాత్రికే బీజగుప్తులవారు దేశాటనకు బయలుదేరుతున్నారు. ఈ విషయాన్ని గ్రహించి ఆలోచించుకోండి."

"ఆర్యబీజగుప్తు లారాత్రే బయలుదేరుతున్నారా?"- చిత్రలేఖ కొంచెం తటపటాయించింది - కాని మఱుక్షణంలోనే ఆమె దృఢచిత్తు రాలై అన్నది - "ఐతే దానితో నాకేమి? నా నిశ్చయం తిరుగులేనిది."

శ్వేతాంకుడు లేచి నిలబడ్డాడు - "మీ యిష్టం దేవీ!" - అన్నాడు.

శ్వేతాంకుని వివాహం జరిగింది. విందుభోజనానికి చంద్రగుప్తచక్రవర్తీ, ఇతరాతిథులెందరో వేంచేసినారు. ఆనాడు బీజగుప్తు డందరికీ స్వాగతం పలికినాడు. అతడందరితో నవ్వుతూ ఉల్లాసంగా మాట్లాడుతున్నాడు గాని లోలోపల అతని హృదయం కుంపటివలె కుమిలి పోతున్నది. చిత్రలేఖ అక్కడ లేకపోవడం అతనికి నచ్చలేదు. చిట్టచివరిగా పాటలీపుత్రాన్ని విడిచిపోయేందుకు ముందాతడు చిత్రలేఖను చూడదలంచినాడు. కాని ఆమె రాలేదు.

భోజనానంతరము చంద్రగుప్తసార్వభౌముడు శ్వేతాంకుని అభినందిస్తూ, అతనిని సామంతశ్వేతాంకుడని సంబోధించినాడు. ఆ తర్వాత అతని దృష్టి బీజగుప్తునిపై బడింది. బీజగుప్తుని చెంతకు బిలుచుకొని చక్రవర్తి తనచేతిలో అతని చేతిని ఉంచుకున్నాడు. అట్లుంచు కొని సార్వభౌముడు నిలబడగా, మిగిలిన అతిథులందఱూ గౌరవసూచకముగా లేచి నిలబడ్డారు. అప్పుడు భవనమంతా నిశ్శబ్ద మావరించింది. చక్రవర్తి ఆరంభించినాడు - "బీజగుప్తా! నీవొక మహాత్ముడవు. నీవు అసాధ్యమైన దానిని సుసాధ్యంగా చేసి చూపించి నావు. నీవు మనుష్యమాత్రుడవు గావు - దైవస్వరూపుడవు. సమస్తభారతవర్షసార్వభౌముడు మౌర్యచంద్రగుప్తుడు నీకు మస్తకము వంచి నమస్కరిస్తున్నాడు" - అంటూ చంద్రగుప్తసార్వభౌముడు బీజగుప్తుని ముందవనతమస్తకుడైనాడు. అప్పుడచట నున్న సమస్తాతిథుల శిరస్సులు సైతము సగౌరవముగా వినమ్రములైనవి. స్త్రీవర్గమునుండి దీర్ఘనిశ్వాససహితశోకరుద్ధకంఠధ్వను లొక్కపెట్టున పొటమరించి నవి.

బీజగుప్తుడు చక్రవర్తి ముందు సగౌరవంగా వంగి అన్నాడు - "మహారాజా! నేనీ ఆదరణకు సర్వదా అనర్హుడను. నేనీరోజు దేశాటనకు వెళుతున్నాను - ఒక భికారివలె. మీరు నన్నాశీర్వదించండి, నాకు వీడ్కోలివ్వండి!"

అని పలికి బీజగుప్తుడు ద్వారంవైపు సాగినాడు. అతిథు లిరుప్రక్కలా నిలబడగా అతడు వారి మధ్యనుండి సాగిపోయినాడు. అతని ముఖంలో ఒక దివ్యమైన మందహాసం తొణికసలాడుతున్నది. అతిథులందఱికి అతనిలో ఒక దివ్యతేజం కనిపించింది. ఆబాలవృద్ధులు చేతులు జోడించి అతనికి వీడ్కోలొసగినారు. వైభవాధికారములకు బదులు శాంతిత్యాగములు తోడురాగా బీజగుప్తు డా జనసంఘము నుండి బయటకు నడచినాడు.

బయట బీజగుప్తుని సేవకులు వేచి ఉన్నారు. బీజగుప్తుని చూస్తూనే వారు దుఃఖింప మొదలిడినారు. బీజగుప్తుడు క్షణమాత్ర మక్కడ ఆగినాడు. వారిలో ప్రతియొక్కరిని వరుసగా చూచినాడు- "నావలెనే మీరు శ్వేతాంకుణ్ణి భావించండి. ఇక నన్ను మఱచిపొండి" - అన్నాడు.

సేవకులింకా బిగ్గరగా శోకింప నారంభించినారు. కొంద రేకకంఠంతో అన్నారు - "మేమూ మీతోటే వస్తాము."

బీజగుప్తుడు గంభీరస్వరంతో మందలించినాడు - "ఏమన్నారు? నా ఆజ్ఞ మీరిక్కడనే ఉండిపొండని. ఎవ్వరూ ఇక్కడనుండి కదలరాదు."

వారు భయపడి వెనుకకు తగ్గినారు. బీజగుప్తుడు వెళ్లిపోయినాడు. అప్పటికి అర్ధరాత్రి దాటింది. నగరమంతా ప్రశాంతత నెలకొన్నది. అతడు మెల్లమెల్లగా ముందుకు సాగుతున్నాడు. ఒక భికారివలె అతడు పాదచారియై నడుస్తున్నాడు. అతని వస్త్రధారణ సామాన్యునివలె నున్నది; దారిఖర్చులకై అతనివద్ద కొన్ని వెండి ముద్రికలు మాత్రమున్నవి. అతనికి ఏదో అడుగుల చప్పుడు వినవచ్చింది. క్రమక్రమంగా ఆ చప్పుడు అధికం కాజొచ్చింది. అతడు వెనుదిరిగి చూచినాడు. కాని అంధకారంలో అతని కేమీ కనపడలేదు. అతడట్లే ముందుకు సాగిపోయినాడు. ఆ ధ్వని ఇంకా ప్రబలమైంది. ఆ అంధకారంలో అతనికొక దీర్ఘవస్త్రావగుంఠితమైన మూర్తి పొడసూపింది - "నా ప్రాణదైవమా!" - అన్నది.

బీజగుప్తు డాగిపోయినాడు - "ఎవరు నీవు?" - అన్నాడు.

"నా దైవమా! నా దైవమా! నన్ను క్షమించు!" - అంటూ ఆ మూర్తి అతని పాదాలపై బడిపోయింది.

బీజగుప్తుడు కర్కశంగా అన్నాడు - "చిత్రలేఖా! నా జీవనశాపమా! నీ విక్కడి కెందుకు వచ్చినావు. పో పో! " - అతడు వెనుకకు తగ్గినాడు - "అంతా అయిపోయింది. నీవింకెందుకు వచ్చినావు?"

"నా దేవతాచరణరజోలేశలేపనకై. నా దేవతాసమర్చనకొఱకై" - చిత్రలేఖ లేచి నిలబడింది. "స్వామీ! నేను మీకు నష్టం చేసినాను. మీ జీవితాన్ని నాశనం చేసినాను. నన్ను శపించండి, శిక్షించండి, దండించండి - కాని నన్నేవగించుకొనకండి."

బీజగుప్తుని యావచ్ఛరీరం కంపించిపోయింది. రుద్ధకంఠస్వరంతో అతడన్నాడు - "చిత్రలేఖా! అంతా అంతమైంది. నీవే సమస్తం పరిసమాప్తం జేసినావు. కుమారగిరికుటీరం వదలివేసిన నీవు నా కడకు రాలేదు. నేను నీపై ఆశ వదలుకొన్నాను. ఇప్పుడు నన్ను విచలితుణ్ణి జేయుటకు నీవెందుకు వచ్చినావు? నా దగ్గర ఇప్పుడేమీ లేదు. నా హృదయంలో ఉల్లాసం లేదు, నా దగ్గర పూర్వవైభవం లేదు, సంపద లేదు. నన్ను వెళ్లనివ్వు!"

చిత్రలేఖ బీజగుప్తుని చేతులు పట్టుకొని అన్నది -"లేదు, మిమ్మిప్పుడే పోనీయను స్వామీ! ఒకరోజు నా అతిథిగా ఉండి, కావాలంటే రేపు వెళ్లవచ్చు."

బీజగుప్తుడు తన చేతులను విడిపించుకొన్నాడు - "తొలగు నర్తకీ! నా యెదుటనుండి తొలగి పో! ఇప్పుడు నీవు నన్నాపలేవు. నాకు వినాశకరమైన నీ ప్రవర్తనయొక్క ఫలితాన్నిక చూచి నవ్వుకో పో! నన్ను పోనివ్వు" - అంటూ బీజగుప్తుడు ముందుకు దూసుక పోయినాడు.

చిత్రలేఖ అతని పాదాలను పట్టుకొన్నది - "నేను చెప్తున్నాను మిమ్ము వెళ్లనీయను. నాతో బాటు నాభవనందాక మీరు రావలసిందే. బీజగుప్తా! నా స్వామీ! నాపై మీప్రేమ మరణించిందాయేమి? చెప్పండి నాథా ....." - అంటూ ఆమె దీర్ఘంగా నిశ్వసిస్తూ వెక్కివెక్కి యేడ్వ నారంభించింది.

బీజగుప్తుడు తన కఠినవైఖరిని నిర్వహించుకొనలేకపోయినాడు -"ప్రేమయే మరణించే పక్షంలో నేనీ వైభవాన్నెందుకు త్యజిస్తాను? చిత్రలేఖా! నా హృదయంలో నీప్రేమ సమసిపోవాలని ఎంతగానో కోరుకున్నాను! కాని అది సమసిపోలేదు చిత్రలేఖా! అది సమసి పోజాలదు." - అంటూ అతడు చిత్రలేఖను లేవనెత్తి కౌగిలించుకొనబోయినాడు గాని ఆమె ప్రక్కకు జరిగింది - "లేదు నా దైవమా! నా శరీరాన్ని తాకవద్దు. నేను పతితను, అపవిత్రురాలను, పరమపాపిని. పదండి! నా భవనానికి పదండి! నన్ను పవిత్రురాలిని చేయండి. మీ అభిశాపాగ్నితో పరితప్తం జేసి నన్ను పవిత్రురాలిని చేయండి" - అని ప్రాధేయపడింది.

"పద!" - ఆరంభించినాడు బీజగుప్తుడు - "పద చిత్రలేఖా పద! ఈ ప్రపంచంలో నీ మాటొక్కటే నేను కాదనలేను. పద! నన్నెంత పతనం జేయదలచుకొన్నావో అంత పతనం జేయి. కాని రేపు నన్నాపనని మాత్రం నాకు మాటియ్యి."

"నేను మాట యిస్తున్నాను."

చిత్రలేఖ తన భవనాన్ని చేరుకొన్నది. ఆమె బీజగుప్తునికి శయనమేర్పాటు చేసింది. ఆ తర్వాత, "నాథా! ఈ రాత్రికి శయనించండి. రేపుదయం మాట్లాడుదాం"-అంటూ అమె శయనమందిరాన్ని వీడిపోయింది. బీజగుప్తుడు అవాక్కయి ఆమెనట్లే చూస్తుండి పోయాడు.

ఉదయం చిత్రలేఖ బీజగుప్తుని వద్దకు వచ్చింది. "స్వామీ! మీ చరణామృతపానమును ప్రసాదించండి" - అన్నది.

ఆమె ప్రవర్తన కతని కాశ్చర్యమేసింది - "ఇది దేనికి? "

"నేను నన్ను పునీతురాలిని చేసుకుంటున్నాను. నా స్వామీ! నేను నా మార్గంపై విరక్తురాలనై, యోగి కుమారగిరియొక్క రక్తికి సాధనమైనాను. నేను కోపావేశంలో నా శరీరాన్ని అతని వశం చేసినాను. ఆ శరీరాన్నిప్పుడు పునీతం జేసికొన దలుస్తున్నాను." - అంటూ ఆమె తన కథనంతా బీజగుప్తునికి వినిపించింది - "ఇప్పుడు మీకు దెలుసునుగదా నే నెందుకు మీకడకు రాలేదో! నన్ను క్షమించండి."

"దీనికేనా?" - బీజగుప్తుడు నవ్వసాగాడు - "చిత్రలేఖా! నీవు గొప్ప పొరపాటును చేసినావు. నీవు నన్నర్థం చేసికొనుటలో పొరపడ్డావు. నీవు నన్ను క్షమించమంటున్నావా? త్యాగం, విస్మృతి, తన్మయతలతో పరిపుష్టమైనదే ప్రేమ. ప్రేమవిషయంలో అపరాధమనేది ఉండదు. అటువంటప్పుడు క్షమార్పణ దేనికి? ఐనా నానోట వినాలని నీకుంటే, నేనంటాను "నిన్ను క్షమిస్తున్నాను" అని.

చిత్రలేఖ అతని పాదాలను పట్టుకొని అడిగింది - "ఐతే నాథా! నన్ను మళ్లీ స్వీకరించండి."

"ఇదెట్లా సాధ్యం చిత్రలేఖా! నేను బికారిని. నా వైభవం వీగిపోయింది, సంపద సమసిపోయింది - ఇప్పుడదెట్లా సాధ్యం?"

"నా దగ్గర అపారధనరాశు లున్నవి, నేను మీ దాసినై ఉన్నాను. నా ధనం మీ ధనమే, మఱి మీరు నిర్ధను లెట్లౌతారు? బికారినని మీరెందుకనుకుంటారు?"

"నీ ధనరాశి, నీ సంపద - ఇవి నాకు పనిలేదు. నేను వైభవపూరితజీవితాన్ని త్యజించినాను. ఆ జీవితాన్ని మఱల స్వంతం చేసికొను టకుగాదు నేను త్యజించింది, దాన్ని శాశ్వతంగా త్యజించినాను. ఒకవేళ నీవుగూడ నాతో బికారివలె ఉండగోరితే నిన్ను స్వీకరింప గలను."

చిత్రలేఖ లేచి నిలబడింది - "ఐతే అట్లే కానిండు. ఈ ప్రపంచంలో మన మిర్వురమూ భిక్షుకులవలె చరింతము గాక! ప్రేమయే, కేవలము ప్రేమయే మన కాధారమగుగాక! నా ప్రణయదేవతా! నేను నేడే నా ఐశ్వర్యాన్నంతా దానం చేస్తాను. ఈ రాత్రికే మనమిద్దరమూ అగాధ ప్రపంచసాగరాన్ని ప్రేమనౌకలో నాసీనులమై తరింతము గాక!" - చిత్రలేఖాముఖమండలం తేజోమండితమైంది. ఆమె కన్నులలో క్రొమ్మెఱుగు పొడసూపింది, ఆమె ఆత్మ ప్రకాశమానమైంది.

బీజగుప్తుడు చిత్రలేఖను ముద్దాడినాడు - "మనమిద్దర మెంత సుఖజీవులం!"

## ౨౩

ఒక సంవత్సరం గడచింది.

మహాప్రభువు రత్నాంబరు డడిగినాడు - "శ్వేతాంకా! నీ వివాహం జరిగింది, నీవొక గృహస్థుడవైనావు. ఇప్పుడు చెప్పగలవా బీజగుప్తుడు, కుమారగిరి - వీరిద్దరిలో పాపాత్ముడెవ్వరో?"

శ్వేతాంకుడు గురువుగారికి ప్రణమిస్తూ అన్నాడు - "మహాప్రభూ! బీజగుప్తుడు దైవస్వరూపుడు. అతడు విశాలహృదయుడు, త్యాగానికి ప్రతిమూర్తి. మఱి కుమారగిరి పశుస్వరూపుడు. అతడు తనకొఱకే జీవిస్తాడు, అతనిది వ్యర్థజీవితం. ప్రపంచరీతికి ప్రతికూలమైన జీవితమతనిది. తన సౌఖ్యంకొఱకు ప్రపంచంలోని బాధలనుండి అతడు వైముఖ్యాన్ని ఆశ్రయించినాడు - అతడే పాపి."

"మఱి విశాలదేవా! నీవు యోగశిక్షను తీసుకొన్నావు, యోగివైనావు గూడ. నీవు జెప్పు కుమారగిరి పాపాత్ముడా, లేక బీజగుప్తుడా?"

విశాలదేవుడు రత్నాంబరునికి నమస్కరించి అన్నాడు - "మహాప్రభూ! యోగి కుమారగిరి అజేయుడు. అతడు మమకారంపై అధికారం సంపాదించినాడు. అతడు సంసారాన్ని అధిగమించినవాడు. అతని సాధన, జ్ఞానం, శక్తి పరిపూర్ణమైనవి. మఱి బీజగుప్తుడో - అతడు సంసారవాసనలకు దాసుడు. ప్రపంచానికి అసహ్యకరమైన భోగవిలాసాలలోనే అతని జీవితం. పాపమయమైన ప్రపంచంలో అతడొక ప్రధానపాత్రధారుడు. అతడే పాపి."

రత్నాంబరు డన్నాడు - "మీరిద్దరు విభిన్నపరిస్థితు లెదుర్కొన్నారు. అందుచే పాపవిషయంలో మీ ఆలోచనాధారలు గూడ భిన్నంగా ఉన్నవి. ఇక మీ చదువు పరిసమాప్తమైంది. చివరిసారిగా నా అంతిమపాఠాన్ని వినండి."

"ప్రపంచంలో పాపమనేది లేదు. పాపమనేది మనుష్యునియొక్క దృష్టికోణవైషమ్యతకు మఱొక్క పేరు. ఒక్కొక వ్యక్తి ఒక్కొక మనఃప్రవృత్తితో జన్మిస్తాడు. ప్రతివ్యక్తి ఈ ప్రపంచరంగస్థలంలో అభినయార్థమై ప్రభవిస్తాడు. తన మనఃప్రవృత్తిప్రకారం అతడు తన పాఠాన్ని మనముందు వల్లెవేస్తాడు - ఇదే మానవజీవనప్రవృత్తి. మనుష్యుడు చేసేదంతా అతని స్వభావాన్నిబట్టి ఉంటుంది - మఱి ఆ స్వభావం పరిసరాలపైన ఆధారపడి ఉంటుంది. అందుచే మనుష్యుడు స్వాధికారి కాడు - అతడు పరిస్థితులకు దాసుడు, అధీనుడు. అతడు కార్యకర్తగాడు, కార్యనిర్వహణకొక సాధనము మాత్రమే. ఇట్టి స్థితిలో పాపపుణ్యవిచక్షణకు తావెక్కడ?

మానవునిలో మమత్వమునకే ప్రాధాన్యత. ప్రతివ్యక్తి సుఖాన్ని కోరుకుంటాడు. కాని ఏది సుఖదాయకమనేది భిన్నవ్యక్తులకు భిన్నంగా ఉంటుంది. కొందరికి ధనంలో, మఱి కొందరికి మద్యంలో, వేఱే కొందరికి వ్యభిచారంలో, ఇంకా కొందరికి త్యాగంలో సుఖముంటుంది - కాని అందరు కోరుకొనేది సుఖమే. ప్రపంచంలో ఏవ్యక్తి గూడ బుద్ధిపూర్వకంగా దుఃఖకరమైన పనిని చేయడు. ఇదే మానవుని మనఃప్రవృత్తి, ఈ ప్రవృత్తియే అతని దృష్టికోణంయొక్క వైషమ్యము. అందుచేత ప్రపంచంలో ఫలానాదే పాపమనే పరిభాష నెలకొనలేదు, నెలకొనజాలదు గూడ. మనం పాపం జేయలేము, పుణ్యమూ చేయలేము, ఏది చేయవలసివస్తుందో దాన్ని మనం చేస్తాం."

రత్నాంబరుడు లేచి నిలబడ్డాడు - "ఇది నా అభిప్రాయం. దీనితో మీరంగీకరించినను, అంగీకరింపకున్నను దానికి నేను మిమ్ములను బాధ్యులను చేయను, చేయజాలను గూడ. వెళ్లండి, సుఖంగా ఉండండి. మీకు నా ఆశీస్సులు."

